

ఏటుకూరు బలరామ మూర్తి

# ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర



# ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర

ఏటుకూరు బలరామమూర్తి, ఎం.ఏ.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్-500 001

ప్రచురణ సంఖ్య : 1591 ప్రతుల సంఖ్య : 4,000
మొదటి ముద్రణ : జూన్, 1968
పదవ ముద్రణ : సెప్టెంబరు, 1990

© ఏటుకూరు బలరామమూర్తి

టైటిల్ డిజైన్ : మోహన్

వెల : రూ. 20.00

ప్రచురణ :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞానభవన్, బ్యాంక్‌స్ట్రీట్,
హైదరాబాదు - 500 001.

విశాలాంధ్ర బుక్ హౌస్
విజయవాడ, హైదరాబాదు, అనంతపురం, విశాఖపట్నం,
హన్మకొండ, గుంటూరు, తిరుపతి, కాకినాడ.

ISBN : 81 - 7098 - 181 - X

ప్లానోగ్రావర్స్, చిరాగ్ అలీ లేన్, హైదరాబాద్ - 1

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | పీఠిక | ... | 5 |
| 1. | ఆంధ్రుల ప్రాచీనత | ... | 7 |
| 2. | వివిధ తెగల సమ్మేళనం | ... | 13 |
| 3. | శాతవాహన యుగం | ... | 21 |
| 4. | శాతవాహన నాగరికత | ... | 28 |
| 5. | ఇక్ష్వాకురాజులు - నాగార్జునకొండ | ... | 39 |
| 6. | బౌద్ధ సంస్కృతి విధ్వంసన | ... | 46 |
| 7. | ఆంధ్ర భాష పరిణామం | ... | 59 |
| 8. | కళింగ చరిత్ర | ... | 66 |
| 9. | చాళుక్య యుగం | ... | 75 |
| 10. | ఆంధ్ర మహాభారతం | ... | 87 |
| 11. | తెలుగు చోడులు-పల్నాటి యుద్ధం | ... | 97 |
| 12. | కాకతీయ యుగం | ... | 108 |
| 13. | వీర శైవమతం | ... | 117 |
| 14. | కాకతీయులనాటి సాంఘిక జీవితం | ... | 126 |
| 15. | ముసునూరి నాయకులు-రెడ్డిరాజులు | ... | 136 |
| 16. | ఆర్థిక జీవితం | ... | 147 |
| 17. | విజయనగర సామ్రాజ్యం | ... | 160 |

| | | | |
|---|---|---|---|
| 18. | రాయలనాటి వైభవం | ... | 172 |
| 19. | గోల్కొండ నవాబులు | ... | 184 |
| 20. | యోగి వేమన | ... | 194 |
| 21. | బ్రిటిషు ఆక్రమణ | ... | 205 |
| 22. | సామ్రాజ్యవాదుల దోపిడీ - ప్రజల ప్రతిఘటన | ... | 214 |
| 23. | ఆధునిక యుగం | ... | 223 |
| 24. | ఆంధ్రుల చరిత్రలో కొన్ని ముఖ్య తేదీలు | ... | 231 |
| 25. | BIBLIOGRAPHY | ... | 233 |

# పీఠిక

ఆంధ్రుల సంక్షిప్త చరిత్రకు ఇది ఆరో ముద్రణ. మొదటి ముద్రణ 1953 లో వెలువడ్డది.

ఇది సంక్షిప్త చరిత్ర. ఆదినుండి మన ప్రజలను గురించిన ఒక సాధారణ చిత్రాన్ని పాఠకులకు అందింప చేయాలనే యత్నం. ఆర్థిక, సాంఘిక, ధోరణులకు సంబంధించిన వివరాలు ఇందులో చాలా క్లుప్తంగా ఉన్నాయి. అందుకు సంబంధించిన సమాచారం (ఈ గ్రంథ రచనకు పునాది 1948-51 సంవత్సరాలలో కడలూరు జైలులో నేను డిటెన్యూగా ఉన్నప్పుడు ఏర్పడ్డది.) ఆనాడు లభించలేదు. ఈనాడు లభిస్తున్నది. ఐనా గ్రంథ విస్తరభీతిచే అదనపు సమాచారాన్ని చేర్చటం లేదు. అందుకు ప్రత్యేక రచన అవసరం. పరిస్థితులు అనుకూలిస్తే ఆ ప్రయత్నమూ చేయాలని వుంది.

ఒకటి మాత్రం చెప్పగలను. గత ఇరవయ్యేండ్లలో ఆంధ్రుల చరిత్రలో ఎంతో పరిశోధన జరిగింది. ఇంకా జరుగుతున్నది. ఈ పరిశోధనా ఫలితాలేవీకూడా ఈ గ్రంథ రచనలోని విషయ వివరణకు మౌలికంగా, వ్యత్యాసంగా గాని, విరుద్ధంగాగాని లేవు. అనుకూలంగానే ఉన్నాయి.

చారిత్రక సరిహద్దులను రాజవంశాలు నిర్ణయించే ప్రాచీన కాలం అది. కనుక ఆ పరిధిని ఈ గ్రంథం అధిగమించలేకపోయింది. ఐనప్పటికీ

తెగల స్థాయినుండి జాతి స్థాయికి, మహావేగ దశనుండి భాషా సమైక్యతా దశకు పయనించి, ఫ్యూడల్ సామాజిక స్థితినుండి ఆధునిక యుగంలోకి అడుగు పెడుతున్న ఆంధ్రజాతి స్థూలచిత్రణ ఈ గ్రంథం ద్వారా పాఠకునికి దృగ్గోచరం అవుతుందనే నా విశ్వాసం.

ఇట్లు,

విధేయుడు,

ఏటుకూరు బలరామమూర్తి

విజయవాడ,
10-2-81

---

[ఈ గ్రంథం 1954 లో రష్యన్ భాషలోకి మాస్కోలో ప్రాచ్యవిద్యా పేరెన్నికగన్న ఆంధ్రుడు శ్రీ కొండపల్లి రామయ్యగారిచే అనువదించబడింది. విదేశీ భాషా ప్రచురణాలయం వారిచే ప్రచురించబడింది.]

# ఆంధ్రుల ప్రాచీనత

ఒక జాతి చరిత్ర ఖచ్చితంగా ఫలానా సంవత్సరం నుండి ప్రారంభ మైందని చెప్పడం అసాధ్యం. కొండవాగులు, సెలఏరులు, ఊటలు, జలలు-అనేకం కలిసి నదీ ప్రవాహమైనట్లు, వేర్వేరు తెగలు, గణాలు, ప్రజలు కాలక్రమంలో కలిసి, ఒక జాతిగా రూపొందాయని సమాజ చరిత్ర తెలియ జేస్తున్నది.

ఆంధ్రుల ప్రాచీనతను నిర్ణయించే విషయంలో సైతం ఇదే సమస్య ఎదుర్కొంటున్నది. భారతదేశంలోని అతి ప్రాచీన జాతులలో ఆంధ్రులొకరు. మహాభారత, రామాయణాది ఇతిహాసాలలోను, పురా ణాలలోను, బౌద్ధ జాతక కథలలోను ఆంధ్రులకు సంబంధించిన గాథలు అనేకమున్నాయి ఎంతో కొంత చారిత్రక సత్యం ప్రతి గాథలోను అంత ర్గర్భితమై ఉన్నదని అంగీకరించినపుడు ఈ గాథలలో నుండి, ఆంధ్ర జాతి ప్రాచీనతను మనం సూత్రప్రాయంగా నిర్ణయించవచ్చు.

కురు పాండవ యుద్ధంలో ఆంధ్రులు, కాళింగులు కౌరవుల పక్షాన పోరాడారు. ధర్మజాని రాజసూయ యాగ సందర్భంలో సహదేవుడు పాండ్య, ద్రవిడ, ఓఢ్ర, కేరళ, ఆంధ్ర, కళింగ రాజ్యాలను జయించారు. మహాభారత గ్రంథం అలా తెలియజేస్తున్నది. శ్రీకృష్ణుడు మధురానగరం వచ్చినప్పుడు, కంసునిచే ప్రేరితుడై, కరూశరాజైన చాణూరుడను జగ జెట్టి, కృష్ణునితో మల్లయుద్ధంచేసి చనిపోయినాడు. ఈ చాణూరుడు ఆంధ్రు డని హరివంశపురాణం తెలియజేస్తున్నది. కరూశదేశం వింధ్య పర్వతాని కుత్తరాన యమునానదీ తీరంలో ఉంది.

రామాయణంలో మరొక గాథ ఉంది. విశ్వామిత్రుడు నరమేధ యాగాన్ని నివారించి, యజ్ఞపశువైన శునశ్శేపుని విడిపించి అతనిని దత్త

పుత్రునిగా స్వీకరించగా, అందుకు ఇష్టపడని విశ్వామిత్రసంతతి, తండ్రిచే శపించబడి, తూర్పుగాను, దక్షిణంగానూ తరలిపోయినారు. వీరే ఆంధ్రులని పై గాథ తెలియజేస్తున్నది.

మహాభారత, రామాయణ గ్రంథాలు రచించబడిన కాలము బౌద్ధ యుగానంతరం ఐనప్పటికి, అనేకమైన ప్రాచీనగాథలను, స్మృతులను ఈ ఇతిహాసాలు గ్రంథస్థం చేశాయి. ఆ విషయంలో ఎట్టి సందేహము లేదు. ఆంధ్రులను ఒక తెగ మహా భారత యుద్ధకాలంనాటికి (క్రీ. పూ. 1500) యమునానదీ తీరానికి చేరుకున్నారని పై సమాచారం ద్వారా నిర్ణయించ వచ్చును.

మహాభారత యుద్ధం ప్రాచీన చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం. అన్నదమ్ములమధ్య జరిగిన ఈ అంతర్యుద్ధంలో ఆనాడు జీవించిన వివిధ తెగల రాజులు పాల్గొన్నారు. లక్షలాది సైనికులు మరణించారు. దేశం పీనుగుల పెంట ఐంది. దేశాన్నంతా ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన కౌరవ సామ్రాజ్యం ధ్వంసమైంది. వందలాది చిన్న రాజ్యాలు తల ఎత్తాయి. యుద్ధానంతరం 2 శతాబ్దాలకు గంగా, యమునా తీరంలో మిడ తలదండువల్ల పంటలు నాశనమై కాటకం ఏర్పడ్డది. ఆ ప్రాంతంలో నివ సిస్తున్న ప్రజలు 300 మైళ్ళు దక్షిణంగా కదలిపోయారని ఛాందోగ్యో పనిషత్తు తెలియజేస్తున్నది. ఐతరేయ బ్రాహ్మణంలో, ఆంధ్రులు, వింధ్యకు దక్షిణప్రాంతములో, పుండ్రపుళింద శబర మూతిబులతో కలిసి జీవిస్తున్నట్లు వర్ణించబడ్డారు. ఛాందోగ్యోపనిషత్తు, ఐతరేయ బ్రాహ్మణ ములు క్రీ. పూ. 1000 ప్రాంతంలో రచించబడ్డాయి.

ఆంధ్రుల మహాప్రస్థానం ఒక రోజున ప్రారంభం కాలేదు. ఒక్క రోజున ముగియలేదు కొన్ని వందల సంవత్సరాలపాటు, గుంపులు గుంపులుగా, ప్రజలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి కదలి పోతూనే వున్నారు. కొన్ని గణాలు ముందుగా తరలిపోగా, మరికొన్ని గణాలు పాత భూములను వదలలేక కొట్లాడుతుండేవి. క్రీ. పూ. 700 నాటికి కూడా కొన్ని ఆంధ్రగణాలు యమునానదీ తీరంలో సాల్వదేశంలో ఉండేవి. ఆపస్తంబఋషి గాథ ఆ విషయం తెలియజేస్తున్నది. ఆపస్తంబ

గృహ్య సూత్రాలు ఆంధ్ర బ్రాహ్మణులలో నేటికీ వ్యాప్తిలో ఉన్నాయి. ఒక్కొక్క గణానికి ఒక్కొక్క ఋషి ఆచార్యుడుగా ఉండేవారు. ఆప స్తంబుడు అట్టి ఆచార్యులలో ఒకడు. ఈ ఋషి తన సూత్రాలను యమునా తీరంలో సాల్వదేశంలో ఉండగా రచించారు. ఆపస్తంబుని నిర్యాణా నంతరం, అతని సూత్రాలను పాటిస్తున్న ఆంధ్రగణాలు వింధ్య పర్వ తాలను దాటి దక్షిణానికి వచ్చి మిగతా ఆంధ్రగణాలతో కలిసిపోయినవి.

దక్షిణ దేశానికి తరలి వచ్చిన ఆంధ్రులలో కొందరు, వింధ్య పర్వ తాలకు దక్షిణాన, అనగా నేటి హైద్రాబాద్ రాష్ట్రపు ఉత్తర సరిహద్దులో స్థిరపడగా, మరికొందరు తూర్పు కనుమల వెంబడి క్రిందికి దిగి, ఒరిస్సా మీదుగా కళింగదేశం చేరుకున్నారు. సెరివణిజ జాతకకథ ఆంధ్రులు తేల్ నదీ తీరాన అంధకపురం నిర్మించినట్లు వర్ణించింది.

జాతకకథల కాలం క్రీ. పూ. 200-250. తేల్‌నది మహానది ఉపనది ఐన తెలివాహ. మహానది ఒరిస్సా రాష్ట్రంలో ఉంది. కనుక ఒరిస్సా మీదుగా ఆంధ్రులలో ఒక శాఖ క్రిందికి దిగివచ్చారని స్పష్టం కాగలదు. వీరే కాళింగులు. ఆంధ్రులను, కాళింగులను పైన ఉదాహరించిన అన్ని గ్రంథాలు ఒకే తెగలోని రెండు శాఖలుగా ప్రస్తావిస్తూ వచ్చాయి. ఒక్కొక్కసారి ఈ రెండు పదాలు పర్యాయపదాలుగా కూడ వాడబడినవి.

## నాగ, యక్ష, ద్రావిడ గణాలు

వింధ్య పర్వతాలను దాటి దక్షిణ దిక్కుగా క్రిందికి దిగుతున్న ఆంధ్రులకు, అంతకు పూర్వమే ఈ ప్రాంతంలో నివసిస్తున్న నాగ, యక్ష, ద్రావిడ గణాలతో సంబంధం ఏర్పడ్డది.

బౌద్ధ జాతక కథలు కృష్ణా, గోదావరీ ప్రాంతాన్ని వజ్ర దేశమని, నాగభూమియని, మంజీర దేశమని వర్ణించాయి. ఈ ప్రాంతంలో నాగజాతి ప్రజలు నివసించేవారు. కళింగదేశపు రాజకుమార్తె, ఆమె భర్త బుద్ధుని దంతముగల పెట్టెను తీసుకొని సింహళదేశం వెళ్ళుతూ త్రోవలో మార్గం గమనించలేక, సముద్ర మార్గంనుండి మళ్ళి, కృష్ణానది ఎగువకు చేరు కున్నారు. వీరి ఓడ వజ్రాల దిన్నెవద్ద ఒడ్డుకు చేరుకున్నది. ఇచ్చట

నాగాశోకుడను నాగరాజు బౌద్ధస్తూపం నిర్మిస్తున్నాడు. వజ్రాల దిన్నె. నేటి ధాన్యకటకం (ధరణికోట). ఆ రాజు నిర్మించిన స్తూపం, అమరావతి స్తూపం.

అమరావతి స్తూపాన్ని నిర్మిస్తున్న నాగాశోకుని వద్ద గల బుద్ధుని అస్థికలు అతని మిత్రుడు, సింహళరాజైన మేఘవర్ణుడు తీసుకువెళ్ళె. సింహళంలో మరొక స్తూపం నిర్మించినట్లు మరొక బౌద్ధగాథ తెలియ జేస్తున్నది.

నాగజాతి భారతదేశ ప్రాచీన జాతులలో ఒకటి. వీరు ఆర్యుల కంటె పూర్వులు. ద్రావిడులకంటె భిన్నులు. ఆర్యులు భారతదేశానికి వచ్చి గంగా యమునా ప్రాంతంలో స్థిరపడిన మీదట నాగులు మధ్య ప్రాంతం వదిలి అస్సాం రాష్ట్రంలోను. పెషావరువద్ద తక్షశిల ప్రాంతం లోను. దక్షిణాన కృష్ణా-గోదావరి ప్రాంతంలోను స్థిరపడ్డారు. ఆర్య, నాగజాతి కలహాలు చరిత్ర ప్రసిద్ధము. మహాభారతములోని పరీక్షిత్తు కథ. జనమేజయుని సర్పయాగము – ఇందుకు నిదర్శనాలు.

కృష్ణా-గోదావరి ప్రాంతంలో అనాదిగా నాగజాతి ప్రజలు జీవించి నట్లు బౌద్ధజాతక కథలద్వారా మాత్రమేగాక, నేటికీ ఆంధ్ర ప్రజలలో నిలచిన కొన్ని ఆచారాల ద్వారా కూడా రూఢి అవుతున్నది. నాగులచవితి నాడు పాము పుట్టలో పాలు పోసే ఆచారం నేటికీ ఆంధ్రదేశంలో ఉంది. నాగయ్య, నాగమ్మ మొదలైన పేరులు అతి ప్రాచీనమైనవి. అడవులలో, కొండలలో జీవించిన ఈ ప్రజలకు పాములను జయించటం లేక మచ్చిక చేసుకోవటం జీవన్మరణ సమస్య. ప్రకృతిపై మానవుడు సాధించిన ప్రథమ విజయం, ఈ ప్రజలకు సంబంధించినంతవరకు, విషసర్పాలపై సాధించిన విజయంగా వ్యక్తమైంది. ఈ విజయాన్ని సాధించిన వీరు నాగజాతి అయి నారు. పాము పడగల ఆభరణాలు ధరించటం, పాముల కోరలు తీసి విషాన్ని పిండి, మచ్చిక చేసి, వాటితో ఆట లాడుకోవటం, వీరికి సర్వ సామాన్యం.

ఆర్యుల వర్ణ విభేదాలు వీరిలో ప్రవేశించ లేదు. కనుక వీరు ప్రప్రథమంలోనే సమానత్వాన్ని బోధించిన బౌద్ధ మతాన్ని స్వీకరించారు.

మౌర్య అశోకునికంటే ముందే, ఆంధ్రదేశంలోని నాగరాజులు, నాగ ప్రజలు బౌద్ధ స్తూపాలను నిర్మించ నారంభించారు. బుద్ధుడు తపస్సు చేసుకుంటూ ఉండగా, ముచిలిందుడను నాగరాజు బుద్ధునికి ఎండ, వాన తగులకుండా రక్షణ కల్పించాడట. ఈ భావాన్ని ఒక శిల్పి, ఏడు పడగల నాగుబాము బుద్ధుని ఆవరించి, తన పడగలను బుద్ధుని చుట్టూ గుండ్రంగా త్రిప్పుతూ, ఎండ, వాన తగులకుండా కాపాడినట్లు ఊహించి, ఈ ఊహకు ప్రాణ ప్రతిష్ఠ చేసి, ఒక చక్కని శిల్పాన్ని తయారు చేశాడు. నాగార్జునకొండ వద్ద వున్న ప్రాచీన శిల్పఖండాలలో ఇది ఒకటి. ముచిలిందుడను నాగరాజు బహుశా కృష్ణా - గోదావరి ప్రాంతంవాడై ఉండవచ్చు.

నాగులతోపాటే యక్షులను మరొక తెగ కూడా ఈ ప్రాంతంలో నివసించేవారు. గుంటూరుజిల్లా భట్టిప్రోలు శాసనాన్ననుసరించి, క్రీ. పూ. 400 ప్రాంతంలో, కుబీరకుడను రాజు ఆ ప్రాంతాన్ని పరిపాలించినట్లు తెలుస్తున్నది. కుబీరక నామం నుండే కుబేరపదం ఏర్పడ్డది. కుబేరుడు యక్షగణం అధిపతి. యక్షులు అనార్య జాతులలో ఒకరు.

కుబీరకుడు సింహగోష్ఠికి అధిపతి. నాగులకు పాము కులవేల్పు. యక్షులకు సింహం కులవేల్పు.

నాగులవలెనే, యక్షులు కూడా ప్రథమంలోనే బౌద్ధమతం స్వీకరించారు.

ఇక మూడవ తెగ, ద్రావిడులైన తెలుగువాడు. తెలుగు, తమిళ, కన్నడ ప్రజలు ద్రావిడ ప్రజలు. ఈ మూడు భాషలు ఒకే ద్రావిడ కుటుంబంనుంచి ఆవిర్భవించినవి. తెనుగు ప్రజల నివాసస్థలం మొదట రాయలసీమ పిమ్మట తెలంగాణా. తెనుగు క్రమంగా తెలుగైంది. అందులో నుండే తెలగాలు, తెలంగాణా, తెలగాణ్యులు (బ్రాహ్మణులలో ఒక శాఖ). తెలికిగిరి మొదలైన పేర్లు ఏర్పడ్డాయి. బర్మాలోని తైలాంగ్ ప్రజలు ప్రాచీన తెలుగుజాతికి చెందినవారని కూడా కొందరు ఊహిస్తున్నారు. తెనుగు అను మాటకు దక్షిణ దిక్కుగా తిరుగువారు లేక ప్రయాణం చేయువారు అని అర్థం. తెన్ - దక్షిణ దిక్కు - అని తమిళ, కన్నడ భాషలలోని అర్థము.

తెలంగాణాలో దోర్నకల్లు, టేగంపేట, మౌలాలి, మధిర, చింత కాని ప్రాంతాలలో అతి ప్రాచీన ప్రజల సమాధులు కొన్ని బైటపడ్డాయి. వీటిని కైరన్లు లేక రాక్షసగుళ్ళు అని వ్యవహరిస్తున్నారు. భూమిలో కట్టిన రాతి గృహంలో శవాన్ని ఉంచి, ఆ వ్యక్తి పరలోక యాత్ర సుఖంగా జరుగుటకై ధాన్యం, ముంతలో మంచినీరు, నాణెములు, ఆ వ్యక్తి వాడిన పనిముట్లు, ఆయుధాలు, నగలు - ఇవన్నీ వేసి సమాధి నిర్మించేవారు. ఈ కైరన్లలో బయల్పడిన కుండలపైగల చిహ్నాలు, హరప్ప మొహంజదారో శిధిలాలలో దొరికిన చిహ్నాలను, నాణెములను పోలి ఉన్నవి.

మరికొన్ని ప్రాచీన చిహ్నాలు, పనిముట్లు బళ్ళారి జిల్లాలో ఈ మధ్యనే బయల్పడినవి. బళ్ళారి జిల్లాలో బయల్పడినవి రాతియుగానికి చెందిన పనిముట్లు. తెలంగాణా లోనివి, లోహయుగానికి చెందినవి. కనుక ఆంధ్రులు దక్షిణ దేశానికి రాకముందే, ద్రావిడ కుటుంబానికి చెందిన తెలుగు ప్రజలు తెలంగాణా ప్రాంతంలో నివసిస్తుండేవారని, వారి నాగరికత హరప్ప మొహంజదారో నాగరికత వలెనే వ్యవసాయం, ఇనుప పనిముట్లు కలిగి నగరాలను సైతం నిర్మించిన వ్యవస్థ అని స్పష్టమౌతున్నది.

రామాయణంలో వర్ణింపబడిన దండకారణ్యము, జనస్థానము ఖరదూషణాదుల నివాసస్థలము దక్కను పీఠభూమి. దక్కను పీఠ భూమిలో భాగమైన తెలంగాణా అత్యంత ప్రాచీనమైన ద్రావిడ నాగరి కతకు నిలయమని రూఢిగా చెప్పవచ్చు.

# వివిధ తెగల సమ్మేళనం

వింధ్యాద్రిని దాటివచ్చిన ఆంధ్రులలో వర్ణ భేదాలు అనాటికే ఉన్నవి. కృష్ణ-గోదావరి తీరస్థులైన నాగ, యక్ష తెగలు బౌద్ధమతాన్ని ఆదరించిన తెగలు. వారిలో వర్ణ విభేదాలు లేవు. తెలుగు తెగవారి మతధోరణి ప్రాచీన శైవమతానికి దగ్గరగా ఉండేది. ద్రావిడ దేశానికి చెందిన ఈ శైవమతం, హెచ్చుతగ్గులను అంగీకరించక, సమానత్వాన్ని ప్రతిపాదించిన మతం. ఇట్టి విభిన్న మతధోరణులకు చెందిన తెగలు కలిసి ఏకజాతిగా రూపొంద సాగారు. ఇది ఎలా సాధ్యమైంది?

ఆంధ్రులు జైత్రయాత్ర చేసుకుంటూ దక్షిణానికి వచ్చినవారు కారు. ఉత్తర హిందూస్థానంలో ఏర్పడిన సమాజ కల్లోలాల ఫలితంగా దక్షిణానికి తరలిన తెగలు. కనుక తాము అధికులమన్న గర్వభావం వారిలో లేదు. సాంఘిక కల్లోల ఫలితంగా వారి కుటుంబ జీవితం విచ్ఛిన్నమైంది. భర్త ద్వారా సంతానం కలుగనపుడు, భర్త అనుమతితో మరొక పురుషునిద్వారా సంతానం పొందే 'నియోగ' పద్ధతి ఆంధ్రులలో నాటికి విస్తారంగా ఉండేది. ఆపస్తంబుడు ఆ పద్ధతిని తీవ్రంగా ఖండిస్తూ కొన్ని నిబంధనలను చేశాడు. రాజకుటుంబాలలో యిట్టి పద్ధతి ఆపద్ధర్మంగా ఉండేదని భారత గాథలు తెలియజేస్తున్నాయి. జనక్షయం విపరీతమై, పురుషుల సంఖ్య క్షీణించి, స్త్రీల సంఖ్య హెచ్చవటంతో ఈ పద్ధతి ఆపస్తంబుని నాటికి మరింత హెచ్చిందని భావించవచ్చు.

ఆంధ్రులలో 'ప్రవత్త' యను మరొక ఆచారం కూడా ఉన్నట్లు కామసూత్రాలు రచించిన వాత్స్యాయనుడు తెలియజేస్తున్నారు. ఈ నియమా మన్ననరించి వివాహిత స్త్రీ భర్తతో కలసి జీవించేముందు గణనాయకునితో

లేక గ్రామాధికారితో ఒక రాత్రి గడపాలి. సమిష్టి వివాహపద్ధతి ఏనాడో నశించినా, దాని అవశేషాలు ఆచారాల రూపంలో నాటికీ ఉండేవని పెగాథ తెలియజేస్తున్నది. శాలివాహన రాజులలో ఒకరైన హాలుని కాలంలో రచించ బడిన గాథా సప్తశతి, ఆనాటి కుటుంబ జీవితాన్ని మరింత స్పష్టంగా వివరిస్తున్నది.

సైనికులుగానో లేక ఏదో వృత్తికొరకో పురుషుడు సంవత్సరాల తరబడి దూరదేశాలలో గడపడం, తత్ఫలితంగా, కుటుంబ జీవితంలో ఏర్పడే ఒడుదుడుకులు సప్తశతిలో వర్ణించబడ్డాయి. సోదరుని భార్యను తల్లిగా చూడవలెనన్న రామాయణ ఆదర్శం ఒకవైపున, సోదరుని భార్యను భార్యగా స్వీకరించవచ్చునన్న వాలి సుగ్రీవుల ఆచారం ఒకవైపున ఘర్షణ పడుతున్నట్లు సప్తశతిలోని గాథలు తెలియజేస్తున్నాయి.

ఇట్టి పరిస్థితులలో వర్ణ విభేదాలను పక్కకునెట్టి, అన్ని వర్ణాలవారు పరస్పరం వివాహ సంబంధాలు నేర్పరచుకొనక విధి లేదు. దీనికి తోడు సమానత్వాన్ని బోధించిన బుద్ధుని బోధనలు భారతదేశమంతా మారుమూలలలో పైతం నాడు ప్రతిధ్వనించసాగాయి.

శాతావాహన వంశ మూలపురుషుడైన రాజు జన్మగాథ ఇలా ఉంది: సంతానహీనుడైన దీపకర్ణి అను రాజు ఒకనాడు వేటకువెళ్ళి సింహంపై స్వారీ చేస్తున్న ఒక బాలుని చూశాడు. ఆ సింహాన్ని చంపి, బాలుని స్వీకరించిన వెంటనే చనిపోయిన సింహం మనుష్య రూపం ఎత్తి, తానొక యక్షుడనని తన భార్య బ్రాహ్మణ స్త్రీ అని, ఈ వివాహానికి అంగీకరించక మునులు శపించగా తాను సింహాన్ని బనానని, కనుక తన కుమారుని స్వీకరించవలసిందని చెప్పి అంతర్ధానమైనాడు. బ్రాహ్మణ, యక్ష తెగల అంతర్జాతి వివాహాలను పై గాథ తెలియజేస్తున్నది.

బృహత్కథ రచించిన గుణాఢ్యుని తల్లి బ్రాహ్మణ స్త్రీ. తండ్రి నాగరాజు. నదివద్దకు స్నానానికి వెళ్ళిన ఆమె, నాగరాజును గాంధర్వ పద్ధతిలో వివాహమాడి గుణాఢ్యుని కన్నది. ఇది తెలియక ఆమె సోదరులు ఆమె శీలాన్ని అనుమానించగా వాసవం బైటపెట్టింది. ఆమె కుమారుడైన గుణాఢ్యుడు మహాపండితుడై బృహత్కథను రచించాడు.

క్షత్రియ బ్రాహ్మణులలోనేకాక సామాన్య ప్రజలలో కూడా. ఈ తెగల సమ్మేళనం జరిగింది. వర్ణ విభేదాలనే అడుగోడలను నరలించి. తెగలమధ్య సోదరభావం కలిగించిన బౌద్ధ సంస్కృతి వికసన. ఆంధ్రజాతి పరిణామం ఒకే కాలంలో ప్రారంభం కావటం యాదృచ్ఛికం కాదు. ఒక దాని కొకటి తోడ్పడిన ఘటనలు.

## ఆర్థిక విధానం

కేవలం వేర్వేరు తెగలమధ్య వివాహాలతోనే ఒక జాతి పరిణామం ప్రారంభం కాదు. పూర్తికాదు; అంతకంటే బలవత్తరమైన ఆర్థిక కారణాలు సహాయకారి ఐనప్పుడే ఇది జరగగలదు.

బౌద్ధ సంస్కృతి వికసన. ఆంధ్రజాతి పరిణామం బానిస విధానం పతనమై అర్ధబానిస విధానం భారతదేశంలో తలయెత్తుతున్న సందర్భంలో జరిగినవి.

ఆర్యులు భారతదేశానికి రాకముందు. వచ్చిన కొత్తలోను స్వంత ఆస్తి. కుటుంబం. ప్రభుత్వంలేని ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థలో జీవించారు. భారతదేశం వచ్చి. అప్పటికే ఇచ్చట బానిస విధానంలో నివసిస్తున్న ప్రజలనుండి వ్యవసాయాన్ని నేర్చుకొని. వ్యవసాయ నాగరికతలోకి అడుగు పెట్టటంతో ఆర్యగణాలలో బానిస విధానం, వర్ణ వ్యవస్థ. నిరంకుశ రాచరిక విధానం తలయెత్తాయి. మహాభారతగాథ ఈ పరిణామానికి పరాకాష్ఠ. కురు పాండవ యుద్ధం అధికారతృష్ణకు లోనైన నిరంకుశ చక్రవర్తుల అంతః కలహాల గాథ.

ఈ అంతఃకలహాల ఫలితంగా నిరంకుశ రాచరిక వ్యవస్థ బలహీన పడ్డది. కాని. బానిస విధానం మాత్రం మరొక 5 వందల సంవత్సరాలు. గౌతమబుద్ధుని కాలంవరకూ కొనసాగుతూనే ఉంది.

బానిస విధానంలో వ్యవసాయం కులపతి వ్యవస్థపై కొనసాగుతూం డేది. వైశ్యులు. వ్యవసాయదారులు. క్షత్రియులు గ్రామరక్షకులు. బ్రాహ్మ ణులు మతకర్మలకు అధిపతులు. మొత్తం గ్రామంపై పెత్తనం కులపతిది. బానిస విధానంలో ఈ మూడే వర్ణాలు. వీరు ముగ్గురూ స్వతంత్రులు. వీరు

గాక శూద్రు లుండేవారు. బానిసలు నగరాలలో హెచ్చు సంఖ్యలోను, గ్రామాలలో స్వల్పంగాను ఉండేవారు.

వ్యక్తిగత కుటుంబ ప్రాతిపదికపై వ్యవసాయం జరిగేది. ప్రతి కుటుంబానికి వందలకొద్దీ బానిస లుండేవారు. సాగుచేసుకుంటున్న పొలంపై ఆ కుటుంబానిదే పెత్తనం. అయితే, యాజమాన్యానికి పరిమితి ఉంది. కులపతి ఇష్టా ఇష్టాలకు లోబడి ఈ యాజమాన్యం ఉండేది. అగ్రవర్ణాలు మూడింటి మధ్య, ఆదిమ కమ్యూనిస్టుదశ అవశేషాలైన సమిష్టి బాధ్యతలు కొన్ని ఉండేవి. బానిసలకు మాత్రం ఎట్టి హక్కులు లేవు. వందలాది బానిసలను కలిగివున్న భూస్వాముల ప్రస్తావన బౌద్ధజాతక కథలలో అనేక చోట్ల ఉంది.

నగరాలలో బానిసలు గనులలోను, ఆయుధాగారాలలోను వ రకుల వద్ద ఉండేవారు. "శూద్రులు ఇతరులకు సేవకులు. ఇతరుల ఆజ్ఞకు లోబడి జీవించాలి. ఇతరుల ఆజ్ఞకు లోబడి మరణించాలి" అని ఐతరేయ బ్రాహ్మణం తెలియజేస్తున్నది. "శూద్రులు అన్నిరకాల పనులు చేస్తుంటారు. ఏ ఆహారమైనా వారికి చాలు. వారు సర్వకర్మోప జీవులు" అని మహాభారతం తెలియజేస్తున్నది.

కాలం గడచినకొద్దీ బానిసల సంఖ్య వృద్ధి కాసాగింది. ఇతర వర్ణాల నుండి చ్యుతులైనవారు కొత్త తెగల నుండి స్వీకృతులైనవారు బానిసలుగా మారిపోతూ వచ్చారు. ఈ క్రింది విధాలుగా బానిసలు ఏర్పడతారని నారదస్మృతి తెలియజేస్తున్నది:

"దాసీజనానికి పుట్టినవారు, డబ్బుతో కొనబడినవారు, బహుమతుల రూపంలో ఇవ్వబడినవారు, కరువుకాలంలో తిండిగడవక బానిసలైనవారు, బంధువులచే అప్పుకింద ఇచ్చివేయబడినవారు....వీరందరూ బానిసలే. వీరు గాక నిర్ణీతకాలం బానిసలుగా ఉండి, బాకీ తీరిన తర్వాత స్వతంత్రులయ్యేవారు కొందరు. ఈ విధంగా 15 రకాల బానిసలున్నారు."

బానిస విధానం భారతదేశంలో బుద్ధునికి పూర్వం ఉండేది. వైశ్యులు ప్రధానంగా వ్యవసాయదారులుగా ఉండేవారు. బానిసలు వారి క్రింద చాకిరీ చేస్తుండేవారు.

ఈ విధానం క్రింద బానిసలు ఎంతటి నికృష్టస్థితిలో ఉండేవారో బౌద్ధ జాతక కథలు తెలియజేసాయి. యజమానులు బానిసలను కొట్టటం, చంపటం సర్వసామాన్యం. "బంగారం, పశువులు, వస్త్రాలు, చందనపు చెక్క ఆభరణాల వలెనే బానిసలు కూడా యజమానుల ఆస్తి." (జాతక కథలు – 229, 5 వాల్యూం)

"ఏమాత్రము పనిలో అశ్రద్ధ చూపినా యజమాని నన్ను స్తంభానికి కట్టి చిత్రహింసలు పెడతాడు అని కథకుడను బానిస భయభ్రాంతుడై నాడు" (వాల్యూమ్, 125 కథ). "కాశీరాజైన ఏకరాజు, తన నగరంలోని వైశ్యులను తదితరులను దేవతకు బలి యివ్వవలెనని, కందహాలి అను బ్రాహ్మణుని సలహాపై ప్రయత్నించాడు. అపుడా వైశ్యులందరూ రాజు వద్దకు వచ్చి యిలా మొరపెట్టుకున్నారు:

"మమ్ములను చంపవద్దు, దయతలచవలసింది; మేము మీకు బానిసలం అవుతాము. కాళ్ళకు చేతులకు సంకెళ్ళువేసి మీ గోశాలలో మమ్ము ఉంచండి. మేము రోజూ మీ గోశాలలను, అశ్వశాలలను శుభ్రం చేస్తూ వుంటాము. —(జాతక కథలు–138)

ఇట్టి దోపిడీ విధానంపై ఆధారపడిన వ్యవస్థలో ప్రజల అసంతృప్తి అనేక రూపాలలో వ్యక్తమౌతూ ఉండేది. పనులు చేయక పారిపోవడం, పంటలకు నష్టం కలిగించటం, దొంగతనాలు, దారిదోపిడీలు, వ్యక్తిగత తిరుగుబాట్లు జరుగుతూ ఉండేవి.

బుద్ధునికాలంనాటికి పరిస్థితులు మారాయి. వైశ్యులు వ్యాపారం ఎక్కువగా చేయసాగారు. గ్రామాలను వదలి నగరాలకు హెచ్చు సంఖ్యలో చేరుతూ వచ్చారు. బానిసలు మాత్రమేగాక, క్షత్రియ వైశ్యులు సైతం బ్రాహ్మణ మత నిరంకుశత్వంపట్ల అయిష్టత వెలిబుచ్చసాగారు. గ్రామాలలో వ్యవసాయం సాగాలంటే అంతకు పూర్వం బానిసలుగా ఉన్న వారిని పౌరులలో ఒకరిగా గుర్తించి భూమిని సాగుచేసుకునే హక్కు ఇవ్వవలసిన అవసరం ఏర్పడ్డది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి బానిస విధానం ఆటంకంగా తయారైంది.

ఈ అసంతృప్తిని బౌద్ధమతం ప్రతిబింబించింది. వర్ణవిభేదాలు పనికి రావని, బానిసలను మానవులనుగా చూడవలెనని బుద్ధుడు బోధించారు.

నూతన సమాజావిర్భావానికి దోహదకరమైన బుద్ధుని బోధలు దేశమంతటా వ్యాపించాయి.

రాజకీయంగా నందసామ్రాజ్యం బానిస సామ్రాజ్యాలలో ఆఖరు సామ్రాజ్యం. మురా అను బానిస కొడుకైన చంద్రగుప్తుడు, సోదరులను సంహరించి రాజు కావటం కేవలం వ్యక్తిగత విషయం మాత్రమే కాదు; నూతన సమాజ నిర్మాణాన్ని సుకరం చేసిన ఒక పరివర్తన, చంద్రగుప్తుడు జైనమతాభిమాని. జైనమతం కూడా బౌద్ధమతంవలెనే వర్ణవిభేదాలను ఖండించి సమానత్వాన్ని బోధించిన మతం.

చంద్రగుప్తుని మంత్రి చాణక్యుడు తన అర్థశాస్త్రంలో నాటి ఆర్థిక పరిస్థితులను ఇలా వివరించాడు :

"రైతుకు భూమిపై హక్కు ఉంది. రైతు బానిస కాదు. స్వతంత్రుడు. గ్రామపంచాయతీకి లోబడి రైతు సాగు చేసుకుంటూ వుండాలి. వ్యవసాయంలో బానిస విధానం పనికిరాదు."

గ్రామాలలో బానిస విధానం నశించి అర్ధబానిస విధానం ప్రారంభమైంది. నగరాలలో మాత్రం బానిసవిధానం మరికొంతకాలం వరకూ కొనసాగుతూనే వచ్చింది.

పాత సామాజిక విధానం ఒక్కనాటితో పూర్తిగా అంతమై కొత్త సామాజిక విధానం ఒక్కసారిగా ఆవిర్భవించదు. పాతసమాజ అవశేషాలు చాలాకాలంవరకు కొనసాగుతూనే వుంటాయి. బానిసవిధానం ఏర్పడ్డమీదట కూడ ఆదిమ కమ్యూనిస్టు లక్షణాలు కొన్ని కొనసాగినట్లు, అర్ధబానిస విధానం ఏర్పడ్డ మీదట కూడా, బానిస విధాన లక్షణాలు కొన్ని ఉంటూనే ఉన్నవి. అశోకునితో ప్రారంభమైన గ్రామీణ వ్యవస్థ అర్ధబానిస విధానానికి చిహ్నం. కాని ఆదిమ కమ్యూనిస్టు సమాజ చిహ్నాలైన సమిష్టి లక్షణాలు, బానిసవిధాన చిహ్నాలైన అస్పృశ్యత నూతన వ్యవస్థలో కూడా కొనసాగుతూనే వచ్చాయి. అంతకు ముందులేని గ్రామపంచాయతీ ఒకటి కొత్తగా ఏర్పడది. ఏ కులానికి చెందినా, గోత్రానికి చెందినా, మతానికి చెందినా, వ్యవసాయం చేసుకునే ప్రజలందరికి ఈ పంచాయతీ రక్షణ యిస్తుంది. ఈ పంచాయతీ అధికారాలను ప్రభుత్వం గౌరవించాలి. ఈ గ్రామ పంచాయితీయనే, ఆధునిక చరిత్రకారులు గ్రామకమ్యూన్ అంటున్నారు.

కులపతి వ్యవస్థకంటే, గ్రామపంచాయతీ వ్యవస్థ అభ్యుదయకరమైన ఆర్థిక విధానం. అంతకుపూర్వం యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీవిస్తున్న బానిసలకు సమాజంలో ఒక స్థానం ఏర్పడది. శూద్రులు నాలుగవ వర్ణము అనీ, హిందూమతం గుర్తించడం కూడా నాటినుండే ప్రారంభమైంది. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తిండి, బట్ట, రక్షణ యివ్వవలసిన బాధ్యత పంచాయతీది. వివిధ వృత్తులను ప్రోత్సహించి, వారికి కావలసిన ఆర్థిక సహకారాన్ని ఇచ్చి గ్రామపంచాయితీలు ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి తోడ్పడ్డాయి.

చంద్రగుప్తుని మనుమడైన అశోకుడు (క్రీ. పూ. 250) గ్రామ పంచాయితీలకు విశేషాధికారాలు యిచ్చి, రహదారి సౌకర్యాలు కల్పించి సత్రాలు కట్టించి, నూతన సామాజిక వ్యవస్థకు భద్రత కలిగించాడు.

ఇది భారత దేశంలోని అర్థ బానిస విధాన స్వరూపం. గ్రామ పంచాయతీ పునాదిపై వృత్తులు వృద్ధిచెందాయి. వేర్వేరు వృత్తులు చేసుకునేవారు కాలక్రమేణా వేర్వేరు కులాలు (Castes) గా ఏర్పడ్డారు. భూస్వామ్యవర్గ దోపిడికి భారతదేశ చరిత్ర కల్పించిన ప్రత్యేకరూపం కులవ్యవస్థ. కాని బౌద్ధ సంస్కృతి ప్రభావం భారతదేశంలో ఉన్నంత వరకు, ఈ వ్యవస్థలోని కాఠిన్యత అదుపులో ఉండేది.

ఆర్థిక, సాంఘిక రంగాలలో ఇట్టి గొప్ప మార్పులు జరుగుతున్న కాలం కనుకనే వివిధ తెగలు ఏకమై జాతులుగా ఏర్పడేందుకు అవసరమైన భౌతిక పునాదులు నాడు ఏర్పడ్డాయి. కులపతి వ్యవస్థ స్థానంలో గ్రామ పంచాతీయిలు, వర్ణ వ్యవస్థకు బదులు కులవ్యవస్థ, తెగల స్థానంలో జాతులు తలయెత్త సాగినవి.

ఉత్తర హిందూస్థానంనుంచి వచ్చిన ఆంధ్రులలో బానిసవిధానం, వర్ణవ్యవస్థ వున్నప్పటికీ బానిస విధానంలో తమకంటె శక్తివంతులైన తెగల తాకిడికి నిలవలేక దక్షిణాదికి దిగివచ్చినవారు కనుక ఈ విధానం యొక్క పటుత్వం వారిలో తగ్గింది. కనుక నూతన వ్యవస్థ ఐన అర్థ బానిస విధానానికి వీరు అతిత్వరలో అలవాటు పడ్డారు. నాగ, యక్షతెగలు కొంతవరకు ఆదిమ కమ్యూనిస్టు అవశేషాలతో జీవిస్తున్న తెగలు. తెలుగు

వారు వ్యవసాయంలో బాగా అభివృద్ధి చెందినవారు - వేర్వేరు ఆర్థిక విధానాలపై, వేర్వేరు వృత్తుల్లో నైపుణ్యం సంపాదించిన ఈ తెగలన్నీ అప్పుడప్పుడు తలయెత్తుతున్న స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థ అను అర్ధ బానిస విధానంలో అంతర్లీనమైనాయి. ఈ ఆర్థిక పరిణామం, ఆంధ్రజాతి పరిణామానికి పునాదిరాయి.

బానిస విధానంపై ఆధారపడిన రోమ్ సామ్రాజ్యం బ్రద్దలైన మీదటనే అంతవరకు తెగల దశలలో ఉన్న కెల్టు, జర్మన్, గాలిక్ ప్రజలు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడి, భూస్వామ్య విధానం క్రింద వేర్వేరు జాతులుగా ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్ జాతులుగా రూపొందసాగారు. భారత సమాజ చరిత్ర : ఆంధ్రజాతి ఆవిర్భావం పై చారిత్రక సత్యాన్ని రుజావు చేస్తున్నవి. మహాభారత యుద్ధనంతరం బౌద్ధ సంస్కృతి ప్రోత్సాహంతో భారతదేశంలో వివిధ జాతులు రూపొందాయి.

౨వ అధ్యాయం

# శాతవాహన యుగం

ఆంధ్రప్రాంతాన్ని పరిపాలించిన ప్రథమ రాజవంశం శాతవాహన వంశం. పురాణాలు వీరిని ఆంధ్రులని, ఆంధ్ర ప్రభృత్యులని పేర్కొన్నాయి.

శాతవాహనులకు పూర్వమే కృష్ణానదీతీరంలో నాగ, యక్ష ప్రజలు రాజులు జీవించినట్లు లోగడ తెలుసుకున్నాము. వీరితోపాటు ఆంధ్ర విష్ణువను మరొక రాజుకూడా ఉన్నట్లు బ్రహ్మాండ పురాణం తెలియజేస్తున్నది.

సుచంద్రుడను రాజు కుమారుడైన ఆంధ్రవిష్ణువు నిశంభుడను రాక్షసుని సంహరించి గోదావరీ తీరంలో ఒక రాజ్యాన్ని స్థాపించాడు. సుచంద్రుని రాజధాని కృష్ణాజిల్లా శ్రీకాకుళం అని ఆర్య మంజుశ్రీ మూలకల్పమను బౌద్ధ గ్రంథం తెలియజేస్తున్నది. ఆంధ్రవిష్ణువు దేవాలయం ఒకటి నేటికీ శ్రీకాకుళంలో నిలచి వుండటంవల్ల పై గాథలో కొంత సత్యమున్నదని తోస్తున్నది. ఆంధ్ర విష్ణువుని గురించి ఇంతకు మించి సమాచారమేమీ తెలియడంలేదు. ఇతడు శాతవాహన వంశస్థుడు కాదు. గుంపులు గుంపులుగా దక్షిణాదికి తరలివస్తున్న ఆంధ్రులలో ఒక తెగ లేక గణం ముందుగా కృష్ణా నదీతీరానికి చేరి అక్కడ ఒక రాజ్యాన్ని స్థాపించి ఉండవచ్చు.

ఆంధ్ర శాతవాహన రాజ్యం చంద్రగుప్తమౌర్యుని కాలం నాటికే బలసంపదతో విరాజిల్లుతున్నట్లు, చంద్రగుప్తుని ఆస్థానంలో ఉన్న గ్రీకు రాయబారి మెగస్తనీస్ వ్రాతలద్వారా తెలుస్తున్నది. మెగస్తనీస్ ఇలా వ్రాస్తున్నాడు: "ఆంధ్రులకు ప్రాకారావృతమైన 30 నగరాలు ఉన్నవి. వీరి రాజుకు 10 వేల పదాతి సైన్యం, 2 వేల గుర్రపు రౌతులు, 1 వేయి ఏనుగులు కూడా ఉన్నవి."

మెగస్తనీసు కాలము క్రీ.పూ. 300. ఆనాటికే 30 నగరాలను కలిగిన ఆంధ్రరాజ్యం, అంతకు ముందు 1, 2 శతాబ్దాల క్రితమే ఏర్పడి ఉండాలి. బృహత్కథలోని గాథల ననుసరించి, శాతవాహన రాజ్యం అంతకుముందు చాలాకాలం నుండి ఉన్నట్లు బోధపడుతుంది. కనుక శాతవాహన రాజ్యం క్రీ. పూ. 400 ప్రాంతంలోనో, అంతకుముందో ఆవిర్భవించి, క్రీ. పూ. 300 నాటికి 30 నగరాలను కల విశిష్ట ప్రాంతమైనదని భావించవచ్చు.

శాతవాహన రాజ్యం మౌర్యసామ్రాజ్యానికి మొదట లోబడి, ఆ తర్వాత స్వతంత్ర రాజ్యమైనట్లు పురాణాలలో వాడబడిన ఆంధ్రభృత్య పదం (భృత్యులైన ఆంధ్రులు) తెలియజేస్తున్నది. అశోకుడు కళింగ దేశాన్ని జయించాడే గాని ఆంధ్రదేశాన్ని జయించలేదు. కాని ఆంధ్ర దేశం, అశోక రాజ్యంలో అంతర్భాగమైనట్లు అతని 13 వ శాసనం ద్వారా తెలుస్తున్నది. కర్నూలు జిల్లా ఎర్రగుడిలోను, రాయచూరు జిల్లా మస్కీలోనూ, బళ్ళారి జిల్లా సిద్ధాపురంలోను, అశోక శిలాశాసనాలు నేటికీ నిలచి ఉన్నాయి. అమరావతి స్తూపాన్ని మహాస్తూపంగా పునర్నిర్మించింది అశోకుడు. కనుక అశోకునికి పూర్వమే ఆంధ్రదేశం మౌర్యసామ్రాజ్యంలో అంతర్భాగమైందని, అశోకుని తండ్రి బిందుసారుడు ఆంధ్రులను జయించి వుండవచ్చు.

బిందుసారుని కాలంలో మౌర్యసామ్రాజ్యానికి సామంతులైన శాతవాహన రాజులు, అశోకరాజు పరిపాలనను అనుభవించి, అతని సత్సాంప్రదాయాలను, మత సహనాన్ని, పరిపాలనా పద్ధతులను స్వీకరించి, అశోక రాజు మరణానంతరం స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు.

## శాతవాహనుల విస్తరణ

శాతవాహన రాజులలో మొదటి ముగ్గురు రాజులు సిముకుడు, కృష్ణుడు, మొదటి శాతకర్ణి. వీరి నాణెములు, శాసనాలు బొంబాయి రాష్ట్రంలోని నాసిక, కన్హేరీ గుహలలో లభించాయి. 20వ రాజైన గౌతమీపుత్ర శాతకర్ణి శాసనాలు, నాణెములు నాసిక, కన్హేరిలలో మాత్రమేగాక కృష్ణా

జిల్లా ఘంటసాలలోను, గుంటూరుజిల్లా అమరావతిలోను లభించాయి. గౌతమీపుత్రుని విగ్రహమొకటి అమరావతిలో లభించింది. ఈ మధ్య జరిగిన పరిశోధనల ఫలితంగా తెలంగాణాలోని గాజులబండ, ఫణిగిరి (నల్లగొండ జిల్లా), కొండాపురం (మెదక్ జిల్లా) కరీంనగర్ జిల్లా ధూళికట్ట, కోటిలింగాల గ్రామాలలో శాతవాహనుల నాణెములు, స్తూపములు మాత్రమే గాక, ప్రాచీనమైన కట్టడాలు సైతం కొన్ని బయల్పడినవి. కళింగరాజైన ఖారవేలుడు తన సైన్యాలను పశ్చిమదిశగా పంపి, శాతకర్ణి రాజును లక్ష్యం చేయక పిధుండ, మూషిక నగరాలను ధ్వంసం చేసినట్లు, అతని హాథిగుంఫ శాసనంలో ఉంది. పిధుండ, మూషిక నగరాలు రెండూ తెలంగాణా ప్రాంతంలోనివి. ప్రతిష్ఠానపురం, (ఔరంగాబాద్ జిల్లాలోని పైఠాన్) శాతవాహనుల రాజధానియైనట్లు బృహత్కథ శాలివాహన గాథా సప్తశతి తెలియజేస్తున్నాయి. మెగస్తనీసు ప్రస్తావించిన 30 నగరాలలో నేటికి తెలిసినవి ఇవి: భట్టిప్రోలు, విజయపురి, ధరణికోట, వేగి, గాజులబండ, ఫణిగిరి, కొండాపురం, పిధుండ, మూసిక నగరం, పైఠాన్, బళ్ళారి జిల్లాలో క్రీ.శ. 2 వ శతాబ్దంలో బయల్పడ్డ ఒక శాసనాన్ననుసరించి ఆ ప్రాంతానికి శాతవాహనహార అని, ఆంధ్ర పథమని పేర్లు అనాటికే ఉండేవి.

వింధ్య పర్వతాలు దాటి క్రిందకు దిగుతున్న ఆంధ్రులు మొట్టమొదట, నేటి మరాట్వాడా ప్రాంతంలోను, ఆ పిదప తెలంగాణా ప్రాంతంలోను రాజ్యం స్థాపించారు. కాలక్రమేణా ఈ రాజ్యం కృష్ణా గోదావరి ప్రాంతానికి, రాయలసీమకు విస్తరించి యావదాంధ్ర దేశాన్ని ఆవరించింది. మెగస్తనీసు ప్రస్తావించిన 30 నగరాలలో ఇప్పటికీ బయల్పడనివి తెలంగాణా ప్రాంతములోనే ఉండి ఉంటాయి.

మెరకభూముల నుండి సారవంతమైన భూముల వైపుగా ప్రజలు, రాజ్యాలు విస్తరించడం సహజం. కనుక ఆంధ్రులు, వారి రాజులైన శాతవాహనులు పైఠాన్ వద్దనుండి ధరణికోటవైపు విస్తరించారు. శాతవాహన నాగరికతకు ప్రథమ దశలో తెలంగాణా పునాది. అటు పైఠాన్ ఇటు ధరణికోట రెండు జంటలుగా ఉండేవి.

## శాతవాహనరాజులు

శాతవాహన వంశానికి చెందిన మొదటి స్వతంత్ర పరిపాలకుడు సిముకుడు. సంస్కృతంలో ఈ పదం శ్రీముఖుడు అవుతుంది. ఈ రాజు పరిపాలనా కాలం క్రీ. పూ. 221-198 వరకు. ఇతని రాజధాని పైఠాన్. ఈ రాజు సౌరాష్ట్రాన్ని జయించి, అప్పటి రాజైన మహారఠీత్రణకయిరో. కుమార్తె నాగానికను తన కుమారుడైన శాతకర్ణికి వివాహం చేసుకున్నాడు.

ఇతని తర్వాత, అతని తమ్ముడు కృష్ణుడు బలాత్కారంగా రాజ్యం ఆక్రమించుకున్నాడు. నానేఘాట్ గుహలలో ఇతని శాసనమొకటి ఉన్నది. ఇతడు వాసిక ప్రాంతాన్ని జయించాడు. ఇతని కాలంలోనే మౌర్య చక్రవర్తియైన బృహద్రధుని సంహరించి, పుష్యమిత్రుడను శుంగరాజు పాటలీపుత్రాన్ని ఆక్రమించుకున్నాడు. కృష్ణుని పరిపాలనా కాలం పది సంవత్సరాలు.

అనంతరం, సిముకుని కుమారుడైన శాతకర్ణి పరిపాలన ప్రారంభమైంది. శాతవాహన రాజులలో పలువురికి శాతకర్ణి బిరుదున్నందువల్ల ఇతనిని మొదటి శాతకర్ణి అని చరిత్రకారులు వ్యవహరిస్తున్నారు. నానేఘాట్ గుహలో శాతకర్ణి, అతని భార్య నాగానిక, అతని తండ్రి సిముకుని విగ్రహాలున్నవి.

శాతకర్ణి బహు పరాక్రమశాలి. దక్షిణాపథపతి అను బిరుదును ధరించి, పాటలీపుత్ర రాజైన పుష్యమిత్రునితోను, కళింగరాజైన ఖారవేలునితోను, అనేక యుద్ధాలు చేశాడు. ఇతని పరిపాలనాకాలం క్రీ. పూ. 180-170. ఇతను ఉజ్జయినిపై దండెత్తి ఆ నగరాన్ని జయించి అందుకు చిహ్నంగా తన నాణెములపై ఉజ్జయిని ముద్రను వేయించాడు. రెండశ్వమేథయాగాలను, రాజసూయయాగాన్ని, ఇంకా అనేక క్రతువులను ఈ రాజు చేసినట్లు ఇతని భార్య నాగానిక చెక్కించిన శాసనంలో ఉంది.

శాతకర్ణి కుమారుడు పూర్ణోత్సంగుడు. ఇతడు క్రీ. పూ. 170-152 వరకు పరిపాలించాడు. ఆ తర్వాత రెండవ శాతకర్ణి క్రీ. పూ. 152-96 వరకు. అనగా 56 సంవత్సరాలు పరిపాలించాడు. ఈ సుదీర్ఘకాలంలో ఈ

రాజు కళింగ, విదిశ దేశాలపై దండెత్తి పాటలీపుత్రాన్ని సైతం జయించి పది సంవత్సరాలపాటు మగధ రాజ్యాన్ని ఆంధ్ర సామ్రాజ్యంలో భాగంగా చేశాడు. సాంచీ బౌద్ధ స్తూపంవద్ద ఈ రాజు శాసనం ఒకటి ఉన్నది. విదిశ, పాటలీపుత్రాలు ఆ తర్వాత తిరిగి స్వతంత్ర మైనప్పటికీ కళింగరాజ్యం మాత్రం నాటినుండి శాతవాహన రాజ్యంలో భాగమైంది. శకులు భారతదేశంపై ఈ కాలంలోనే దండయాత్రలు ప్రారంభించారు

రెండవ శాతకర్ణి తర్వాత సామ్రాజ్యపతనం ప్రారంభమైంది. విదిశ, ఉజ్జయిని, మహారాష్ట్ర ప్రాంతాలు శాతవాహన రాజ్యంనుండి జారిపోయినవి. ఈ సామ్రాజ్యపతన కాలంలో లంబోదరుడు, ఆపీలకుడు మొదలైన రాజులు వరుసగా పైఠాన్ సింహాసనం అధిష్ఠించారు.

ఈ వంశంలో పదకొండవవాడైన కుంతలశాతకర్ణి ప్రతిభాశాలి. ఇతను పరిపాలించిన కాలం క్రీ. పూ. 38-30 వరకు. అనగా 8 ఏండ్లు మాత్రమే ఐనప్పటికి. ఈ కాలం ఆంధ్రుల చరిత్రలో ముఖ్యమైనది. ప్రాకృత భాషను తొలగించి సంస్కృతభాష, యీ కాలంలోనే రాజభాష ఐంది. విలాసప్రియుడైన కుంతలశాతకర్ణి, కరిర అను ఒకానొక కామసంబంధమైన బంధనక్రియద్వారా, తన భార్య మలయవతి మరణానికి కారకుడైనట్లు వాత్స్యాయన కామసూత్రాలు తెలియజేస్తున్నవి.

ఇతని ఆస్థాన పండితుడైన గుణాఢ్యుడు బృహత్కథను రచించాడు. పాటలీపుత్రాన్ని పరిపాలిస్తున్న కాణ్వరాజైన సుశర్మను, క్షహరాట వంశస్థుడై గుజరాత్‌లోని భరుకచ్ఛాన్ని (బ్రోచ్) పరిపాలిస్తున్న నహపానుని కుంతల శాతకర్ణి యుద్ధాలలో ఓడించి తన రాజ్యాన్ని కాపాడుకున్నాడు.

కుంతల శాతకర్ణి తర్వాత మొదటి పులోమావి క్రీ. పూ. 30 నుండి క్రీ. పూ. 6 వరకు పరిపాలించాడు. ఇతను పాటలీపుత్రంపై దండెత్తి సుశర్మను చంపి, ఆ నగరాన్ని ఆక్రమించుకున్నాడు.

పూర్వ శాతవాహనులలో అఖండరాజు హాలచక్రవర్తి. ఇతనికాలం క్రీ. శ. 19-24. అయిదేండ్లు మాత్రమే హాలుడు పాలించినప్పటికీ నాటి

సంస్కృతి ప్రతిబింబమైన గాథాసప్తశతి హాలుని ఆధ్వర్యాన సంకలనం చేయబడటంతో, ఇతని పేరు చరిత్రలో శాశ్వతస్థానం సంపాదించుకున్నది. ఈ రాజు కాలంలో శాతవాహనరాజ్యం తూర్పు సముద్రంవరకు విస్తరించింది. లీలావతియను సింహళ రాజకన్యను హాలుడు సప్తగోదావరి ప్రాంతంలోని భీమేశ్వర క్షేత్రంలో వివాహమాడినట్లు లీలావతి కావ్యం తెలియజేస్తున్నది. నేటి తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామమే భీమేశ్వర క్షేత్రము.

హాలుని తర్వాత శాతవాహనరాజులు, పైఠాన్ నగరాన్ని మహారాష్ట్ర ప్రాంతాన్ని కోల్పోయినారు. ఆ ప్రాంతమంతా క్షత్రప బిరుదాంకితులైన శకరాజుల పాలనకు లోబడిపోయింది. క్రమంగా శాతవాహన పీఠము, తెలంగాణా మీదుగా ఆంధ్రకు తరలింది. ధరణికోట శాతవాహన రాజుల రాజధాని అయింది.

ధరణికోట రాజధానిగా పరిపాలించిన శాతవాహన రాజులలో గౌతమీపుత్ర శాతకర్ణి ప్రముఖుడు. శాతవాహన వంశంలో ఇతను ఇరువది ఒకటవ రాజు. హాలునికి, గౌతమీపుత్ర శాతకర్ణికి మధ్య పరిపాలించిన రాజుల విశేషాలేమి తెలియవు.

గౌతమీపుత్ర శాతకర్ణి క్రీ. శ. 78_102 వరకు పరిపాలించాడు. ఇతని రాజ్యంలో యావదాంధ్ర ప్రాంతం ఉంది. దక్షిణాన కడలూరులో ఇతని నాణెములు కనుపించాయి. తమ పూర్వరాజధానియైన పైఠాన్‌ను గౌతమీపుత్ర శాతకర్ణి తిరిగి స్వాధీనం చేసుకుని, మహారాష్ట్ర, ఉత్తర కొంకణ, సౌరాష్ట్ర, మాళ్వ, విదర్భ రాజ్యాలను జయించినట్లు, ఇతని తల్లి బాలశ్రీ చెక్కించిన నాసిక శాసనం ద్వారా తెలుస్తున్నది.

కన్నడ దేశమందలి వైజయంతి అను ప్రసిద్ధ రేవు పట్నాన్ని ఇతను ఆక్రమించాడు. శకరాజైన నహపానుని జయించి, విజయసూచకముగా అతని నాణెముల రెండవవైపున తన చిహ్నమును ముద్రించాడు. ఇతని సామ్రాజ్యము దక్షిణాన కడలూరునుండి ఉత్తరాన ముఖలింగం వరకు, బంగాళాఖాతం నుండి అరేబియా సముద్రం వరకు వ్యాపించింది.

త్రిసముద్రాధీశ్వరని, ద్విజకులవర్ధనుడని, ఏకబ్రాహ్మణుడని, గౌతమీపుత్రుడు అనేక బిరుదులు ధరించాడు. ఇతని నాణెములపైగల ఓడచిహ్నం నాడు విస్తారంగా సాగుతున్న ఓడ వ్యాపారానికి నిదర్శనం.

గౌతమీపుత్ర శాతకర్ణి అనంతరం అతని జ్యేష్ఠపుత్రుడు వాసిష్ఠీపుత్ర పులోమావి, ఆ తర్వాత ద్వితీయ పుత్రుడు శాతకర్ణి పరిపాలించారు. శాతకర్ణి, శకరాజైన రుద్రదమనుని కుమార్తెను వివాహమాడాడు. ఐనప్పటికీ శక, శాతవాహన ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. రుద్రదమనుడు రెండుసార్లు శాతకర్ణిని ఓడించి, అల్లుడుగదా అని అభిమానంతో విడిచిపుచ్చినట్లు రుద్రదమనుని జునాగడ్ శాసనం తెలియజేస్తున్నది.

క్రమంగా శాతవాహన రాజ్యం పతనం ఐంది. ఆఖరున పరిపాలించిన వారిలో ప్రముఖుడు యజ్ఞశ్రీ శాతకర్ణి. ఇతని కాలం క్రీ. శ. 174-203. ఆచార్య నాగార్జునుని సమకాలికుడు. నాగార్జున కొండవద్ద పారావత విహారాన్ని కట్టించినవాడు యజ్ఞశ్రీ.

యజ్ఞశ్రీ అనంతరం మరి ముగ్గురు రాజులు పరిపాలించారు. వారిని గురించిన విశేషాలు తెలియవు. 500 సంవత్సరాల పైచిలుకు కాలం యావదాంధ్ర దేశాన్ని, కొంతకాలం మహారాష్ట్ర దేశాన్ని సహితం పరిపాలించిన శాతవాహన రాజవంశం క్రీ. శ. 218 లో అంతమైంది.

# శాతవాహన నాగరికత

శాతవాహనులనాటి రాజభాష ప్రాకృతం. సామాన్య ప్రజలు దేశి అనే భాష మాట్లాడేవారు. ఈ భాష ప్రాకృతజన్యం కాదు. ద్రావిడభాషా కుటుంబమునకు చెందినది. దేశి యొక్క అపభ్రంశరూపమే పైశాచి. ఈ భాషలోనే గుణాఢ్యుడు బృహత్కథను వ్రాశాడు. కొద్దిమంది పండితులు మాత్రం సంస్కృతం మాట్లాడేవారు. ప్రాకృతభాషను తొలగించి, సంస్కృత భాష రాజాదరణ పొందిన ఉదంతాన్ని ఈ క్రింది కథ వివరిస్తుంది.

## గుణాఢ్యుని కథ

కుంతల శాతకర్ణి ఆస్థానంలో గుణాఢ్యుడనే ప్రాకృత పండితుడున్నాడు. కుంతల శాతకర్ణి భార్యలలో ఒకరు సంస్కృత భాషా పాండిత్యంగల స్త్రీ. రాజుకు సంస్కృతము రాదు. ఒకనాడు రాజు అంతఃపుర జనంతో జలక్రీడలాడుతుండగా రాణి రాజు నుద్దేశించి "రాజన్ మామోదకైః ప్తాడయ" అని అన్నది. మోదకాలంటే వుండ్రాళ్ళు కనుక రాణిగారికి వుండ్రాళ్ళమీద ఆసక్తి కలిగిందని వెంటనే రాజు ఒక బుట్టెడు వుండ్రాళ్ళు తెప్పించాడు. అది చూచి రాణితో సహా అందరూ రాజును పరిహసించారు. 'మాం ఉదకైః మా తాడయ' నీళ్ళతో నన్ను కొట్టవద్దు అని రాణి అన్నది. ఈ సంస్కృత వాక్యార్థం గ్రహించలేని రాజు మోదకైః అంటే ఉండ్రాళ్ళు అనుకున్నాడు.

ఈ ఘటన జరిగిన తర్వాత రాజు అవమాన భరితుడై పండితులను పిలిపించి తనకు 6 నెలలలో సంస్కృత పాండిత్యం వచ్చేటట్లు చేయాలన్నాడు. శర్వవర్మ అను సంస్కృత పండితుడు అందుకు పూనుకొని,

కాతంత్ర వ్యాకరణము అనే ఒక సులభ వ్యాకరణాన్ని రచించి రాజుకు 6 నెలలలో సంస్కృత పాండిత్యము కలిగించాడు.

రాజస్థానంలో సంస్కృతభాషకు ఆదరం హెచ్చింది. ప్రాకృత పండితుడైన గుణాఢ్యునికి అనాదరం కలిగింది. ఈ నిరసనకు ఖిన్నుడై గుణాఢ్యుడు అడవికి వెళ్ళి బృహత్కథ అను ఒక గొప్ప గ్రంథాన్ని రచించాడు. అతి ప్రాచీనమైన కథలను ఇందులో చేర్చాడు. ఆంధ్రుల ప్రాచీన సాంఘిక జీవనము మాత్రమేగాక భారతీయుల సాంఘిక చరిత్ర తెలుసుకోడానికికూడా బృహత్కథ ఎంతగానో ఉపయోగ పడుతుంది.

ఈ గ్రంథమంతా పైశాచీ భాషలో రచించబడ్డది. సంస్కృత, ప్రాకృత, దేశీ భాషలను వదలి తాను పైశాచీ భాషలో ఈ గ్రంథాన్ని రచించానని గుణాఢ్యుడే చెప్పుకున్నాడు. ప్రాకృతభాషకు ఈ క్రింది నిదర్శనాలు చూడవచ్చు.

## కృష్ణుని నాసిక శాసనం ప్రాకృతం

1. సాదవాహన కులె కన్హె రాజిని నాసిక కెన.
2. సమణెన మహామాతెణ లెణ కారిత.

(శాతవాహన కులమునందలి కృష్ణుడు రాజుగనుండగ నాసిక వాస్తవ్యుడు అగు శ్రమణుడు అను మహాత్మునిచేత యీ గుహ తొలిపింపబడెను.)

శాతవాహన రాజులనాటి సామాజిక జీవితాన్ని తెలుసుకోడానికి, ఆ రాజుల శాసనాలు, నాణెములు, సమకాలీన గ్రంథాలు ఉపయోగపడతాయి. ఇవి మాత్రమేకాక, కౌటిల్యుని అర్థశాస్త్రంవంటి గ్రంథాలు కూడా ఎంతో సహాయపడతాయి. అర్థశాస్త్ర గ్రంథకర్త చాణక్యుడు. మౌర్యచంద్రగుప్తుని కాలంలోనూ, అంతకు పూర్వం మౌర్య సామ్రాజ్యంలో మాత్రమే కాక, భారతదేశమంతటా ఉన్న సామాజిక, ఆర్థిక విధానంలోని విశేషాలను అర్థశాస్త్రం తెలియచేస్తుంది.

## నగర పరిపాలన

పట్టణాలను 'నగరము'లని 'నిగమము'లని పిలిచేవారు. పట్టణ పరిపాలన, కేంద్రాధికారానికి లోబడిన పౌరసంఘాలచే నిర్వహించ బడుతూ ఉండేది. నగర పరిపాలన బాధ్యత 'నాగరికుడు' అను ప్రభుత్వ ఉద్యోగి వహించేవాడు. అర్థశాస్త్రములోని 'నాగరిక ప్రణిధి' అను విభాగం నాటి నగర పరిపాలనా వ్యవస్థను తెలియచేస్తుంది. ఇతనికి విశేషాధికారాలుండేవి. రాజుకు మాత్రమే ఇతడు బాధ్యుడు. సర్వాధికారాలు గల ఈ నాగరికుల యాజమాన్యాన పౌర సంఘాలకు నామమాత్రాధికారాలు మాత్రము ఉండేవి.

## గ్రామ వ్యవస్థ

స్వయంసంపూర్ణ ఆర్థిక విధానంతో జీవించిన నాటి గ్రామాల పరిపాలన స్థానికుల చేతిలో ఉండేది. పన్నులధారం విపరీతం. చెరువులో చేపలుపట్టే హక్కు, సంతలో పన్ను వసూలు చేసుకునే హక్కు, బంజరు, బీళ్ళు తరితరమైన హక్కులన్నీ రాజుకు ఉండాలని చాణక్యుని వాదన. కొందరు ఉదారులైన రాజులు కొన్నికొన్ని హక్కులను గ్రామీణ ప్రజలకు వదలి ఉండవచ్చు. కాని సాధారణ వ్యవస్థ చాణక్యుడు వివరించినట్లే ఉండేది.

## ఆర్థిక వ్యవస్థ

గ్రామాలలో రైతులకు తమ క్షేత్రాలపై యాజమాన్యం ఉండాలని. ఏదో అసాధారణ పరిస్థితులలో మాత్రమే వారి యాజమాన్యాన్ని తొలగించి శిక్షగా వారిని దాసులుగా, సైన్యంలోను, గనులలోను పనిచేయించవలెనని కౌటిల్యుడు వ్రాశాడు. యీ బానిసలు కొన్ని సంవత్సరాల తర్వాతగాని లేక కొంత మూల్యం చెల్లించిన మీదటగాని, తిరిగి స్వతంత్రులు అయ్యే అవకాశము ఉండేది. దాసులను విక్రయించే హక్కు కూడా యజమానుల కుండేది. దాసుని పుత్రుడు తప్పనిసరిగా దాసుడు కానక్కరలేదు.

గుణాఢ్యుని బృహత్కథలో అనేక సందర్భాలలో, బానిస వ్యాపారాన్ని గురించి, దాసులను గురించి ప్రస్తావనలు వున్నాయి. విదేశాలతో నౌకా వ్యాపారం చేసే వర్తకులవద్ద విశేషంగా బానిస లుండేవారు. వర్తకులు వారిని అతినీచంగా చూస్తుండేవారని, ఈ కథల ద్వారా తెలుస్తున్నది.

## వి వి ధ వృ త్తు లు

శాతవాహన రాజుల శాసనాల ద్వారా ఆనాడు, చేనేత, కమ్మరి, కుమ్మరి, చర్మకార, వడ్రంగి, స్వర్ణకార-తదితర వృత్తుల వారందరూ శ్రేణుల రూపంలో సంఘటితమై ఉండేవారని బోధపడుతుంది. యజ్ఞశ్రీ శాతకర్ణి శాసనం ఒకదానిలో ఇలా చెప్పబడింది :

"చేనేత శ్రేణివారికి వేయి కర్షపణములు, వడ్రంగి శ్రేణి వారికి 2 వేల కర్షపణములు, నూనె గానుగల శ్రేణివారికి 500, యజ్ఞశ్రీ శాతకర్ణి స్వల్పవడ్డీకి అప్పు రూపంలో యిచ్చారు." రాగితో చేయబడిన కర్షపణమనే నాణెము నాడు ముఖ్యమైనది.

## వ్యా పా ర ం

దేశం నలుమూలలా లోహ సంపదను త్రవ్వి, ఉపయోగంలోకి తెచ్చే కర్మాగారా లుండేవి. అనేక రేవుల పేర్లు శాసనాల ద్వారా మనకు తెలుస్తున్నాయి. పశ్చిమ సముద్రతీరంలోని తగర, జున్నారి, కరహాటక, నాసిక, గోవర్ధన, భరుకచ్ఛ నగరాల ద్వారా; తూర్పు సముద్రతీరంలో ధాన్యకటకం, విజయపురి, కెవురూర, మసోలియస్ (కోడూరు, మచిలీపట్నం) మొదలైన రేవుల ద్వారా విదేశాలతో వ్యాపారం సాగుతూ ఉండేది. చైనా, జావా, సింహళ దేశాలతో విరివిగావ్యాపారం సాగేది.

## మ త, కు ల వ్య వ స్థ

శాతవాహన రాజులందరూ హిందూ మతాభిమానులు. వీరిలో అనేకులు అశ్వమేధయాగం చేశారు. కాని రాణులు బౌద్ధమతాభిమానులు. బౌద్ధ

మతం దేశంలో విరివిగా వ్యాపించింది. ఆంధ్ర ప్రజలలో విశేష భాగము బౌద్ధమతాభిమానులుగా ఉండేవారు. వృత్తి పనివారలు. వ్యాపారస్తులు, రైతులు బౌద్ధ మతాన్ని అభిమానించారు. బ్రాహ్మణులు మాత్రం హిందూ దేవతలను ఆరాధించేవారు. రాజులైన శాతవాహనులు ఉభయులను సమ దృష్టితో చూసేవారు.

గౌతమీపుత్ర శాతకర్ణి తల్లి బౌద్ధులకు అనేక దానధర్మాలు చేసింది. ఈమెకు గాఢమైన బౌద్ధ మతాభిమాన ముండేది. ఆమె గౌరవార్థం గౌతమీ పుత్ర శాతకర్ణి త్రిరశ్మి అను గుట్టవద్దనున్న ఒక గ్రామాన్ని బౌద్ధ భిక్షువులకు దానంగా యిచ్చారు. ఆ గ్రామంలో "రాజుకు యికముందు ఎట్టి అధికారమూ లేదు" అని ఒక శాసనంలో వుంది.

మరొకరాజు బౌద్ధభిక్షువులకు చలికాలంలో వస్త్రాల నివ్వగలందు లకు గ్రామ చేనేత కార్మికుల శ్రేణికి 4 వేల కర్షాపనములు ఉచితంగా దానం చేశారు. రాజులు మాత్రమేకాక ధనికులైన వర్తకులు కూడా బౌద్ధ భిక్షువులకు దానధర్మాలు చేసేవారు.

ఒక రాజు బౌద్ధభిక్షువులకు, బ్రాహ్మణులకు ఇద్దరికీ ఉపయోగపడే టట్లు కొన్ని గ్రామాలు దానంగా యిచ్చారు.

శాతవాహన రాజు లందరూ తమ తల్లి పేరుతో ప్రారంభించి తమ పేర్లు చెప్పుకున్నారు. వీరి తర్వాత పరిపాలించిన ఇక్ష్వాకురాజులు కూడా ఇదే పద్ధతి అవలంబించారు.

## బౌద్ధమతంలో మార్పు

బౌద్ధమతంలో వివిధ శాఖలు ఏర్పడసాగినవి. మొదట్లో బ్రాహ్మణ మతంపై తిరుగుబాటుగా ప్రారంభమైన బౌద్ధమతం క్రమంగా హిందూ మతంలోని అనేక విషయాలను అనుకరించ పూనుకున్నది. హిందూ దేవతల గురించి, అనేక చిలవలు పలవలు గ్రంథాలలో వర్ణించబడినట్లే, బుద్ధ జాతక కథలు సృష్టించబడ్డాయి. బుద్ధుడికి అనేక అవతారాలు కల్పించ బడ్డాయి. ఆ అవతారాల గాథలే బుద్ధ జాతకకథలు.

పీడిత ప్రజలు ముఖ్యంగా శిల్పులు, బుద్ధునిపైగల తమ భక్తి భావాన్ని ప్రదర్శించటానికి, బౌద్ధవిగ్రహాలు చెక్కి వానిని పూజించ మొదలు పెట్టారు. బుద్ధుని విగ్రహరూపంలో పూజించవచ్చునా, లేదా అని బౌద్ధు లలో తీవ్ర వివాదాలు సాగాయి. 'మహాయాన' శాఖవారు ఇందుకు అనుమ తించారు. 'హీనయాన' శాఖవారు విగ్రహారాధనను వ్యతిరేకించారు. కాల క్రమేణ మహాయాన శాఖ వృద్ధి చెందింది. ఈ శాఖవారి ప్రచారం వల్లనే బౌద్ధమతం ఖండ ఖండాంతరాలకు వ్యాపించింది. అయితే మూల స్వరూపం కోల్పోయింది. బుద్ధుని విగ్రహాలు భారత దేశంలో మాత్రమే కాక, బర్మా, సిలోన్, సయాం, చైనా, జపాను, ఇండోనేషియా దేశాలలో సైతం వెలిచ బడ్డాయి. శిల్పకళ ఎంతో అభివృద్ధి చెందింది.

## ఆచార్య నాగార్జునుడు

మహాయాన మతాన్ని ప్రారంభించింది. కనిష్కుని సమకాలికుడైన అశ్వఘోషుడు. ఇతని కాలం క్రీ. శ. 100. మహాయానం విశేష వ్యాప్తి చెందటానికి కారకుడు ఈ క్రీ. శ. 2 వ శతాబ్దిలో నివసించిన ఆచార్య నాగార్జునుడు.

ఆచార్య నాగార్జునుని జన్మస్థలం విదర్భ. ఈ బ్రాహ్మణుడు బాల్యం లోనే నన్యసించి హిందూతత్వ శాస్త్రాన్ని అభ్యసించాడు. ఆ తర్వాత బౌద్ధమతాన్ని స్వీకరించి, మహాయాన మతవృద్ధికి తన జీవితాన్ని ధార పోశాడు. కొంతకాలం నలందా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడుగా ఉండి ఆ పిమ్మట శ్రీ పర్వతాన్ని తన కేంద్రంగా చేసుకున్నాడు. ఆ శ్రీ పర్వ తమే నేటి నాగార్జునకొండ. నాగార్జునుడు యజ్ఞశ్రీ శాతకర్ణికి సమకాలికుడు.

ఈ ఆచార్యుడు నాగార్జున కొండవద్ద విశ్వవిద్యాలయాన్ని స్థాపిం చాడు. భారతదేశం నుండి మాత్రమేకాక చీనా, సింహళ, జావా దేశాల నుండికూడా ఇచ్చటికి విద్యార్థులు వచ్చేవారు.

నాగార్జునుడు తత్వశాస్త్రంలో మాత్రమేకాక, వైద్య, రసాయన శాస్త్రాలలో సైతం పండితుడు.

బౌద్ధ తత్వశాస్త్రంలో మాధ్యమికవాదమనే కొత్త ధోరణిని నాగార్జునుడు ప్రవేశపెట్టాడు. నిరంతర పరిణామశీలమైన ప్రపంచానికంటె అతీతమైన, మార్పులేని శాశ్వత బ్రహ్మపదార్థం ఒకటి ఉన్నదని, దానిని గ్రహించుటే జీవితలక్ష్యమని ఉపనిషత్తులు ప్రతిపాదించాయి. ఈ జడాత్మక దృష్టిని ఖండించి, గౌతమబుద్ధుడు శాశ్వత సత్యము, బ్రహ్మ పదార్థము ఏమీలేదని, ప్రతిది మారిపోతూంటుందనే గతితార్కిక దృష్టిని భారతీయ తాత్వికరంగంలో ప్రవేశపెట్టాడు.

## కార్యకారణ సూత్రం బౌద్ధ సిద్ధాంతానికి జీవగర్ర

కాని, బుద్ధుని సిద్ధాంతంలో 'నిర్వాణం' అనే లక్ష్యం కూడా ఉంది. ఇది మార్పులేని సమాధి స్థితి. బౌద్ధతత్వశాస్త్రంలోని ఈ వైరుధ్యం పెరిగి, మహాయాన శాఖగా రూపొందింది. దృశ్యమాన ప్రపంచమంతా పరిణామశీలం కనుక వాస్తవం కాదని, మార్పులేని శాశ్వత సత్యం వేరొకటి ఉన్నదని మహాయానవాదులు ప్రతిపాదించారు.

గౌతమబుద్ధుని కార్యాచరణ వాదాన్ని పునరుద్ధరించే ఉద్దేశ్యంతో నాగార్జునుడు శూన్యవాదాన్ని లేక మాధ్యమికవాదాన్ని ప్రతిపాదించాడు. ఏదీ వాస్తవము కాదు, అవాస్తవమూ కాదు. ప్రతిది పరస్పరాధారంగా ఉంటుంది. ఈ పరస్పరాధారాన్నే నాగార్జునుడు శూన్యత (Relativity) అని వ్యవహరించాడు. రెండు తీవ్ర ధోరణులకు రాజీగా ఉంది కనుక ఈ వాదాన్ని మాధ్యమికవాదమని కూడా అంటారు.

బౌద్ధ తత్వ శాస్త్రానికంతా జీవమైన కార్యకారణ సూత్రాన్ని, పునరుద్ధరించినందువలన, ఆచార్య నాగార్జునుడు బుద్ధుని అవతారమని, బౌద్ధ మత గ్రంథాలలో కీర్తించబడ్డాడు.

నాగార్జునుడు గొప్ప విద్వాంసుడు. స్వయంగా రచించినవి, పాత గ్రంథాలను పెంచి వ్యాఖ్యానాలు వ్రాసినవి, మొత్తం 24 గ్రంథాలు నాగార్జునుని రచనలుగా నేటికీ నిలచి వున్నాయి.

నాగార్జునుని గ్రంథాలలోకి అతిముఖ్యమైనవి. సుహృల్లేఖ. ప్రజ్ఞా పారమిత. తన మిత్రుడు, పోషకుడు అయిన యజ్ఞశ్రీ శాతకర్ణికి వివిధ విషయాలను వివరిస్తూ నాగార్జునుడు వ్రాసిన లేఖ సుహృల్లేఖ. మహాయాన మాధ్యమికవాద సూత్రాలను వివరిస్తూ వ్రాసిన బృహద్గ్రంథం ప్రజ్ఞా పారమిత. మానవ విజ్ఞానం ఈ గ్రంథంలో అత్యున్నత స్థాయిని అందు కున్నదని సూచించేందుకై ఈ గ్రంథానికి ప్రజ్ఞాపారమిత (విజ్ఞానానికి పరిహద్దులు) అని నామకరణం చేశారు.

నాగార్జునుని కాలంలో ఆంధ్రదేశంలోని అమరావతి, భట్టిప్రోలు, జగ్గయ్యపేట, నందిగామ, ఘంటసాల, గుడివాడ, నాగార్జునకొండ, గోలి, అమరావతి, శాలిహుండాం, బొజ్జన్నకొండ, రామతీర్థం, శాలిహుండాం మొదలైన ప్రాంతాలలోను, తెలంగాణాలోని గుమ్మడిదుర్రు, అలూరు, కొండాపురం, ఫణిగిరి, గాజులబండ మొదలైనచోట్ల బౌద్ధ ఆరామాలుండేవి. హిందూ మత పునరుద్ధరణ పేరుతో ఆ తర్వాత రాజులు, మతాచార్యులు వీటిలో పెక్కింటిని ధ్వంసం చేశారు నాగార్జునాచార్యుని కొరకు నాగార్జున కొండలో యజ్ఞశ్రీ శాతకర్ణి కట్టించిన పారావత విహారాన్ని 5వ శతాబ్దంలో భారతదేశం పర్యటించిన ఫాహియాన్ ఇలా వర్ణించాడు : "ఈ భవనంలో అయిదు అంతస్తులున్నాయి. క్రింది అంతస్తులో 500 గదులు, ఆ పైన వరుసగా 400, 300, 200, 100 గదులున్నాయి. క్రింది నుంచి పైకి, ఏనుగు, సింహం, గుర్రం, ఎద్దు, పావురం ఆకారాలలో ఈ అంతస్తులను నిర్మిం చారు."

## పంటలు

చెరుకు గానుగలు, ఏతాములు, నూనె గానుగలు గాథా సప్తశతిలో అనేక సందర్భాలలో వర్ణింపబడ్డాయి. వరి, శనగ, నువ్వులు, జనుము, మొదలైన ధాన్యాలను రైతులు పండించేవారు. వివాహాది శుభకార్యాల్లో జరిగే ఆచారాల వర్ణన, స్త్రీల నోములు, బాలబాలికల ఆటపాటలు తదితర ఆచారాలను ఈ గ్రంథం వర్ణించింది. నాటి గ్రామీణ సంస్కృతిలోని ఆచార వ్యవహారాలు నేటికీ కొన్ని కొనసాగుతున్నాయి. స్త్రీలు ఇంటింటికి

తిరిగి వాయనము లిచ్చేవారు. పసుపు వంటినిండా పూసుకొని స్నానము చేసేవారు. కర్షకుల కష్టభరితమైన జీవితాన్ని శ్రమ ఫలితాన్ని చూసుకుని వారు అనుభవించే ఆనందాన్ని గాథాసప్తశతి యిలా వర్ణిస్తున్నది :

"నారు నాటి, కావలసిన నీరు పెట్టి, తగిన పరామరికతో చక్కగా సాకుతూవచ్చి క్రమంగా పైరు పెరిగి, ఈని, పాలపొట్ట పోసుకుని, గింజ కట్టి వంగివున్న పొలమును చూచి, కర్షకుడు, పారాడుతున్న కన్న కుమారుని చూసినట్లు మనస్సులో అంతులేని సంతోషముతో పొంగిపోయినాడు."

## పట్టణ జీవనము

పట్టణ ప్రజలలోని ఉన్నత తరగతుల జీవన పద్ధతి తెలుసుకోటానికి వాత్స్యాయన కామసూత్రాలు ఉపయోగపడతాయి. ఈ గ్రంథాలలో వివరించబడ్డ సుఖాలు, విలాసాలు నాటి ప్రజలంతా అనుభవించే వారనుకోవటం పొరపాటు. పరాన్న భుక్కులై కాలు కదల్చ నవసరంలేక జీవితమంతా విలాసాలతో గడపటానికి తగిన విశ్రాంతి కలిగిన కొద్దిమంది ధనిక వర్గ వ్యక్తుల అలవాట్లను, మోసాన్ని, అవినీతినీ, కుటిలత్వాన్నీ ఈ గ్రంథం తెలియజేస్తుంది.

నగరాలలో నృత్య సంగీత చిత్రకళాది లలితకళ లన్నింటికి కేంద్రాలు నాటి వేశ్యాగృహాలు. లలితకళలు, భోగలాలసత పెనవేసుకొని వుండేవి.

## శాతవాహన రాజ్య వైభవం

శాతవాహన రాజులు మొత్తం 500 సంవత్సరాలకు పైగా ఆంధ్ర దేశాన్ని పరిపాలించారు. వీరి సామ్రాజ్యం అత్యున్నత దశలో దక్షిణాన కడలూరువరకు, ఉత్తరాన మగధ వరకూ వ్యాపించింది. తెలంగాణా, కోస్తా ఆంధ్ర, రాయలసీమ వీరి ఏలుబడిలో చాలాకాలం వున్నాయి.- చివరి కాలంలో శక, పహ్లవ, అభీరుల దండయాత్రల ఫలితంగా వీరు మహారాష్ట్ర దేశాన్ని పోగొట్టుకున్నా, ఆంధ్రదేశాన్ని మాత్రం స్థిరంగా పరిపాలించారు.

సుస్థిర పరిపాలన ఫలితంగా వర్తక వ్యాపారాలు, శిల్ప, చిత్రకళలు, సాహిత్యం వృద్ధి చెందాయి. ఆనాడు రెండు ప్రధాన రాజమార్గాలగుండా వర్తకం సాగుతూ వుండేది. బందరు నుండి ఒకటి, గుంటూరు జిల్లా వినుకొండ నుండి ఒకటి, ఇవి బయలుదేరేవి. హైదరాబాదువరకు విడిగా వెళ్ళి అక్కడ రెండూ కలసి కళ్యాణి, పైఠాన్, నాసిక నగరాల మీదుగా పశ్చిమ తీరాన ప్రసిద్ధ రేవుపట్టణమైన భరుకచ్ఛ నగరాన్ని చేరుకునేవి. భరుకచ్ఛం (బ్రోచ్) నాటి ప్రసిద్ధ వ్యాపార కేంద్రాలలో ముఖ్యమైనది. 'కథా సరిత్సాగరం'లోని కథలలో ఈ నగర ప్రస్తావన పదేపదే కనబడుతుంది.

## శాలివాహన శకం

గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యానికి వచ్చిన క్రీ. శ. 78 తో శాలివాహన శకం ప్రారంభమైంది. విదేశీయులైన శకుల దండయాత్రలు నాటి దేశభద్రతకు పెద్ద ముప్పుగా తయారయ్యాయి. అట్టి శకులను నిర్జించిన మహావీరుల పేరుతో రెండు శకాలు ప్రారంభమైనవి. ఒకటి విక్రమార్క శకం, రెండవది శాలివాహన శకం. గౌతమీపుత్ర శాతకర్ణి శాతవాహన శకానికి మూలపురుషుడైనాడు.

ఆంధ్రుల చరిత్రలో మాత్రమేగాక, భారతదేశ చరిత్రలో సైతం శాలివాహన యుగానికి గల ప్రాధాన్యతకు ఇది చిహ్నం.

## ధాన్యకటకం - అమరావతి

శాతవాహన రాజుల రాజధాని అయిన ధాన్యకటక నగర వైభవాన్ని ప్రస్తావించక, ఈ అధ్యాయాన్ని ముగించలేము. ధాన్యకటకం-అమరావతి - రెండూ కలసిన ఒక మహానగరం ఆరు ఏడు చదరపు మైళ్ళ వైశాల్యంలో వ్యాపించి ఉండేది.

చైనా యాత్రికుడు హ్యూన్‌సాంగ్ ధాన్యకటకం మహాంధ్ర దేశానికి రాజధాని అని వర్ణించాడు. గౌతమీపుత్రుని శాసనాలలో ఈ నగరం ధన

కలకమని పేర్కొనబడ్డది. క్రీ.పూ. 200 నాటికే ఈ పేరు వాడుకలో ఉన్నట్లు అమరావతి మహా చైత్యంలోని శాసనం ద్వారా తెలుస్తున్నది.

అమరావతి, నాటి బౌద్ధుల పుణ్య క్షేత్రాలలో ఒకటి. ఇక్కడ మహా చైత్యం అశోకునికి పూర్వమే ఒక నాగరాజుచే పెంపుచేయబడి శాతవాహన రాజుచే మరింత వృద్ధిచేయబడ్డది. యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో నాగార్జునా చార్యుని ప్రోత్సాహం వల్ల, ఈ మహా చైత్యానికి ఒక ప్రాకారం నిర్మిం చబడ్డది.

అమరావతిలో బుద్ధుని అస్తికలపై నిర్మించబడిన మహాచైత్యం, ఇతర చైత్యాలు, ఒక విశ్వవిద్యాలయం వుండేవి. కాల గర్భంలో అన్నీ నశించినవి. మహాచైత్య శిథిలాలకు సంబంధించిన పలకలు మాత్రం కొన్ని నేటికీ లండన్ మ్యూజియంలోను, మద్రాసు మ్యూజియంలోను ఉన్నవి.

అమరావతి చైత్యంపైన బుద్ధుని జీవిత గాథలు, జాతక కథలు వందల సంఖ్యలో చెక్కబడ్డవి. అమరావతి శిల్ప విశిష్టతను నేడు కళా ప్రపంచమంతా వేనోళ్ళ కొనియాడుతున్నది. భారతదేశంలోని బౌద్ధచిత్ర శిల్ప కళకంతా అమరావతి ఒరవడి పెట్టింది. సమకాలీనోత్తర హిందూ దేశంలో అదే కాలంలో వ్యాపించిన గాంధార శిల్పంలో విస్తృతి, గాంభీర్యం ప్రధా నాంశాలు. జాతీయమైన అమరావతి శిల్పంలో లాలిత్యం, మృదుత్వం, నైపుణ్యం ప్రధానాంశాలు. అమరావతి ద్వారా ఆంధ్ర కళాకారులు, భార తీయ కళా ప్రపంచంలో గురుత్వ స్థానాన్ని సంపాదించుకున్నారు.

# ఇక్ష్వాకు రాజులు - నాగార్జునకొండ

శాతవాహనరాజ్య పతనానంతరం చిన్న రాజ్యాలు వేర్వేరు ప్రాంతాలలో తలఎత్తినవి. మహారాష్ట్ర ప్రాంతం అభీరుల పరిపాలన క్రిందకు, కర్ణాటక ప్రాంతం చూటుకుల, శాతకర్ణుల ఆధిపత్యం క్రిందకు వెళ్ళినది. ఆంధ్ర ప్రాంతంలో ఇక్ష్వాకు రాజులు తలఎత్తి, నాగార్జునకొండ వద్ద వున్న విజయపురి రాజధానిగా 50 ఏండ్లు పరిపాలించారు.

శాక్యవంశస్థుడైన గౌతమబుద్ధుడు ఇక్ష్వాకు వంశస్థుడు. శ్రీరాముడు ఇక్ష్వాకురాజు. విజయపురిని పరిపాలించిన ఇక్ష్వాకురాజులు తాము శ్రీరామచంద్రునికి, గౌతమబుద్ధునికి వారసులమని చెప్పుకున్నారు.

వాసిష్ఠీపుత్ర చాంతమూలుడు ఇక్ష్వాకు రాజులలో ప్రథముడు. ఇతని కుమారుడు మాఠరీపుత్ర వీరపురుషదత్తుడు. మనుమడు బాహుబల శాంతి మూలుడు-మొత్తం ముగ్గురు రాజులు యీ వంశంలో పరిపాలించారు.

ఇక్ష్వాకురాజులు శాతవాహనుల మతసామరస్య సాంప్రదాయాన్ని అనుసరించారు. వివాహ సంబంధాల ద్వారా రాజ్యాన్ని దృఢతరం చేసుకున్నారు.

వాసిష్ఠీపుత్ర చాంతమూలుడు, అశ్వమేధ, వాజపేయాది యాగాలను చేశాడు. ఉజ్జయినిలోని మహాసేనుని భక్తుడు. అతని చెల్లెలు చాంతిశ్రీ బౌద్ధ మతాభిమాని. నాగార్జునకొండ వద్దనున్న మహాచైత్యాన్ని ఈమె నిర్మించింది.

క్షత్రియుడైన చాంతమూలుడు, బ్రాహ్మణ స్త్రీయైన మాఠరీదేవిని వివాహమాడాడు. తన కుమారుడైన వీరపురుషదత్తునికి ఉజ్జయిని పాలకుడైన

శకరాజు రుద్రసేనుని కుమార్తెను వివాహం చేశాడు. తన చెల్లెలు శాంతిశ్రీని పాకనాటి పాలకునికి, కుమార్తె అయిన అడవి శాంతిశ్రీని ధనక రాష్ట్రపాలకునికి, మరొక కుమార్తెయైన కొడబలిశ్రీని, కర్ణాటకప్రాంతంలోని వనవాసి అధిపతికి యిచ్చి వివాహాలు చేశాడు. మత కుల భేదాలను పక్కకు నెట్టి, సామంతులతో వివాహ సంబంధాలు చేసి చాంతమూలరాజు రాజ్యభద్రతను కాపాడాడు. ఇక్ష్వాకులు తెలంగాణాతోపాటు యావదాంధ్ర దేశాన్ని పరిపాలించారు.

మొదటి రాజైన వాసిష్ఠీపుత్ర చాంతమూలుడు కడపటి శాతవాహన రాజులవద్ద సామంతరాజుగానో, సేనా నాయకుడుగానో ఉండి రాజ్యాధికారం స్వీకరించి వుంటాడు. భుజబల కీర్తితో రాజ్యాన్ని నలుమూలలా విస్తరింపజేసి విజయసూచకంగా అశ్వమేధయాగం చేశాడు. ఇతని కుమారుడు మాఠరీపుత్ర వీరపురుషదత్తుడు నాగార్జునకొండలో చెక్కించిన ఒక శాసనం ఇలా వుంది:

"కోట్లకొలది బంగారు నాణెములను, వేలకొలది ఆవులను వాసిష్ఠీపుత్ర చాంతమూలుడు దానం చేశాడు. లక్ష నాగళ్ళతో భూమిని సాగులోకి తెచ్చాడు. ఉజ్జయినీ నగరంలోని మహాసేనుని పూజించాడు."

## శాంతిశ్రీ శాసనాలు

రెండవ రాజైన మాఠరీపుత్ర వీరపురుషదత్తుడు, అతని భార్యలు, మేనత్త నాగార్జున కొండపైన అనేక శాసనాలు చెక్కించారు. మేనత్త శాంతిశ్రీ చెక్కించిన ఒక శాసనంలో యిలా వుంది:

"బ్రాహ్మణులు, శ్రమణకులు, నిరాహారులైన పేద ప్రజల పట్ల కనికరించి శాంతిశ్రీ విస్తారంగా దానాలు చేసింది. ఆమె వితరణశీల. కుటుంబంలో సభ్యులయెడ ఎంతో ప్రేమగలది. పుట్టినింటివారికి, మెట్టినింటివారికి క్షేమం కలుగవలెనని కోరేది. బౌద్ధభిక్షువులకు ఒక ఆరామం కట్టించింది."

మరో శాసనంలో ఇలా ఉంది:

"తన అల్లుడైన మాఠరీపుత్ర విరూపాక్షదత్తుడు దిగ్విజయ యాత్రలో విజయవంతుడు అయ్యేందుకు, తన మోక్షసాధనకు మరొక ఆరామాన్ని కట్టించింది."

ఈ ఆరామాలన్నిటినీ భదంతాచార్యులు నిర్మించారు. శిల్పుల పేర్లు ప్రాచీన శిల్పాలలో లిఖించడం అరుదు. నాగార్జునకొండ శిల్పాలలో మాత్రం ఇందుకు విరుద్ధంగా శిల్పుల పేర్లు కనబడుతున్నాయి.

రాజకుటుంబానికి చెందినవారు మాత్రమేగాక, సామాన్య స్త్రీలు కూడా విశేషంగా దానాలు చేసి శాసనాలు చేకూర్చేవారు. రాజువద్ద కోశాధికారిగా ఉన్న బోధిశర్మ మేనకోడలు బోధిశ్రీ బౌద్ధధర్మాన్ని స్వీకరించిన ఉపాసిక. ఈమె వివిధ దేశాల నుండి నాగార్జునకొండకు వచ్చే బౌద్ధభిక్షువుల కొరకు ఆరామాలను నిర్మించింది. తామ్రపర్ణ (సింహళ దేశం), కాస్మీర (కాశ్మీరదేశం), గాంధార, చీనా (చైనా), తొసలి, అపరాంతం, వంగ, వనవాస, యవన, తమిళ దేశాలనుండి వచ్చే బౌద్ధభిక్షువుల సౌకర్యార్థం ప్రత్యేక ఆరామాలను కట్టించింది. చైనా, సింహళం కాశ్మీరదేశాల నుండి బౌద్ధభిక్షువులు నాగార్జునకొండకు వచ్చేవారు. 'మహావంశ'మను బౌద్ధ గ్రంథంలో ఇలా వర్ణించబడ్డది: 'మహాదేవుడను బౌద్ధభిక్షువు పల్లవభోగం (పల్లవనాడు లేక పల్నాడు) ప్రాంతంలో చాలాకాలం బౌద్ధమతం ప్రచారం చేసి, 14 లక్షల 60 వేలమంది బౌద్ధభిక్షువులతో సింహళదేశం వెళ్ళాడు. జీవనోపాధి కొరకు పెద్ద పెట్టున ప్రజలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలసలు వెళ్ళిన ఉదాహరణలు ప్రాచీన చరిత్రలో అనేకం గలవు. బౌద్ధమత గురువులు ఇట్టి వలసలకు నాయకత్వం వహించి, ఈ ప్రజానీకమంతా కొత్తదేశంలో స్థిరపడి జీవించటానికవసరమైన పరిస్థితులు కల్పించేవారు.

## వీర పురుష దత్తుని శిల్పాలు

వీరపురుషదత్తుడు బౌద్ధ మతాన్ని అభిమానించాడు. వృద్ధాప్యంతో రాజ్యాన్ని కుమారుడైన బాహుబలశాంతిమూలుని కిచ్చి సన్యాసాశ్రమం

స్వీకరించాడు. హిందూమతాన్ని అణచివేసినట్లు ఆయన చెక్కించిన శిల్పాల ద్వారా తెలుస్తుంది.

నాగార్జునకొండ వద్దనున్న ఒక్క స్తంభంపైన ఈ శిల్పాలన్నీ చెక్కబడ్డాయి. మొదటి శిల్పంలో బుద్ధుడు స్వర్గంనుంచి క్రిందకు దిగుతూ ఉంటాడు. రాజు బుద్ధునివద్దకు పోతూవుంటాడు. రాణులు అతనిని నివారిస్తూ ఉంటారు. తరువాత చిత్రంలో, రాణుల ఆటంకాలను నిర్లక్ష్యంచేసి, రాజు బుద్ధునివద్ద సాష్టాంగ ప్రణామం చేస్తాడు. మూడవచిత్రంలో, రాజు తన కాలితో శివలింగాన్ని త్రోసివేస్తూ ఉంటాడు. శివలింగంచుట్టూ బ్రహ్మాండమైన నాగుబాము ఉంటుంది. మరొక శిల్పంలో రాజు సాధారణ వస్త్రాలు ధరించి 8 మంది అనుచరులతో సన్యాసాశ్రమానికి వెళ్ళుతుంటాడు. ఆఖరు చిత్రంలో రాజకుమారుడు తండ్రి గౌరవార్థము విస్తారమైన ధనాన్ని భిక్షువులకు దానమిస్తున్నట్లుంది. అమరావతీ శిల్పాలలో కేవలం బుద్ధుని జీవిత విశేషాలతోబాటు, పరిపాలించిన రాజు జీవిత చిత్రాలు కూడా చెక్కబడ్డాయి.

## ప్రాంతాల పేర్లు

వీరపురుషదత్తుడు బాహుబలంతో కొత్త ప్రాంతాలను గూడా జయించి సుస్థిర పరిపాలన చేశాడు. నాగార్జునకొండ శాసనాల సహాయంతో నాటి ఆంధ్రదేశంలోని వివిధ రాష్ట్రాల పేర్లను తెలుసుకోవచ్చు.

గుంటూరు జిల్లాలో ప్రవహించే గుండ్లకమ్మ నదికి ఇరువైపుల సముద్ర పర్యంతమూ ఉన్న ప్రాంతం పూగినాడు. నందికొట్కూరు, మార్కాపురం, వినుకొండ, నరసరావుపేట, బాపట్ల, ఒంగోలు, పొదిలి తాలూకాలలో యీ నది ప్రవహిస్తుంది. పూగినాడు లేక పూగివిషయ అను నది క్రమంగా పోకనాడు, పాకనాడుగా రూపాంతరం చెందింది. పాకనాటివారు ఆంధ్ర బ్రాహ్మణులలో ఒక శాఖ. తెనాలి, రేపల్లె, బాపట్ల తాలూకాలు ధనకరాష్ట్రం. ఆ తర్వాత ఈ ప్రాంతం వెలనాడు అయింది.

కడప ఉత్తర భాగం హిరణ్యక రాష్ట్రం. కొంతకాలానికి యీ పేరు నశించి, రేనాడు అను పేరు స్థిరమైంది.

ఇక్ష్వాకురాజు లందరూ ప్రాకృత భాషలోనే శాసనాలు చెక్కించారు. కాని తెలుగు పదాలు అనేకం శాసనాలలో ప్రవేశించ సాగాయి. తలారి అనే అచ్చతెలుగు మాట మహా అనే విశేషణంతో కలసి, మహాతలవరిగా శాసనాలలో ప్రవేశించింది. నాటి ప్రజల పేర్లుకూడా శాసనాల ద్వారా తెలుసుకోవచ్చు. స్త్రీల పేర్లు నాగసిరి, గోలసిరి, వరజాతిసిరి, బాపిసిరి మొదలైనవి. పురుషులపేర్లు నాగంన (నాగన్న), వీరంన (వీరన్న). సంస్కృతభాషా ప్రాబల్యంగల పేర్లు కూడా వాడుకలో ఉండేవి. బుధిమణిక, రేవతిమణిక, సరసిక, కుసుమలత స్త్రీల పేర్లు. పురుషులకు మహాచంద ముఖ, మూలచంద ముఖ, మహామూల మూలమూల అను పేరులు ఉన్నాయి.

## నాగార్జున కొండ - విజయపురి

నాగార్జున కొండతో ప్రారంభించి శ్రీశైల పర్వతం వరకు గల పర్వత పంక్తిని శ్రీపర్వతం అని పురాణాలు, బౌద్ధగ్రంథాలు వర్ణించాయి. ఇక్ష్వాకు రాజులను పార్వతేయులని కూడా వర్ణించాయి.

నాగార్జున కొండవద్ద లోయలో విజయపురి నిర్మింపబడ్డది. ఆ నగరానికి ఒకవైపున కృష్ణానది, మిగతావైపున కొండలు సహజ రక్షణ కుపకరించాయి. నీటిని నిలవచేసే పెద్ద రిజర్వాయరు అవశేషాలను, ఏనుగులు నదిలో నీరు త్రాగటానికి దిగేచోటును, పడవలు ఆగే రేవుప్రాంతాన్ని నేటికీ చూడవచ్చు. కృష్ణానది ముఖద్వారం వద్దనుండి పెద్ద పెద్ద పడవలు ఈ రేవుకి వస్తుండేవి.

టోలమీ అను చరిత్రకారుడు క్రీ.శ. 150 సంవత్సరాల ప్రాంతంలో ఆంధ్రదేశం సంచారం చేశాడు. కృష్ణా, గోదావరీ నదులలో ముఖద్వారం నుండి పెద్ద పెద్ద పడవలు ఎగువకు ప్రయాణం చేసేవని వ్రాశాడు. ప్రయాణీకుల కొరకు ఒకటి, సరుకుల రవాణా కొకటి రెండు రకాల పడవ లుండేవని వర్ణించాడు. కృష్ణా, గోదావరి నదుల పేర్లను మాత్రమేగాక ఋషికుల్య, వంశధార, నాగావళి, శారద, తాండవ, గుండ్లకమ్మ నదుల

పేర్కొనుకూడా బోర్‌మీ వర్ణించాడు. ఏదేశాలతో విశేషంగా వ్యాపారం జరుగుతుండేది. చైనానుండి పట్టువస్త్రాలు దిగుమతి అయ్యేవి. చీనాంబరాలు-చైనానుండి వచ్చిన గుడ్డలు - నాటినుండే వ్యాప్తిలోకి వచ్చాయి.

నాగార్జునకొండపై చైత్య గృహాలలో తూర్పు దిక్కుగా వున్నవాటిని పూర్వశైల చైత్యాలని, పశ్చిమ దిక్కుగా ఉన్నవాటిని అపరశైల చైత్యాలని బౌద్ధ గ్రంథాలు వర్ణించాయి. నాగార్జునకొండ ఆనాడు వేలకొలది పెద్ద భిక్షువులకు నిలయంగా ఉండేది. గొప్ప విద్యా కేంద్రం.

నాగార్జునకొండ త్రవ్వకాల ఫలితంగా నాటి బౌద్ధ విహారాలు చైత్యాలు, స్తూపాలు అనేకం నేడు బహిర్గతమౌతున్నాయి. భిక్షువులు నివసించే వసతి గృహాలు, విహారాలు, బుద్ధధాతువులను నిక్షేపించి నిర్మించబడిన స్మారక చిహ్నాలు, స్తూపాలు. భిక్షువులు మత గ్రంథాలను పారాయణ చేసుకునేందుకు వీలుగా నిర్మించబడిన భవనాలు, చైత్యాలు ఎన్నో వెలువడ్డాయి.

ఇంతవరకు నాగార్జునకొండ వద్ద స్తూపాలు, చైత్యాలు, విహారాలు మొత్తం 20 కి మించి బైటపడ్డాయి. ఒక పెద్ద విశ్వవిద్యాలయం, ఒక కొలను, తదితర భవన విశేషాలు అనేకం బహిర్గతమైనవి. శాతవాహన రాజుల కాలంలో ప్రారంభమై, ఇక్ష్వాకురాజుల ప్రోత్సాహంతో ఉచ్ఛస్థానాన్నందుకున్న, ఒక బ్రహ్మాండమైన బౌద్ధ కేంద్రం నాగార్జునకొండ.

నాగార్జునకొండ శిల్పాలన్నీ తెల్లని పాలరాతితో చెక్కబడి వున్నాయి. బౌద్ధ జాతక కథలు, బుద్ధుని జీవిత చిత్రాలు, నాటి రాజుల గాథలు, తదితర ఘటనలు, ఈ శిల్పాలలో చెక్కబడినవి వేర్వేరు భంగిమలు గల బుద్ధుని విగ్రహాలు వందల సంఖ్యలో ఈ ప్రాచీన సంస్కృతి కేంద్రంలో చెల్లాచెదురుగా పడివున్నవి. కవచము, ఉష్ణీషము ధరించిన సితియన్ ద్వారపాలకుని చిత్రం ఒకటి ఈ శిల్పాలలో వుంది. శకరాజులతో సంబంధ బాంధవ్యాలు చేసిన ఇక్ష్వాకు రాజులవద్ద సితియన్ భటులు, సైనికులు పలువు రుండేవారు.

మాధ్యమికవాద ప్రవక్తయైన నాగార్జునుని నివాసస్థలం కావటంతో ఖండాంతరాలలో సైతం నాగార్జునకొండ ప్రతిభ వ్యాపించింది. వివిధ దేశాల నుంచి వచ్చే భిక్షువులకు అది యాత్రాస్థలంగా వుండేది.

ఇక్ష్వాకురాజ్య పతనానంతరం దక్షిణ దేశాన్ని పరిపాలించిన పల్లవుల కాలంలో నాగార్జునకొండ భవనాలు, శిల్పాలు అనేకం ధ్వంసం చేయబడ్డాయి. శంకరాచార్యులు బౌద్ధ మతస్థులను ఓడించి వారి ఆస్తి పాస్తులను స్వాధీనం చేసుకునే సందర్భంలో నాగార్జునకొండ శంకర మఠంవారి అధీనంలోకి పోయింది. విజయసూచకంగా వారు కొండ దిగువన, కృష్ణ ఒడ్డున దుర్గగుడిని, హనుమంతుని దేవాలయాన్ని నిర్మించారు.

6వ అధ్యాయం

# బౌద్ధ సంస్కృతీ విధ్వంసన

ఇక్ష్వాకురాజ్య పతనంతో శాతవాహన యుగం నిశ్శేషంగా అంత మైంది. వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు చిన్నరాజులు పరిపాలించసాగారు. క్రీ. శ. 250 నుండి 650 వరకు, కృష్ణకు దక్షిణాన వున్న ఆంధ్రదేశాన్ని పల్లవరాజులు, కృష్ణా, గోదావరుల మధ్య ప్రాంతాన్ని సాలంకాయన, బృహత్ఫలాయన, ఆనంద, విష్ణుకుండినరాజులు, గోదావరికి ఉత్తరంగా వున్న కళింగదేశాన్ని మాఠర, గాంగ వంశస్థులు పరిపాలించారు. తెలంగాణాలో అధిక భాగం వాకాటక సామ్రాజ్యంలో భాగమైంది.

ఈ రాజకీయ పరిణామాలకంటె ముఖ్యమైన సామాజిక పరిణామాలు ఈ కాలంలో ప్రారంభమైనవి. స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థ దేశ మంతటా సుస్థాపితమైంది. సుస్థిర గ్రామజీవనము, శాశ్వత పనివిభజనపై ఆధారపడిన కులవ్యవస్థ దేశమంతటా బలపడసాగింది. తెగల నమ్మక శిథిలం పూర్తికావటంతో బౌద్ధమతం యొక్క చారిత్రక ప్రయోజనం ముగి సింది. దాని పతనం ప్రారంభమైంది.

అశోక సామ్రాజ్యం, బౌద్ధమత వ్యాప్తి అవినాభావంగా పెనవేసుకు పోయిన ఫలితంగా సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలు స్వతంత్రరాజ్య స్థాపనకై చేసే ప్రయత్నాలకు బౌద్ధమతం ఆటంకంగా పరిణమించింది. కనుక ప్రాంతీయ ప్రజలు, రాజులు, బౌద్ధమతాన్ని, బౌద్ధ సంస్థలను సామ్రాజ్యతత్వ చిహ్నంగా ఎంచి నిరసించసాగారు.

బౌద్ధమతంలో అనేక శిథిల లక్షణాలు ప్రారంభమైనవి. శూన్య వాదం అట్టి శిథిల ధోరణులకు మార్గాన్ని సుకరం చేసింది. వజ్రయాను

తలయెత్తింది. దయ్యాలు, శాకినులు, ప్రయోగాలు మొదలైన వానిద్వారా శత్రువులను పారించవలెనని, మధుమాంస మైథునాది పంచ మకార సాధన నిర్వాణానికి సులభమార్గమని వీరు బోధించారు. శైవమతంలోని కాపాలిక, భైరవ తంత్రాలకు వజ్రయానమే పునాది. ఈ మతస్థులు ఓషధులను తయారుచేయుటలోనూ లోహప్రక్రియలలోను ప్రత్యేక కృషి చేసేవారు. 6 వ శతాబ్దంలో జీవించిన సిద్ధనాగార్జునుడు ఈ ధోరణికి మూలపురుషుడు. ఇతను జగ్గయ్యపేటలో పుట్టి, చివరి రోజులను ఆచార్య నాగార్జునుని వలెనే, నాగార్జునకొండలో గడిపాడు.

బౌద్ధమతంలో ప్రవేశించిన ఈ బలహీనతలను అవకాశంగా తీసుకొని ఈ మతాన్ని ధ్వంసం చేసి హిందూమతాన్ని పునరుద్ధరించినవారు పల్లవ, విష్ణుకుండిన రాజులు.

బౌద్ధమతంతోపాటు బౌద్ధ సంస్కృతికి మూలసూత్రమైన సమానత్వ భావం కూడా వెనకడుగు వేసింది. కుల మత విభేదాల కతీతమైన మానవత్వం ఒకటున్నదన్న ధోరణి నశించి ఈ విభేదాలు ప్రజలను విభజించే అడ్డుగోడలు కాసాగినవి. అశోకుని అడుగుజాడలలో నడచిన ఉదార పరిపాలకుల యుగం నశించి గుప్త, వాకాటక, పల్లవ చక్రవర్తుల నిరంకుశ రాచరికయుగం భారతదేశమంతటా ప్రారంభమైంది. ప్రాకృతభాష పదవీ భ్రష్టత పొందింది సంస్కృతం రాజభాష అయింది. ఆంధ్రలో ఏర్పడిన చిన్న చిన్న పరిపాలకులు నిరంతం అంతః కలహాలతో జనసంక్షోభాన్ని కలిగించి, వ్యవసాయ, వర్తక వాణిజ్యాది రంగాలలో క్షీణత కలిగించారు.

## పల్లవులు (250-630)

పల్లవరాజులు శాతవాహనులకు సామంతులుగా ఉండి తదనంతర కాలంలో దక్షిణదిశగా తరలివెళ్ళి ఒక ప్రత్యేక రాజ్యం స్థాపించారు. వీరి రాజధాని తమిళాంధ్ర దేశాల సరిహద్దులలో ఉన్న కాంచీపురం. ప్రారంభంలో వీరి రాజ్యం ఆంధ్ర ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉంది. క్రమేణా వీరు తమిళదేశాన్ని కూడా ఆక్రమించి దీర్ఘకాలం పరిపాలించారు.

ఆంధ్రలో వీరి శాసనాలు గుంటూరు జిల్లాలోని ఒంగోలు, చేబ్రోలు, మైదవోలు, అమరావతి, చందలూరు గ్రామాలలోను, నెల్లూరు జిల్లా కంచుకూరులోను, బళ్ళారిజిల్లా హీరహడగళ్ళిలోను, ఉత్తర ఆర్కాటు, కర్నూలు జిల్లాలలోను లభిస్తున్నాయి.

పల్లవ వంశ స్థాపకుడు వీరకూర్చవర్మ. ఆంధ్రదేశంపై పల్లవుల ఆధిపత్యం సాగిన 400 సంవత్సరాలలోను 20 మంది రాజులు కంచిని పరిపాలించారు. ఆ తర్వాత మరి రెండు శతాబ్దాలు వీరు తమిళ దేశాన్ని మాత్రమే పరిపాలించారు. పిమ్మట ఈ వంశం అంతమైంది.

తాము అశ్వత్థామ వంశస్థులమని, పరమ మాహేశ్వరులమని పల్లవ రాజులంతా తమ బిరుదావళిలో చెప్పుకున్నారు. బౌద్ధమతాన్ని నాశనం చేసి శైవ, వైష్ణవ మత సాంప్రదాయాలను వీరు దక్షిణ దేశంలో ప్రవేశ పెట్టారు. శాతవాహన ఇక్ష్వాకురాజులు తమ పేర్లలో తమ తల్లులను ప్రస్తావించగా, వీరు ఆ సాంప్రదాయాన్ని వదలి తమ తండ్రుల పేర్లను ప్రస్తావించారు. ప్రతి పల్లవరాజు తన తండ్రిని బప్పభట్టారకుడని కీర్తించాడు.

వీరకూర్చవర్మ కుమారుడైన శివస్కందవర్మ ఇక్ష్వాకు రాజులను ఓడించి ఆంధ్రదేశంపై ఆధిపత్యం సంపాదించాడు. బ్రాహ్మణులకు, దేవాలయాలకు విరివిగా భూదానాలు ఇచ్చాడు. ధాన్యకటకంలో ఇతని సామంతుడొకడుండేవాడు. నాటినుండి 7 వ శతాబ్దంవరకూ, ధాన్యకటకంలో ఒక పల్లవ సామంతుడు ఉంటూనే ఉన్నాడు.

ఈ వంశంలో పదవవాడైన విష్ణుగోపవర్మ సముద్రగుప్తునితో యుద్ధం చేశాడు. 12వ వాడైన సింహవర్మ కళింగదేశం వరకు జైత్రయాత్రచేసి, తిరిగివస్తూ ధాన్యకటకంలో వీతరాగుడైన బుద్ధుని పూజించి బౌద్ధ ఉపాసకుడైనాడు. 13 వ వాడైన విజయస్కందవర్మ త్రిలోచన పల్లవుడను బిరుదు ధరించి సామ్రాజ్య విస్తరణకు తీవ్ర కృషి చేశాడు. ఆంధ్రలో వీరి పెత్తనం అంతరించిన పిమ్మట కంచిని పరిపాలించిన రాజులలో ఒకడైన నరసింహవర్మ కాలంలో, మహాబలిపుర శిల్పాలు చెక్కబడ్డాయి.

నారు మహాబలిపురం గొప్ప రేవు పట్నంగా ఉండేది. నరసింహవర్మకు మామళ్ళ (మహామల్ల) అని మరొక పేరున్నది. అతని పేరుతో ఆ పూరు మామళ్ళాపురమై, క్రమేణా మహాబలిపురమైంది. ఇతని కాలం క్రీ.శ. 630-70.

పల్లవులు దక్షిణ హిందూదేశంలో సంస్కృత భాషకు, శిల్పకళకు అధిక ప్రోత్సాహమిచ్చారు దశకుమార చరిత్ర రచించిన దండి, కిరాతార్జునీయం వ్రాసిన భారవి. వీరి ఆస్థానంలోని వారు. తమిళ దేశంలో సంస్కృతభాష పల్లవుల కాలంలోనే అడుగుపెట్టింది. స్థానిక ప్రభువులైన చోళరాజులతో పల్లవులు నిరంతరం యుద్ధాలు చేస్తూండేవారు. పల్లవ శిల్పకళ మహాబలిపురంలో అత్యున్నత స్థాయినందుకున్నది. కంచి దేవాలయాలు, ఆంధ్రలో ఆ కాలంలో జరిగిన నిర్మాణాలు, పల్లవ శిల్పానికి చిహ్నాలు.

## బృహత్పలాయన, ఆనందరాజులు

బృహత్పలాయన వంశస్థుడైన జయవర్మ, కృష్ణాజిల్లా కోడూరు రాజధానిగా పరిపాలించిన ఒక స్థానిక ప్రభువు. క్రీ. శ. 270-285 మధ్య ఈ రాజు పరిపాలించాడని, పల్లవులతో ఒకసారి యుద్ధం చేశాడని, తెనాలి తాలూకాలోని పాటూరను గ్రామం బ్రాహ్మణులకు దానం చేశాడని, ఇతని కొండముది శాసనం ద్వారా తెలుస్తున్నది.

ఆనంద గోత్రీకులైన ముగ్గురు స్థానిక ప్రభువులు నర్సరావుపేట తాలూకా చేజెర్ల రాజధానిగా పరిపాలించారు.

వీరిలో దామోదరవర్మ క్రీ. శ. 295-315 మధ్య, అత్తివర్మ 395-420 మధ్య, కందారరాజు 615-20 మధ్య పరిపాలించారు. ఈ మధ్య కాలంలో పరిపాలించిన వారి పేర్లు తెలియవు.

ఈ రాజులు చెక్కించిన శాసనాలలోని భావజ, నందజ, అను మాటలు శాత్రికొన్ర అను మాటలు నాటి తెలుగుభాషా స్వరూపాన్ని తెలియ

చేయగలవు. భావజ్ఞ క్రమేణ భావయ్య అయింది. 'ఱ' అను అక్షరం 'ద' గా మారి తాటికొండ అయింది. వీరిలో దామోదరవర్మ బౌద్ధ హిందూమతాలను సమానంగా అభిమానించాడు. పల్లవులతో యుద్ధం చేశాడు. రెండవ వాడైన అత్తివర్మ, విజయగోపవర్మ అను పల్లవరాజుతో పోరాడి ఓడిపోయాడు. మూడవ రాజైన కందారరాజు పశ్చిమ చాళుక్యుడైన సత్యాశ్రయ పులకేశి ఆంధ్రదేశంపై దండెత్తినపుడు అతని సేనాపతియైన పృథ్వీయువరాజుతో పోరాడి అతనిని ఓడించాడు. ఈ పులకేశి తమ్ముడు కుబ్జ విష్ణువర్ధనుడు తిరిగి దండయాత్ర చేసి స్థానిక ప్రభువు లందరినీ ఓడించి ఆంధ్రదేశాన్ని ఆక్రమించుకున్నాడు.

## సాలంకాయనులు (300-420)

సాలంకాయనులు పల్లవులకు సామంతులుగా వేంగినగరం రాజధానిగా క్రీ. శ. 300-420 వరకు పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలను పరిపాలించారు. ఈ వంశంలో ఆరుగురు రాజులున్నారు. వీరిలో రెండవ వాడైన హస్తివర్మ సముద్రగుప్తునితో యుద్ధం చేశాడు.

వీరి కాలంలో వేంగినగరం గొప్ప విజ్ఞానకేంద్రంగా ఉండేది. సూర్యదేవుని భక్తులైన సాలంకాయనులు వేంగినగరంలో చిత్రరథ స్వామి దేవాలయాన్ని నిర్మించడంతోపాటు పలువురు బౌద్ధ తాత్వికులకు ఆశ్రయమిచ్చారు. మహాయాన బౌద్ధంలోని యోగాచార శాఖకు చెందిన దిఙ్నాగాచార్యులు వేంగిలో నివసించారు. భౌతిక ప్రపంచం అసత్యమని, భావ ప్రపంచం మాత్రమే వాస్తవమని వాదించిన యోగాచార వాదులు స్వీయాత్మక భావవాదుల (Subjective Idealists) కోవకు చెందినవారు. దిఙ్నాగుడు మాత్రమేకాక బుద్ధపాలితుడు, భావ వివేకుడు అను బౌద్ధ తాత్వికులు కూడా ఆ కాలంలో ఆంధ్ర దేశంలో నివసించేవారు.

సాలంకాయనుల కాలంలో బౌద్ధ సంస్కృతి భారతదేశాన్ని వదలి బర్మా, సయాం దేశాలకు, ఇండోనేషియా దీవులకు వలసవెళ్ళటం ప్రారంభమైంది.

## సముద్రగుప్తుని దండయాత్ర

క్రీ.శ. 342_343 సంవత్సరాలమధ్య మగధ రాజైన సముద్రగుప్తుడు దక్షిణ దిగ్విజయ యాత్ర ప్రారంభించాడు. సముద్రగుప్తుని అలహాబాదు శాసనాన్ననుసరించి ఆంధ్రదేశంలోని వివిధ రాజులను సముద్రగుప్తుడు జయించి తిరిగి ఆ రాజులనే వారి వారి స్థానాలలో ప్రతిష్ఠించినట్లు తెలుస్తున్నది. అలహాబాదు శాసనంలో యిలా వుంది :

"కోసల రాజైన మహేంద్రుడు. మహాకాంతార పాలకుడైన వ్యాఘ్రరాజు. కురాల అధిపతి మంతరాజు. పిష్టపురిరాజు మహేంద్రుడు. గిరికొత్తూరు అధిపతి స్వామిదత్తుడు. కంచి విష్ణుగోపుడు. ఎరడపల్లి రాజు దమనుడు. అవముక్త దేశాధిపతి నీలరాజు. వేంగిరాజు. హస్తివర్మ. పాలకద రాజు ఉగ్రసేనుడు. దేవరాష్ట్ర అధిపతి కుబేరుడు, తదితర దక్షిణదేశ రాజులు - సముద్రగుప్తునిచే జయించబడి. తిరిగి స్వస్థానములలో ప్రతిష్ఠించబడినారు."

కోసల : మధ్యప్రదేశ్ లోని జయపుర ఛత్తీస్‌ఘడ్ జిల్లాలు.

మహాకాంతారము : ఒరిస్సాలోని కియోంఝార్, మయూర్‌భంజ్, కలహండి మొదలైన ఏజన్సీ ప్రాంతాలు.

ఎరడపల్లి : శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస.

అవముక్తం : భద్రాచల ప్రాంతం.

దేవరాష్ట్రం : విశాఖజిల్లా అనకాపల్లి, ఎలమంచిలి ప్రాంతం.

పిష్టపురం : పిఠాపురం.

వేంగి : ఏలూరు ప్రక్కన వున్న చినవేగి, పెదవేగి గ్రామప్రాంతం.

## త్రిలోచన పల్లవుడు — కరికాల చోళుడు

క్రీ.శ. 458_488 కాలంలో పల్లవరాజ్యాన్ని త్రిలోచన పల్లవుడు పరిపాలించేవాడు. ఆ కాలంలో కృష్ణా, గోదావరీ ప్రాంతాన్ని విష్ణుకుండిన

రాజైన రెండవ మాధవవర్మ. దక్షిణాన కావేరీప్రాంతాన్ని కరికాలచోళుడు. మహారాష్ట్ర ప్రాంతాన్ని వాతాపి చాళుక్యుడైన విజయాదిత్యుడు పరిపాలించేవారు. త్రిలోచన పల్లవునికి, వాతాపి విజయాదిత్యునికి కడప, కర్నూలు జిల్లాల సరిహద్దులలో ఘోర యుద్ధం జరిగి విజయాదిత్యుడు ఓడిపోయాడు. విజయోన్మత్తుడైన త్రిలోచన పల్లవుడు కృష్ణా - గోదావరీ ప్రాంతం పై దండెత్తాడు. కాని రెండవ మాధవ వర్మచే ఓడింపబడి తరిమిగొట్టబడ్డాడు. ఆ వెన్వెంటనే కావేరీ ప్రాంత పాలకుడైన కరికాలచోళుడు త్రిలోచనపల్లవుని ఓడించి అతనిచే కావేరి ఆనకట్ట నిర్మాణానికి మట్టితట్టలు మోయించాడు.

కరికాలచోళుడు ప్రజారంజకుడైన రాజు. పరమశైవుడు. చెరువులను తవ్వించి వేలకొలది ఎకరాలు సాగులోకి తెచ్చాడు. కరికాలుని వంశస్థులైన చోళ లేక చోడ వంశస్థులు దక్షిణాదిన మాత్రమేగాక ఆంధ్రదేశమంతటా ఉండేవారు. రాయలసీమ ప్రాంతంలోని రేనాటి చోళులు, తెలంగాణాలోని మహబూబ్‌నగర్, నల్లగొండలోని తెలుగుచోళులు - కరికాలచోళుని తమ వంశస్థునిగా, పేర్కొంటున్నారు. తెలంగాణాలోని ఈ తెలుగుచోళులే క్రమంగా గుంటూరుజిల్లా ప్రాంతాలకు వచ్చి, పల్లవరాజ్య పతనానంతరం పరిపాలించారు. పల్లవరాజులు బ్రాహ్మణులు. చోళ లేక చోడ రాజులు బ్రాహ్మణేతరులైన కర్షకులు. అందరూ శైవ మతస్థులే. కులం మాత్రం వేరు.

చోళులు అతిప్రాచీనులైన ప్రజలు. వీరిలో ద్రావిడ శైవమతం మొదటినుండి వ్యాప్తిలో ఉంది. తమిళాంధ్ర చోళులిద్దరూ, కరికాలచోళుని తమ వంశకర్తగా ప్రస్తుతించారు. ఒకే పురుషునుంచి బయలుదేరిన చోళులు కొందరు తమిళ దేశంలోను, మరికొందరు ఆంధ్రదేశంలోను నివాసం ఏర్పరచుకున్నారు. తెలుగు చోళుల ఆదిమ నివాసస్థలం రాయలసీమ. అప్పటి నుండి వీరు, కృష్ణదాటి తెలంగాణాలోని నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు వ్యాపించారు.

సంస్కృత భాషవల్ల, ఉత్తరాదినుండి దిగివచ్చిన ఆర్యగణాలవల్ల నిరసనభావం, వీరిలో స్వభాషాభిమానాన్ని రేకెత్తించింది. కరికాల చోళుడు తమిళ భాషకు విస్తారంగా ప్రోత్సాహమిచ్చాడు. రేనాటి సీమను పాలించిన

చోళులు, తెలుగు భాష పట్ల విశేషాభిమానం ప్రదర్శించారు. ఇంతవరకు దొరికిన తెలుగు శాసనాలలో అతి ప్రాచీనమైనది కడప జిల్లా కలమళ్ళ గ్రామంలో లభించింది. దాని కాలం క్రీ. శ. 575.

కరికాలచోళుని గాథ ప్రాచీన తమిళ గ్రంథమైన తిరుక్కురళ్‌లోను, పాల్కురికి సోమనాథుని బసవపురాణంలోను, తిక్కన నిర్వచనోత్తర రామాయణంలోను — వర్ణించబడ్డది.

## విష్ణుకుండిన వంశం (420-620)

క్రీ. శ. 420 నుండి 620 వరకు కృష్ణా-గోదావరి మధ్య ప్రాంతాన్ని పరిపాలించిన వీరు, గుంటూరు జిల్లా వినుకొండ వాసులు. వినుకొండ సంస్కృత భాషలోకి మారి విష్ణుకుండిన అయింది. ఈ వంశంలో మొత్తం 8 మంది రాజులున్నారు. వంశస్థాపకుడు మొదటి మాధవవర్మ. వీరిలో త్రిలోచన పల్లవునితో పోరాడిన రెండవ మాధవవర్మ సుప్రసిద్ధుడు.

ఇతని రాజధాని విజయవాడ. ఈ రాజు రాజసూయ, అశ్వమేధ యాగాలను మాత్రమేగాక నరమేధయాగాన్ని కూడ చేశాడు. ఇతని కాలంలోనే మొగల్రాజపురం, ఉండవల్లి గుహలు అంతకు పూర్వమున్న బౌద్ధ చిహ్నాలను కోల్పోయి, హిందూ దేవతల నివాసాలుగా మారినవి. అమరావతి స్తూపం కూడ ఇతని కాలంలోనే, బౌద్ధుల చేతిలోనుంచి జారిపోయి హిందువుల చేతిలోకి వచ్చినట్లు హ్యూన్‌సాంగ్ అను చైనా యాత్రికుడు వ్రాశాడు. ఇందుకు సంబంధించిన కథ ఇది :

"అమరావతి స్తూపం బౌద్ధ భిక్షువుల అధీనంలో ఉంది. బ్రాహ్మణులు ఈ స్తూపంపై పెత్తనం కావాలని తగాదా పెట్టారు. బౌద్ధభిక్షువులు తలుపులు బిగించుకొని లోపల కూర్చున్నారు. బైట బ్రాహ్మణులు ముట్టడి వేశారు. చిట్టచివరకు బౌద్ధ భిక్షువులు తలుపులు తీసి, బైటకువచ్చి రాజుగారి మధ్యవర్తిత్వం అడుగుదామని ఆయన వద్దకు వెళ్ళారు. ఈలోగా బ్రాహ్మణులు స్తూపాన్ని ఆక్రమించుకున్నారు. రాజు బ్రాహ్మణుల తరఫున తీర్పు చెప్పాడు. బౌద్ధభిక్షువులు స్థానభ్రష్టులై వేలిపోయినారు. కొద్దిరోజుల

తర్వాత అమరావతి స్తూపం అమరేశ్వరాలయంగా మారిపోయింది" అని హ్యూన్‌సాంగ్ వర్ణించారు.

ఈ వంశంలో ఆఖరివాడైన మూడవ మాధవవర్మ ధర్మదీక్షను గురించిన ఒక కథ దగ్గుపల్లి దుగ్గన రచించిన నాచికేతోపాఖ్యానంలోను, నందిమల్లన, ఘంట సింగయలు రచించిన ప్రబోధ చంద్రోదయంలోను యీ విధంగా వర్ణించబడ్డది :

"మూడవ మాధవవర్మ ఏకైకపుత్రుడు ఒకనాడు కొత్తగా కొన్న పారసీకపు గుర్రాలను రథానికిగట్టి జనసమ్మర్దంగల నగరవీధులలో అతి వేగంగా పోనిచ్చాడు. ఆ రథం క్రిందపడి ఒక బీద బ్రాహ్మణ యువకుడు మరణించాడు. ఈ విషయం తెలిసిన రాజు తన పుత్రుడని జాలి ఏమాత్రం లేకుండా తన కుమారునికి ఉరిశిక్ష విధించాడు." రాజు ధర్మతత్పరతకు మెచ్చి విజయవాద దుర్గ సువర్ణ వర్షం కురిపించి, రాజకుమారుణ్ణి, బ్రాహ్మణ యువకుణ్ణి-యిద్దరినీ బ్రతికించిందని కూడా పై కథలో చేర్చబడ్డది.

విష్ణుకుండిన రాజ్యం కృష్ణానది నుండి కళింగదేశం వరకూ వ్యాపించింది. వీరు ప్రారంభంలో అమరావతిని రాజధానిగా చేసుకొని ఆ పిమ్మట పల్లవుల దాడికి తట్టుకోలేక వేంగినగరానికి రాజధానికి మార్చి చివరకు విజయవాడలో స్థిరపడ్డారు. ఇటీవలి పరిశోధనల ననుసరించి వీరి రాజ్యం తెలంగాణా లోని నల్లగొండ జిల్లాకు కూడా విస్తరించినట్లు తెలుస్తున్నది. దక్కను పీఠభూమిలో నాడు ప్రబలులైన వాకాటక రాజులతో వీరు వివాహ సంబంధాలు చేసి తమ రాజ్యానికి స్థిరత్వం సంపాదించారు. బ్రాహ్మణులకు, పండితులకు విస్తారంగా దానాలు చేశారు. గోదావరీ తీరంలోని సారవంతమైన భూములను బ్రాహ్మణాగ్రహారాలుగా చేసి వేదాధ్యయనాన్ని ప్రోత్సహించారు. పూర్వమీమాంసా సూత్రకారుడైన కుమారిలభట్టు, అతని శిష్యుడు ప్రభాకర పండితుడు విష్ణుకుండిన రాజుల అంత్యదశలో 7 వ శతాబ్ది ప్రారంభంలో ఆంధ్రలో జీవించారు. విష్ణుకుండిన రాజ్యాన్ని మూడవ మాధవవర్మ పరిపాలింపుచుండగా ఆంధ్ర పశ్చిమ చాళుక్యుల దండయాత్రలు ప్రారంభమైనవి. క్రీ. శ. 611 తో విష్ణుకుండిన వంశం అంతమైంది.

## భూస్వామ్య వ్యవస్థ

గుప్తరాజుల కాలంలో దేశం అంతటా ఆర్థిక రంగంలో ఒక పెద్ద మార్పు వచ్చింది.

దేశమంతటినీ, కేంద్ర రాజధాని అయిన పాటలీపుత్రం నుండి పరిపాలించటం అసాధ్యమని గుర్తించిన గుప్తరాజులు సామంత ప్రభువులను ఏర్పరచారు. వీరు ఉపసామంతులను ఏర్పరచారు.

పరిపాలనా బాధ్యత మాత్రమేకాక, ఆర్థిక వ్యవస్థపై కూడా సామంతుల పెత్తనం పెరిగింది. ప్రతి సామంతుడు, వేలాది ఎకరాలు, వందలాది గ్రామాలు, స్వంత ఆస్తిని సంపాదించుకుంటున్నాడు.

మత ప్రచారానికై బ్రాహ్మణులకు అగ్రహారాలు, సర్వహక్కులతో ఇచ్చే పద్ధతిని గుప్తరాజులు ప్రవేశపెట్టారు. వారి సామంతులు యీ పద్ధతిని అవలంబించారు.

నిరంతర యుద్ధాల ఫలితంగా వర్తక వ్యాపారాలు మందగించాయి. నాణాల రూపంలో, జీతాలు చెల్లించే పద్ధతి స్థానే భూములను కేటాయించే పద్ధతిని క్రింది ఉద్యోగుల వరకు సామంతులు అవలంబించారు.

బ్రాహ్మణులకు అగ్రహారాలతోపాటు, అన్ని చేతివృత్తుల వారికి చివరకు ఉద్యోగులకు సైతం, చాకిరీ ఈనాములు, వృత్తి ఈనాములు ఇవ్వటం ప్రారంభమైంది.

వీటన్నిటి ఫలితంగా భారతదేశంలో ఫ్యూడల్ వ్యవస్థ తల ఎత్తింది.

భూమి అంతా ఫ్యూడల్ ప్రభుత్వ స్వంత ఆస్తిగా ఉండటం యూరపియన్ భూస్వామ్య పద్ధతి. భారతదేశంలో ఆ స్థితి లేదు. భూమిపై సూత్రప్రాయంగా రైతే హక్కుదారు. కాని పై నుండి క్రిందకు అసంఖ్యాకమైన భూకామందులు ఏర్పడటం, రైతులు తప్పనిసరిగా భూస్వాములకు లోబడి పనిచేయటం, రైతులు క్రమంగా కౌలుదారులుగా మారటం, చేతివృత్తులవారు గ్రామాన్ని వదలి వెళ్ళరాదని నిషేధించటం, భూములను అమ్మటం, కొన

టం చాలా తక్కువ స్థాయిలో జరగటం– ఈ మార్పులన్నిటిలో భారత దేశంలో కూడా కొన్ని ప్రత్యేకతలు కలిగిన భూస్వామ్య వ్యవస్థ గుప్త రాజుల కాలంతో ప్రారంభమైంది. ఇది ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క రూపం ధరించింది.

తమిళనాడులో దేవాలయాలు పెద్ద భూస్వామ్య కేంద్రాలైనవి. కర్ణాటక, ఆంధ్రలలో వేల సంఖ్యలో బ్రాహ్మణ అగ్రహారా లేర్పడ్డాయి. ప్రతి అగ్రహారానికి, కొన్ని వెలి గ్రామాలుండేవి. ఆ గ్రామాల రైతులు విధిగా అగ్రహార భూములను సాగుచేసి పెట్టాలి.

ఆనాటి శాసనాలలోను, గ్రంథాలలోను, ప్రజలతోసహా గ్రామాలను దానం చేస్తున్నట్లు పెక్కు ఉల్లేఖనలు లభించాయి.

సూత్రప్రాయంగా స్వతంత్రుడైన రైతు, ఆచరణలో అర్ధ దాసుగా మారిపోయినాడు.

గుప్తరాజులతో ప్రారంభమైన పద్ధతి, కొద్ది మార్పులతో బ్రిటిష్ యుగం వరకు కొనసాగుతూనే వచ్చింది.

## పరిపాలనా విధానం

నాటి న్యాయ పరిపాలన అతి దారుణంగా ఉండేది. నేరం రుజువు చేయడానికి అనేక శిక్షలు విధించేవారు. వీటికి దివ్య పద్ధతులని పేరు. కాగుతున్న నూనెలో చేయి పెట్టటం, నీళ్ళలో ముంచటం, పాములచే కరిపించటం, మండుతున్న ఇనపగుండును అరచేతిలో ఉంచటం–మొదలైన శిక్షలు విధించి నేరాన్ని రుజువు చేసేవారు. విష్ణుకుండిన రాజులందరూ ఈ శిక్షా పద్ధతులను అతికఠినంగా అమలు జరిపేవారు. మూడవ మాధవవర్మరాజుకు 'అవసిత వివిధ దివ్యస్య' (శిక్షలను అమలు జరుపుటలో ప్రసిద్ధుడు) అని బిరుదు వుంది.

ప్రజలపై 18 రకాల పన్నులుండేవి. బంజర్ల లోని కంప, కట్టె, గడ్డిపై హక్కు రాజుది. ఉప్పు, పంచదార వ్యాపారం రాజోద్యోగులే నిర్వ

హించేవారు. సైనికుల ప్రయాణాని కవసరమైన వాహనాలను గ్రామస్థులు ఉచితంగా అందజేసి, భోజన సౌకర్యాలు కల్గించాలి. పల్లవ శాసనాల ననుసరించి ఈ క్రింది రాజోద్యోగుల పేర్లు తెలుస్తున్నవి. రాజకుమార, సేనాపతి, రాష్ట్రిక, దేశాధిక, గోవల్లభ, అశ్వవల్లభ, గ్రామభోజక- మొదలైనవారు. పల్లవరాజుల ఒక దాన శాసనంలో స్థల నిర్దేశం ఎంత స్పష్టంగా ఉందో చూడండి:

"ఈ గ్రామంలో రెండువందల నివర్తనాల భూమి ఉంది. పడమర కందుకూరు, తూర్పున సుప్రయోగవతి అను నది, ఉత్తరాన మహాపథం (రాజమార్గం) ఉన్నది మహాపథానికి ఉత్తరంగా ఒక చింతచెట్టు, ఆ పైన ఒక గుట్ట, ఆపైన ఒక రాళ్ళపోగు, ఆ రాళ్ళపోగు ఈ స్థలానికి సరిహద్దు. ఈ గుర్తులమధ్య ఉన్న భూమి అన్ని హక్కులతోను బ్రాహ్మణులకు దానం చేయబడుతున్నది. గ్రామాధికారులు ఇది గుర్తుంచుకోవాలి. ఏ మాత్రం పన్ను వసూలు చేయరాదు. సైనికులు, రాజభటులు ఈ గ్రామంలో ప్రవేశించరాదు."

## విజ్ఞాన వికాసం

భారతదేశం మొత్తంమీద, ఈ యుగంలో అపూర్వమైన విజ్ఞాన వికాసం కలిగింది. గుప్తరాజుల పరిపాలనా కాలమైన ఈ యుగాన్ని భారతదేశ చరిత్రలో స్వర్ణయుగమని చరిత్రకారులు అంటారు. ఉజ్జయినీ రాజుల ప్రోత్సాహంతో వివిధ రంగాలలో జరిగిన అభివృద్ధే ఇందుకు కారణం.

గణితశాస్త్రం రచించిన ఆర్యభట్టు, ఖగోళశాస్త్ర పండితుడైన వరాహమిహిరుడు, వైద్యశాస్త్రం రచించిన వాగ్భటుడు, తత్వశాస్త్ర భాష్యాలు వ్రాసిన శబరస్వామి, ప్రశస్తపాదుడు, రాజనీతిశాస్త్రం రచించిన కామందకుడు ఈ కాలంలో నివసించారు. మహాకవి కాళిదాసు ఈ కాలంలోనే నివసించారు.

గణితశాస్త్రంలో పూర్ణబిందుప్రయోజనాన్ని కనిపెట్టింది ఆర్యభట్టు. సూర్యమండలానికి సూర్యుడు కేంద్రమని, భూమి తన కక్ష్యపైనే

తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని, ఇందువల్లనే రాత్రి పగలు ఏర్పడుతున్నవని- ఆర్యభట్టు మొట్టమొదటిసారిగా నిరూపించారు. సూర్య, చంద్రగ్రహణ కాలాలను లెక్కగట్టడం, ఈ పరిశోధనల తర్వాతనే ప్రారంభమైంది.

వరాహమిహిరుడు పై గణితశాస్త్ర పరిశోధనలను మరింత ముందుకు తీసుకువెళ్ళి ఖగోళశాస్త్రాన్ని వృద్ధిచేశారు. తన గ్రంథాలలో వరాహమిహిరుడు గ్రీకు ఖగోళ శాస్త్రజ్ఞులను అనేక సందర్భాలలో ప్రశంసించి, క్షేత్ర గణితం (Geometry) విషయంలో గ్రీకులనుండి నేర్చుకోవలసిన విషయాలు ఎన్నో ఉన్నవని నిరూపించారు.

రాజభాషగా సంస్కృతం ఉన్నప్పటికి ఈ కాలంలో ప్రజలభాష అయిన తెలుగు అభివృద్ధి చెందుతూనే ఉన్నది. ఘూదవ మాధవవర్మ కాలంలో నివసించిన గణస్వామి అను పండితుడు 'జనాశ్రయఛందోవిచ్ఛిత్తి' అను ఛందశ్శాస్త్రం వ్రాశారు. తెలుగుభాషలో సీస, గీత, కంద పద్యాలు ఆనాటికే వ్యాప్తిలో ఉన్నట్లు ఈ గ్రంథంద్వారా తెలియవస్తున్నది.

# ఆంధ్ర భాష పరిణామం

ఆంధ్ర అను పదం మొదట్లో ఒక తెగ ప్రజల పేరుగా ఉండేది. తర్వాత ఈ తెగ ప్రజలు సంచరించిన ప్రాంతంలోని నదులకు, కొండలకు ఆ పేరు సంక్రమించి, క్రమంగా వారు స్థిరపడిన దేశానికి ఆంధ్ర దేశము అను పేరు వచ్చింది. బొంబాయివద్ద ఆంధ్రలోయ అని పిలువబడే కొండ లోయ ఉంది. మహారాష్ట్ర దేశంలో ఆంధ్రి అనే ఒక చిన్న నది ఉంది. అదే విధంగా తుంగభద్రా నదికి గల ఉపనదులలో ఒకదానిపేరు హంద్రి. క్రీ.శ. 220 ప్రాంతంలో బళ్ళారి జిల్లాలో చెక్కబడిన పల్లవ రాజుల శాసనంలో మొట్టమొదటిసారిగా ఆంధ్రపథము అను పద ప్రయోగమున్నది.

ఈ పరిణామం జరిగిన మరికొంత కాలానికి, ఆంధ్రులు మాట్లాడే భాషకు కూడా ఆంధ్ర భాష అను పేరు స్థిరపడ్డది.

వివిధ తెగల సమ్మేళనము జరుగుతున్న రోజులలో, ఒక్కొక్క తెగ ప్రజలు ఒక్కొక్క భాష మాట్లాడుతూ ఉండేవారు. ఆంధ్ర దేశంలో అనాదిగా నివసిస్తున్న ద్రావిడ, యక్ష, నాగ ప్రజలు తెనుగు లేక తెలుగు భాషను మాట్లాడేవారు. ఉత్తర హిందూస్థానమునుండి దిగివచ్చిన ఆంధ్ర ప్రజల వ్యవహార భాష దేశి.

తెనుగు ద్రావిడభాషా కుటుంబానికి చెందినది. తమిళ, కన్నడ, తుళు భాషలతో దీనికి సామీప్యం ఉన్నది. ఒక భాషలోని మూల పద జాలము, నిత్య వ్యవహారములలో అత్యవసరముగా వాడుకునే క్రియా రూపము (ధాతువు)లు, వాక్య రచనా పద్ధతి, తదితర వ్యాకరణ విశేషము లనుబట్టి, ఆ భాషా స్వరూపం నిర్ణయించబడుతుంది. ఈనాటికి తెనుగు

భాషలో మూల పదజాలమంతా అచ్చ తెనుగులోనే ఉన్నది. అమ్మ, అక్క, చెట్టు, పుట్ట, నీరు, పాము, తేలు, గాలి ఇత్యాది అశేష పద జాలము ప్రాచీన మానవుడు మాట్లాడ నేర్చినపుడు ప్రారంభమై అభివృద్ధి చెందిన పదసంపద. తిను, కొట్టు, తిట్టు, నడు, కూర్చో, వెళ్ళు, రా ఇత్యాది ధాతువులు కూడా ప్రాచీనమైనవి. పైన చెప్పిన పదజాలానికి దగ్గర సంబంధమున్న మాటలే తమిళ, కన్నడ భాషలలో ఉన్నవి.

| తెనుగు | తమిళము | కన్నడము |
|---|---|---|
| తల | తలై | తలె |
| నెల | నిల | నిలా |
| పులి | పులి | పులి, హులి |
| ఊరు | ఊర్ | ఊర్ |
| మగవాడు | మగన్ | మగన్ |
| ఉప్పు | ఉప్పు | ఉప్పు |
| పప్పు | పరుప్పు | పప్పు |
| పట్టి | పట్టు | పడె (పట్టుకొనుట) |
| ఎక్కు | ఏఱు | ఏఱు (ఎక్కుట) |

తెలుగు వాక్య నిర్మాణములో కర్త, కర్మ, క్రియ – వరుసగా ఉంటాయి. ఇతర ద్రావిడ భాషలలోను అంతే. కాని సంస్కృతములో ఈ నియమము లేదు. విభక్తి ప్రత్యయములు భాష ప్రాచీనతకు, అభి వృద్ధికీ చిహ్నం. తెనుగు భాషకు – డు, ము, వు, లు మొదలైన విభక్తి ప్రత్యయాలు, సంస్కృతంకంటె భిన్నమైనవి, అనాదిగా వాడుకలో ఉన్నవి. పై కారణాలవల్ల తెనుగుభాష ద్రావిడభాషా కుటుంబానికి చెందినదని భాషా శాస్త్రజ్ఞులు ఏకకంఠంతో వచిస్తున్నారు.

శాతవాహన రాజుల శాసనభాష ప్రాకృతం. అది నాటి రాజభాష. శాతవాహనుల తర్వాత పరిపాలించిన ఇక్ష్వాకుల శాసనాలలో మొట్ట మొదటగా తెలుగు మాటలు కనబడుతున్నవి. నాగార్జున కొండవద్ద

క్రీ. శ. 250 ప్రాంతంలో చెక్కబడిన ఇక్ష్వాకు రాజుల శాసనాలలో, నాగంవ', 'పీరంన' మొదలైన మాటలేగాక, మహాతలవర అను మరొక మాటకూడా ఉన్నది.

మహాతలవరలో, తలవర అనునది తెనుగు మాట. తలారి లేక తలవర అంటే గ్రామాధికారి. తమిళంలో తలైవార్ అంటే పెద్ద అధిపతి - అని అర్థము ఈ అచ్చ తెనుగు మాటకు మహా అను ఒక సంస్కృత విశేషణము చేర్చబడింది. ప్రజలు మాట్లాడే తెనుగు భాషలోని మాటలు, కొన్ని యథాతథంగానూ, కొన్ని సంస్కృతీకరించబడి శాసనాలలో ప్రవేశించినవని, అనాటి ఆంధ్ర ప్రజలు తెనుగుభాష మాట్లాడేవారు. సంస్కృతజన్యమైన ప్రాకృతం రాజభాష మాత్రమే.

క్రీ. శ. నాల్గవ శతాబ్దిలో పల్లవరాజు శివస్కందవర్మ చెక్కించిన ప్రాకృత శాసనంలోని భాష చూడండి :

"కాంచీపురతో యువమహా రాజో భారదాయస గొత్తో పలవానం సవఖందవమ్మో ధర్మబదె వాపతం ఆనవయతి. అంఘవతీయగామో.... విరిపరం అంహేహి ఉదకాదిం సంపదతొ ఏతస గామన విరివరస నవ బంహదేయ పరిహాలో వితరమ."

ఆంధ్ర ప్రాంతంలోని గ్రామమైన విరిపర (ఏప్పర్రు) గ్రామాన్ని శివస్కందవర్మ దానం చేస్తున్నాడు-అని పై శాసన సారాంశం.

7 శతాబ్దిలో చెక్కించబడిన చాళుక్య జయసింహ వల్లభుని తెనుగు శాసనము చూద్దాం :

"జయసింహవల్లభ మహారాజు లాకున్ ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబుళ ఎణుంబోది అన్వేణ్ణ అమ్మిన్ పుణ్ణమనాణ్డు ప్లాఏంది రాజుల ముట్లు కలిముడిరాజుల్ ప్లావింది నముద్రరత్తై నాకు బణిసేసిన కల్చి వీఅరుల్లు ఛుద్ది కదు మూటికి ఏకల్లి ఉత్తరంబున పులోంబున చెఱువు పదుమూటి కోటన్ ఎణ్బుంబోది పుట్లు అల్ల పట్టు సేనుశాలీ తోంటలాయు

పదువారంబు ఇచ్చిరి." తెలుగు, ప్రాకృతభాషల మూల స్వరూపములోనే ఉన్న వ్యత్యాసాన్ని. పై ఉదాహరణలు తెలియజేస్తున్నాయి.

ప్రాచీన శాసనములలోని గ్రామముల పేర్లు కొన్ని 'ఊరు'తో అంత మవుతూ ఉంటవి. కూడూరే, ఏఊరే; ఇందులోని ఊరు దక్షిణదేశ భాషల లోని ఊర్ కు సమీపంలో వుంది. నాటి ఏఊరే నేడు ఏలూరు. నాటి కూడూరే - నేటి కృష్ణాజిల్లాలోని కోడూరు. ప్రాచీన శాసన పరీక్ష జరిపినట్లయితే, తెలుగు దేశంలోని గ్రామముల పేర్లు తెలియగలవు. అతి ప్రాచీనమైన ఈ పేర్లు తెలుగు యొక్క ద్రావిడభాషా బంధుత్వాన్ని స్పష్టంగా నిరూపిస్తున్నాయి.

ఆంధ్రులకంటె ప్రాచీనులైన ద్రావిడ, యక్ష, నాగ ప్రజలు మాట్లాడుతూవున్న ఈ తెనుగుభాష పైన, ఆంధ్రులు మాట్లాడే దేశి, రాజ భాష వన ప్రాకృతం, శాతవాహనయుగం తర్వాత రాజభాష వన సంస్కృతం - ప్రభావం పడసాగింది. సంస్కృత, ప్రాకృతములు రెండూ ఒకే కూటమికి చెందినవి. గ్రాంధికభాష సంస్కృతము, వ్యావహారికభాష ప్రాకృతము. అంతకుమించి మూలపదజాలములోకాని, వాక్యరచనా పద్ధతిలోగాని ఈ రెంటికీ ఎట్టి తేడా లేదు. బౌద్ధమత ప్రచారకులు, తమ మత సిద్ధాంతాలను ప్రజా సామాన్యానికి అర్థమయ్యేటట్లు చేసేందుకు వారి గ్రంథా లన్నిటిని ప్రాకృతంలో వ్రాశారు. అశోకుడు, శాతవాహన రాజులు మాత్రమే కాక ఆనాడు భారతదేశంలోని రాజులందరూ ప్రాకృతాన్నే రాజభాషగా వాడేవారు.

కాని ఆంధ్ర ప్రజల భాష ప్రాకృతం కాదు. గుణాఢ్యుడు బృహత్క థను వ్రాసేటప్పుడు ఇలా అన్నాడు : "సంస్కృత, ప్రాకృత, దేశి భాష లను పరిత్యజించి నేను పైశాచీ భాషలో బృహత్కథను వ్రాస్తున్నాను." సంస్కృత, ప్రాకృతములు ఒకే కూటమికి చెందినవి. దేశి, పైశాచి - మరొక కూటమికి చెందినవి.

ఇప్పటికీ, బెలూచిస్తాన్‌లో బ్రాహుయి అను భాష, వింధ్య ప్రాంతము నందలి కొండ జాతులలో కొండు, మార్టు, ఒరెయాన్ - మొద

లైన భాషలు నిలిచివున్నవి. ఈ భాషలన్నీ ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవి. ఆర్యులు రాకపూర్వము, ద్రావిడులు ఉత్తర హిందూస్థానములో నివసించారు. సింధునదీ తీరంలో హరప్పా, మొహంజదారో నాగరికతను నిర్మించారు. కాంక్రమేణ ఆర్యుల వత్తిడికి లొంగి, వీరు దక్షిణ హిందూ దేశానికి వచ్చినప్పటికీ, ద్రావిడ బంధువులైన కొన్ని తెగలు, అక్కడ నిలిచిపోయినవి. వారి భాషలు కూడా ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవి. బెలూచిస్తాన్‌లో బ్రాహుయి, ఆఫ్ఘనిస్తాన్‌లోని పప్పై, కాశ్మీర్‌లోని గిల్గిట్ ప్రజలు మాట్లాడే షినా – ఇవన్నీ ఇలాంటివి. ద్రావిడ భాషా కుటుంబంతో దగ్గర సంబంధం కలిగిన ఈ భాషలను, దార్దిక్ భాషా కూటమి అని శాస్త్రజ్ఞులు నిర్ణయించారు.

ఆంధ్రుల 'దేశి' ఈ కూటమికి చెందినది. దేశి అపభ్రంశ రూపము పైశాచి. ఆంధ్రులు దక్షిణాపథంలో ప్రవేశించిన ప్రారంభంలో వింధ్య ప్రాంతాలలో నివసించారు. వింధ్యాటవులలోని కొండజాతుల వారు ఇప్పటికీ, ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన కాండు, మార్తు, ఒరెయాన్ భాషలు మాట్లాడుతున్నారు. గంగా, యమునా తీరానికి చేరకముందు ఆంధ్రులు బెలూచిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, కాశ్మీర్‌లలో కూడ ప్రయాణం చేశారని చరిత్రకారులు భావిస్తున్నారు.

దేశియొక్క అపభ్రంశ రూపమైన పైశాచిలో బృహత్కథను వ్రాసిన గుణాఢ్యుడు కాశ్మీర్ వాసియా, ఆంధ్రుడా, నేపాల్ వాడా అని పండితులలో వాద ప్రతివాదాలున్నవి. కాశ్మీర్, నేపాల్ దేశస్థుల ప్రాచీన భాష, దేశి, అపభ్రంశమైన పైశాచీ ఒకే కూటమికి చెందిన భాషలు కావటమే పై చర్చకు కారణం.

ఆంధ్రుల 'దేశి' తెనుగు, నాగ, యక్ష ప్రజల తెలుగు రెండూ కలిసి ఒకే భాషగా రూపొందినవి. ఈ రెండు భాషలూ సమీప బంధుత్వం గల దార్దిక్, ద్రావిడ భాషా కూటములకు చెందినవి. కనుకనే ఈ సమ్మేళన సాధ్యమైంది.

ఒకే కూటమికి చెందిన భాషలు మాత్రమే పరస్పర సమ్మేళన ఫలితంగా ఏకమైపోగలవని, వివిధ భాషా కూటములకు చెందిన భాషలు - ఎంతకాలం కలిసిమెలిసి వర్తిల్లినా - చిటచివరకు బలవత్తరమైన, పటిష్ఠమైన భాష - నిలిచి రెండవది నశించిపోవుందేతప్ప రెండూ సమ్మేళనం కాలేవని ఆధునిక భాషా శాస్త్రజ్ఞులు నిరూపించారు.

తెలుగుభాష చరిత్రే ఇందుకు చక్కని ఉదాహరణ. శాతవాహన యుగంలోను తర్వాత కొంతకాలం-మొత్తం 5 లేక 6 వందల సంవత్సరాలు ప్రాకృతం ఆంధ్రదేశంలో రాజభాషగా ఉంది. తెలుగు భాష శాసనాలలోకి ఎక్కటమే కష్టమైంది. ప్రాకృతభాషలోని పదజాలం తద్భవములనే పేరుతో అనేకము తెలుగులో ప్రవేశించినవి. కాని తెలుగుభాష నశించలేదు. అవసరమైన ప్రాకృత పదజాలాన్ని జీర్ణం చేసుకుని మిగతా భాషను త్రోసిపుచ్చింది. హిందూమత పునరుద్ధరణ వినాదంతో ఉత్తర హిందూదేశంలో గుప్తరాజులు, దక్షిణ హిందూదేశంలో పల్లవరాజులు క్రీ. శ. 400-500 ప్రాంతంలో దండయాత్రలు ప్రారంభించటంతో ప్రాకృతం రాజభాషగా కూడ నశించింది. టిబెటులోని బౌద్ధమత గ్రంథాలలో తలదాచుకున్నది.

ఆ తర్వాత సంస్కృత భాషా ప్రభావము ఆంధ్రదేశంలో 500 ఏండ్లు సాగింది. క్రీ. శ. 1000-1100 మధ్య నన్నయ్యభటు తెలుగు భారత రచనతోను-అంతకుముందే అనేక శాసనాలలో వచన, పద్య రూపాలలో ప్రవేశించుటద్వారానూ, తెలుగుభాష తన అస్తిత్వాన్ని పునః స్థాపించుకొని రాజభాష అయిన సంస్కృత భాషను త్రోసివేసింది. సంస్కృతంలో నుంచి అవసరమైన పదజాలాన్ని తత్సమాల రూపంలో మాత్రం స్వీకరించింది.

కాని దేశి, తెలుగుభాషలు పూర్తిగా సంలీనం కాగలిగినవి. దేశి కూడా తెలుగుభాషకు సారూప్యం కలిగి ఉండటం, దేశికంటె తెలుగు, శతాబ్దాల తరబడి అభివృద్ధిచెంది, మూల పదజాలాన్ని రూపొందించుకొని ఉండటమే ఇందుకు కారణం. దేశి భాషతో లీనం కాగలిగిన తెలుగు, ప్రాకృత,

సంస్కృతాలను - త్రోసివేయటానికి కూడ ప్రధాన కారణం - ఈ రెండు భాషా కూటములతో గల వ్యత్యాసము తప్ప వేరుకాదు.

ఆర్యులకంటే, ద్రావిడులు అతి ప్రాచీనులైనట్లు, ద్రావిడభాషలు కూడా సంస్కృత జనిత భాషలకంటె అతి ప్రాచీనమైనవి, పటిష్ఠమైనవి. ప్రాకృతజన్యమైన హిందీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ భాషలకంటె ద్రావిడ భాషలైన తమిళ, కన్నడం, తెలుగు భాషలు దీర్ఘచరిత్రలో కాల పురుషుని అనేక అఘాతములను తట్టుకొని రూపొందినవన్న విషయం మనం మరువరాదు.

క్రీ. శ. 1050 ప్రాంతంలో రచింపబడిన తెనుగు భారతంలో తెలుగు, తెనుగు, ఆంధ్రము-ఒకే అర్థములో అనేక సందర్భాలలో వాడబడ్డవి. మొదట ఒకతెగ పేరుగా ఉన్న 'ఆంధ్ర' - ఈ వేయి సంవత్సరాల చరిత్రలో జరిగిన పరిణామాల ఫలితంగా భాషకు కూడా వర్తించసాగింది. ఆంధ్రులు, ఆంధ్రదేశము, ఆంధ్రభాష; తెలుగువారు, తెనుగుదేశము, తెనుగుభాష: ఇవి పర్యాయ పదములుగా మారిపోయినవి.

# కళింగ చరిత్ర

ఆంధ్రులవలెనే కళింగులు అతి ప్రాచీన ప్రజలు. రామాయణ, భారత గ్రంథాలలో అంగ, వంగ, కళింగ పదాలు ఎల్లప్పుడూ కలిసి ఉపయోగింపబడుతూ వచ్చాయి. కళింగులు బలిచక్రవర్తి సంతానమని పురాణాలు వర్ణించాయి.

మహాభారత యుద్ధంలో కళింగులు 60 వేల రథాలతో, పదివేల ఏనుగులతో కౌరవులపక్షాన యుద్ధం చేశారని ఉంది. ఆనాడు వారు ప్రస్తుత కళింగ దేశంలో కాక (శ్రీకాకుళం, విశాఖజిల్లాలు) గంగానదికి దక్షిణ భాగంలో అనగా బరగ్‌పూర్ ప్రాంతాల్లో నివసించి ఉండేవారు. మహాభారత యుద్ధానంతరం ఏర్పడ్డ కల్లోల పరిస్థితులవల్ల, కాటకంవల్ల వీరు క్రమంగా దక్షిణదిశగా సాగి బంగాళాఖాతం ఒడ్డున, మహానదీ, గోదావరి మధ్య ప్రాంతాలలో స్థిరపడ్డారు. కటక్, బరంపురం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాలు మాత్రమేగాక పిఠాపురం వరకు కూడా కళింగ దేశమనే వ్యవహరించబడ్డది.

## బౌద్ధ గాథలు

విజయుడను కళింగరాజు 700 మంది పరివారంతోనూ, బౌద్ధభిక్షువులతోనూ బుద్ధుని అవశేషాలను కొన్నిటిని తీసుకొని సముద్ర మార్గాన సింహళం వెళ్ళినట్లు వెస్సంతర జాతకం తెలియజేస్తున్నది.

విజయుడనే రాజు కళింగదేశం నుండి వచ్చినట్లు, సింహళ చరిత్ర గ్రంథాలు ధృవపరుస్తున్నాయి. విజయుడు ఓడ యెక్కి ప్రయాణం చేస్తున్నట్లు ఒక శిల్పం సింహళ దేశంలో వుంది.

బుద్ధుని నిర్యాణానంతరం అతని శరీరావశేషాలను బౌద్ధులు వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్ళి, భూస్థాపితంచేసి, వాటిపై స్తూపాలు నిర్మించారు. అమరావతీ స్తూపం ఇలాంటిదే. కళింగదేశంలో దంతపురమనేచోట కూడా యిలాంటి స్తూపం నిర్మించబడ్డది. ప్రస్తుతం చికాకోల్ స్టేషన్ సమీపంలో దంతవక్త్రునికోట అని పిలవబడే దిబ్బ ప్రాచీనమైన దంతపురం.

కుంభవతీ పురంలో ప్రజా పీడకుడైన దండకుడనే రాజు పరిపాలించేవాడు. అతని దుష్కృత్యాల ఫలితంగా రాళ్ళవర్షం కురిసి కుంభవతీ నగరమంతా ధ్వంసమైంది. అతని సామంతులు బౌద్ధధర్మాన్ని స్వీకరించి. ప్రజారంజకులుగా పరిపాలించారని మరొక జాతకకథ తెలియజేస్తున్నది. ఈ కుంభవతీ నగరం కళింగ దేశంలో ఎక్కడ వుండేదో చెప్పలేము. బౌద్ధమతం అతి ప్రాచీన కాలం నుండి బహుశా ఆంధ్రదేశంలో కంటే కూడా ముందుగానే కళింగ దేశంలో వ్యాపించిందని ఊహించవచ్చు.

కళింగదేశం నందరాజుల పరిపాలన క్రింద వుండేది. వారి రాజధాని పాటలీపుత్రము. బౌద్ధమతంతోపాటు జైనమతం కూడా కళింగ దేశములో విశేషవ్యాప్తిలో వుండేది. బౌద్ధ, జైనమతములు రెండూ హిందూమతముపై తిరుగుబాటుగా ప్రారంభమైనవి. కాని జైనమతంలో మొదటినుండి శక్తి పూజలు, ఆరాధనలు, మంత్ర తంత్రాలు ప్రబలంగా ఉండేవి. నందరాజులు కళింగ దేశాన్ని పరిపాలిస్తుండగా జైనమతం విస్తారంగా వ్యాపించి ఉండేదని. అనేక జైన విగ్రహాలను నందరాజులు పాటలీపుత్రానికి తరలించుకు పోయారని క్రీ. పూ. 183 ప్రాంతంలో కళింగ దేశాన్ని పరిపాలించిన కారవేలుని హాతిగుంఫా శాసనం ద్వారా తెలుస్తున్నది.

## అశోకుని దండయాత్ర

అశోకుని కళింగ దండయాత్ర కళింగదేశ చరిత్రలోనే గాక భారత దేశచరిత్రలోనే అతి ప్రధానమైన ఘట్టం.

క్రీ. పూ. 268-236 మధ్యకాలంలో అశోకుడు పరిపాలించాడు. అశోకుడు రాజ్యానికి వచ్చిన వెంటనే కళింగ రాజులు స్వతంత్ర్యం ప్రక

టించారు. వారిని ఓడించేందుకు క్రీ. పూ. 255లో అశోకుడు దండయాత్ర చేసినట్లు దౌలి (పూరీ)వద్ద, జౌగడ (బరంపురం)వద్ద శాసనాలు తెలియజేస్తున్నాయి.

ఈ కళింగ దండయాత్ర మహా భీకరంగా జరిగింది. అనేకవేల సైనికులు మరణించారు. ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. మహోదాత్త యుద్ధంలో ధైర్యసాహసాలతో పోరాడిన కళింగ వీరుల సంతతి యీ యుద్ధంలో చనిపోయినందుకు, తానెంతో విచారిస్తున్నానని అశోకుడు తన శాసనాలలో వ్రాసుకున్నాడు. అతి బలవంతులయిన ప్రత్యర్థులు నశించటంతో అశోక సామ్రాజ్యానికి ఇక ఎదురు లేకపోయింది. అశోకుని వ్యక్తిగత మానసిక ప్రవృత్తిలోనూ మార్పు వచ్చింది. ఈ రెండూ పరస్పరాధారాలు పాలకవర్గ ప్రయోజనాలకు వ్యక్తుల పాత్రకు గల గతి తార్కిక సంబంధానికి కిది చిహ్నం.

అశోకుని శాసనాలన్నీ ప్రాకృతంలో ఉన్నవి. హాలుని గాథా సప్తశతి శౌరసేని ప్రాకృతమై వుండగా, ఈ శాసనాలన్నీ పాలీ ప్రాకృతంలో వున్నాయి.

## సామాజిక జీవనం

అశోకుని శాసనాల ద్వారా నాటి కళింగ ప్రజల సామాజిక జీవనం కొంత తెలియజేస్తుంది. రాజ ప్రతినిధి అతనికొక సలహా సంఘము, అమాత్య శ్రేణి, ప్రదేశకులు, రజ్జుకులు, ఆయుక్తులు-అని వివిధ అంతస్థులకు చెందిన రాజోద్యోగులు పరిపాలనా బాధ్యతను నిర్వహించేవారు.

మోక్షము కల్గునను పిచ్చినమ్మకముతో పశు హింస చేయరాదని ఆహారానికి మాత్రము పశువులను విచక్షణతో వాడుకోవాలని ప్రజల మద్బోధిస్తూ అశోకుడు శాసనాలు చెక్కించారు.

దాస దాసీ జనులను, భృత్యులను దయతో చూడవలెనని కూడా అశోకుడు హెచ్చరించారు. ఔషధశాలలు దేశమంతటా విరివిగా ఉండేవి

బర్మా, సింహళం, జావా, సుమిత్ర దేశాలతో విరివిగా వ్యాపారం సాగుతూ ఉండేది.

## కారవేలుడు

అశోక సామ్రాజ్య పతనానంతరం కారవేలుడను రాజు క్రీ. శ. 18[3] సంవత్సరంనాడు కళింగదేశాన్ని పరిపాలించాడు. మౌర్య సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసి స్వతంత్ర ప్రభుత్వాన్ని స్థాపించిన మొదటి కళింగరాజు కారవేలుడు. కారవేలుడు అనునది ద్రావిడభాషా పదము. పదునైన ఆయుధము కలవాడు అని ఈ మాటకు అర్థము. ఈ పదాన్ని సంస్కృతీకరించి ఖారవేలుడు అన్నారు. ఈతడు పాటలీపుత్రాన్ని పరిపాలిస్తున్న పుష్యమిత్రుని ఓడించి, మౌర్యరాజులు తీసుకువెళ్ళిన జైన విగ్రహాలను తిరిగి తెచ్చాడు.

కారవేలుడు కళింగదేశాన్ని పరిపాలించే సమయంలో శాతకర్ణి అను రాజు ఆంధ్రదేశాన్ని పరిపాలించేవాడు. ఈ ఉభయ రాజుల మధ్య యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో 'పిందుంద'నగరాన్ని కారవేలుడు ధ్వంసం చేశాడని హాథిగుంఫ శాసనం తెలియజేస్తున్నది. భువనేశ్వరానికి (ప్రస్తుత ఒరిస్సా రాజధాని) నాలుగుమైళ్ళ దూరంలో ఖండగిరిలోనూ, ఉదయగిరిలోనూ ఈతని శాసనాలు లభించాయి. హాథిగుంఫ శాసనంద్వారా ఈ క్రింది విషయాలు తెలుస్తున్నవి.

జైన మతస్థుడైన కారవేలుడు వృషభలాంఛనుడు. వృషభం జైనమతస్థులకు దైవతుల్యం. ఇతని రాజధానియైన కళింగనగరం, ప్రస్తుతం పర్లాకిమిడి వద్దనున్న ముఖలింగం.

అంతకుపూర్వం పరిపాలించిన మగధరాజులు త్రవ్వించిన కాలువలు చెడిపోగా, వానిని కారవేలుడు మరమ్మతు చేయించాడు. రాజధాని ఐన కళింగనగరానికి నీటివసతి కల్పించాడు. జైనమత ప్రవక్త వర్ధమాన మహావీరుడు కళింగదేశం స్వయంగా వచ్చి జైనమతం ప్రచారం చేశాడని కూడా యీ శాసనంలో వుంది.

ఖారవేలుడు 35 లక్షల ప్రజల యోగక్షేమాలను చూస్తూవుండేవాడు. తుఫానులవల్ల పడిపోయిన గోపురప్రాకారాలను బాగుచేయించాడు. సర్వ రాష్ట్రిక, భోజక ప్రముఖులను (మధ్యప్రదేశ్‌లోని రాజులు) పాదాక్రాంతులను చేసుకున్నాడు. పౌర జానపదులకు అనేక సౌకర్యాలు కలిగించాడు. బీహారు రాష్ట్రంలో గయ జిల్లాలోని గోరథగి వద్ద పాటలీపుత్ర రాజును ఓడించాడు. ఖారవేలుని ధాటికి గ్రీకు రాజైన డిమిట్రియస్ భయపడి పారిపోయాడు. అంగ, వంగ దేశాల నుండి రత్నాలను తెచ్చాడు. బౌద్ధ, జైన భిక్షువులకు, బ్రాహ్మణులకు విశేషంగా పారితోషికాలిచ్చి సంతృప్తిపరచాడు. 164 జైన మత గ్రంథాలను పునరుద్ధరించాడు.

పై వివరాలనుబట్టి ఖారవేలుడు అతి సమర్థుడైన రాజని మాత్రమే గాక, అతని సామ్రాజ్య విస్తీర్ణం కూడా తెలుస్తున్నది. గోదావరీ నదీతీరం వరకు అతని సామ్రాజ్యం వ్యాపించింది. ధాన్యకటకంపైన కూడా అతను దండెత్తాడని తెలుస్తున్నది.

## ఆంధ్ర దేశంలో అంతర్భాగం

ఖారవేలుని తర్వాత, కళింగ దేశమంతా శాతవాహన రాజుల పరిపాలనలోకి వచ్చింది. శాతవాహన రాజుల నాణెములు అనకాపల్లి, చీపురుపల్లి ప్రాంతాలలో విశేషంగా లభించాయి. రామతీర్థం, బొజ్జనకొండ, శంఖవరం శిల్పసంపద, ఇతర ఆంధ్ర శిల్పసంపద ఒకే రకమైనది. శాలిహుండాం బౌద్ధ స్తూపాన్ని శాతవాహనరాజులు నిర్మించినట్లు స్థలపురాణం తెలియజేస్తున్నది. శాతవాహన రాజులు కళింగాంధ్ర ఐక్యతను స్థాపించి సుస్థిర పరిపాలన ఏర్పరచారు. ముఖలింగం, చీపురుపల్లి వద్ద దొరికిన శాసనాలలోని భాష, లిపి ఇతర ఆంధ్ర ప్రాంతాలలోని భాష, లిపివలెనే ఉంది. వర్తక వ్యాపారాలు, సంబంధ బాంధవ్యాలు, భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు కలిసిపోయినాయి. మాండలికమైన తేడాలుండవచ్చు, కాని, జాతి ఒకటే, భాష ఒకటే.

## చిన్న రాజ్యాలు

శాతవాహన రాజ్య పతనానంతరం, చిన్న చిన్న రాజులు కళింగ దేశంలో ఏర్పడ్డారు. 4 వ శతాబ్దంలో జరిగిన సముద్రగుప్తుని దండయాత్ర నాటికి పిఠాపురం, ఎలమంచిలి, అముదాలవలస, గిరికొత్తూరులవద్ద వేర్వేరు స్థానిక ప్రభువులు పరిపాలించినట్లు సముద్రగుప్తుని అలహాబాద్ శాసనం తెలియజేస్తున్నది.

అటుతర్వాత మాఠరవంశస్థులు క్రీ. శ. 350 ప్రాంతంలో పిఠాపురం రాజధానిగా దక్షిణ కళింగను పరిపాలించసాగారు. ఈ వంశంలో మొదటి రాజు వాసిష్ఠీపుత్ర శక్తివర్మ. శాతవాహన సాంప్రదాయాలను యితడు కొనసాగించినట్లు, తల్లి పేరుతో ప్రారంభమైన యితని నామ దేయమే స్పష్టం చేస్తున్నది. ఇతని మనుమడైన రెండవ శక్తివర్మ తన రాజధానిని పిఠాపురం నుండి చికాకోల్ వద్దనున్న సింగుపురానికి మార్చారు. ఈ రాజులు "కళింగాధిపతి" అను బిరుదు వహించారు. మరి ముగ్గురు రాజులు పరిపాలన చేసిన మీదట, క్రీ. శ. 440 ప్రాంతంలో యీ వంశం అంతరించింది. వీరి తర్వాత వాసిష్ఠ వంశస్థులైన గుణవర్మ, ప్రభంజన వర్మ, అనంతవర్మ అను రాజులు ఎలమంచిలి రాజధానిగా కొంతకాలం పరిపాలించారు. క్రీ. శ. 485 లో యీ వంశం కూడా అంతరించింది.

పిమ్మట విష్ణుకుండిన రాజులు దక్షిణ కళింగదేశాన్ని జయించారు. ఉత్తర కళింగలో, గాంగరాజులు అను స్వతంత్ర వంశం తలయెత్తింది. వీరికి, విష్ణుకుండినులకు అనేక యుద్ధాలు జరిగాయి.

గాంగ వంశం క్రీ. శ. 497 లో ప్రారంభమైంది. అముదాలవలస వద్ద నున్న దంతపురాన్ని వీరు మొదట్లో రాజధాని చేసుకున్నారు. ఆ పిమ్మట క్రీ. శ. 570 లో ముఖలింగం వీరి రాజధాని ఐంది. విష్ణుకుండిన వంశప్రభావం కొనసాగినంతవరకు వీరు ఉత్తర కళింగాన్ని మాత్రమే పరిపాలించి ఆ పిమ్మట మొత్తం కళింగదేశ మంతటిపైన ఆధిపత్యం సాగించారు.

గాంగ వంశస్థులు మైసూరునుండి తరలి వచ్చినట్లు వారి చరిత్ర తెలియ జేస్తున్నది. మైసూరును పరిపాలించిన వారిని పశ్చిమ గాంగులని, కళింగరాజులను తూర్పు గాంగులని చరిత్రకారులు వ్యవహరిస్తున్నారు. గాంగరాజులు వేయిసంవత్సరాల పాటు క్రీ. శ. 1437 లో గజపతిరాజులు తలయెత్తేవరకు కళింగ రాజ్యాన్ని పరిపాలించారు.

7 వ శతాబ్దంలో భారతదేశ సంచారము చేసిన హ్యూన్‌సాంగ్ కళింగ దేశాన్ని యిలా వర్ణించాడు :

"ఉఢ్ర (ఓఢ్ర) దేశానికి దక్షిణంగా కళింగ్‌కియా (కళింగ) దేశం ఉంది. ఈ రాష్ట్రం చుట్టుకొలత 714 మైళ్ళు. దీని రాజధానీనగర వైశాల్యం 3 మైళ్ళు. ఇది ఉష్ణదేశం. వరుసగా వందల కొలది మైళ్ళవరకు కొండలు, కీకారణ్యాలు వ్యాపించి వున్నాయి. సముద్రతీరంలో మాత్రం సారవంత మైన భూములున్నాయి.

"నూరు బౌద్ధ ఆరామాలు, నూరు హిందూ దేవాలయాలు ఉన్నవి. బౌద్ధ మఠాలలో పదివేలమంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రజలు ఉభయమతాలను సమానంగానే ఆదరిస్తున్నారు. మదించిన ఏనుగు లకు యీ దేశం ప్రసిద్ధి చెందింది. ప్రజలు నాగరికత గలవారు."

## జైన మత వ్యాప్తి

ఆంధ్రదేశంలో అతి ప్రాచీనకాలం నుండి బౌద్ధ మతంతో బాటు జైన మతంకూడా వ్యాపించింది. బౌద్ధ మతానికి అమరావతి, నాగార్జున కొండలు కేంద్రాలు. ఇక్కడనుండి ప్రారంభమై బౌద్ధశిల్పం, సంస్కృతి, మతం నలుమూలలా వ్యాపించాయి. జైనమతం కళింగదేశము నుండి ప్రారంభమై దక్షిణ దిశగా ఆంధ్రదేశంలో వ్యాపించింది. విష్ణుకుందిన వంశ పతనానంతరం పరిపాలించిన చాళుక్యుల కాలంలో పెక్కుమంది రాజులు జైనమతాన్ని ఆదరించారు.

ప్రాచీనుల సాంఘిక జీవనంలో ఆర్థిక కారణాలతో పాటు మతం ఒక ప్రధాన శక్తిగా వుండేది. ప్రజల తాత్విక భావాలు, నమ్మకాలు, ఆచారాలు వారి మతంపైన ఎక్కువగా ఆధారపడి ఉండేవి. ప్రాచీన కళింగ ప్రజల ఆచార వ్యవహారాలను తెలుసుకునేందుకు ముఖలింగ దేవాలయ శిల్పాలు ఎంతో ఉపయోగపడతాయి.

## ము ఖ లి ం గ శి ల్పా లు

పర్లాకిమిడి సమీపంలో ప్రస్తుతం ముఖలింగం అని వ్యవహరించబడుతున్న నగరం అనేక సంవత్సరాలు కళింగ రాజులకు రాజధానిగా ఉండేది. 7 వ శతాబ్దం తర్వాత గాంగరాజులు ముఖలింగాన్ని వదలి, కటకం తమ రాజధానిగా చేసుకున్నారు.

నాటి సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే అనేక చిత్రాలు ముఖలింగ దేవాలయాలపై చెక్కబడియున్నాయి. ఒక చిత్రంలో మల్లయుద్ధపు ప్రదర్శనం వుంది. చుట్టూ జనసమూహం, రాజు అంతఃపుర పరివారంతో సహా ఒక వేదిక మీద వుంటాడు. మరొకచోట ఏనుగుల యుద్ధచిత్రం ఉంది. ఏనుగుల వేటకు సంబంధించిన అనేక శిల్పాలున్నాయి. కళింగదేశం ఏనుగులకు ప్రసిద్ధి చెందిన విషయం పై శిల్పాల ద్వారా గ్రహించగలం.

ముఖలింగం ప్రస్తుతం ఒక శివాలయం. కాని బౌద్ధ జైన విగ్రహాలనేకం అక్కడ దొరికాయి. శక్తి పూజ, నరబలి ఆనాడు ఉండేవని సూచించే శిల్పాలుకూడా ఉన్నాయి. ఒక శిల్పంలో స్త్రీ ఒక త్రాసును పట్టుకున్నది. ఒక వైపున కాళ్ళు, తల వ్రేలాడుతున్న మనుష్యుడు, రెండవ వైపున మొండెంగల మానవ శరీరం ఉన్నాయి. ఈ రెంటిని ఆ స్త్రీ త్రాసులో తూస్తున్నది. మరొక శిల్పంలో, ఆరు చేతులు గల శక్తి ఒక పురుషుని ఒక చేతితో పట్టుకొని మరొక చేతితో నరుకుతున్నది. మరొక శిల్పంలో ఒక స్త్రీని చెట్టుకు తలక్రిందుగా వ్రేలాడగట్టి చుట్టూ భజన చేస్తున్నారు. మరొక శిల్పంలో ఒక కత్తిని ధరించిన పురుషుడు' నాలుగు పశువులు ఉన్నాయి.

జంతుబలిని, నరబలిని యీ శిల్పాలు సూచిస్తున్నాయి.

## విదేశయానం

ఆంధ్ర సంస్కృతికి కళింగ ప్రజలు చేసిన మహోపకారం మరొకటి ఉంది.

కళింగదేశం కొండప్రాంతం. సారవంతమైన దేశం కాదు. మొదటి నుంచి విదేశాలకు వలస వెళ్ళటం కళింగ దేశంలో విస్తారంగా ఉంది కళింగ పట్టణం నాటి ప్రధాన రేవు పట్టణాలలో ఒకటి. కళింగ పట్టణానికి మూడుమైళ్ళు ఎగువగా, వంశధార పక్కన ఉన్న శాలిహుండాం బౌద్ధ స్తూపం. ప్రజలు, బౌద్ధభిక్షువులు విదేశ యాత్రలకు వెళ్ళేవారు. జావాలో నేటికీ "క్లింగులు" అను ఒక తెగ ప్రజలున్నారు. వీరు కళింగుల నుండి ఏర్పడిన ఒక ఉపశాఖ. జావా, సుమిత్రా, బోర్నియో, సింహళ దేశాలకు కళింగులు విస్తారంగా వలస వెళ్ళారు. వీరి ద్వారానే హిందూ, బౌద్ధ సంస్కృతి ఆ దీవులలో వ్యాపించింది. ఇండోనేషియా రాజధాని జోగ్జ కార్తాలో చతుర్ముఖ బ్రహ్మకు దేవాలయం ఉంది. భీముడు, అర్జునుడు, సుభద్ర, భారతీయులకు పౌరాణిక వ్యక్తులు. ఇండొనీషియాలో వీరందరికీ దేవాలయాలు కట్టారు. దశావతారాలకు దేవాలయాలు, గరుత్మంతుని దేవాలయం, కూర్మ (తాబేలు) దేవాలయం- ఇవన్నీ జావా, సుమిత్రా దీవులలో నిలిచి ఉన్నవి.

9 వ అధ్యాయం

# చాళుక్య యుగం

క్రీ. శ. 620 సంవత్సరం తర్వాత ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక నూతన యుగం ఆరంభమైంది. మహారాష్ట్ర దేశంలో బాదామి నగరాన్ని రాజధానిగా చేసుకొని దక్షిణ హిందూ దేశాన్నంతా పరిపాలించిన సత్యాశ్రయ పులకేశి ఆంధ్రదేశంపై దండెత్తాడు. అప్పటికే విష్ణుకుండిన రాజుల ప్రభావం అంతరించింది. క్రీ. శ. 611 లో కృష్ణానదీ తీరంలో జరిగిన ఘోర యుద్ధంలో, ఆంధ్రదేశంలో మిగిలిన రాజులను ఓడించి, సేనానాయకుడైన పృథ్వీ యువరాజును రాజప్రతినిధిగా పులకేశి నియమించాడు. ఆంధ్ర రాజులు అంతమాత్రాన మహారాష్ట్ర రాజైన పులకేశి పరిపాలనకు తల ఒగ్గలేదు. తిరిగి 624 లో, సత్యాశ్రయ పులకేశి రాజు సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనుడు ఆంధ్రదేశంపై దండెత్తి, కొల్లేరు వద్ద శత్రువులను ఓడించి చాళుక్య రాజ్యానికి శంకుస్థాపన చేశాడు. వేంగీ నగర రాజధానిగా విష్ణువర్ధనుడు రాజ్యాన్ని స్థాపించి కాలక్రమేణ తన సోదరుడైన పులకేశితో సంబంధాలు తెంచుకొని, వేంగి చాళుక్య లేక తూర్పు చాళుక్య వంశానికి మూలపురుషుడైనాడు. ఈ వేంగీ చాళుక్యులు 500 సంవత్సరాలకు పైగా ఆంధ్ర దేశాన్ని పరిపాలించారు.

చాళుక్యులకు పూర్వం ఆంధ్ర చరిత్రను తెలుసుకోటానికి శాసనాలు, శిల్పాలు, నాణెములు, విదేశ చరిత్రకారుల రచనలు తప్ప వేరే ఆధారాలు లేవు. కనుకనే క్రీ. పూ. 200 నుండి క్రీ. శ. 600 వరకు 800 సంవత్సరాల ఆంధ్ర ప్రజల చరిత్రను సమగ్రంగా తెలుసుకోవటం కష్టంగావుంది. కాని చాళుక్యయుగ ప్రారంభంతో యీ బాధ కొంత తగ్గుతుంది.

తెలుగుభాష శాసనాలలో ప్రవేశించింది. తెలుగులో నేటివరకు తెలిసిన మొదటి గ్రంథం ఆంధ్ర మహాభారతము. చాళుక్య రాజులలో ఒకడైన రాజరాజ నరేంద్రుని కాలంలో రచించబడ్డది (1022-1061). నాటినుండి ఆంధ్రప్రజల చరిత్రను గ్రహించటానికి తెలుగు సాహిత్యం ఒకముఖ్య సాధనం.

బౌద్ధ, హిందూ మత ఘర్షణలతో, పల్లవ, విష్ణుకుండిన రాజుల నిరంతర యుద్ధాలతో కల్లోలమైన ఆంధ్రదేశం 625 నుండి 753 వరకు ఒక శతాబ్దం పైగా, ప్రథమ చాళుక్య రాజులక్రింద సుస్థిర పరిపాలనను అనుభవించింది. వర్తక వ్యాపారాలు, వ్యవసాయం వృద్ధిచెందాయి. ఆంధ్ర భాషాభివృద్ధి కూడా జరిగింది.

## వివిధ భారతీయ జాతుల ఆవిర్భావం

భారతదేశం మొత్తంమీద యీ యుగంలో మరొక పరిణామం కూడా ప్రారంభమైంది. వివిధ ప్రాంతాలలోని ప్రజలు స్థిరజీవనానికి అలవాటు పడ్డారు. పెద్దఎత్తున ఒక ప్రాంతం నుండి మరొకప్రాంతానికి వలసను వెళ్ళటం ఆగిపోయింది.

ఆంధ్రదేశంలో గత 600 సంవత్సరాల కాలంలో వ్యవసాయం వృద్ధి పొందింది. ప్రజలు అరణ్యాలను ఛేదించి సాగులోకి తెచ్చారు. నదులకు చిన్నచిన్న ఆనకట్టలు కట్టారు. వర్తక వ్యాపారాలు పెంపొందినవి. ఈ ఆర్థికాభివృద్ధి ఫలితంగా, ఆంధ్రులు పెద్దపెట్టున ఇతర ప్రాంతాలకు వలసవెళ్ళే అవసరం లేకపోయింది. ఒకే ప్రాంతంలో నివసిస్తూ వర్తక వ్యాపారాది ఆర్థిక సంబంధాలతో పెనవేసుకు పోయిన ఆంధ్రులు ఒక ప్రత్యేక జాతిగా రూపొందసాగారు. ఈ యుగంలోనే కన్నడ, ఆంధ్ర లిపులు విడిపోయి వేర్వేరు లిపులుగా రూపొందినవి. నేటి మహారాష్ట్రి భాషకు ప్రాథమిక చిహ్నాలు కూడా యీ యుగంలోనే తలయెత్తినవి. హర్షవర్ధనుడు (606-636) కనోజ్ రాజధానిగా ఉత్తర హిందూస్థానమంతా జయించి తన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. బౌద్ధ, హిందూ, జైన మత

ష్ణుల నందరినీ సమానంగా ఆదరించారు. అంతవరకు ప్రజల ప్రత్యేకతను వారి మతాలు తెలియజేస్తూ వుండేవి. కాని నాటితో మత విద్వేషాలు, విభేదాలు కొంత తగ్గినవి. బౌద్ధమతం ప్రాచీన స్వరూపాన్ని కోల్పోయి కేవలమొక వైజ్ఞానిక శాఖగా మిగిలిపోయింది. బౌద్ధ విశ్వ విద్యాలయంగా పేరు పొందిన నలందా (బీహారు) లో హిందూ, బౌద్ధ, జైన తత్వశాస్త్రా లన్నిటిని బోధిస్తుండేవారనీ, యీ మతాలన్నీ భారతీయ సంస్కృతియొక్క వివిధ రూపాంతరాలుగా అధ్యాపకులు భావించేవారనీ, నలందా విశ్వవిద్యాలయాన్ని చూచిన హ్యూన్‌సాంగ్ వర్ణించాడు.

దక్షిణ హిందూ దేశంలో యీ మార్పు స్పష్టమైంది. క్రీ.శ. 600 నాటికి బౌద్ధమతం ఆంధ్రలో పూర్తిగా అడుగంటింది. హిందూ, జైన మతాలు మాత్రమే చాళుక్య రాజులకాలంలో విలచినవి. నాటివరకు వ్యక్తుల మధ్య సన్నిహితత్వము మతప్రాతిపదికపైనుండేది. తెలుగుదేశపు బౌద్ధుడు, మహారాష్ట్ర బౌద్ధుడు తాము అత్యంత సన్నిహితులమని భావిస్తుండేవారు. తమప్రక్కనే ఒకే గ్రామంలో నివసించే మరొక మతస్థుణ్ణి పరాయివారుగా యెంచుకునేవారు. బౌద్ధ భిక్షువుల నిరంతర సంచార కార్యక్రమాలు యీ సన్నిహితత్వాన్ని ప్రోత్సాహించాయి.

చాళుక్య యుగంలో ఇది నశించింది. బౌద్ధుడైనా, జైనుడైనా, హిందువైనా ఒకే భాష మాట్లాడుతూ, ఒకే ప్రాంతంలో తరతరాలుగా నివసిస్తున్న వ్యక్తులే తమకు సన్నిహితులని ప్రజలు భావించసాగారు. మతభావం తగ్గి జాతిభావం ప్రారంభం కావటాని కిది నాంది. సుస్థిర రాజకీయ, ఆర్థిక జీవితం పునాదిపైననే ఇది సాధ్యమైంది. వ్యక్తుల మధ్య అనుబంధాన్ని భాష వృద్ధి చేయసాగింది.

ఈ పరిణామం సామాన్య ప్రజలకు మాత్రమే పరిమితంకాక రాజులవరకూ వ్యాపించింది. చాళుక్యరాజులు సగర్వంగా ఇలా చెప్పుకున్నారు :

*అస్తి ప్రశస్త జాతీనాం రత్నమానివ వారిధి*

*జన్మభూమిః చాళుక్యానాం దేశో వేంగీతి విస్తృతః॥*

రత్నగర్భయైన సముద్రమువలె అత్యంత ప్రసిద్ధిచెందిన వేంగి దేశము చాళుక్యుల జన్మభూమి. పై శ్లోకము క్రీ.శ. 772-806 సంవత్సరాలమధ్య పరిపాలించిన నాల్గవ విష్ణువర్ధనుని శాసనంలో ఉంది.

## చాళుక్యుల మాతృభూమి

ఆంధ్రదేశ చరిత్రలో ఇంతటి మార్పులు తెచ్చిన యీ చాళుక్య రాజు లెవ్వరనే విషయంలో చరిత్రకారులలోనే వివిధ సిద్ధాంతాలున్నాయి. తాము సూర్యవంశ రాజులమని, చంద్రవంశ రాజులమని, పాండవుల సంతతివారమని, అతిశయోక్తులు సహజంగానే ఈ రాజులు చెప్పుకున్నారు. కాని వాస్తవిక దృష్టితో చూస్తే వీరు దక్షిణాదివారేనని ఆంధ్రదేశమే వీరి జన్మస్థలమని కూడా బోధపడగలదు.

నాగార్జునకొండ శిల్పాలలో మహాతలవర ఖండచాలికి రేమణక అను ఒక సేనానాయకుడు హిరణ్యక రాష్ట్రంలో పరిపాలించినట్లు ఉంది. హిరణ్యకరాష్ట్రం అనగా కడపజిల్లా కేంద్రంగాగల రాయలసీమ. దీనినిబట్టి క్రీ.శ. 200-250 ప్రాంతంలో చాలికి వంశస్థులు హిరణ్యక రాష్ట్రంలో ఉన్నారని భావించవచ్చు.

క్రీ. శ. 458-480 మధ్యకాలంలో త్రిలోచన పల్లవునితో విజయాదిత్య చాళుక్యుడు పోరాడి ఓడిపోయినట్లు చరిత్ర తెలుపుతున్నది. గర్భవతియైన విజయాదిత్యుని భార్య కడపజిల్లా ముదివేము అగ్రహారంలో విష్ణుశర్మ అను బ్రాహ్మణుని ఇంట్లో తలదాచుకొని ప్రాణాలను కాపాడుకున్నది. ఆమెకు పుట్టిన కుమారుడు విష్ణువర్ధనుడు. చాళుక్య వంశములో ఈ పేరు అనేకమంది రాజులు ధరించారు. చాళుక్యనామం, చళుకి, చల్కి, సలుకి అను ద్రావిడ నామాల రూపాంతరం మాత్రమే. కీ. శే. కొమర్రాజు లక్ష్మణరావుగారు ఈ విషయమై పరిశోధనలు చేసి నూతన విషయాలను బైటపెట్టారు. "దివాకరం" అనబడు తమిళ భాషాకోశంలో-చాళుక్య వెండార్ అను పదానికి వెల్లాలకుల ముఖ్యులు అను అర్థం ఉన్నది. వెల్లాల తెగవారు కర్షకులు.

పై విషయా లన్నిటినీ సమన్వయం చేస్తే ఒక విషయం బోధపడు తుంది. చాళుక్యుల ప్రాచీన నివాసస్థానము రాయలసీమ ప్రాంతం. వీరు ప్రారంభంలో కర్షకులు. క్షాత్రధర్మ మవలంబించి, క్షత్రియులమని చెప్పు కొని పల్లవ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడారు. తాత్కాలికంగా ఓడి పోయారు. తర్వాత ఉత్తరదిశగా వెళ్ళి, మహారాష్ట్ర దేశంలో బాదామి వద్ద, సత్యాశ్రయ ప్రథమ పులకేసి నాయకత్వాన రాజ్యం స్థాపించారు. తిరిగి ఆంధ్రదేశాన్ని జయించి, ఒక శాఖవారు ఆంధ్రదేశంలో స్థిరపడ్డారు. వీరే వేంగి చాళుక్యులు.

చోళులు అనుపేరు గలవారు కావేరీతీరంలోను, రాయలసీమలోను, తెలంగాణా ప్రాంతంలోను క్రీ. శ. నాల్గవ శతాబ్దంలో నివసించారనీ, వీరంతా కరికాలచోళుని వంశకర్తగా చెప్పుకున్నారనీ మనము ఇంతకు ముందే తెలుసుకున్నాము. అదే విధంగా వేంగి చాళుక్యులు, బాదామి చాళుక్యులు, వేములవాడ చాళుక్యులు, ముదిగొండ చాళుక్యులు వీరంతా సత్యాశ్రయ పులకేశిని తమ వంశకర్తగా భావించి, వివిధ ప్రాంతాలను పరిపాలించారు. బాదామి చాళుక్యులు మహారాష్ట్ర ప్రాంతాన్ని, వేములవాడ చాళుక్యులు తెలంగాణాలోని కరీంనగర ప్రాంతాన్ని, ముదిగొండ చాళుక్యులు తెలంగాణాలో మధిర, మానుకోట, వరంగల్ ప్రాంతాన్ని, వేంగి చాళుక్యులు కృష్ణా - గోదావరీ మధ్యాంధ్ర దేశాన్ని పరిపాలించారు.

## మూడు ప్రధాన ఘట్టాలు

ఆంధ్రదేశంలో చాళుక్య పరిపాలనను మూడు దశలుగా విభజించ వచ్చు.

1. క్రీ. శ. 625-755 వరకు మొదటి దశ. ఈ దశలో 8 మంది రాజులు పరిపాలించారు. వీరు తమ పాలనను కోస్తా ఆంధ్ర జిల్లాలలో, చీపురుపల్లి నుండి నెల్లూరువరకు విస్తరింప జేసుకున్నారు. నూరు సంవత్స రాలకుపైగా సుస్థిర పరిపాలన చేశారు. పశ్చిమ దిశగాఉన్న తమ జ్ఞాతు లైన బాదామి చాళుక్యులతోను, దక్షిణాన కంచిని పరిపాలిస్తున్న పల్లవుల

తోను స్నేహ సంబంధాలు ఏర్పరచుకున్నారు. పల్లవులు-బాదామి చాళుక్యులు నిరంతర సంగ్రామాలలో నిమగ్నులై ఉన్నప్పటికీ వేంగి చాళుక్యులు ఈ తగాదాలలో జోక్యం కలిగించుకోక తటస్థంగా ఉన్నారు.

2. క్రీ. శ. 753-973 వరకు (200 సంవత్సరాలకు పైగా) రెండవ దశ. ఈ దశలో 16 గురు రాజులు పరిపాలించారు. బాదామి చాళుక్యులు రాజ్యచ్యుతులై వారి స్థానంలో రాష్ట్రకూటులు మహారాష్ట్ర రాజ్యాన్ని పరిపాలించసాగారు. వీరు వేంగి రాజ్యాన్ని కబళించడానికి అనేక యుద్ధాలు చేశారు. కొంతకాలం పరిపాలించారు కూడా. కాని తిరిగి వేంగి చాళుక్యులు విజృంభించి రాష్ట్రకూటులను ఆంధ్రదేశం నుండి తరిమివేశారు. ఈ 200 సంవత్సరాలలో రాష్ట్రకూటుల దండయాత్ర నుంచి ఆంధ్రదేశాన్ని రక్షించిన పోరాటాలలో వేంగి చాళుక్యులు రాటు దేలి, తాము ఆంధ్రులమేనన్న ఆత్మజ్ఞానాన్ని పొంది ప్రజలతో సన్నిహితత్వం పెంపొందించుకున్నారు. ప్రజా సహకారంతో అనేక ఘోర యుద్ధాలలో రాష్ట్రకూటులను ఓడించి ఆంధ్రదేశ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టారు.

3. క్రీ. శ. 973-1076 వరకు మూడవదశ. ఈ దశలో 8 మంది రాజులు పరిపాలించారు. రాష్ట్రకూటులు పదవీచ్యుతులై తిరిగి కళ్యాణి చాళుక్యులు మహారాష్ట్రాన్ని పరిపాలించసాగారు. తమ వంశస్థులన్న అభిమానం లేకుండా వీరు వేంగి దేశంపై దండెత్తారు. ఈ యుద్ధాలలో వేంగి చాళుక్యులు ఒంటరిగా నిలవటం కష్టమని గుర్తించి కంచిని పరిపాలించిన చోళరాజులతో సంబంధాలేర్పరచుకొని-చోళ చాళుక్యవంశానికి పునాదులు వేశారు. ఈ ఆంధ్ర. తమిళ కూటమి-మహారాష్ట్ర; కర్ణాట కూటమిని ఎదిరించి అనేక యుద్ధాలు చేసింది. ఇవి ఎక్కువ భాగం కృష్ణానదీ తీరంలోను, కొన్ని రాయలసీమలోను జరిగినవి ఈ పోరాటాలలో చిట్టచివరకు ఆంధ్ర తమిళ కూటమి విజయం పొందింది.

## సుస్థిర పరిపాలన దశ

వేంగి చాళుక్య వంశకర్త విష్ణువర్ధనుడు. ఇతనికి కొంచెం గూని ఉండేది. కనుక కుబ్జ విష్ణువర్ధనుడు అని చరిత్ర ప్రసిద్ధి వహించాడు.

ఈతని శాసనములు చీపురుపల్లి, తిమ్మాపురం, చేబ్రోలు, నెల్లూరులలో లభించినవి. ముఖలింగం వరకు దండయాత్ర జరిపి అచ్చటి శిల్పాలను బాగు చేయించాడు. రణకోవిదుడై స్థల, జల, దుర్గములను స్వాధీన పర్చుకొన్న రాజ్యస్థాపకు డగుటవలన విషమసిద్ధి అను బిరుదు వహించాడు. ఇతని రాజధాని మొదట పిఠాపురం, తర్వాత వేంగి నగరం.

641 నుండి 673 వరకు పరిపాలించిన జయసింహ వల్లభుడు ఈతని కుమారుడు. ఇతనిపేర నిర్మించబడ్డ సర్వసిద్ధి గ్రామం ఇప్పటికీ విశాఖజిల్లా ఎలమంచిలి తాలూకాలో ఉంది. ఇతడు నౌకాయుద్ధంలో గొప్ప ప్రవీణుడు. సమకాలికుడైన మహాకవి దండి దశకుమార చరిత్రలో జయసింహుని కళింగ దండయాత్రను వర్ణించాడు కళింగ రాజును ఈతడు నౌకాయుద్ధంలో ఓడించి అతని కూతురైన కనకరేఖను వివాహమాడినటు ఆ కవి వర్ణించాడు. ఇతని కాలములోనే చైనా యాత్రికుడు హ్యూన్‌సాంగ్ ఆంధ్రదేశంలో సంచరించి, రాజధాని నగరమైన వేంగి నగరం చూశాడు. బౌద్ధమతం పూర్తిగా నశించిందని, హిందూ దేవాలయాలు ఎక్కడ జూచినా ఏర్పడ్డవని ఆ చైనా యాత్రికుడు వర్ణించాడు.

జయసింహ వల్లభుని పరిపాలనలో మరొక విశేషముంది. నరసరావుపేట తాలూకా, విప్పర్రు గ్రామంలో యీ రాజు ఒక తెలుగు శాసనాన్ని చెక్కించాడు. దీనికాలం క్రీ. శ. 649. ఇది సర్కారు జిల్లాలలో దొరికిన మొదటి తెలుగు శాసనం.

జయసింహుడు అనేక గ్రామాలను బ్రాహ్మణులకు దానమిచ్చాడు. గ్రామాలలో వేద-సంస్కృత విద్యల పోషణకై ఘటికాస్థానాలు నిర్మించబడ్డవి. పూర్వపు బౌద్ధారామాలలోవలె వేలకొలది విద్యార్థులు ఒకేచోట విద్య నభ్యసించే పద్ధతి చాళుక్యులయుగంలో నశించింది. పదుల సంఖ్యలో విద్యార్థులు పండితులవద్ద ఘటికాస్థానాలలో విద్య నభ్యసించేవారు.

జయసింహవల్లభుని తర్వాత ఆరుగురు రాజులు పరిపాలించారు. వీరి శాసనాలు ఎలమంచిలి, తిమ్మాపురం, ముంజేరు, భోగాపురం, చందలూరు, యీపూరు గ్రామాలలో లభించినవి. పై వానిలో మొదటి నాలుగు విశాఖ జిల్లాలోనివి. చివరి రెండు గుంటూరు జిల్లా లోనివి. చాళుక్యులు వరాహ లాంఛనములు. 8 వ రాజైన మూడవ విష్ణువర్ధనుడు బెజవాడలోని జైన వసతికి ఒక గ్రామం దానం చేశాడు. చాళుక్యరాజులలో పలువురు హిందూ మతాన్ని అభిమానించినా, వారి రాణులు జైనులను ఆదరించినట్లు చరిత్ర తెలియజేస్తుంది. మూడవ విష్ణువర్ధనునితో చాళుక్య పరిపాలనలో మొదటి దశ అంతరించింది. ఇదేకాలంలో కంచిలో పల్లవరాజుల పరిపాలన ముగిసి చోళరాజుల పరిపాలన ప్రారంభమైంది.

## ప్ర తి ఘ ట నా ద శ

ఈ రెండవదశలో 16 గురు రాజులు పరిపాలించారు. రాష్ట్రకూట రాజులతో యుద్ధాలు చేసి ఆంధ్రజాతి స్వాతంత్ర్యాన్ని కాపాడినవారు. తెలుగుభాషకు అత్యంత ప్రోత్సాహ మిచ్చినవారు వీరిలో అనేకులున్నారు.

వీరిలో 808–847 వరకు పరిపాలించిన నరేంద్ర మృగరాజు ఒకడు. ఇతని కాలంలో చాళుక్య సింహాసనం కొరకు అన్నదమ్ముల బిడ్డలమధ్య అంతఃకలహాలు ప్రారంభమైనవి. రాష్ట్రకూట రాజులు ఇందులో జోక్యం కలిగించుకొని, భీమసలుక్కి అను నతనిని వేంగిరాజ్యంపై అభిషిక్తుని చేశారు. ఇతడు 12 ఏండ్లు పరిపాలించాడు.

నరేంద్ర మృగరాజు అను గౌరవ బిరుదు వహించిన రెండవ విజయాదిత్యుడు, పాండవుల వలె 12 సంవత్సరాలు అజ్ఞాతవాసం చేసి, సైన్యాలను కూడగట్టుకొని రాష్ట్రకూటులను, భీమసలుక్కిని పారద్రోలి వేంగీ సింహాసనం ఆక్రమించాడు. ఈ భీమసలుక్కియే నేటి ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని నిర్మించాడు. నరేంద్ర మృగరాజు 108 యుద్ధాలు చేసి శత్రువులను ఓడించాడట. ఈ పాప పరిహారార్థము 108 శైవ దేవాలయాలను నిర్మించాడు

ఇంతకంటె కూడ ప్రసిద్ధి చెందినవారు గుణగవిజయాదిత్యుడు. చాళుక్యవంశంలో 13 వ ...ైన ఇతరు 849-892 సంవత్సరాల మధ్య కాలంలో పరిపాలించారు. ఈతడు తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకోవటం మాత్రమేగాక విస్తరింపజేశారు. దక్షిణానికి దండెత్తి వెళ్ళి గాంగ పల్లవులను, నోలంబ, వైదుంబ, బాణులని ఓడించి వచ్చారు. కోలారు ప్రాంతాలకు విస్తరించారు. నెల్లూరు జిల్లాలో బోయలు తిరుగుబాటు చేయగా ఇతని సేనాని పండరంగడు ఆ తిరుగుబాటును అణచి వేశారు. రాష్ట్రకూట రాజధాని మాన్యఖేటం(హైదరాబాదులోని మల్ఖేడ్)ధ్వంసం చేసి తగులబెట్టారు. ఒంగోలు తాలూకా ధర్మవరంలో తెలుగు సీస పద్యాలతో ఒక శాసనం ఇతని కాలంలో చెక్కించబడ్డది.

సీ॥ లోహాసనం బెక్కి రాజ్యంబునొత్తిచన
 వల్లభు కొల్చిన సెల్ల తెలుగ
కన్నరాభూపతి సన్నాటిలో దూచె
 నంకిలాఖ్యను రేనిదింక ముడిచె
దంతిపై వచ్చిన చెంద్రైన చోళునిం
 జేకాని కాచె భూలోక మెఱుంగ
గీ॥ కిరణపురము, దహాలనిరతంబు విడె నాడు
 నచలపురము సొచ్చె నచలితుండు
 వల్లభుండు గుణకెనల్లుండు వచ్చి తాం
 బంత రంగమాడు పంతిరంగ.

ఈ ప్రాచీన సీసపద్యంలో అనేక పదాలు పరిశీలించుట అవసరం. గుణకె నల్లుండు-గుణకేనల్లాన్ అను తమిళ సమాసరూపం=మంచి గుణములు కలవాడు అని అర్థము. ఈ పద్యములో వర్ణించబడ్డ కిరణపురము, అచలపురము మధ్యరాష్ట్రములోని కిరన్‌పూర్, ఇలిచపూర్ నగరాలు. బుందేలుఖండ్ ప్రాంతాన్ని దహాలనిరతం అనేవారు. గుణగ విజయాదిత్యుడు చాళుక్యరాజులందరిలోకి శ్రేష్ఠుడు. రాజ్యాన్ని దూర ప్రాంతాలకు విస్తరింపచేశాడు. తెలుగు భాషకు ఎంతో ప్రోత్సాహమిచ్చారు.

గణితశాస్త్రంలో ఇతడు గొప్ప పండితుడు. కనుకనే గుణగ విజయాదిత్యుడని, గణక విజయాదిత్యుడని కూడ ఇతడు వ్యవహరించబడు తున్నాడు.

గణక విజయాదిత్యుని అనంతరం పరిపాలించిన మొదటి చాళుక్య భీముడు శత్రురాజుల నోడించి విస్తృత సామ్రాజ్యాన్ని సంరక్షించుకోవ టంతోపాటు, సామర్లకోటవద్ద చాళుక్య భీమేశ్వరాలయాన్ని నిర్మించాడు. చాళుక్యుల శిల్పవైభవానికి ఈ ఆలయం చిహ్నం.

క్రీ. శ. 918-925 సంవత్సరాల మధ్య పరిపాలించిన మొదటి అమ్మరాజు విష్ణువర్ధనుని కాలంలో రాజమహేంద్రవరం నిర్మించబడి చాళు క్యులకు రాజధాని అయింది. అంతవరకు వేంగీ నగరం వారి రాజధానిగా ఉండేది. నది అవతల రాజధానిని నిర్మించుటద్వారా శత్రురాజుల నుండి రక్షణ ఏర్పడగలదన్న ఉద్దేశంతో అమ్మరాజు విష్ణువర్ధనుడు రాజ మహేంద్రవరాన్ని నిర్మించాడు.

ఇతని అనంతరం సింహాసనం కొరకు తగవు లారంభమై ఒక ఏడా దిలో నలుగురు రాజులు పదభ్రష్టులైనారు. అనంతరం రెండవ యుద్ధ మల్లుడు 928-934 సంవత్సరాల మధ్య పరిపాలించాడు. బెజవాడ మల్లి కేశ్వరస్వామి దేవాలయంలో ఇతను చెక్కించిన శాసనం ద్వారా చరిత్ర పరిశోధకులకు విలువైన సమాచారం లభిస్తున్నది.

ఈ వంశంలో 23 వ వాడైన రెండవ అమ్మరాజ విష్ణువర్ధనుడు సమర్థుడైన రాజు.

ఈ రాజు శైవ, జైన మతస్థులకు సమానంగా దానధర్మాలు చేశాడు. బెజవాడలో ఉన్న సమస్త భువనాశ్రయ శైవ దేవాలయానికి, సర్వ లోకాశ్రయ జిన భవనానికి దానాలు చేశాడు. ఈ రాజుకు పట్టవర్ధని వంశస్థురాలైన చామెకాంబ అను ప్రియురాలు కలదు. చామెకాంబ సంగీత, నృత్య కళలలో ప్రసిద్ధి చెందినది. ఈమె జైన మతస్థురాలు. ఆమె ప్రోత్సా హంతోనే రెండవ అమ్మరాజు జైన దేవాలయాలకు దానాలు యిచ్చినట్లు తెలుస్తున్నది. ఇతని కాలం క్రీ. శ. 945-970.

ఇతని అనంతరం 27 సంవత్సరాలు చాళుక్య రాజ్యం అరాచక పరిస్థితులకు లోనైంది. రాష్ట్రకూటులు ఈ అవకాశం తీసుకొని బాదపుడను రాజును రాజమహేంద్రవరంలో సింహాసనస్థుని చేశారు.

బాదపునికి రాష్ట్రకూట రాజులేకాక, జటాచోడ భీముడను చోడరాజు కూడ సహాయం చేశారు. ఈ కాలంలో ఆంధ్రదేశంలో నిరంతర యుద్ధాలకు ఆలవాలమై ప్రజలు క్షోభించారు. జటాచోడ భీముడు ప్రజాకంటకుడని, పంటలను నాశనంచేసి స్త్రీలను, బాలురను హింసించాడని చరిత్ర తెలియజేస్తున్నది.

కంచి చోళరాజులకు పోటీగా వేరొక రాజ్యాన్ని స్థాపించిన సాహసికుడు జటాచోడ భీముడు.

దేశాన్నావరించిన యీ ఉపద్రవాన్ని తప్పించేందుకై, చాళుక్య వంశస్థుడైన శక్తివర్మ, కంచిని పాలించే చోళరాజుల సహాయంతో, రాష్ట్రకూటులను, జటాచోడ భీముని ఓడించి తిరిగి రాజమహేంద్రవర రాజ్యాన్ని వశం చేసుకున్నాడు.

ఇదే కాలంలో రాష్ట్రకూట రాజ్యాన్ని ఓడించి క్రీ. శ. 973 లో రెండవ తైలపుడను చాళుక్యరాజు కళ్యాణిలో ఒక కొత్త రాజవంశానికి ప్రారంభం చేశారు. కాని కల్యాణి చాళుక్యులు సైతం రాష్ట్రకూటులవలెనే వేంగి చాళుక్యులపై కయ్యానికి కాలు దువ్వసాగారు. ఈ ప్రమాదం నుండి కాపాడుకొనుటకు, శక్తివర్మ, కంచి చోళరాజులతో వివాహ సంబంధాలను సైతం ఏర్పరచుకొని దృఢమైన చాళుక్య-చోళ మైత్రికి పునాది వేశారు. ఇతనితో, చాళుక్య పరిపాలనలో నూతన దశ ప్రారంభమైంది.

## చాళుక్య - చోళ మైత్రి

శక్తివర్మ క్రీ. శ. 999-1011 మధ్య రాజ్యం చేశాడు. ఇతని తమ్ముడు విమలాదిత్యుడు కంచి పరిపాలకుడైన రాజరాజ దేవరివర్మ కూతురును వివాహమాడాడు. విమలాదిత్యుని కుమారుడు రాజరాజ నరేంద్రుడు సైతం చోళుల ఆడబడుచును పెండ్లాడాడు. ఇతని కుమారుడైన

కులోత్తుంగ చోళుడు. మేనమామ అయిన చోళరాజు కూతురిని వివాహమాడి, తండ్రి రాజ్యాన్ని, మేనమామల రాజ్యాన్ని రెంటిని, కంచి నుండి పరిపాలించసాగాడు. ఈ విధంగా మూడు తరాల వివాహ బాంధవ్యాలు ఏర్పడ్డవి. ఇతనితో వేంగి చాళుక్యయుగం అంతమైంది.

విమలాదిత్యుని కాలంలో కూడ దేశంలో యుద్ధాలు సాగుతూనే వున్నవి. కృష్ణా-గోదావరుల మధ్యనున్న పశ్చిమ గోదావరిజిల్లా, రణరంగంగా మారిపోయింది. పశ్చిమ చాళుక్యులు తెలంగాణా మీదుగా, కృష్ణను చేరి గోదావరివైపు పురోగమించేవారు. గోదావరిని చేరకముందే వారిని ఓడించవలెననే ఉద్దేశ్యంతో వేంగి చాళుక్యులు ఎదురు వెళ్ళేవారు. ఫలితంగా ఈ రెండు నదుల మధ్య భూమిలో యుద్ధాలు జరిగేవి.

విమలాదిత్యుని అనంతరం క్రీ.శ. 1022 లో రాజరాజ నరేంద్రుడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. కాని అనతి కాలంలోనే ఇతని తమ్ముడైన విజయాదిత్యుడు ఇతనిని త్రోసివేసి సింహాసనం ఆక్రమించాడు. అనేక సంవత్సరాలు అజ్ఞాతవాసం చేసి రాజరాజనరేంద్రుడు చోళరాజుల సహాయంతో తిరిగి అధికారాన్ని చేపట్టాడు. చివరవరకు తమ్ముడితో పోరాడుతూనే రాజరాజు క్రీ. శ. 1061 లో మరణించాడు.

అన్నదమ్ముల కలహాలతో విసిగి వేసారిన వాడవటం వల్ల అలాంటి ఘటనలు చాళుక్యుల గత చరిత్రలోనూ వున్నందువల్ల రాజరాజనరేంద్రుడు సోదర కలహ ప్రధానమైన మహాభారతంపై దృష్టి సారించి ఉండవచ్చు. కారణమేమైనా, రాజరాజు ప్రోత్సాహం, నన్నయభట్టు కృషి కలిసి తెలుగు నాటికి ఆంధ్ర మహాభారత కావ్యం అందించింది.

రాజరాజ నరేంద్రుని అనంతరం అతని కుమారుడు కులోత్తుంగ చోళుడు కంచిలో పరిపాలించసాగాడు. రాజమహేంద్రవరంలో ఒక సామంతుడు మాత్రం వుండేవాడు.

చాళుక్య-చోళ మైత్రి ఫలితంగా ఆంధ్ర-తమిళ దేశాల మధ్య సంబంధ బాంధవ్యాలు హెచ్చినవి. తమిళ కుటుంబాలు, బ్రాహ్మణ క్షత్రియులు-పలువురు ఆంధ్రదేశానికి తరలి వచ్చారు.

ఓడరేవుకు వసతులు కలిగిన విశాఖపట్టణాన్ని కులోత్తుంగచోళుడు విస్తరింపాడు.

*10 వ అధ్యాయం*

# ఆంధ్ర మహాభారతము

ఆంధ్రులు విశిష్ట లక్షణాలు గల జాతిగా చాళుక్య రాజుల పరిపాలనా కాలంలో రూపొందసాగారు. ఐక్య జాతీయ భావాన్ని పెంపొందింపజేయుటలో భాష ప్రధాన పాత్ర వహిస్తున్నది. క్రీ. శ. 600-700 సంవత్సరాల వరకు తెలుగు, కన్నడ భాషల లిపి ఒకే విధంగా ఉండేది. నాటితో ఈ సంబంధం తెగిపోయింది. తెలుగు అక్షరాలు గుండ్రటి స్వరూపాన్ని స్వీకరించాయి. దీనిని వేంగి చాళుక్య లిపి అనేవారు. కన్నడ, తెలుగు లిపులను పరిశీలిస్తే ఒక విషయం బోధపడగలదు. కన్నడ భాషలో ఇప్పటికీ గీతాలు జాస్తి. తెలుగులో అవి లేవు.

మరొక విశేషం కూడా వుంది. క్రీ శ 930 సంవత్సర ప్రాంతంలో పరిపాలించిన రెండవ యుద్ధమల్లుడు బెజవాడలో ఒక శాసనం చెక్కించాడు. నేటి తెలుగు భాషలో నశించిన "ఱ" అను అక్షరము అందులో వుంది. ద్రవిడకజగం అను మాటలో "ఴ" అను అక్షరాన్ని తమిళ ప్రజలు ఎలా ఉచ్చరిస్తారో, అలాటి ఉచ్చారణే యుద్ధమల్లుని శాసనంలోని అక్షరానికి కూడా వుండేది. ఈ అక్షరం యుద్ధమల్లునికి పూర్వం కూడా అనేక శాసనములలో వుంది. తరువాత ఈ అక్షరం పూర్తిగా నశించింది. ఈ ఉదాహరణ వల్ల రెండు విషయాలు స్పష్టమౌతున్నాయి.

1. తమిళ, తెలుగు భాషలు ఒకే కూటమి నుండి ఆవిర్భవించినవి.

2. కాలక్రమేణ తెలుగుభాష పరిణామం చెంది కొన్ని అక్షరాలను పూర్తిగా వదలివేసి సంస్కృత పద భూయిష్టంగా మారసాగింది. నన్నయ భట్టు రచించిన భారతంలో సగం తెలుగు, సగం సంస్కృతం నుండి పుట్టిన తత్సమ పదాలు ఉన్నవి.

తెలుగు కవిత్వానికి చాళుక్యరాజు లిచ్చిన ప్రోత్సాహాన్ని నన్నె చోడకవి కుమారసంభవ కావ్య ప్రారంభంలో ఇలా ప్రస్తావించారు.

*కం. మును మార్గ కవిత లోకం*
*బున వెలయగ దేశి కవిత బుట్టించి తెనుం*
*గున నిలిపి రంధ్ర విషయమున*
*జన సత్యాశ్రయుని తొట్టి చాళుక్య నృపుల్.*

నన్నెచోడుడు నన్నయభట్టు తరువాతి వాడు. అంతకు పూర్వం రాజులందరూ, సంస్కృత కవిత్వాన్ని మాత్రమే ప్రోత్సహించగా, చాళుక్య రాజులు మాత్రం తెలుగు కవిత్వాన్ని (దేశికవిత) ప్రోత్సహించిన విషయం పై పద్యం వివరిస్తున్నది.

ఈ పరిణామం తెలుగుభాషలో మాత్రమేగాక కన్నడభాషలో కూడా అదే కాలంలో ప్రారంభమైంది. క్రీ. శ. 900 సంవత్సరం నాటికే కన్నడ భాషలో జైనమతస్థుడైన పంప మహాభారతాన్ని సంగ్రహరూపంలో వ్రాశాడు. సంస్కృత ఛందస్సులలో లేని అనేక రూపాలను స్వతంత్రించి అందుల్లో ప్రవేశపెట్టారు.

ఆంధ్ర మహాభారత రచనకు యిది కూడా కొంత ప్రోత్సాహ మిచ్చింది.

సీస, కంద, గీత, పద్యాలకు మాతృకలు కన్నడంలో ఉన్నాయి. వేములవాడ చాళుక్యులు కన్నడాన్ని అభిమానించారు. అక్కడ కన్నడ శాసనాలు లభించాయి. కాని అది తెలుగు దేశం. అక్కడి నుండి సీస, గీత, కంద పద్యాలు తెలుగుతనం సంతరించుకుని, కృష్ణా, గోదావరీ తీరం చేరుకున్నాయి.

మహాభారత యుద్ధంలో అర్జునునికి కృష్ణుడు సహాయపడ్డట్లు, భారత గ్రంథ రచనలో తనకు నారాయణభట్టు సహాయపడ్డారని నన్నయభట్టే అన్నాడు. ఆ మాట పూర్తి అంతరార్థం ఇది.

పాత సాంప్రదాయాన్ని కొంత వెనుకకు నెట్టి తెలుగులో కావ్య రచన చేయడానికి నన్నయభట్టు సాహసించటానికి గల కారణాలను తెలుసుకోవాలంటే నాటి సామాజిక జీవితాన్ని కొంత పరిశీలించాలి.

## సా మా జి క జీ వ నం

ప్రారంభంనుండి, కన్నడ-తెలుగు దేశాల మధ్య, తమిళ-తెలుగు దేశాల మధ్య సన్నిహిత సంబంధం ఉంది. కన్నడ ప్రజలనేకులు వచ్చి ఆంధ్ర దేశంలో స్థిరపడ్డారు. యుద్ధాలు ఘోరంగా జరుగుతున్న సమయంలో కూడా అనేక కుటుంబాలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలిపోవటం ఉండేది. చాళుక్యుల చివరి దశలో చోళ - చాళుక్య రాజుల మైత్రి ఫలితంగా అనేక తమిళ కుటుంబాలు ఆంధ్ర దేశంలో స్థిరపడ్డాయి. రాజోద్యోగులు, సేనాపతులు, బ్రాహ్మణులు ఈ విధంగా వలస వచ్చారు. పేరూరు ద్రావిడులు, పుదూరు ద్రావిడులు దక్షిణదేశము నుండి వచ్చి స్థిరపడ్డవారే. చాళుక్యుల కాలంలో రాజోద్యోగులుగా వచ్చి స్థిరపడ్డ అనేక రైతు కుటుంబాలు నేటికీ విశాఖ జిల్లాలో ఉన్నాయి. చోళదేశం నుండి వచ్చిన 536 బ్రాహ్మణ కుటుంబాలకు పిఠాపురంవద్ద "వీరచోడ చతుర్వేది మంగళం" అనే ఒక అగ్రహారాన్ని కులోత్తుంగ చోళుడు నిర్మించాడు. కన్నడ ప్రాంతమునుండి వచ్చిన కుటుంబాలు ఎక్కువగా తెలంగాణా, గుంటూరుజిల్లా కొండవీడు ప్రాంతాలలో స్థిరపడ్డాయి.

వివిధ ప్రాంతాలలో నుండి వచ్చి స్థిరపడిన యీ ప్రజలతోబాటు కొత్త కొత్త పద్ధతులు, ఆచారాలు, సాంప్రదాయాలు ప్రవేశించసాగినవి.

## కు ల మ త వి భే దా లు

నాటి మత పరిస్థితి చాలా గందరగోళంగా ఉండేది. బౌద్ధ మతం పూర్తిగా నశించింది. హిందూ, జైనమతాలు మాత్రమే వ్యవహారంలో ఉన్నాయి. హిందూమతంలో కూడా శైవ సాంప్రదాయం విశేషంగా వ్యాపించసాగింది. చాళుక్య రాజులందరూ జైనమతాన్నో, శైవ మతాన్నో

ఆదరించారు. అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, పిఠాపురం అను అయిదు ప్రాంతాలు పంచారామాలు అను పేరుతో శైవమత కేంద్రాలుగా ఉండేవి. వీనిలో ద్రాక్షారామం తప్ప మిగతావన్నీ ప్రారంభదశలో బౌద్ధమత కేంద్రాలు. చాళుక్యుల కాలంనాటికి ఇవి శైవ మత కేంద్రాలైనవి.

జైనమతం కూడా విశేషాదరణలో ఉండేది. బెజవాడ, రామతీర్థం (విశాఖ), హనుమకొండ (తెలంగాణా), దానవులపాడు (కడప), ధర్మవరం (ఒంగోలు) ప్రధానమయిన జైనకేంద్రాలు. బెజవాడ జైనమతానికి కేంద్రంగా ఉండేది. సర్వలోకాశ్రయ జినాలయము, కటకాభరణ జినాలయము మొదలైనవి ఇక్కడ నిర్మించబడ్డవి. చాళుక్య రాణులలో ఒకరైన బెజ్జమహాదేవి పేర బెజవాడ నిర్మించబడ్డది. సర్వలోకాశ్రయ జైనపీఠానికి, సమస్త భువనాశ్రయ శైవపీఠానికి నిరంతరం ఘర్షణలు సాగి, అప్పుడప్పుడు దారుణ రక్తపాతాలు జరుగుతూ వుండేవి.

ఆంధ్రదేశమంతటా ఇలాగే వుండేది. మత విభేదాల ఫలితంగా నిరంతర కలహాలు దేశమంతా వ్యాపించసాగినవి. ప్రజలమధ్య సన్నిహితత్వాన్ని పెంపుచేసే బదులు ఈ విభేదాలు ద్వేషాన్ని, విరోధాన్ని హెచ్చు చేశాయి. భాష ఐక్యశక్తిగా, మత విభేదాలు విచ్ఛిన్న శక్తిగా పరిణమించాయి. తత్వశాస్త్రరీత్యా వివిధ మతాలకు గల విభేదాలు అత్యల్పం. ఆరామాలకు, దేవాలయాలకు పెద్ద పెద్ద అగ్రహారాలుండేవి. ధన లోపం లేదు. ఉత్సవాలు, యాత్రలు, తిరునాళ్ళు విపరీతమైన ఆవేశాలతో జరుగుతూ వుండేవి. గుంటూరు జిల్లా చేబ్రోలులో మహాసేన (కుమారస్వామి) దేవాలయం ఉండేది. ఏటా అక్కడ నుండి బెజవాడకు యాత్ర సాగేది. యుద్ధమల్లుని బెజవాడ శాసనం ఇలా తెలియజేస్తున్నది :

*"జననుత చేబ్రోలు నుండి*
*బెజవాడ జాత్రకువచ్చి ఎత్తించె*
*గుడియు, మఠమును*
*కార్తికేయునకు"*

చేబ్రోలు నుండి బెజవాడకు యాత్రలో వచ్చిన ఒకరు. కుమార స్వామి దేవాలయాన్ని అచ్చట కట్టించారని పై పద్యం తెలియజేస్తున్నది.

కుల భేదాలు స్థిరపడ్డాయి. జైన మతం సైతం ఆరంభం నుండి కులాచారాలను అనుసరించసాగింది. బ్రాహ్మణులు కేవలము వేదశాస్త్ర పాండిత్యాలతోనే కాలం పుచ్చక, రాజోద్యోగాలు నిర్వహించసాగారు. సేనాపతులుగా పేరుపడ్డారు. క్షత్రియ రాజులకు బ్రాహ్మణ మంత్రులేర్పడ్డారు. రాజనరేంద్రునివద్ద వజ్జియప్రగడ ప్రధానిగా వుండేవారు. బ్రాహ్మణులు మంత్రిత్వం నిర్వహించే ఆచారం చాళుక్యుల కాలంలోనే ప్రారంభమైనది. నియోగి, వైదిక శాఖలకు ప్రారంభం జరిగింది.

రాజ కుటుంబీకులు, వారి బంధువులు అంతా క్షత్రియులుగా పరిగణించబడేవారు. చాళుక్యులు, చోళులు, హైహయులు-[illegible]రులు అంతా తాము క్షత్రియులమనే చెప్పుకున్నారు.

వైశ్యులకు పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ కేంద్రం. 714 గోత్రాల వైశ్యులున్నట్లు వైశ్య పురాణం తెలియజేస్తున్నది. వ్యాపారస్తులంతా 'నాగరం' అను పేరుతో వర్తక సంస్థలను నిర్మించుకొనేవారు.

శూద్రులలో కూడా వివిధ వృత్తులను బట్టి వివిధ తెగలు ఏర్పడసాగాయి. వ్యవసాయము, సైనికవృత్తి, నేతపనులు వీరి ప్రధాన వృత్తులు. నూనె గానుగ ఆడే తెలికవారికీ, వస్త్రాలను నేసే చేనేతవారికి, రాజులు విస్తారంగా అగ్రహారాలు యిచ్చేవారు.

శూద్రులనేకులు, సైనికులుగా ప్రారంభించి, సామంత రాజులుగా స్థిరపడ్డారు. కొండపడమటిరెడ్లు, చాగివారు, పరిచేదివారు మొదలైనవారు అట్టివారు.

వేశ్యావృత్తి అన్నివృత్తులతో పాటు ఒక వృత్తిగా, రాజపోషణ క్రింద ఉండేది. ప్రతి గ్రామంలోను వేశ్యలుండేవారు. బహు భార్యాత్వ పద్ధతి సర్వసామాన్యము. వర్ణభేదాలున్నప్పటికి, వివిధ వర్ణాలకు చెందిన స్త్రీ పురుషుల మధ్య జరిగే వివాహాలు కూడా లేకపోలేదు.

ఈ మత, కుల విభేదాలు రాజ్య భద్రతకే విచ్ఛిన్నకరంగా తయారయాయి. సుస్థిర రాజ్య పాలన అసంభవమౌతుండేది. ఇతర రాష్ట్రాల నుండి దండెత్తి వచ్చే రాజులను ఆహ్వానించే మతస్థులు, కులస్థులు ఎప్పుడూ ఎవరో ఒకరు ఉండేవారు. కుట్రలను, అరాచకాన్ని ప్రోత్సహించేవారికి మతం ఒక ముసుగుగా ఉపయోగపడేది.

## ఆంధ్ర మహాభారత అవతరణ

ఈ విచ్ఛిన్నకర పోరాటలను కొంతవరకైనా అరికట్టి ఐక్య భావి పరిణామాని కవసరమైన సంస్కృతిని నిర్మించిన ఘనత తెలుగు సాహిత్యానిది. అందుకు మహాభారతం నాంది.

మత ప్రవక్త దృక్పథం సంకుచితం. తన దేవునిపై భక్తికంటె వేరుగు దేవుడిపై ద్వేషం జాస్తి. దేవతల ద్వేషం ప్రజలలో వ్యాపించి అంతఃకలహాలకు కారణమైంది.

కవుల దృక్పథం వేరు. జీవితంలోని కుల, మత భేదాలకు అతీతమైన, సామాన్య మానవ భావాన్ని ప్రస్ఫుటంగా వ్యక్తీకరించటమే కవి కర్తవ్యము. ఈ గురుతర బాధ్యతను నిర్వహించిన కావ్యాలు భారత, భాగవతాలు. అయితే ఈ కర్తవ్యం నాటి ఫ్యూడల్ సమాజ పరిధికి లోబడి జరిగింది. సామాన్య ప్రజల జీవితం ఈ సాహిత్యంలోకి ఎక్కలేదు.

మహాభారతం సర్వజన వంద్యంగా వుండవలెనని తాను రచించినట్లు నన్నయ్యభట్టు అలా వివరించాడు :

*సీ: ధర్మతత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రం బని*
*అధ్యాత్మ విదులు వేదాంత మనియు*
*నీతి విచక్షణుల్ నీతి శాస్త్రం బని*
*కవి వృషభులు మహా కావ్య మనియు*

లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యితిహాసికు లితిహాస మనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహిఁ గొనియాడుచుండ

గీ. వివిధ వేద తత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతంబు.

తామెంతటి మహత్కార్యానికి పూనుకున్నారో మహాభారత కవులు గుర్తించారు.

"నానా రుచిరార్థ సూక్తినిధి
నన్నయభట్టు తెనుంగునన్. మహాభారత
సంహితా రచన బంధురుడయ్యె
జగద్ధితంబుగాన్"

"గావట నీవచే చరిత గాథలు శ్రవ్య తెలుంగు వారికిన్ వ్యాస ముని ప్రణీత" మైన మహాభారత గాథను వివరిస్తున్నానని నన్నయభట్టు మరొక చోట చెప్పారు.

ఇదే విషయాన్ని భారతంలో అత్యధిక భాగాన్ని రచించిన కవి బ్రహ్మ తిక్కన యింకా స్పష్టంగా చెప్పారు.

ఉ. కావున భారతామృతము కర్ణ పుటంబుల నారఁ గ్రోలి, ఆం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీ విభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యములఁ గద్యములన్ రచియించెదన్ కృతుల్
—అంతే కాదు.

తెలుగు భాషలో ప్రజాసామాన్యానికి కందనికి అర్థమయ్యేటట్లు వ్రాయటంలో పురుషార్థ సాధన ఇమిడి వున్నదని కూడా తిక్కన భావించారు.

*తే॥ తెనుగుబాస వినిర్మింప దివురుటరయ*
*భవ్యపురుషార్థ తరు పక్వ ఫలము గాదె॥*

ఆంధ్ర మహాభారతం, నన్నయ ప్రారంభించిన తర్వాత 200 సంవత్సరాలకు గాని పూర్తికాలేదు. ఏ ఆశయంతో నన్నయభట్టు భారత రచన కుపక్రమించాడో, అదే ఆశయంతో క్రీ. శ. 1280 ప్రాంతంలో తిక్కన ఆ కావ్యాన్ని పూర్తిచేశాడు.

ఆంధ్రదేశంలోని అన్ని జిల్లాలలోని అన్ని కులాలలోను మహాభారతం అంతటి విస్తార ప్రచారంగల గ్రంథం మరొకటి లేదు. పాండవ కౌరవగాథలు, నాటినుండి నేటివరకు సామాన్య ప్రజలకు విజ్ఞానాన్ని, లోకానుభవాన్ని అందజేస్తూనే ఉన్నాయి.

నాడు ప్రజలలో జైన, హిందూ మతాలు వ్యాప్తిలో ఉన్నాయి. పూర్వ మీమాంసాకారుడైన కుమారిలభట్టు ఆంధ్రుడైనందువలన, ఆంధ్రలో ఆ సిద్ధాంతానికి ఆలంబనం హెచ్చుగా ఉండేది.

నిర్జీవమైన కర్మకాండకు జైన పూర్వమీమాంసా ధోరణులు రెండూ విశేష ప్రాధాన్యత నిచ్చినవి. అర్థంతో నిమిత్తం లేకుండానే మంత్రోచ్చారణ ద్వారానే ఫలితాలు వస్తాయన్న మూఢనమ్మకాలు విరివిగా ఉండేవి.

క్రీ. శ. 788 లో మలబారులో పుట్టి అద్వైత వాదాన్ని ప్రచారం చేసిన శంకరాచార్యుని బోధనలు దేశమంతా వ్యాపించినప్పటికీ, పాత ధోరణులింకా బలంగానే వున్నాయి. శంకరుని అద్వైతం జ్ఞానప్రధానం. కర్మకాండను నిరసించింది.

నన్నయ్యభట్టు మహాభారత రచన అద్వైత ధోరణికి ఎనలేని సహాయం చేసింది. శైవ, వైష్ణవ ద్వేషాలను ఖండించింది. నిర్జీవ కర్మకాండ పైనుండి ప్రజల దృష్టిని వాస్తవ జీవితంవైపు మళ్ళించింది. రాజ్య

లోభం. ద్వేషం. కక్ష మొదలైన ఆవేశాలకు లోనైనప్పుడు, మహా సామ్రాజ్యాలు పతనమైపోతాయన్న నీతిని ప్రచారం చేసింది. కర్మలు అప్రధానమని. జ్ఞానం. సమదృష్టి అద్వైతభావం ముఖ్యమని కథారూపంలో ప్రజలకు బోధ చేసింది.

ఈ ఉపస్మృతితోపాటు. మనో[illegible] ప్రకారంకూడా జరిగింది. నన్నయ భట్టుకు పూర్వమే చాలా కాలం[illegible]గులో రచనలు సాగుతూ వచ్చాయని ప్రాచీన శాసనాలే తెలి[illegible]న్నాయి. కాని నాటి గ్రంథాలేవీ లభించటంలేదు. అట్టి ప్రజా వాఙ్మయాన్ని, "గాసట బీసట" అని నన్నయభట్టు హేళనచేసి ప్రజావాఙ్మయంపట్ల నిరసనభావం కలిగించాడు.

ఈ నిరసన వెలిరిపై తిరుగుబాటుగానే. రెండు శతాద్దాల అనంతరం వీరశైవమతం. వీరశైవ వాఙ్మయం తలయెత్తాయి.

## పరిపాలనా వ్యవస్థ

రాజాస్థానంలో మంత్రి. పురోహిత. సేనాపతి. దౌవారిక. ప్రధాన. అధ్యక్ష-ఇత్యాది వివిధ ఉద్యోగు లుండేవారు. గ్రామ పరిపాలనను పర్యవేక్షించడానికి కేంద్ర ప్రభుత్వం నైయోగిక వల్లభులను నియమించేది. వీరు కొన్ని పదుల గ్రామాలపై అధికారం చలాయించేవారు. కేంద్ర ప్రభుత్వానికే వీరు బాధ్యులు.

నరాసరి కేంద్ర పరిపాలనలో ఉన్న ప్రాంతం కాక స్థానిక పరిపాలకుల చేతులలో విస్తారప్రాంతం ఉండేది. వీరి అంతరంగిక పరిపాలనలో చాళుక్యరాజులు జోక్యం కలిగించుకునేవారు కారు. కప్పం మాత్రం పుచ్చుకునేవారు. ఎలమంచిలి, పిఠాపురం, ముదిగొండ ప్రాంతాలు ఇట్టి పరిపాలకుల చేతులలో ఉండేవి. వీరందరూ విశ్వాసపాత్రంగా వుం[illegible] కేంద్రాధికారం సుస్థిరంగా వుంటుంది. లేకపోతే నిరంతర కలహాలు తప్పవు. చాళుక్యరాజుల కాలంలో నిరంతర కలహాలకు యీ వ్యవస్థకూడా ఒక కారణం.

గ్రామాధికారులను గ్రామేయకులు అనేవారు. రాజశాసనాలన్నీ సరాసరి గ్రామేయులను సంబోధించి వ్రాయబడేవి. ప్రతి గ్రామంలోను గ్రామ పరిపాలనాధికారులతో పాటు, ప్రభుత్వోద్యోగికూడా ఒకరుండేవారు. ఇతనిపేరు గ్రామణి. శిస్తు వసూళ్ళ బాధ్యతను ఇతరు చూస్తూండేవారు. వారసత్వాధికారాలుగల గ్రామాధికారు లప్పటికి లేరు. అధికారులను ఇష్టం లేనప్పుడు రాజు తొలగిస్తూ ఉండేవారు.

# తెలుగు చోడులు - పల్నాటి యుద్ధం

వేంగీ చాళుక్యరాజ్య పరిపాలన క్రీ. శ. 1100 తో అంతమైంది. పిమ్మట ఒక శతాబ్దానికి పైగా చోడ వంశస్థులైన స్థానిక ప్రభువులు తెలుగు దేశాన్ని పరిపాలించారు. వెలనాటిని పరిపాలించిన వారిని వెలనాటి చోడులని, తదితరులను తెలుగు చోడులని చరిత్రకారులు వ్యవహరిస్తున్నారు.

తాము చతుర్థ వంశస్థులమని, దుర్జయ కులోద్భవులమని వెలనాటి చోడులు చెప్పుకున్నారు. మిగతా తెలుగు చోడులు తాము సూర్యవంశజుల మని, కరికాల చోళుని వంశస్థులమని చెప్పుకున్నారు. కాని వాస్తవానికి అందరూ ఒకే కుదురునుండి ప్రారంభమైన చతుర్థ వంశస్థులే తప్ప వేరు కాదు. వీరందరికీ కాలక్రమేణా తెలగాలు లేక కాపులు అను పేరు స్థిర మైంది.

చోళుల మొదటి నివాస స్థలము రాయలసీమ. అచ్చటినుండి తెలంగాణాకు, పిమ్మట సర్కారుజిల్లాలకు వీరు విస్తరించారు. తమ జన్మభూమి ఐన రాయలసీమతో చాలాకాలంగా సంబంధాలు తెగిపోయి నందువల్ల, వెల నాటి చోడులు కరికాల చోళుని స్మరించక, తమ వంశంలో మరొక వీరుడైన దుర్జయుని తమ వంశకర్తగా పేర్కొన్నారు. అంతకు మించి వెల నాటి చోడులకు, తెలుగు చోడులకు తేడాలేదు. వెలనాటికి షట్సహస్ర దేశ మనికూడా పేరు ఉంది. ఈ ప్రాంతంలో నివశించిన నియోగులు ఆర్వేల నియోగులైనారు.

కృష్ణా-పెన్నా నదుల మధ్య ప్రాంతం వెలనాడు. దీని రాజధాని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలోని చందవోలు. ఈ గ్రామానికి ఆనాడు

ధనదుపురం అని పేరు ఉండేది. దేవాలయాలతోను. మేడలతోను. వసు సమృద్ధములైన విపణి వీధులతోను. ఆ నగరం కుబేరుని రాజధానివలె ఉండేదని మంచన తన కేయూర బాహు చరిత్రలో వర్ణించాడు.

వెలనాటి చోడుల మూలపురుషుడు మల్లవర్మ. ఇతను త్రిలోచన పల్లవునివద్ద సామంతుడుగా ఉండేవాడు. క్రీ. శ. 1076-1408 మధ్య పరి పాలించిన మొదటి గొంకరాజు. కంచి పరిపాలకుడైన కులో త్తుంగ చోళుని కిపుడు. సామంతుడు. గొంకరాజు కొడుకు మొదటి వెలనాటి చోడుడు క్రీ.శ. 1118 ప్రాంతంలో. కంచి ఆధిపత్యాన్ని తోసివేసి స్వతంత్రుడైనాడు.

వెంటనే కళ్యాణి పాలకులైన పశ్చిమ చాళుక్యులు ఆంధ్రదేశంపై దండెత్తివచ్చారు. వెలనాటి చోడుడు ఈ దండయాత్రకు తట్టుకోలేక ఓడి పోయినాడు. 1135 వరకు. 17 సంవత్సరాలు. ఆంధ్రదేశం కన్నడ సామ్రాజ్యంలో భాగమైంది. ఈ కాలంలో పలువురు కన్నడ ఉద్యోగులు. సేనానులు. ఆంధ్రలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు.

వెలనాటి చోడుని కుమారుడైన రెండవ గొంకరాజు. 1132 లో అధికారానికివచ్చి. తెలుగుదేశంలోని చిన్న రాజ్యాలన్నిటినీ ఏకం చేసి. 1135 లో గోదావరీ తీరంలో కన్నడులను ఘోరయుద్ధంలో ఓడించి. తెలుగు దేశ స్వాతంత్ర్యాన్ని పునరుద్ధరించి తెలుగు చోడులు సార్థక నామ ధేయులై నారు.

రెండవ గొంకరాజు అనంతరం. రెండవ వెలనాటి చోడుడు అధి కారంలోకి వచ్చారు. కన్నడరాజులు చేసిన మరొక దండయాత్రను ఇతడు ఓడించాడు. ఇతను మతసామరస్య ధోరణి కలవాడు. కనుకనే వీరశైవ మతాచార్యుడైన మల్లికార్జున పండితారాధ్యుని ఆగ్రహానికి గురైనాడు.

ఇతని అనంతరం వెలనాటి చోడులు తమ రాజ్యాన్ని పోగొట్టు కున్నాడు. ఈ వంశస్థుడైన పృథ్వీశ్వరరాజు. క్రీ.శ. 1187 ప్రాంతంలో పిఠాపుర ప్రాంతాన్ని పరిపాలించి. నెల్లూరు చోడరాజులతో జరిగిన యుద్ధంలో క్రీ. శ. 1206 లో మరణించాడు. అంతట ఈ వంశం అంతమైంది.

## నెల్లూరు చోడులు

నెల్లూరును పరిపాలించిన చోడ వంశానికి మూలపురుషుడు చోళ బిజ్జన. ఆ పిమ్మట తిక్కభూపతి. కడప, చిత్తూరు, చెంగల్పట్టు జిల్లాలను జయించి, కాంచీపుర చోళుల కిపుడె పశ్చిమ చాళుక్యులతో పోరాడి. రాజేంద్రచోళుని, కాంచీపురం సింహాసనంపై అధిష్ఠింప చేశారు. చోళస్థాప నాచార్య బిరుదు వహించారు. ఇతని కాలం క్రీ. శ. 1252.

తిక్కరాజా కుమారుడు మనుమసిద్ధి. ఇతని ఆస్థానంలోనే కవిబ్రహ్మ తిక్కన మంత్రిగా ఉండేవారు. ప్రారంభంలోనే మనుమసిద్ధి దాయాదులు అక్కన, బయ్యనలు అతనిని పదభ్రష్టుని చేశారు. కాకతీయ గణపతిదేవుని సహాయంతో మనుమసిద్ధి తిరిగి రాజ్యం సంపాదించారు.

మనుమసిద్ధికి కాటమరాజుకు పశువుల పుల్లరి విషయంలో తగాదా వచ్చింది. కాటమరాజు గొల్లలకు అధిపతి. పంచలింగాలవద్ద ఇరు సైన్యాలకు ఘోర యుద్ధం జరిగింది. మనుమసిద్ధి సేనాని ఖడ్గతిక్కన. కాటమ రాజు సేనాని బ్రహ్మరుద్రయ. ఇతడు వీరశైవ బ్రాహ్మణుడు. ఈ యుద్ధంలో ఖడ్గతిక్కన మరణించారు. ఖడ్గతిక్కన శౌర్యసాహసాలు కాటమ రాజు కథద్వారా సుప్రసిద్ధములైనవి. కాటమరాజు కథనే యాదవ భారతం అనికూడా అంటారు. మనుమసిద్ధి అనంతరం, అతని కుమారులు కాకతీయ రాజ్యానికి సామంతులైనారు.

కడప జిల్లాలో రేనాటిచోళులు పరిపాలించేవారు. ఈ వంశంలోని రాజుల పేర్లు తెలియవు. వీరి పిమ్మట ఈ ప్రాంతాన్ని పొత్తపి చోళులు పరిపాలించారు. కడప జిల్లాలోని పొత్తపి వీరి రాజధాని.

వీరుగాక ఈ కాలంలో స్థానిక ప్రభువు లనేకులున్నారు. కోన సీమను హైహయరాజులు, నిడదవోలును వేంగిచాళుక్య వంశస్థులు, కొల్లేరు ప్రాంతాన్ని తెలుగు నాయకులు, విజయవాడ ప్రాంతాన్ని చాగివారు, ధరణి కోటను కోటవారు, కొండవీడును కమ్మనాయకులు, నరసరావుపేట తాలూకా

కొణిదెనను మరొక చోడవంశం, పల్నాటిని హైహయ వంశస్థులైన రాజులు పరిపాలించేవారు.

వీరందరూ స్వతంత్రరాజులు. ఈ చిన్నరాజుల మధ్య తగాదాలు, వైషమ్యాలు చిలికి చిలికి గాలివాన అయినట్లు పల్నాటి యుద్ధంగా పరిణమించింది.

## పల్నాటి యుద్ధం

ఈ యుద్ధం క్రీ. శ. 1176-1182 సంవత్సరాల మధ్య జరిగింది. గురజాలను రాజధానిగా పరిపాలించిన నలగామరాజుకు, సవతి తమ్ముడైన మలిదేవరాజుకు రాజ్యాధికారం కోసం కలహం ప్రారంభమైంది.

నలగామరాజు మంత్రి బ్రహ్మనాయుడు సవతి తమ్ములపక్షం వహించి, మాచెర్ల రాజ్యాన్ని వారికి యిప్పించి తను కూడా వారితోపాటు మాచెర్లకు తరలిపోయినాడు. పేరు మలిదేవరాజుదైనా, పరిపాలన అంతా బ్రహ్మనాయుడిదే.

బ్రహ్మనాయుడు వెళ్ళిపోయిన మీదట, నలగామరాజు నాగమ్మ అను ఒక కాపు స్త్రీని మంత్రిణిగా నియమించుకున్నాడు. ఈమె పల్నాటి యుద్ధానికి మూలబీజాలు నాటింది. కనుకనే నాయకురాలు అని ప్రసిద్ధి చెందింది.

ఏదోవిధంగా కవ్వించి బ్రహ్మనాయుడిని అష్టకష్టాలపాలు చేయాలనే ఉద్దేశంతో నాయకురాలు కోడిపందెములు ఏర్పాటుచేసి, అందులో బ్రహ్మనాయుడిని ఓడించింది. ఒప్పందం ప్రకారం బ్రహ్మనాయుడు తన బలగాన్నంతా తీసుకొని కృష్ణను దాటి, అరణ్యప్రాంతంలో వీరమేడపి అనే గ్రామం నిర్మించుకొని 7 సంవత్సరాలు గడిపాడు. గడువు ముగిసినప్పటికీ, మాచెర్ల రాజ్యాన్ని ఇవ్వటానికి నలగామరాజు, నాయకురాలు నిరాకరించటం వల్ల ఉభయ సైన్యాలకు కారంపూడిలో ఘోరయుద్ధం జరిగింది. విజయం బ్రహ్మనాయుడికే లభించింది. కాని అతని అనుచరులు, బంధువులు, మలిదేవరాజు మొదలైన వారంతా నశించారు. దీనితో బ్రహ్మనాయుడు విరక్తి చెంది రాజ్యమంతా తిరిగి నాయకురాలికే వదలివేసి అడవులలోకి తపస్సు

చేసుకో వెళ్ళారు. ఇప్పటికీ పల్నాడు తాలూకాలో ఈ వీరులగాథలు, చిహ్నాలు నిలిచియున్నాయి. బ్రహ్మనాయుడి కొడుకు బాలచంద్రుడు, అతని భార్య మాంచాల, సేనాని కన్నమనీడు మొదలైనవారి వీరగాథలు ఆంధ్రదేశంలో శాశ్వతత్వాన్ని సంపాదించుకున్నాయి.

మహాభారత యుద్ధానికి వలెనే పల్నాటి యుద్ధానికి కూడ సోదరుల రాజ్యకాంక్ష మూలకారణం. పల్నాటి యుద్ధంలో నాటి ఆంధ్రరాజులందరూ ఏదో ఒక పక్షానికి సహాయం చేశారు. ఓరుగల్లు పరిపాలించిన మొదటి ప్రతాపరుద్రుడు 2 వేల గుర్రపు రౌతులను నలగామరాజుకు సహాయంగా పంపాడు. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, రాయలసీమలోని రాజులందరూ తమ సైన్యాలను పంపి యీ యుద్ధంలో పాల్గొన్నారు. కన్నడ, ఘూర్జర, చేది, కళింగరాజులు సైతం పాల్గొన్నారని శ్రీనాథుడు వర్ణించాడు. వివిధ రాజులమధ్య అంతఃకలహాలు, ద్వేషాలు, తగాదాలు-అన్నీ ప్రోగుబడి ల్నాటియుద్ధంగా రూపొందాయి. కనుక నాటి రాజకీయ జీవితాన్ని తెలుసు కోడానికి యీ గాథ చక్కగా ఉపకరిస్తుంది.

ఈ యుద్ధంవల్ల కలిగిన అపార జననష్టంతో రాజుల అహంకారాలు చల్లబడ్డాయి. సైనికబలం సన్నగిల్లింది. ఆంధ్రదేశమంతా ఒకే రాజకీయ పరిపాలనక్రింద లేకపోవడంవల్ల కలిగే నష్టాలను ప్రజలు చవిచూచారు. తిరిగి దేశాన్నంతా ఐక్యంచేసి అరాచకాన్ని తొలగించి, సుస్థిరపాలన స్థాపించ గల ప్రభుత్వం కొరకు ఎదురు చూడసాగారు. ఈ పరిస్థితిని గమనించి ఓరుగల్లు కాకతీయులు తమ దిగ్విజయ యాత్రలను ప్రారంభించి, సామంత రాజులందరినీ ఓడించి, ఆంధ్రదేశాన్నంతా తమ పరిపాలనక్రిందా ఐక్యం చేశారు.

పల్నాటియుద్ధానికి రాజకీయంగానే కాకుండా, సాంఘికంగా కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. 12 వ శతాబ్దంలో దక్షిణ హిందూదేశంలో రెండు మతోద్యమాలు ప్రారంభమైనవి. ఒకటి వైష్ణవమతం, రెండవది శైవమతం.

## రామానుజుడు - వైష్ణవమతం

వైష్ణవమతం ప్రారంభించింది రామానుజుడు. ఇతడు తమిళదేశంలో శ్రీ పెరంబుదూరు అను గ్రామంలో క్రీ. శ. 1018 లో జన్మించాడు. సుమారు నూరు సంవత్సరాలు జీవించి దక్షిణదేశమంతట, వైష్ణవమతం ప్రచారం చేశాడు. అనాటికే మేధావులలో వేరూనిన శంకరుని అద్వైత మతాన్ని ఖండిస్తూ రామానుజుడు ప్రచారం చేశాడు.

ప్రపంచమంతా మాయ. కనుక ఏదోవిధంగా అంటీ అంటనట్లుగా ఈ లోకంలో కాలం గడిపి, జ్ఞానసంపాదనకై కృషిచేసి, మోక్షాన్ని సంపాదించటం మానవుడికి లక్ష్యంగా ఉండాలి. జ్ఞానసంపాదనకు ప్రతి వ్యక్తి తనకు నచ్చిన గురువును ఎన్నుకొని మోక్షమార్గాన్ని అన్వేషించాలి. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు ఈ మూడు హిందూ తాత్విక గ్రంథాలలో ఈ జ్ఞానమంతా యిమిడివుంది. ఇది శంకరుని అద్వైత సిద్ధాంతం. శంకరుని సిద్ధాంతాలు వ్యక్తి ప్రధానమైనవి. సమాజంతో సంబంధం లేకుండానే వ్యక్తి తన మోక్షాన్ని సంపాదించుకోవచ్చునని, జ్ఞాన సంపాదనమే ప్రధానమని శంకరుడు వివరించాడు. నిర్జీవమైన యజ్ఞయాగాదులు మొదలైన కర్మకాండతో జీవితం గడుపుతూ, అదే పర మార్గమని భావించే మీమాంసావాదులను ఖండిస్తూ శంకరుడు తన అద్వైత మతాన్ని ప్రచారం చేశాడు. జ్ఞాన ప్రధానమైనది కావటంవల్ల సహజంగానే ఈ మతం ప్రజాసామాన్యంలోకి వ్యాపించలేదు.

వైష్ణవమత సిద్ధాంతాల ప్రకారం ప్రపంచం మాయకాదు; వాస్తవం. జీవితంలో అంటీ అంటనట్టు ఉండరాదు. జీవిత సుఖాలన్నీ అనుభవించవలసిందే. మోక్షంకొరకు భక్తిమార్గం అవలంబించాలి.

దేవుని యెదుట వినమ్రతతో, దాసభావంతో ప్రవర్తించాలి. ఈ భక్తి ప్రవాహంలో కులభేదాలకు అంతగా ప్రాధాన్యత లేదు. ఇవి రామానుజుని సిద్ధాంతాలు.

ఈ సిద్ధాంతాలను రామానుజుడు, అతని శిష్యులు దక్షిణ దేశమంతా తిరిగి ప్రచారం చేశారు. జీవితం వాస్తవమని, కులభేదాల విష

యంలో పెద్ద పటింపు లేదనీ ప్రచారం చేయడంతోపాటు, సమిష్టిగా ఆచరించవలసిన ఉత్సవాలు, ఊరేగింపులు, దైవ సంకీర్తనలు మొదలైన కార్యక్రమాలవల్ల వైష్ణవమతం ప్రజలలోకి వేగంగా చొచ్చుకు వెళ్ళింది. ఆంధ్రదేశంలో వెలనాటి చోడుల పరిపాలనలో అనేక వైష్ణవదేవాలయాలు నిర్మించబడ్డాయి.

## సంఘ సంస్కర్త - బ్రహ్మనాయుడు

పల్నాటియుద్ధంలో ప్రధానపాత్ర వహించిన బ్రహ్మనాయుడు వైష్ణవమతాన్ని స్వీకరించాడు.'కులభేదాలను పాటించక సహపంక్తిలో భోజనాలను ప్రోత్సహించాడు. మాల కులస్థుడైన కన్నమనీడును తన స్వంత కుమారుని వలె భావించి, ప్రధాన సేనానిగా చేశాడు. బ్రాహ్మణ సేనాని అనపోతులోసహా పల్నాటి వీరులు "చాపకూడు"లో కులభేదాలను పాటించక భోజనం చేశారు. ఈ సంఘ సంస్కరణ కార్యక్రమాల వల్ల బ్రహ్మనాయుడు పల్నాడులో ప్రజారంజకుడైనాడు. బ్రహ్మనాయుడు పల్నాటి విష్ణువని అచ్చటి ప్రజలు పూజిస్తూ ఉంటారు. వెలమకులానికి బ్రహ్మనాయుడు మూలపురుషుడు.

వైష్ణవ మతం ఆంధ్రదేశంలో ప్రవేశించక ముందునుంచీ శైవ మతం ప్రచారంలో ఉంది. చాళుక్య రాజులు ఎక్కువమంది శైవమతాన్ని ప్రోత్సహించారు. తెలుగు చోడులు శైవ, వైష్ణవ మతాలను సమదృష్టితో చూశారు. పల్నాటి యుద్ధంలో రెండవ పక్షమైన నలగామరాజు, నాయకురాలు మొదలైన వారంతా శైవ మతాభిమానులు. ఈ మతద్వేషాలు కూడా నాటి అంతఃకలహాలను వృద్ధిచేయడానికి తోడ్పడ్డాయి.

వీరశైవ మతస్థులైన జంగము లనేకులు నాటి యుద్ధంలో పాల్గొన్నారు. ఈ క్రింది ద్విపద చూడండి :

*"యుద్ధ సన్నద్ధులై యుర్విఁ గంపింప*
*వారితో నరుదెంచె వసియ జంగాలు*

నల్లకొంతంవారు నాలుగువేలు
ఎర్ర కొంతలవారు ఎనుబదివేలు
........................................
ఉరమున లింగాలు మెరిసెడివారు
గళమున రుద్రాక్ష గలిగినవారు

యుద్ధంలో పాల్గొన్నారు.

పల్నాటి వీరచరిత్రను అనేకులు రచించినారు. అందులో శ్రీనాథుడు వ్రాసిన గ్రంథం ఎక్కువ ప్రచారంలో ఉంది. పల్నాటి యుద్ధంలో పాల్గొన్నవారిని శ్రీనాథుడు ఇలా వర్ణించాడు:

ద్వి॥ "నావాంవారును, నాడెము వారు
కొండ్లవిండులవారు గోవిందువారు
ముత్తసానివారును, ముయ్యూరువారు
పైడిబుక్కల పొలపర్తి వారలును
బలుమూరి వారును, బాలెమువారు
నట్టూరి ముట్లూరి యాళ్ళవారు"

12 వ శతాబ్దపు ఆంధ్రదేశ సామాజిక చరిత్రను తెలుసుకొనేందుకు పల్నాటి వీరచరిత్ర ఎంతో ఉపయోగపడుతుంది.

## బసవయ్య

వైష్ణవమతం, తమిళ దేశంలో ప్రారంభమై ఆంధ్ర దేశంలో వ్యాపించింది. వీరశైవమతం కన్నడ దేశంలో ప్రారంభమై ఆంధ్ర ప్రాంతాన్ని ప్రవేశించింది.

ఈ మతాన్ని ప్రారంభించింది బసవయ్య. కళ్యాణి నగరాన్ని పరిపాలించిన కాలచూరి వంశస్థుడైన బిజ్జలుని వద్ద బసవయ్య కోశాధికారిగా

ఉండేవాడు. బిజ్జలుడు చాళుక్యరాజైన మూడవ తైలపుని కూలద్రోసి క్రీ.శ. 1517 లో రాజ్యాధికారం స్వీకరించాడు. కల్యాణి నేటి మరాట్వాడాలోని నగరం. బిజ్జలుడు జైనుడు.

బసవయ్య జీవిత చరిత్ర కన్నడ, తెలుగు, బసవ పురాణాలలో విపులంగా వర్ణించబడ్డది. ఇతడు ఒక బ్రాహ్మణ కుటుంబములో జన్మించాడు. 8 వ ఏట తండ్రి ఉపనయనం చేయబోగా, బసవయ్య వ్యతిరేకించి తనకు కర్మకాండలో విశ్వాసం లేదని, కుల భేదాలు పాటించనని, శైవ భక్తుడనని ప్రకటించాడు. దాంతో తల్లిదండ్రులు తమ ప్రయత్నాన్ని వదలి వేశారు. అప్పటినుండి బసవయ్య వీరశైవమత ప్రచారానికి పూనుకున్నాడు.

కులభేదాలు లేవు. అంతా సమానం. శివుడు ఒక్కడే దేవుడు. ఇతనిని లింగాకారంలో పూజించాలి. శైవమత ప్రచారం చేయటం ప్రతిఒక్కరి విధి. జంగములు (నిరంతరము సంచారం చేసేవారు) యీ ప్రచారానికి అవసరము. వారికి సర్వసౌకర్యాలు కలిగించాలి. వారిని పూజించటం, శివుని పూజించటంతో సమానం. ఇతర మతాలను నిందించి, వాటి మతస్థులను హింసించి అయినాసరే వీరశైవ మతం ప్రచారం చేయవలెనని బసవయ్య సిద్ధాంతం. ఆనాడు ఆంధ్ర, కన్నడ దేశాలలో ప్రజా సామాన్యంలో జైన మతం ఇంకా ఉంది. జైనమతాన్ని నాశనం చేయటం తమ కర్తవ్యంగా వీరశైవ మతస్థులు భావించారు.

బసవయ్య పూర్తిగా మత ప్రచారంలో మునిగిపోతాడనే భయంతో అతని మేనమామ తన కూతుర్నిచ్చి పెండ్లి చేశాడు. ఈ పెండ్లి కూడా బ్రాహ్మణులు, మంత్రాలు లేకుండా సహపంక్తి భోజనాలతో శైవ మతస్థుల పద్ధతిన జరిగింది. ఆ పెండ్లి సమయంలో సాక్షాత్తు శివునివలె బసవయ్య వేషం ధరించాడు.

*"ఘనితంబు నెలపూత బలుచగా బూసి*
*నొసల త్రిపుండ్రత మొప్పెసగ ధరించి*
*మౌళి ప్రసాద సుమంబుల దురిమ*

పోలగ రుద్రాక్ష భూషలుదాల్చి
సారమై లింగవ సాయితంబెనెడు
పేరునుగల కుఠారంబునుదాల్చి" (బసవ పురాణము)

బసవయ్యకు పూర్వం చాలాకాలంనుండి తెలుగు, కన్నడ, తమిళ దేశాలలో శైవ మతం ఉంది. అయితే వారు కుల వ్యవస్థను పాటిస్తూ వచ్చారు. కుల వ్యవస్థను రద్దుచేసి, సమానత్వాన్ని స్థాపించడానికి ప్రయత్నించటమే బసవయ్య ప్రత్యేకత. రాజ్యం ప్రాపకం, ధనబలం, అంగబలం మొదలైనవి ఉంటేగాని మతప్రచారం సాధ్యంకాదని ఇతడు గ్రహించాడు. జైనమతస్థుడైన బిజ్జలునివద్ద కోశాధికారి పదవిని స్వీకరించాడు. తన సోదరిని బిజ్జలుడికిచ్చి వివాహం చేశాడు.

కోశాధికారి పదవి స్వీకరించిన మీదట, బసవయ్య ప్రభుత్వ ధనాన్ని వీరశైవమత ప్రచారానికి విరివిగా ఖర్చుపెట్ట నారంభించాడు. జంగములను పోషించి కన్నడ దేశమంతా ప్రచారకులను ఏర్పరచాడు. ప్రభుత్వధనాన్ని దుర్వినియోగం చేసి మత ప్రచారాని కుపయోగిస్తున్నావని బిజ్జలుడు బసవేశ్వరుని నిందించాడు. నిర్బంధించడానికి కూడా ప్రయత్నించాడు. దాంతో బసవయ్య ఎవరికీ చెప్పకుండా కళ్యాణి వదలి తన సహచరులతో దక్షిణ మైసూరు ప్రాంతానికి వెళ్ళిపోయాడు.

బసవయ్య వెళ్ళిపోగానే ముందు జరిగిన ఒప్పందం ప్రకారం వీరశైవులు అర్ధరాత్రివేళ రాజైన బిజ్జలుని శయ్యాగారం ప్రవేశించి కత్తులతో అతనిని ముక్కలు ముక్కలుగా నరికివేశారు. దానితో జైనులకు శైవులకు బ్రహ్మాండమైన మతయుద్ధం కళ్యాణి నగరంలో ప్రారంభమైంది. వారు అందరూ స్త్రీ, పురుష, బాలురు ఈ మత కలహాలలో పాల్గొన్నారు. నగరం అంతా పీనుగుల పెంట అయిపోయింది. కళ్యాణి నగర వైభవం దీంతో అడుగంటింది. ఈ దారుణ ఘటన క్రీ. శ. 1668 ప్రాంతాలలో జరిగింది. తర్వాత కొద్దికాలానికే బసవయ్య మరణించాడు.

పల్నాటియుద్ధం నాటికే వీరశైవమతం ఆంధ్రదేశంలో వ్యాపించసాగింది. కాని కాకతీయుల కాలంలో ఇది బాగా విస్తరించింది.

తెలుగు చోడరాజుల పరిపాలన ముగించేముందు ఒక విషయం ప్రస్తావించాలి. పరరాజుల దండయాత్రలు, అంతఃకలహాలు ఒక వైపున వైష్ణవ, శైవ మతోద్యమాలు మరొకవైపున ఆంధ్రదేశాన్ని ఊపివేసినవి. కనుకనే చాళుక్యరాజుల కాలంలో ప్రారంభమైన సాహిత్య సృష్టి కొనసాగలేదు. నన్నెచోడుడు రచించిన కుమారసంభవ కావ్యం ఒక్కటే యీ వందసంవత్సరాల ఆంధ్రజీవితంలోను ధ్రువతారవలె నిలిచినది.

నన్నెచోడుడు నరసరావుపేట కొణిదెన ప్రాంతాన్ని పరిపాలించిన చోడరాజులలోనివాడు.

క్రీ. శ. 1120-50 మధ్యకాలంలో నన్నెచోడుడు జీవించాడు. ఈ కవి రచించిన కుమారసంభవం కాళిదాసుని కుమారసంభవానికి అనువాదం కాక స్వతంత్ర కావ్యం.

# కాకతీయ యుగం

ఆంధ్రుల చరిత్రలో అత్యంత ప్రసిద్ధిగాంచిన కాకతీయ రాజుల 300 సంవత్సరాల చరిత్రను సౌలభ్యం కొరకు మూడు ప్రధాన దశలుగా విభజించవచ్చు. 1. మొదటి దశ క్రీ. శ. 1000_1158 వరకు. వరంగల్లు జిల్లాలోని మధిర, మానుకోట తాలూకాలను మాత్రం పరిపాలిస్తూ కొంత కాలం తూర్పు చాళుక్యరాజులకు, మరికొంతకాలము పశ్చిమ చాళుక్యరాజులకు సామంతులుగా వుంటూ కాకతీయులు యీ 150 సంవత్సరాలలోను చిన్న చిన్న రాజులను ఓడించి, పశ్చిమ చాళుక్యుల ఆధిపత్యాన్ని కూల ద్రోసి, తెలంగాణా కంతటికి స్వతంత్రాధిపతులుగా రూపొందారు. ఈ 150 సంవత్సరాలలో నలుగురు రాజులు యీ వంశంలో పరిపాలించారు. వీరిలో ఆఖరివాడయిన రెండవ ప్రోలరాజు అతి ప్రసిద్ధుడు. కాకతీయ చరిత్రలో ఇది ప్రారంభదశ.

(2) రెండవ దశ క్రీ. శ. 1159_1261 వరకు. తెలంగాణాను పునాదిగా చేసుకొని కాకతీయులు యీ రెండవ దశలో ఆంధ్రదేశాన్నంతా జయించారు. ఉత్తరాన గంజాంజిల్లాలోని ఆస్కా మొదలు దక్షిణాన కంచి వరకు, కోస్తా జిల్లాలు, రాయలసీమ, తెలంగాణా అంతా వీరి పరిపాలన లోకి వచ్చింది. ఈ రెండవ దశలో మొత్తం ముగ్గురు రాజులు పరిపాలిం చారు. వీరిలో 1198_1262 వరకు సుదీర్ఘకాలం పరిపాలించిన కాకతీయ గణపతి దేవుడు ప్రసిద్ధుడు. ఈ దశలు కాకతీయ రాజ్య విస్తరణ దశ అని పిలవవచ్చు.

(3) ఆఖరు దశ క్రీ. శ. 1262_1323 వరకు. ఈ దశలో ఇద్దరే రాజులు. రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు. వీరిద్దరు ఆంధ్రదేశం స్వాతం త్ర్యాన్ని పరరాజుల దండయాత్రల నుండి కాపాడిన రాజులు. రుద్రమ

దేవి దేవగిరి యాదవుల నోడించింది. సామంత ప్రభువుల తిరుగుబాట్ల నణచి, అతి సమర్థతతో రాజ్యపాలన గావించింది. రెండవ రాజైన ప్రతాప రుద్రుడు ఉప్పెనవలె ముంచుకువచ్చిన మహమ్మదీయ దండయాత్రను అనేక తడవలు ప్రతిఘటించి, చివరకు ఓడిపోయి ఖైదీ అయినాడు. ఖైదీ జీవితాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు.

## కాకతీయు లెవరు?

కాకతీయ పరిపాలనలో ముఖ్యాంశాలను తెలుసుకునే ముందు కాకతీయుల పుట్టుపూర్వోత్తరాలను గురించి క్లుప్తంగా తెలుసుకోవటం అవసరం.

క్రీ. శ. 626 నుండి, 1120 వరకు దాదాపు 500 సంవత్సరాలు ఆంధ్రదేశం వేంగి చాళుక్యరాజుల పరిపాలన క్రింద ఉన్న విషయం పాఠకులకు విదితమే. తెలంగాణా ప్రాంతం గూడా పేరుకు వేంగి చాళుక్యుల ఆధిపత్యాన్ని అంగీకరించినా అచ్చటి సామంత ప్రభువులు సమయం దొరికినప్పుడల్లా తమ స్వాతంత్ర్యాన్ని స్థాపించుకుంటూ వుండేవారు. రాష్ట్రకూట రాజులకు వేంగి చాళుక్యులకు జరిగిన నిరంతర యుద్ధాలలో ఈ ప్రాంతం తరచు చేతులు మారుతూ వుండేది. ఇట్టి సామంత రాజులలో కాకతీయులొకరు. కాకర్త్యగుండన అను ఒక సామంతరాజు క్రీ. శ. 934-945 సంవత్సరాల మధ్య వరంగల్లు జిల్లా మదిర, మానుకోట తాలూకాలను పరిపాలించాడు. ఇతడే కాకతీయవంశ మూల పురుషుడు.

తూర్పు చాళుక్యులవలెనే కాకతీయులుకూడా వరాహ లాంఛనులు. కాకతీయుల శిల్పంలో కూడా వేంగి చాళుక్య శిల్ప ఛాయలు అనేకమున్నాయి.

కాకతీయులు నాల్గవ వర్ణానికి చెందిన కర్షకులు. వీరు ప్రారంభంలో చిన్న సామంతులుగా ఉండి బలపరాక్రమాలవల్ల గొప్ప రాజ్యాన్ని స్థాపించిన మీదట తాము సూర్యవంశపు క్షత్రియులమని వర్ణించుకున్నారు. రెడ్డి, వెలమ, కమ్మ, బ్రాహ్మణ కులాలతో సంబంధ బాంధవ్యాలు జరిపారు. రుద్రమదేవి తన రెండవ కూతురైన రుయ్యమ్మను, తన మంత్రి

లలో ఒకరైన బెండపూడి అన్నయ్య అను బ్రాహ్మణునకిచ్చి వివాహం చేసింది. ఈ విధంగా కాకతీయులు తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

కాకతీయులు ప్రారంభంలో జైనమతావలంబకులు. వీరశైవ మతం ఆంధ్రదేశంలో వ్యాపించక పూర్వము ప్రజాసామాన్యములో ఎక్కువమంది జైనమతాన్ని అవలంబించి ఉండేవారు. తెలంగాణాలో జైనమత వ్యాప్తి హెచ్చు. క్రీ. శ. 1115-1158 సంవత్సరాల మధ్య పరిపాలించిన కాకతీయ రెండవ ప్రోలరాజు బిజ్జలుని సమకాలికుడు. బిజ్జలునికి సహాయంగా తన సైన్యాలను పంపి కళ్యాణి నగరాన్ని పశ్చిమ చాళుక్యరాజుల నుండి స్వాధీనం చేసుకోవడంలో ప్రోలరాజు సహాయ పడ్డాడు.

ప్రోలరాజు కాలంలోనే వీరశైవ మతం ప్రారంభమైంది. ఇతని స్నేహితుడైన బిజ్జలుడు, అతని కోశాధిపతియైన బసవయ్య జైన, శైవ మత పక్షాలను ఆదరించి, పరస్పర కలహాలను పెంచుకున్న ఫలితంగా కన్నడ రాజధాని కళ్యాణి బూడిద పెంట ఐన విషయం ప్రోలరాజు గమనించాడు. అప్పుడప్పుడే కుదుటపడుతున్న కాకతీయ రాజ్యం మతద్వేషాలలో నాశనం కాకుండా కాపాడాలంటే ఉప్పెనవలె వస్తున్న వీరశైవ మతోద్యమానికి తల ఒగ్గటం మంచిదని భావించాడు. అంతవరకు ఆదరిస్తూన్న జైనమతాన్ని వదలి, తానుకూడ శైవమతాన్ని స్వీకరించాడు. ప్రోలరాజు ప్రదర్శించిన యీ రాజకీయ చతురతవల్లనే కాకతీయుల పరిపాలన మరి రెండు శతాబ్దాలు కొనసాగింది.

## తెలంగాణా విమోచన

మొదటి దశలో నలుగురు రాజులు పరిపాలించారని తెలుసుకున్నాము. వీరిలో రెండవ వారైన మొదటి ప్రోలరాజు, రాజరాజనరేంద్రుని కుమారుడైన కులోత్తుంగ చోళునితోపాటు కాంచీ నగర దండయాత్రలో పాల్గొన్నారు. అప్పటికి కాకతీయులు స్వతంత్ర ప్రభువులు కాలేదు. తూర్పు చాళుక్యులకు మాత్రమేగాక కల్యాణిని పరిపాలించిన పశ్చిమ చాళుక్యులకు కూడా, తాను సామంతుడనని ఆ రాజుల వద్ద నుండి

లిఖిత పూర్వకంగా హనుమకొండ రాజ్యాన్ని సంపాదించు కొన్నానని ప్రోలరాజు ఒక శాసనంలో వ్రాసుకున్నాడు. ఈతని తరువాత పరిపాలించిన రెండవ బేతరాజు కాలంలో సబ్బిమండలం (కరీంనగర్ జిల్లా) వీరికి స్వాధీనమైంది. పశ్చిమ చాళుక్య రాజులకు విశ్వాస పాత్రులుగా ఉంటూ, వారి సహాయంతోనే తమ రాజ్యాన్ని స్థిరు విస్తరింప చేసుకున్నారు.

నాల్గవ వాడు రెండవ ప్రో ... ఇతడు తెలంగాణా అంతటినీ స్వాధీన పరచుకున్నాడు. ఇది తేలికగా సాధ్యపడలేదు. తైలపదేవుడు, గోవిందరాజు, గుండరాజు, జగద్దేవుడు అను నలుగురు స్థానిక పరిపాలకులను ఓడించిన మీదటనే తెలంగాణా అంతా స్వాధీనం చేసుకో గలిగాడు.

ప్రోలరాజు జయించిన తైలపదేవుడు పశ్చిమ చాళుక్య చక్రవర్తి కుమారుడైన మూడవ తైలప దేవుడు. ఇతని తండ్రి విక్రమాదిత్యుడు. కల్యాణిలో పరిపాలించుచుండగా, ఇతడు మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు రాజప్రతినిధిగా ఉండేవాడు. ఇతనిని ప్రోలరాజు ఓడించి ఆ రెండు జిల్లాలను తన స్వాధీనం చేసుకున్నాడు. తైలపుణ్ణి ఖైదుచేయక వదలివేశాడు.

ప్రోలరాజు ఓడించిన రెండవవాడు గోవిందరాజు. ఇతడు కన్నడ దేశం నుండి విక్రమాదిత్యుని సేనా నాయకుడుగా ఆంధ్రదేశం ప్రవేశించి వరంగల్లు జిల్లాలోని నేలకొండపలి ప్రాంతాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. వీరిద్దరినీ కాక మంథెన ప్రాంతాన్ని పరిపాలించే గుండరాజును, వేములవాడను పరిపాలించిన జగద్దేవుని కూడా ప్రోలరాజు జయించాడు. ఈ రెండు ప్రాంతాలూ కరీంనగరు జిల్లాలోనివి. వేములవాడ అనాదిగా ఒక చాళుక్య వంశశాఖచే పరిపాలించబడుతూ స్వతంత్ర రాజ్యంగా వుంటూ వచ్చింది.

పశ్చిమ చాళుక్య రాజుల సామంతులందరినీ ఓడించి కన్నడ సామ్రాజ్యాన్ని ధ్వంసం చేసి, తెలంగాణా ప్రాంతాన్నంతా ప్రోలరాజు తన ఆధీనంలోనికి తెచ్చుకున్నాడు.

తెలంగాణా ఆక్రమణ పూర్తయిన మీదట, కృష్ణానదిని దాటి తెలుగు చోడులనుకూడా జయించవలెనని యితడు ప్రయత్నించాడు.

ఆ ప్రయత్నంలో 1158 లో వెలనాటి చోళరాజైన గొంకరాజుతో పోరాడి మరణించాడు.

కాకతీయుల యీ ప్రథమ దశను ముగించే ముందు ఒక విషయం గమనించాలి. తెలంగాణా ప్రాంతాన్నంతా కన్నడ సామ్రాజ్యం నుండి విముక్తి చేసిన యీ కాకతీయ రాజులు, ఒక చారిత్రక బాధ్యతను నిర్వర్తించారు. అంతవరకు ఆంధ్ర చరిత్రలో రాజ్యపీఠాలన్నీ కోస్తాప్రాంతంలోనే వుంటూ వచ్చాయి. అమరావతి, వేగి, రాజమహేంద్రవరం, విజయవాడ, ఇవి వివిధ రాజ్యాలకు కేంద్రాలుగా ఉండేవి. మహారాష్ట్ర రాజులైన రాష్ట్రకూటులు, కన్నడ రాజులైన పశ్చిమ చాళుక్యులు వేంగీ చాళుక్యులపై జరిపిన దండయాత్రలన్నీ తెలంగాణా మీదుగానే జరిగాయి. వివిధ సామ్రాజ్య సేనల మధ్య నిరంతర సంగ్రామ రంగంగా ఈ ప్రాంతం మారిపోయింది. స్వతంత్ర ప్రతిపత్తిగల రాజ్యం ఏర్పడని కారణంగా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో అభివృద్ధి లేక అచ్చట సమాజం స్థాణు రూపంలో ఉండిపోయింది.

ప్రజలలో పుట్టి, ప్రజల కష్ట సుఖాలు గుర్తెరిగిన కాకతీయ రాజులు ఈ పరిస్థితిని గమనించారు. స్వతంత్ర రాజ్యస్థాపనకు పూనుకున్నారు. శతాబ్దాలుగా ఊసర క్షేత్రంగా ఉన్న తెలంగాణా సస్యశ్యామలమయింది. తెలంగాణాలో ఇప్పటికీ నిలచివున్న అనేక చెరువులు, కాలువలు కాకతీయ రాజుల నిర్మించినవే. 300 సంవత్సరాలు సుస్థిర పరిపాలన ఫలితంగా తెలుగు కవిత్వం తెలంగాణాలో బహుముఖాలుగా వికసిల్లింది; శిల్పం, లలిత కళలు, చేతి వృత్తులు, వర్తక వ్యాపారాలు వృద్ధి చెందాయి. అనేక సంవత్సరాలుగా పరరాజుల పద ఘట్టనల క్రింద నలిగిపోయిన తెలంగాణా మట్టినుండి పుట్టిన కాకతీయ రాజులు స్వతంత్ర రాజ్యపాలన చేయటం వల్లనే ఇదంతా సాధ్యమైంది.

## యావదాంధ్ర ప్రభుత్వ స్థాపన

రెండవ దశలో వీరి రాజ్యం ఆంధ్రదేశమంతా వ్యాపించింది. ఈ దశలో మొదటివాడు రుద్రదేవుడు. ఇతనినే మొదటి ప్రతాపరుద్రుడు అని కూడా చరిత్రకారులు వ్యవహరిస్తారు.

ఇతడు ప్రోలరాజు ప్రారంభించిన దిగ్విజయాలను ముందుకు తీసుకువెళ్ళాడు. మేదరాజు, దొమ్మరాజు, మైలగిదేవుడు, చోదోదయుడు మొదలైన స్థానిక ప్రభువులను జయించాడు. వీరు తెలంగాణాలో మిగిలి పోయిన చిల్లర రాజులు.

వీరిని జయించిన మీదట క్రీ.శ. 1162 లో వెలనాటిపై దండ యాత్రచేసి శ్రీశైలం, త్రిపురాంతకం ప్రాంతాలను ఆక్రమించుకున్నాడు. ఇవి కృష్ణకు దక్షిణంగా ఉన్న కర్నూలు జిల్లాలోని ప్రాంతాలు. 1186 లో దండయాత్రచేసి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. క్రీ. శ. 1176-1182 సంవత్సరాల మధ్య జరిగిన పల్నాటి యుద్ధంలో నాయకురాలికి సహాయంగా, 2 వేల గుర్రపు రౌతులను పంపి నది ఈ ప్రతాపరుద్రుడే. పల్నాటియుద్ధ ఫలితంగా వెలనాటి చోళులు పూర్తిగా బలహీన పడినమీదటనే, 1186 లో రుద్రదేవుడు ఈ ప్రాంతా న్నంతా జయించ గలిగాడు. దేవగిరి యాదవ రాజైన జైతుగి చేతులలో ఇతడు మరణించాడు. ఇతని సోదరుడు మహాదేవరాజు దేవగిరి యాదవులపై పగ సాధించవలెనని ప్రయత్నించాడు. కాని విఫలుడైనాడు. మహాదేవరాజు కొడుకైన గణపతి దేవుడు 1198 లో రాజ్యానికి వచ్చారు.

కాకతీయ గణపతిదేవుడు రాజ్యానికి రాక పూర్వము, దేవగిరి యాదవుల వద్ద 12 సంవత్సరాలు ఖైదులో ఉన్నాడు. చివరకు విడుదల చేయబడ్డాడు. ఈలోగా కాకతీయ రాజ్యంలో సామంతులు అనేక తిరుగు బాట్లు చేశారు. వీటన్నిటినీ రేచర్ల రుద్రుడు అను సేనాని ఓడించి, గణపతి దేవునకు రాజ్యం అప్పగించాడు.

గణపతి దేవుడు రాజ్య విస్తరణకు రెండు మార్గాలవలంబించాడు. కేవలం సైనిక బలంపైన మాత్రమే ఆధారపడక, వివిధ రాజకుటుంబాలతో వంబంధ బాంధవ్యాలను కూడా ఏర్పరచుకున్నాడు.

క్రీ.శ. 1212-13 సంవత్సరాల్లో తూర్పు తీరంపై దండెత్తి కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాలను స్వాధీనం చేసుకున్నాడు. నిడదవోలును పరిపాలిస్తున్న వేంగి చాళుక్య వంశస్థుడైన వీరభద్రరాజుకు తన కూతురైన

రుద్రమదేవినిచ్చి వివాహం చేశారు. తన రెండవ కుమార్తెయైన గణపాంబను ధరణికోట రాజైన బేతరాజుకు, తన సోదరి మేలాంబికను మధిర ప్రాంతానికి రాజైన రుద్రరాజు కిచ్చి వివాహం చేశారు. తెనాలి, రేపల్లె తాలూకాలు కమ్మనాడు అని అప్పుడు వ్యవహరింపబడేవి. ఆ ప్రాంతానికి రాజైన జాయప సేనాని ఇద్దరు చెల్లెళ్ళను తాను వివాహం చేసుకొని, జాయపను తన గజసైన్యాధ్యక్షుడుగా నియమించి ఓరుగల్లు తీసుకు వెళ్ళాడు. నెల్లూరు ప్రాంతాన్ని జయించి, పూర్వ పరిపాలకుడైన మనుమ సిద్ధికి ఇచ్చాడు. రాయలసీమ ప్రాంతాన్నంతా జయించి, గంగయసాహిణి అను సామంత పాలకునికి ఆ ప్రాంతంపై అధికారం యిచ్చాడు. పులివెందుల తాలూకా మొదలుకొని గండికోట, రేనాడు, సలికినాడు, పొత్తపినాడు, మైసూరులోని తెలుగు ప్రాంతమైన చింతామణివరకు గంగయసాహిణి పరిపాలించేవాడు. ఇతనిని జయించటంతో రాయలసీమ అంతా గణపతిదేవుని స్వాధీన మైంది.

అటు తర్వాత కళింగదేశంపై దండెత్తి గంజాంజిల్లా ఆస్కా వరకు దండయాత్ర జరిపినట్లు శాసనాల ద్వారా తెలియవస్తున్నది.

శాతవాహన రాజుల తర్వాత యావదాంధ్ర దేశాన్ని జయించి పాలించినవాడు కాకతీయ గణపతిదేవు డొక్కడే కనబడుతున్నాడు.

ఈ రెండవ దశను ముగించేముందు ఒక విషయాన్ని గమనించ వలసి ఉంటుంది. గణపతిదేవుడు సైనిక బలంతో ఆంధ్రదేశాన్ని జయిం చటంతోపాటు సాంఘిక, సాంస్కృతిక రంగాలలో కూడా ఆంధ్రైక్యత కెంతో సహాయపడ్డాడు. తాను స్వయంగా వివిధ కులాలవారితో వైవాహిక సంబంధాలు ఏర్పరచుకున్నాడు. జాయపసేనాని కమ్మవంశస్థుడు. కోట బేతరాజు మొదలైనవారు తెలుగుచోడులు. వీరు క్రమంగా తెలగాలుగా మారారు. రేచర్ల రుద్రుడు మొదలైన సేనానాయకులు రెడ్లు. వీరుగాక పల్నాటి బ్రహ్మనాయని వంశస్థులైన పద్మనాయక వెలమలను మరొక కులం ఈ కాలంలో ఏర్పడ్డది. వీరికి కూడా గణపతిదేవుడు ప్రధాన పదవు లిచ్చాడు. వహపంక్తి భోజనాలను ప్రోత్సహించాడు. చాళుక్య-వీరభద్రరాజు, సాక్షాత్తు చంద్రవంశపు రాజులమని పూర్వీకుల ఘనతను

చెప్పుకుంటూ జీవించిన చాళుక్య రాజవంశంవారు. ఆంధ్రదేశంలో కమ్మ, రెడ్డి, వెలమ, కాపు కులాలు యీ కాలంలోనే ప్రస్ఫుటం కాసాగినవి. ఈ కులభేదాలు అంతఃకలహాలకు త్రోవ తీయకుండా గణపతిదేవుడు కొంత వరకు కాపాడారు.

నెల్లూరు జన్మస్థలమైన తిక్కన సోమయాజి ఓరుగల్లు వెళ్ళి గణపతి దేవుని ఆస్థానంలో తన మహాభారతం పూర్తి చేశాడు. తెలంగాణా ఆంధ్ర ప్రాంతాలను సాంస్కృతికంగా ఐక్యపరచిన సాహిత్య సృష్టికి తిక్కన మూలపురుషుడు.

## దండయాత్ర - ప్రతిఘటన దశ

కాకతీయుల పరిపాలనలో చివరివారు రుద్రమదేవి. ఆమె మనుమడు ప్రతాపరుద్రుడు. రుద్రమదేవి 1262-1296 వరకు పరిపాలించింది. ఆంధ్ర దేశమంతా ఒక స్త్రీ అసమాన ధైర్యసాహసాలతో పరిపాలించిన యీ ఘట్టం మన చరిత్రలో ప్రత్యేక స్థానం వహిస్తుంది.

స్త్రీ పరిపాలన సహించని కొందరు సామంతులు తిరుగుబాటు ప్రారంభించారు. రుద్రమదేవి అతి సమర్థతతో ఈ తిరుగుబాటును అణచివేసింది. ఒకవైపు అంతఃకలహాలను తట్టుకుంటూ ఉండగా దేవగిరి యాదవరాజు ఓరుగల్లుపై దండెత్తి వచ్చారు. ఆ దండయాత్రను కూడ ఈమె ఓడించింది.

ఈ మహాయుద్ధాలలో రుద్రమదేవికి బాసటగా నిలిచిన ప్రసిద్ధ సేనానులను మనం సర్వదా స్మరించుకోవాలి. గోన గన్నారెడ్డి, ప్రసాదిత్య నాయకుడు, రుద్రమనాయకుడు, కాయస్థులైన జన్నిగదేవుడు, త్రిపురాంతకుడు, బ్రాహ్మణులైన బెండపూడి అన్నయ్య వీరిలో ముఖ్యులు.

రుద్రమదేవి కూతురు కొడుకైన ప్రతాపరుద్రుడు 1290-1326 వరకు పరిపాలించాడు. అప్పటి కప్పుడే ఉత్తర హిందూ స్థానమంతా మహమ్మదీయుల వశమైపోయింది. దక్షిణ హిందూ దేశాన్ని కూడా స్వాధీనం చేసుకునేందుకు నాటి ఢిల్లీ పరిపాలకుడైన అల్లాఉద్దీన్ ప్రయ

తిర్చించసాగాడు. ఇతని మొదటి దండయాత్ర 1303 వ సంవత్సరంలో మాలిక్ కాఫర్ ఆధిపత్యాన జరిగింది. ఆ యుద్ధంలో మహమ్మదీయులు పూర్తిగా ఓడిపోయారు. 1309 లో రెండవసారి మాలిక్ కాఫర్ దండయాత్ర చేశాడు. ఈ యుద్ధం దీర్ఘకాలం జరిగి ఎవరికీ విజయం లభించలేదు. ప్రతాపరుద్రుడు మహమ్మదీయులకు విశేషంగా ధనమిచ్చి సంధి చేసుకున్నాడు. 1316 లో అల్లాఉద్దీన్ మరణించాడు.

మహమ్మదీయుల ప్రమాదం తగ్గినమీదట 1322 వరకు ప్రతాపరుద్రుడు స్థిరంగా రాజ్యం చేశాడు. దక్షిణ దిశగా వచ్చిన పాండ్యరాజుల దండయాత్రలను ఓడించాడు. ఇంతలోకే 1328 లో ఢిల్లీ పాలకుడైన గియాసుద్దీన్ తుగ్లక్ సైన్యాలు తెలంగాణాపై మూడవ దండయాత్ర చేశాయి. ఆంధ్ర సైన్యాలు ఘోరంగా పోరాడి ఓడిపోయాయి. ప్రతాపరుద్రుడు ఖైదు చేయబడ్డాడు. ఢిల్లీకి తీసుకు వెళ్ళుతుండగా త్రోవలో గోదావరిలోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాకతీయ రాజ్యం అస్తమించింది.

13 వ అధ్యాయం

# వీరశైవమతం

శైవమతం భారతదేశంలో అత్యంత ప్రాచీన కాలం నుండి ఉంది. మొదటి నుండి ప్రజాసామాన్యం ఎక్కువగా యీ మతాన్ని అవలంబిస్తూ వచ్చారు. భూస్వామ్య రాచరికయుగంలో నానా బాధలు పడుతూ, తమ కష్టాలకు మూలకారణం గమనించని అమాయక ప్రజల క్రోధావేశాలు; ఆగ్రహం, మతకల్లోలాల రూపంలో అనేకసార్లు చరిత్రలో ప్రత్యక్షమౌతూ వచ్చాయి. శివునిపట్ల మూఢ విశ్వాసం, కులాచారాల నిరసన, అన్యమత ద్వేషం అను మూడు ప్రధాన సూత్రాలపై ప్రారంభమైన వీరశైవ మతోద్యమం 11 వ శతాబ్దంలో కన్నడ, ఆంధ్ర దేశాలలో గొప్ప సంచలనం కలిగించింది.

కులభేదాలను నిరసించుట మినహా, యీ మతంలోని మిగతా మత సూత్రాలన్నీ పూర్తిగా మూఢ నమ్మకాలపై ఆధారపడి ఉన్నవి. కుల భేదాల ఖండన బౌద్ధ, వీరశైవమతాల సామాన్య లక్షణం కాగా బౌద్ధ మతం ప్రజాసేవ, నైతిక జీవితం - మొదలైన వానికి ప్రాధాన్యం యిచ్చింది. వీరశైవమతం అన్యమత వినాశనానికి, స్వమత ప్రచారానికి ప్రాధాన్యత నిచ్చింది. నాటి వైదికమతం కంటే ఒక అడుగు వెనకకువేసి, కేవలం మూఢభక్తి ప్రధానమైన మత ప్రచారానికి పూనుకుంది. కనుకనే యీ ఉద్యమం రెండు వందల సంవత్సరాలలో నశించింది. కులభేదాలను రూపుమాపటానికి పూనుకున్న జరిగములు తామొక కులమైనారు. కన్నడ దేశంలో లింగాయతులను పేరుతోను, ఆంధ్రదేశంలో జంగాలు అను పేరుతోను వీరు సమాజంలో ఒక భాగంగా మిగిలిపోయారు. బ్రాహ్మణ

అధికారంపట్ల ప్రజలలో గల నిరసన భావం వీర శైవమత రూపంలో వ్యక్తమైంది.

## మల్లికార్జున పండితారాధ్యుడు

కులభేదాలను నిర్మూలించ పూనుకున్న వీరశైవమతం ఆంధ్ర దేశంలో అడుగుపెట్టే సమయానికి, ఈ దేశంలో మరొక రూపంలో వీర శైవమతం అప్పుడే ప్రారంభమైంది.

శ్రీపతి, శివలెంక మంచన, మల్లికార్జున పండితారాధ్యుడు అను ముగ్గురు పండితులు బయలుదేరి ఆంధ్రలో శైవమత పునరుద్ధరణకు పూనుకున్నారు. వీరిలో మల్లికార్జున పండితారాధ్యుడు అతి ప్రసిద్ధుడు. ఈ ముగ్గురిని పండితత్రయం అని వ్యవహరిస్తారు.

మల్లికార్జున పండితుడు 1100–1170 సంవత్సరాల మధ్య జీవించాడు. జన్మస్థలము తూర్పు గోదావరి జిల్లా ద్రాక్షారామము.

అప్పటికే ఆంధ్ర బ్రాహ్మణ కుటుంబాలలో హెచ్చుభాగం అద్వైత మతాన్ని స్వీకరించాయి. భక్తి, కర్మ మార్గాలను వదలి, కేవలం జ్ఞాన మార్గం మోక్షసాధనకు చాలునని అద్వైత మత సిద్ధాంతం. ఈ సిద్ధాంతం యొక్క మంచిచెడ్డలు ఎలాఉన్నా, సాంఘికంగా మాత్రం ఒక ఫలిత కలిగింది. మోక్షమనేది ఎవరికి వారు వ్యక్తిగతంగా కృషిచేసి సంపాదించు కొనవలసింది తప్ప సమిష్టిగా చేసే భజనలు,కర్మలు మొదలైనవి నిరర్థకం అని వారి సిద్ధాంతం.ఫలితంగా, అద్వైత మతస్థులు మిగతా సమాజం నుండి వేరుపడటం జరిగింది. ప్రజాసామాన్యంలోకి ఈ మతం ఎన్నడూ వ్యాపించ లేదు. సాంఘికంగా మిగతా కులాలవారికి, బ్రాహ్మణులకు మధ్య అగడ్త ఎక్కువైంది.

ఇలాంటి కుటుంబంలో మల్లికార్జున పండితారాధ్యుడు పుట్టాడు. జ్ఞానాన్ని సంపాదించుకున్నామని భావిస్తూ అద్వైతులు మేధావుల అహం కారాన్ని మాత్రం పెంచుకుంటున్నారని అతడు భావించాడు. భక్తి ప్రధాన మైన శైవమతాన్ని చేపట్టాడు. తనకుగల పాండిత్య ప్రకర్ష నుపయోగించి

శైవమత మొక్కటే వైదిక సాంప్రదాయాల కనుగుణ మైనదని వాదించ సాగారు.

బసవయ్యవలె, ఈ పండితుడు కులాచారాలమీద ధ్యజమెత్తలేదు. కన్నడ, ఆంధ్ర వీరశైవ మతాలకు యిదే ప్రధానమైన వ్యత్యాసం. శివ శక్తిని, కులభేదాలను రెంటిని సమన్వయం చేయటానికి పూనుకున్నాడు:

"శివునిమీద వలవు, బ్రాహ్మల్యంబుతో పొత్తు
పాయలేను నేను బసవలింగ"

అన్నది పండితారాధ్యుని సూత్రం.

పండితారాధ్యుడు తన మతాన్ని ప్రచారం చేసుకుంటూ దేశమంతా తిరిగారు. జైన, బౌద్ధ పండితులను అనేకులను వోడించారు. వెలనాడు రాజధానియైన చందవోలులో రెండవ వెలనాటి చోళుడు పరిపాలిస్తూ వుండేవాడు. వెలనాటి చోళుడు మత సామరస్యకోరణి కలవాడు. అతని సభలో బౌద్ధ పండితునికి, మల్లికార్జున పండితారాధ్యునకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. దూషణ, ప్రతిదూషణలతో సభ అంతమైంది.

తమ గురువైన పండితారాధ్యుని బౌద్ధపండితుడు నిందించాడన్న కోపంతో, పండితారాధ్యుని శిష్యులైన రేమయ్య, దేవయ్యలు అర్ధరాత్రి వేళ ఆ బౌద్ధమత గురువును దారుణంగా హత్య జేశారు.

ఈ సంగతి మర్నాడు రాజుకు తెలిసి, హత్యకు కారకులెవరని ప్రశ్నించగా పండితారాధ్యుడు తానే హత్యకు కారకుడనని అంగీకరించాడు. తన పైగల అభిమానంతో తన శిష్యులు బౌద్ధగురువును హత్య చేశారని, అలా చేయటం తప్పుగాదని వాదించాడు. రాజు పండితారాధ్యునికి కళ్ళు ఊడబెరికించాడు.

ఈ ఉదంతంద్వారా నాటి ప్రచారకులెట్టి హింసాత్మక పద్ధతు లవలంబించెడివారో తెలుసుకోవచ్చు. అదే కాలంలో కన్నడ దేశంలో బసవయ్య కూడా బిజ్జలుని సంహరించి వీరశైవమత ప్రచారానికి పూనుకున్నాడు. బసవయ్యను కలుసుకోవలెనని పండితారాధ్యుడు బయలుదేరి శ్రీశైలం

వరకు వెళ్ళాడు. బసవయ్య చనిపోయినట్లు తెలిసింది. దానితో పండితా రాధ్యుడు నిరాశచెంది శ్రీశైల ప్రాంతంలో నివసిస్తూ కొద్దికాలంలో మరణించాడు.

ఈ పండితారాధ్యుడు శివతత్వసారము అను గ్రంథం వ్రాశాడు. గ్రంథం అంతా శివభక్తిని వర్ణిస్తుంది. తెలుగు భాషలోని శతకవాఙ్మయానికిది పునాది.

## జైనమత విధ్వంసన

అగ్రవర్ణాల నుండి ప్రారంభమైన భక్తి ప్రధానమైన శైవము, కన్నడదేశం నుండి వ్యాపించి కులవ్యవస్థపై ధ్వజమెత్తిన వీరశైవము కలిసిపోయాయి. ఈ కలయిక ఫలితంగా ఆంధ్రలో వీరశైవ మతం కన్నడదేశంలోవలె కులవ్యవస్థపై మహోధృతంగా దండెత్తలేదు. అయినప్పటికి తీవ్ర సాంఘిక కల్లోలాన్ని కలిగించింది. పరమత ద్వేషాన్ని వీరెంతగా బోధించారో, శివతత్వసారంలోని ఈ క్రింది పద్యాలవల్ల తెలుసుకోవచ్చు.

కం. ధ్రువముగ సర్వప్రాణుల
నవశ్యమును వేయుచుండునది హింస మదిన్
శివ నిందకు లగు పాపుల
నవిచారిత వృత్తి చంపనగు నీకానా.

కం. శివనిందా విషయంబగు
నవమానము చెప్పునట్టి యప్పున్తకముల్
అవిచారంబుగ కాల్పగ
నవ్వ చెప్పెటివాని జంపనగు నీకానా.

ఆంధ్రదేశంలో ఆనాడు ప్రజాసామాన్యంలో జైనమతం విశేషంగా వ్యాపించి ఉంది. ముఖ్యంగా స్వర్ణకారులు, వృత్తికార్మికులు, వ్యవసాయదారులు జైనమతాన్ని అవలంబించేవారు. తెలంగాణాలో ఈ మతవ్యాప్తి హెచ్చు. కాకతీయ రాజులు ప్రారంభంలో జైన మతాన్ని ఆదరించారు.

జైనమతాన్ని నాశనం చేసి, జైన దేవాలయాలను ధ్వంసం చేసి జైన గురువులను హింసించి ఆంధ్రలో ఆ మతాన్ని నామరూపాలు లేకుండా చేసింది వీరశైవ మతము. రెండవ ప్రోలరాజు తర్వాత కాకతీయ రాజులందరూ శైవమతాన్ని ఆదరించారు. జైన హింసను ప్రోత్సహించారు. అనేక జైన దేవాలయాలు శైవ దేవాలయాలుగా మారినవి. హనుమకొండలో చరిత్ర ప్రసిద్ధమైన పద్మాక్షి దేవాలయం జైనులది. జైన మతస్థుల చిత్రాలు, విగ్రహాలు ఇప్పటికీ అక్కడ వున్నాయి. ప్రోలరాజు కాలంలోనో, ఆ తర్వాతనో ఇది శైవాలయంగా మారింది. మొదట ప్రతాపరుద్రుని కాలంలో జీవించిన పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్రలోనూ, బసవ పురాణంలోను శైవమత ప్రచారకులు ఏ విధంగా అన్య మతస్థులను హింసించింది, స్వోత్కర్షా పూర్వకంగా వర్ణించబడ్డాయి.

దేవర దాసయ్య అను వీరశైవుడు పొట్లచెర్వు గ్రామంలో ఏడు జైన వసతులను ధ్వంసం చేశాడు. జైనుల విగ్రహాలను ముక్కలు చేశాడు. కోమూరులో బ్రహ్మయ్య అను శైవుడు, వాదములో జైనులను ఓడించి, వారినందరినీ చంపించినాడు. అబ్బలూరులో ఏకాంతమయ్య జైనుల ఆలయాలను ధ్వంసం చేశాడు. ఇలాంటి సమాచారం పై గ్రంథాలలో విస్తారంగా వుంది.

ఈ సందర్భంలో ఒక సందేహం సహజంగా వస్తుంది. వీరశైవ మతం కులాచారాలను విరసించింది. జైనమతం కూడా కులాచారాలను వ్యతిరేకించింది. ఈ రెంటికి ప్రధాన శత్రువు కులవ్యవస్థ. దాని పై ఆధార పద్ధతి వైదికమతం. కాని చరిత్రలో వీరశైవులు జైనుల పైన హింసా కాండ జరిపినట్లున్నది. కాని బ్రాహ్మణ మతస్థుల మీద ఎక్కడా జరిపినట్లు లేదు. కేవలం విమర్శనలతో మాత్రమే వారిని వదిలి వేశారు. దీనికి కారణం ఏమిటో తెలుసుకోవాలి.

అద్వైత సిద్ధాంతంగాని, వైదికమతంగాని ఆనాటికి ప్రజా సామాన్యంలో వ్యాపించలేదు. ప్రజలలో బలంగా వేరూనియున్న జైన మతాన్ని తొలగించి, ఆ స్థానాన్ని ఆక్రమించుకోవటమే వీరశైవుల

ప్రధాన కర్తవ్యమైంది. ఇంతేకాదు. అగ్రవర్ణస్థులైన బ్రాహ్మణులకు మొదటి నుండీ రాజాం ప్రాపకం వుంది. వారికి అగ్రహారాలిచ్చి అనేక రక్షణలిచ్చి ఆంధ్రరాజులందరూ పోషిస్తూ వచ్చారు. ఏ మత కల్లోలం వచ్చినా, యుద్ధం వచ్చినా, బాధపడేది ప్రజాసామాన్యం. తమను సూటిగా ఎదిరించిన అన్ని ఉద్యమాలను రాజులు క్రూరంగా అణచి వేశారు. తమ వ్యవస్థకు ముప్పులేనంతవరకూ జైన, శైవ, వైష్ణవ మతాలు ఏవి వ్యాపించినా వారు సహించారు. ప్రజలు మత కుల ప్రాతిపదికపై, తమలో తాము నిరంతరమూ కలహించుకోవటం, తమ అధికార భద్రతకు ఒక విధంగా లాభమేనని భావించారు. కలహాలు తీవ్రమైనప్పుడు మధ్యవర్తిగా వచ్చి యిద్దరినీ శిక్షించి, తమ పెత్తనాన్ని పునఃస్థాపితం చేసుకునేవారు.

కాకతీయులలో అత్యంత సమర్థుడైన గణపతిదేవుడు, వీరశైవ మతోద్రేకాన్ని అదుపులో పెట్టగలిగాడు. జైన, శైవులను సమదృష్టితో పరిపాలించాడు. విశ్వేశ్వర శంభువు అను మతాచార్యుడు గణపతి దేవునికి గురువు. మతద్వేష రహితమైన శైవమతాన్ని, విశ్వేశ్వరశంభువు ప్రోత్సహించాడు. శైవ వైష్ణవ విభేదాలను పక్కకు నెట్టి హరిహరనాథు నికి మహాభారతాన్ని అంకితం చేసిన తిక్కన కూడా మత సామరస్య స్థాపనకు తోడ్పడ్డాడు.

బలవంతులైన రాజులు పరిపాలించినప్పుడు, జైన శైవ ద్వేషాలు అణగివుండేవి. బలహీనుడైన రాజు అధికారంలోకి రాగానే అవి తిరిగి తలయెత్తేవి. గణపతిదేవ, రుద్రమ పరిపాలన కాలంలో అణగివున్న జైన శైవ మత ద్వేషాలు ప్రతాపరుద్రుని కాలంలో విజృంభించినవి. జైనులను శైవులు నానాహింసలు పెట్టినారు. ఈ హింసలకు తాళలేక జైనులు రాజ్యవిచ్ఛిత్తికి కుట్రలు చేస్తుండేవారు. కాకతీయ రాజ్య పత నానికి జైన శైవ మత ద్వేషాలు కూడా ఒక కారణం.

## వైదిక మత నిరసన

ఆచరణలో అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని తొలగించ లేకపోయినా వీరశైవ మతగ్రంథాలు బ్రాహ్మణాధిక్యతను నోరార నిరసించాయి. వైదిక కర్మసిద్ధాంతాలను నిశితంగా అవహేళన చేశాయి.

పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్రలోని యీ క్రింది వాక్యాలు చూడండి :

"అనమాల గొలువని అగ్రజుండైన
వసుధ మాలల మాలవాడ కావెట్లు"
"వేద భరాక్రాంతు లనగబడిన
బ్రాహ్మణ గార్దభంబులతోడ
బ్రతిసేని యాడిన పాపంబు వచ్చు."

గాడిద చాకలి మూటలను మోసినట్లు, బ్రహ్మణులు వేదాలను మోస్తూ, వల్లిస్తూ ఉంటారు. వారితో చర్చించుటే పాపము – అని సోమనాథుడు తన మతాభినివేశాన్ని చాటుకున్నాడు.

ఒక్కొక్క సందర్భంలో ఎంతటి హేతువాదయుక్తంగా వీరి వాదన లుంటాయో యీ క్రింది ఉదాహరణలు చూడండి :

"పుట్టలుదై కాలి
నాగుం బంపుమంచి
ప్రతిమ నాగులకును
పాలోసియునట్లు"
"నెఱి నంకురించు ప్రమానికి నీరు మాని
నెఱ వట్టి కొయ్యకు నీరెత్తినట్లు
కాన అనాదులు గావు లోకములు
కాన దైవంబులు గావు వేదములు"
"వేదంబు దైవమేనియును
చెవ్వుమా ఒక
దైత్యునిచే మ్రింగబడునె"

అదే విధంగా కర్మ సిద్ధాంతాన్ని యిలా విమర్శించారు:

"దనరి లక్ష్మియు ధనుర్ధరు శేయకున్న
దనకు దా వాడంబు సని యెట్లు దాకు
తెనుపొంద ఈశ్వర ప్రేరణ లేక
ధనకు దా ధర్మంబు సని యెట్లు నొందు

మత ప్రచారం కొరకు ఏమి చేసినా తప్పులేదని వీరు బహిరంగంగా చెప్పారు. భర్త శైవుడు కానిచో భార్య అతనిని వదలి వేరొకరిని స్వీకరించవచ్చు :

"పురుషుడు శివభక్తి విరహితుడేని.
పురుషుని మీరుట తరుణికి వ్రతము"

అంతేకాదు—

"వేలాడి రాముడు వెంది గోల్పడియె
వేలాడి యొకక దా విశ్వేశు గలిసె
కాన ఎట్లును నమార్గం బనరాదు
దా సీశ్వరార్థమున్ తంపునజేని"

సామాన్య నైతిక సూత్రాలను సైతం ఉల్లంఘించి మతవ్యాప్తికి పూనుకున్న వీరశైవమతం గొప్ప కల్లోలాన్ని కలిగించింది. అన్ని మతకల్లోలాలవలనే ఇదికూడా బలవత్తరమైన ఆర్థిక, రాజకీయ శక్తులకు లోబడి నశించింది. బ్రాహ్మణులలో ఆరాధ్యులు, బ్రాహ్మణేతరులలో జంగాలు అను రెండు ఉపశాఖలు మాత్రం పై మతోద్యమ చిహ్నంగా ఆంధ్రలో మిగిలిపోయారు.

వీరశైవ మత ప్రచారం తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ధోరణిని ప్రవేశపెట్టింది. మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు, తదితరు లనేకులు మత ప్రచారమే ప్రధానోద్దేశంగా గ్రంథాలు వ్రాశారు. సోమనాథుడు వ్రాసిన వాటిలో బసవపురాణము, పండితారాధ్య

చరిత్ర-రెండూ అమూల్య గ్రంథాలు. నాటి సాంఘిక పరిస్థితులను తెలుసుకోటానికి ఎంతో ఉపయోగపడతాయి. ఈ గ్రంథాలు ద్విపదలో వ్రాయబడ్డాయి. సంస్కృత ఛందస్సును వదలి దేశీయ ఛందస్సును స్వీకరించుటే గాక, భావ ప్రకటనకు ఆటంకంగా వుండే అనేక నియమాలను శివకవులు ఉల్లంఘించి తెలుగు సాహిత్యంలో కొత్తమార్గం ప్రారంభించారు. ప్రాచీన సంస్కృతిలోని చెడును మాత్రం ఖండిస్తూ, మంచిని ఏమాత్రం చూడలేని ఉద్యమాలు కాల క్రమేణ ఎలా నిర్వీర్యం గాక నశించిపోతాయో తెలుసుకునేందుకు వీరశైవమతం ఒక విస్పష్ట ఉదాహరణ.

# కాకతీయులనాటి సాంఘిక జీవితం

కాకతీయరాజుల సుస్థిర పరిపాలన ఫలితంగా, ఆంధ్ర దేశంలో వ్యవసాయం, వాణిజ్యం అభివృద్ధి చెందినవి శాతవాహనరాజుల కాలం నుండికూడా ఆంధ్రలో సముద్రవ్యాపారం విరివిగా సాగుతూన్న విషయం పాఠకులకు విదితమే. దేశం అల్లకల్లోలమై అంతర్యుద్ధాలకు నిలయమైనప్పుడు యీ వ్యాపారం మందగించి, తిరిగి సుస్థిర పరిస్థితు లేర్పడగానే అభివృద్ధి అవుతూ ఉండేది. కాకతీయ గణపతిదేవుని కాలంలో గుంటూరు జిల్లాలోని మోటుపల్లి సుప్రసిద్ధ రేవుపట్టణంగా ఉండేది. రేపల్లెకు దగ్గర సముద్రతీరాన ఇప్పటికి మోటుపల్లె ఒక పల్లీయుల గ్రామంగా నిలిచి ఉంది.

ఆంధ్రదేశంనుండి సన్నని దారంతో నేయబడిన మల్లుసెల్లాలు, తివాచీలు, కంబళీలు విదేశాలకు విస్తారంగా ఎగుమతి అవుతూ ఉండేవి.

ఓరుగల్లు నగరంలో తివాచీల నేత ఎక్కువగా జరుగుతుండేది. మల్లుసెల్లాలు మచిలీపట్టణ పరిసర ప్రాంతాలలో విరివిగా తయారయ్యేవి. క్రీ. శ. 14 వ శతాబ్దం ఆఖరులో ఆంధ్రదేశ సంచారం చేసిన మార్కోపోలో అను విదేశ యాత్రికుడు యిలా వ్రాశాడు :

"కాకతీయ రాజ్యంలో శ్రేష్ఠమైన, సన్ననైన వస్త్రములు నేయబడుచున్నవి. వీని ధర చాలా ప్రియము. నిజముగా ఆ బట్టలు సాలెగూడు వలె నుండును. ఆ వస్త్రముల ధరింపనొల్లని రాజుగాని, రాణిగాని ప్రపంచములో నుండరు."

మణిపట్టు, భూతికలము, శ్రీవన్నియ, మహాచీని, భావజతిలకము మొదలయిన పేర్లు గల రకరకాల వస్త్రాలు తయారు చేయబడుతూ ఉండేవి.

## వర్తక వాణిజ్యాలు

ఓరుగంటి సమీపంలో మట్టెవాడ అను గ్రామమున్నది. అచ్చట స్త్రీలు ధరించు మట్టెలు తదితర ఆభరణములు తయారవటంవల్ల ఆ గ్రామానికి మట్టెవాడ అని పేరు వచ్చింది. ఆదిలాబాదు జిల్లాలోని నిర్మల సమీపము వద్దనున్న కూనసముద్రం గ్రామంలో ఉక్కు కత్తుల కవసరమయిన లోహం లభించేది. ఇప్పటికీ ఆ ప్రాంతం కత్తుల పరిశ్రమకు ప్రసిద్ధి.

ఓరుగల్లు నగరం వెలుపల బ్రహ్మాండమయిన సంత జరుగుతూ ఉండేది. ఆ ప్రాంతంలో నిలచివున్న ఒక శాసనంలో ఈ క్రింది వివరాలున్నాయి.

దేశి, పరదేశి, బేహారులు విశేషముగా నల్కా వ్యాపారము చేయుచుండిరి. ఆకుకూరలు, కొబ్బరికాయలు, మామిడిపండ్లు, చింతపండు మొదలైన వస్తువులమీద, నువ్వులు, గోధుమలు, పెసలు, వడ్లు, జొన్నలు మొదలైన ధాన్యాలమీద, నూనె, నెయ్యి, ఉప్పు, బెల్లము, అవాలు, మిరియాలు, తగరము, సీసము, రాగి, చందనము, కర్పూరము, జవాది, కస్తూరి, దంతము, పట్టు, ఉల్లి, అల్లము మొదలైన వస్తువులమీద పన్నులు విధించబడేవి. వీనిని కోట వెలుపలనే ప్రభుత్వోద్యోగులు వసూలు చేసేవారు.

బరువును నిర్ణయించుటకు తులము, ఫలము, వీసము, చిన్నము మొదలైన పరిమాణము లుండేవి. ఓరుగల్లు నగరంలో మయిల సంత, మడి సంత అని రెండు సంత లుండేవని, మాంస పదార్థములు మయిల సంతలోను, కూరగాయలు మడి సంతలోను అమ్మబడుతూ ఉండేవని వల్లభామాత్యుని క్రీడాభిరామం అనే గ్రంథంవల్ల తెలుస్తున్నది.

సముద్ర వ్యాపారము విశేషంగా వృద్ధిపొందినందువల్ల నౌకా పరిశ్రమ కూడా వృద్ధి చెందింది. సముద్రయానాని కుపయోగపడే పెద్ద పడవలతో పాటు, నదులను, ఏరులను దాటటానికి తోలుతో చేసిన పుట్టము వాడేవారు. ప్రతాపరుద్రుని రాజ్యకాలంలో గోదావరి నదిపై సైనికుల

ఉపయోగార్థం కొన్ని వేల పుట్లు సిద్ధంగా వుండేవి. 'పుట్టి' ఇప్పటికీ తెలుగు దేశంలో ఏరులను దాటటానికి ఉపయోగింపబడుతూనే ఉంది.

మహమ్మదీయులతో జరిగిన యుద్ధాలలో ఆంధ్రులు ఉపయోగించిన ఆయుధాలను కూడా మనం తెలుసుకోగలం. ఓరుగలు కోటను మహమ్మదీయులు ముట్టడించినపుడు సలసల కాగే ద్రావకాలను కోటపై నుండి శత్రువులపై కుమ్మరించేవారు. రాళ్ళను రువ్వటానికి "అరద్దలు" ఆంధ్రుల చేతను, "మాంజనీకు" లు మహమ్మదీయుల చేతను వాడబడ్డాయి. ఈ రాళ్ళ వేగమును గురించి ఒక ముస్లిం చరిత్రకారుడు యిలా వర్ణించాడు:

"ముసల్మానుల రాళ్ల వేగముతో ఆకాశమం దెగురుచుండెను. హిందువుల గుండ్లు బ్రాహ్మణుల జందెముల నుండి విసరబడిన వానివలె బలహీనములై యుండెను."

ప్రతాపరుద్రీయం అనే గ్రంథములో ఆంధ్రులు యీ క్రింది ఆయుధాల నుపయోగించినట్లు ఉంది. తోమరము, ఖడ్గము, కొయ్యతో చేయబడిన గద, విల్లు, అమ్ము, లోహముతో చేయబడిన గద మొదలైనవి.

ఆంధ్రుల ఓటమికి యితర కారణాలతోపాటు, మహమ్మదీయుల ఆయుధసంపత్తి ఒక కారణం. మహమ్మదీయులు గుర్రపు దళాలను విస్తారంగా వాడారు. ఆంధ్రులు ప్రధానంగా పాదచారులు. కొద్దిపాటిగా ఏనుగులను వాడారు. ఫిరంగులు, తుపాకులు మహమ్మదీయులు ప్రయోగించారు. ఆంధ్రులకు పై ఆయుధ ప్రయోగం అనాటికి తెలియదు. కాకతీయుల అనుభవం దృష్ట్యా విజయనగర రాజులు ఈ లోపాన్ని సరిచేసుకోగలిగారు

## లలిత కళలు — సాహిత్యము

ఈ కాలంలో లలిత కళలు, సాహిత్యము విస్తారంగా అభివృద్ధి అయినాయి. ముఖ్యంగా శిల్పకళ వృద్ధి అయింది. శత్రువులకు దుర్భేద్యంగా ఉండే కోటలను నిర్మించుకోవడం నాటి రాజుల అక్క రక్షణకే అత్యవసరం. మత వ్యాప్తి కవసర మయిన దేవాలయాలు, భవనాలు,

వస్త్రాలు నిర్మించబడ్డాయి. ఈ రెండు కారణాల వల్ల లలిత కళ లన్నిటి కంటే శిల్పకళ ప్రాచీన చరిత్రలో విశేష ప్రాధాన్యత సంపాదించింది. హనుమకొండలోని వద్మాక్షి దేవాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప గుళ్లు, ఓరుగల్లు కోట, స్వయంభూదేవాలయం, కాకతమ్మగుడి మొదలైన శిల్పకళా విశేషాలు నేటికీ నిలిచి, నాటి ఆంధ్రుల కళా ప్రతిభను వేనోళ్ళ చాటుచున్నవి. జాయపసేనాని రచించి... నృత్య రత్నాకరంలోని భంగిమలు అనేకం రామప్పగుడిలో శిల్పా... ఉన్నవి. శాతవాహనుల కాలంలో ఆంధ్ర శిల్పకళ మహోజ్వలంగా వెలిగింది. వేయి సంవత్సరాల అనంతరం తిరిగి కాకతీయుల పాలనలో ఆంధ్ర శిల్పుల ప్రతిభా నైపుణ్యాలు విజృంభించాయి.

శిల్పకళ మాత్రమే గాక, సంగీత నృత్య కళలు కూడా విశేషంగా అభివృద్ధి పొందాయి.

కాకతీయ రాజులందరూ భాషాపోషణ విషయమయి ప్రత్యేక శ్రద్ధ వహించారు. మొదటి ప్రతాపరుద్రుడు "నీతిశాస్త్ర" మను సంస్కృత గ్రంథం రచించినట్లు తెలుస్తున్నది. అయితే ఆ పుస్తకం ప్రస్తుతం లభ్యం కావడంలేదు. ఇతను "విద్యాభూషణుడు" అనే బిరుదును కూడా పొందారు.

విద్యానాథుడు, విశ్వనాథుడు, మల్లికార్జునభట్టు మొదలైన సంస్కృత కవులు యీ కాలంలో నివసించారు.

వీరి సంస్కృత రచనలు సహజంగా ప్రజా సామాన్యంలో ప్రవేశం పొందలేదు. ఇందులో విద్యానాథుడు వ్రాసిన ప్రతాపరుద్రీయం లక్షణ గ్రంథం మాత్రమే కాక, నాటి చారిత్రక సమాచారాన్ని కూడా కొంత తెలియజేస్తున్నది.

శివకవులు, నూతన మార్గాల నవలంబించి, ద్విపదకవిత్వ రచనను సాగించారని యింతకు పూర్వమే తెలుసుకున్నాము. ద్విపద రచన ప్రభావం సాహిత్యంలో ప్రవేశించిన మీదట ఇతరులు కూడా ఈ పద్ధతిని స్వీకరించారు. గోన బుద్ధారెడ్డి ద్విపద రంగనాథ రామాయణం వ్రాశారు.

పాల్కురికి సోమనాధుని బసవపురాణము, పండితారాధ్య చరిత్ర, వృషాధిప శతకము మొదలైన వానివలెనే ఈ గ్రంథం కూడా విశేష వ్యాప్తి చెందింది. ఇదే కాలంలో రచింపబడ్డ భాస్కర రామాయణం ఒక విలువైన గ్రంథం. శతకరచన ఈ కాలంలో వృద్ధియైంది. మల్లికార్జున పండితారాధ్యుడు వ్రాసిన శివతత్వసారము తెలుగులో మొదటి శతకం. అతని తర్వాత కొద్దికాలానికి బద్దెన అను కవి "నీతిశాస్త్ర ముక్తావళి" అను గ్రంథం వ్రాశాడు. ప్రస్తుతం ఆంధ్రదేశంలో విస్తార ప్రచారంలో ఉన్న 'సుమతీ శతకం' కూడా ఈ బద్దెన రచించినదే. నాటి జీవిత వ్యవహారాని కవసరమైన నీతిసూత్రాలను లోకానుభవంతో కూడిన గుణపాఠాలను, పాఠకుల హృదయాలలోకి సూటిగా ప్రవేశించునట్లు వెల్లడి చేసే తెలుగు శతకాలలో సుమతీ శతకమొకటి. ఆంధ్రదేశంలో తెలుగు విద్యాభ్యాసము సుమతీ శతకంతోనే ప్రారంభమౌతున్నది.

పై సాహిత్య రచనలన్నీ ఒక పంతు. తిక్కన మహాకవి పూర్తి చేసిన మహాభారతం మరొక పంతుగా భావించవలసి వుంటుంది. తిక్కన జన్మస్థలం నెల్లూరు. మనుమసిద్ధి రాజువద్ద మంత్రిగా ఉండి. ఆ రాజ్యాన్ని మనుమసిద్ధి దాయాదులు హరించిన మీదట, ఓరుగల్లు వెళ్ళి గణపతిదేవుని ఆస్థానంలో స్థిరపడ్డాడు. గణపతిదేవుని సహాయంతో మనుమసిద్ధి తిరిగి వెల్లూరు రాజ్యం సంపాదించాడు. తిక్కన తన మహా భారతంలోని 15 పర్వములు గణపతిదేవుని ఆస్థానంలోనే పూర్తిచేశాడు. ఆంధ్ర మహాభారత ప్రశస్తిని గురించి, తెలుగు సాహిత్యంలో తిక్కనస్థానాన్నిగురించి ఇక్కడ దీర్ఘంగా చర్చించ నక్కరలేదు.

కేవలం ఆంధ్రదేశంలోను, భారతదేశంలోను మాత్రమేగాక, తిక్కన ప్రపంచ మహాకవులలోనే ఒకడుగా పరిగణింపబడవలసినవాడు. కాళిదాసు, షేక్స్పియర్ మొదలైనవారివలె తిక్కన మహాకవి గూడ ఆచంద్రతారార్కం సాహిత్యంలో స్థానం సంపాదించుకున్నాడు.

తిక్కన ప్రతిభ ఇంతటితో ముగియలేదు. సాహిత్యాభిలాషను మేధావులలో వ్యాపింపజేసి అనేకులయిన కవులను తయారుచేశాడు. 13, 14 శతాబ్దాలలో ఆంధ్రదేశంలో రచనలు సాగించిన కవులందరూ, తాము

తిక్కన శిష్యులమని ఘనంగా చెప్పుతున్నారు. దశకుమార చరిత్ర వ్రాసిన కేతన, మార్కండేయ పురాణం వ్రాసిన మారన, సుమతీ శతకం వ్రాసిన బద్దెన—యింకా అనేకులు తిక్కన శిష్యులు.

సంస్కృతంలోని మహాకావ్యాలను తెలుగులోకి అనువదించే సాంప్రదాయాన్ని నన్నయభట్టు ప్రవేశపెట్టాడు. తిక్కన యుగంలో ఈ సాంప్రదాయం విశేషంగా వృద్ధి చెందింది. సంస్కృతంలోని పురాణాలు, కావ్యాలు తెలుగులోకి తరుమా కాసాగినవి. ఈ ఆంధ్రీకరణోద్యమం రెడ్డి రాజులనాటి శ్రీనాథునివరకు కొనసాగుతూనే ఉంది.

మరొకవైపున శివకవులు, శైవమత ప్రచారాని కనువైన వాఙ్మయాన్ని సృష్టించసాగారు. ద్విపద కావ్యాలు, శతకాలు, ఉదాహరణ వాఙ్మయము పెంపుచేశారు. సంస్కృత కావ్యాలలో పురాణపురుషులు, ధీరోదాత్తులు నాయకులు కాగా, శైవ వాఙ్మయంలో మాల, మాదిగ, కమ్మరి, కుమ్మరి కులాలలో పుట్టిన శైవభక్తులు, భక్తురాండ్రు నాయకులయినారు. ఈ పద్ధతివల్ల ఆంధ్ర సాహిత్యానికి ఎంతో మేలు జరిగింది.

అధర్వణుడను జైనకవి భారతంలోని మూడు పర్వాలను తెలుగుచేశాడు. ఇతని కాలం క్రీ. శ. 1250. ఈయన భారతం నేడు లభించుట లేదు. మతద్వేష పిశాచికి ఆహుతి ఐన అసంఖ్యాక గ్రంథాలలో అది ఒకటి.

చాళుక్యుల కాలంలో ప్రారంభమైన ఆంధ్రాభిమానం కాకతీయుల కాలంలో వెల్లివిరిసి రాజులలోను, ప్రజలలోను వ్యాపించ జొచ్చింది. ఓరుగల్లు ఆంధ్రనగరము. కాకతీయ రాజులు ఆంధ్రోర్వీశులు. మత, కుల విభేదాల కతీతమైన జాతీయ భావాని కిది నాంది. మహమ్మదీయుల దండయాత్రలను ప్రతిఘటించవలసిన ఆ కాలంలో ఈ జాతీయ దృష్టి ఎంతగానో ఉపకరించింది.

శాతవాహనుల కాలంనాడు, బౌద్ధ సంస్కృతి ప్రజలను ఐక్యం చేసింది. అది నశించిన పిదప, మతద్వేషాలు, కులవిభేదాలు, ప్రాంతీయ దురహంకారాలు, వేర్వేరు ప్రాంతాల మధ్య ప్రజల మధ్య అడ్డుగోడ

ఐను సృష్టించాయి. కాకతీయుల కాలంనాటికి, ఈ అడ్డుగోడలు కొంత తొలగి, అఖిలాంధ్ర జాతీయ భావం ఏర్పడసాగింది. కనుకనే కాకతీయ పరిపాలన ఆంధ్రుల చరిత్రలో అత్యంత ప్రధానమైన యుగంగా భావిస్తున్నాము.

## గ్రామ పరిపాలన

కాకతీయుల కాలంలో రాజ్యపరిపాలనలో కొన్ని ప్రధానమైన మార్పులు జరిగాయి. గ్రామ పరిపాలనలో రెడ్డి, కరణము, తలారి మొదలైనవారు కాకతీయులకాలంనాటికే ఉన్నారు. కాకతీయులకు పూర్వం కరణం వృత్తి విశ్వబ్రాహ్మణుల చేతులలో ఉండేది. విశ్వబ్రాహ్మణులు ప్రారంభంలో జైనమతాన్ని, తర్వాత వీరశైవమతాన్ని స్వీకరించారు. మతాభినివేశ ఫలితంగా రాజులకు వ్యతిరేకంగా జరిగే కుట్రల్లో ప్రధాన పాత్ర వహిస్తూండేవారు. గణపతిదేవుని కాలంలో, ఒక ప్రధానమైన మార్పు జరిగింది. అంతవరకు వున్న విశ్వబ్రాహ్మణులందరిని కరణీకం వృత్తి నుండి తొలగించి, బ్రాహ్మణులను గణపతిదేవుడు ఈ వృత్తిలో స్థిరపరచాడు. వీరే నియోగులు. అదే వ్యవస్థ ఇప్పటికీ నిలిచిఉంది. ఆంధ్ర దేశంలో ముప్పాతిక మూడువంతులు కరణం వృత్తి బ్రాహ్మణుల చేతిలో ఉన్న విషయం పాఠకులకు విదితమే.

ఈ ప్రధానమైన మార్పుకు గణపతిదేవుని ప్రోత్సహించిన మంత్రి గోపరాజు రామప్రధాని అని ఆంధ్రదేశంలోనే గ్రామ కవిలెలలో ఉంది.

గ్రామోద్యోగులకు, తలారి మొదలయినవారికి మాన్యములు ఇవ్వబడేవి. భటవృత్తి మాన్యములు దేవాదాయ, ధర్మాదాయాలకు సంబంధించిన ఈనాములు ఇవ్వడం కాకతీయుల కాలంలో సర్వసామాన్యం.

## సాంఘిక నైతిక జీవనము

కాకతీయుల కాలంలోని ఆంధ్ర సాంఘిక పరిస్థితిని గురించి కూడా మనం తెలుసుకోవలసి ఉంటుంది. రెడ్డి, వెలమ, కమ్మ, తెలగ విభాగాలు ఈ కాలంలో ఘనీభవించాయి.

కులాలు ఏర్పరడమే గాక, కుల విద్వేషాలు కూడా హెచ్చు కాసాగినవి. గణపతిదేవుడు దూరదృష్టితో అన్ని కులాల వారికి సమానగౌరవం యిచ్చిన విషయం లోగడ తెలుసుకున్నాము. ఆ విధానాన్ని త్యజించి ప్రతాపరుద్రుడు వెలమ నాయకులకు విశేష గౌరవం ఇచ్చారు. తమకు జరిగిన అవమానం వల్ల క్రుద్ధులయి రెడ్డిరాజులు, ప్రతాపరుద్రునిపట్ల ద్వేష భావము వహించారు. ముస్లిం దండయాత్రలను ప్రతిఘటించే సమయంలో మనస్ఫూర్తిగా పోరాడక, వెనుకడుగు వేశారు. ప్రతాపరుద్రుని కాలంలో, గండికోటలో ఒక తిరుగుబాటును కూడా తెచ్చారు.

ప్రతాపరుద్రుడు వెలమవారియెడల జూపిన ప్రత్యేక అభిమానం కాకతీయరాజ్య పతన కారణాలలో ఒకటి. తత్ఫలితంగా రెడ్డి, కమ్మ కులాలకు, వెలమలకు నిరంతరం కలహాలు సాగాయి. కాకతీయుల పతనానంతరం, తెలంగాణాలోని రాజుకొండలో ప్రోలయ నాయకుడను పేరుగల వెలమ ప్రభువు; కొండవీటి సీమలో రెడ్డిరాజులు పరిపాలన సాగించారు.

వేశ్యాకులానికి నాటి సమాజంలో విశేష ప్రాధాన్యత ఉండేది. అన్ని కులాల వలెనే అది ఒక కులంగా భావించబడేది. వేశ్యావృత్తికి సంబంధించిన శాసనాలను ప్రభుత్వం చేసేది. శాసనోల్లంఘనం చేసిన వేశ్యలకు, విటులకు శిక్షలు విధించేవారు. కాకతీయుల కాలంలో అన్ని కులాలలోను వేశ్యావృత్తి వ్యాపించి వున్నట్టు క్రీడాభిరామం ద్వారా తెలుస్తున్నది. బ్రాహ్మణ కులం మొదలుకొని; మాలలవరకు, బహిరంగంగానో, రహస్యంగానో వ్యభిచారం సాగుతుండేది. బ్రాహ్మణ పూటకూటిళ్ళు వ్యభిచార నిలయాలుగా ఉండేవని క్రీడాభిరామం ద్వారా తెలుస్తున్నది.

వేశ్యలను పోషించడం గౌరవంగా నాటి అధికారవర్గాలు భావించాయి. ప్రతాప రుద్రుని ఉంపుడుగత్తె మాచల్దేవి భవనం, ఓరుగల్లులో అత్యంత సుందర భవనాలలో ఒకటి. ఈ నైతిక విశృంఖలత్వము అధికార వర్గాలలో మాత్రమేగాక ప్రజలలో కూడా వ్యాపించింది. బాల్య వివాహాలు వ్యాపించసాగాయి. నిరంతర యుద్ధాల ఫలితంగా జననష్టం కలిగి, బాలవితంతువుల సంఖ్య హెచ్చింది. మాంచాల వంటి అభిమానవతులైన ఒకరిద్దరు

వహగమనం చేసినా, ఆ ఆచారం, విరివిగా మాత్రం లేదు. ఏకపత్నీవ్రతం దాదాపు శూన్యం. ఆస్తి, అధికారం, దర్పం కలవారు యిద్దరు, ముగ్గురు, భార్యలను చేసుకోవటం సర్వసామాన్యంగా ఉండేది. నాటి వైవాహిక నైతిక జీవనం ఎంత కల్మషపూరితంగా ఉండేదో తెలుసుకునేందుకు క్రీడాభిరామం చదివితే చాలు. శ్రీకాకుళ స్వామి ఉత్సవ వర్ణనలో వల్లభామాత్యుడు అతి నగ్నంగా, వెగటుగలిగించే విధంగా నాటి వ్యభిచారవృత్తిని వర్ణించాడు.

ఒక వైపున వర్తక వాణిజ్యాలు, లలితకళలు, సాహిత్యం వృద్ధి పొందాయని, ఆంధ్రదేశాన్నంతా ఐక్య పరిపాలన క్రిందకు తెచ్చిన కీర్తి కాకతీయులదని అంటున్నాము. మరొక వైపున నాటి సాంఘిక, నైతిక జీవనం అత్యంత కలుషితంగా ఉండేదని కూడా చెబుతున్నాము. ఇది పరస్పర విరుద్ధం కాదా అను ప్రశ్న ఉదయించవచ్చును.

ఇందులో అసందర్భ మేమీలేదు; అది భూస్వామ్యయుగం. కుల వ్యవస్థపై ఆధారపడిన హిందూ సమాజంలో వివిధ కులాల మధ్య హెచ్చు తగ్గులు అంతఃకలహాలకు త్రోవ తీసేటంతగా వృద్ధి అయ్యాయి.

దీనికితోడు నిరంతర యుద్ధాలు. ఎప్పుడు ఏ క్షణాన పర రాజులు దండెత్తివస్తారో తెలియదు. ప్రజలలో సైనికతత్వం, వీరావేశం, ఎక్కువగా ఉండేవి. వీరుల ఆరాధనలు, జాతరలు, ఉత్సవాలు, జంతు బలులు, ఆటపాటలు, నృత్యగీత వినోదాలు, వీటితో నాటి నాగరిక జీవితం గ్రామ జీవితం నిండివుండేది. సైన్యాలు కదిలేటపుడు వారి వినోదార్థం వేశ్యా బలగాన్ని వెంట తీసుకు వెళ్ళేవారు. పల్నాటియుద్ధ వర్ణనలో యీ విషయం వుంది.

వీటన్నిటికి నాటి వీరశైవమతంకూడా తోడ్పడ్డది. ఏదో విధంగా మత ప్రచారం చేయటమే వారి ఉద్దేశ్యం. జంగములలో కొందరు మిండ జంగము లుండేవారు. వారు సాధారణ నీతిసూత్రాలకు కట్టుబడరు. మత ప్రచారమే వారి లక్ష్యము, కాబట్టి అన్నిటికి అతీతులు. వారు స్వేచ్ఛగా వ్యభిచరించేవారు

ఒక్క కళ్యాణిలో 12 వేలమంది మిండ జంగములు ఉండేవారని వారికి కావలసిన వేశ్యలను బసవయ్య పంపుతుండేవాడని బసవ పురాణంలో వుంది.

ఈ నైతిక విశృంఖలత్వము నాటి సమాజంలోని ప్రధాన బల హీనతలలో ఒకటి. కుల విద్వేషాలు నైతిక విశృంఖలత్వము. మూఢ భక్తితో కూడిన మతావేశాలు-ఇవి కాకతీయ సామ్రాజ్య పతనానికి గల అంతరంగిక కారణాలు. వీటి ఫలితంగానే మహమ్మదీయులు ఓరుగల్లును జయించగలిగారు. కాకతీయుల ఘనకార్యాలను గుర్తించటంతో పాటు నాటి భూస్వామ్య వ్యవస్థలోని విచ్ఛిన్నకర పతన శక్తులను కూడా గమ నించినప్పుడే, ప్రాచీన చరిత్రను గురించి మనము సమగ్ర అవగాహన ఏర్పరచుకోగలము. భూస్వామ్య యుగంలో అంతర్వైరుధ్యం సహజం.

15 వ అధ్యాయం

# ముసునూరి నాయకులు-రెడ్డిరాజులు

కాకతీయ సామ్రాజ్యము క్రీ. శ. 1323 తో అంతమొందింది. ఢిల్లీ పాదుషా అయిన గియాసుద్దీన్ తుగ్లక్ సైన్యాలు తెలంగాణా ప్రాంతాన్నంతా స్వాధీనం చేసుకొన్నాయి. మహమ్మదీయుల దండయాత్ర అంతటితో ఆగలేదు. గియాసుద్దీన్ తుగ్లక్ కుమారుడైన ఉల్లూఖాను నెల్లూరు మీదుగా మధురవరకు వెళ్ళి దండయాత్రలు చేశాడు. మదురలో మొట్టమొదటగా ఒక రాజ్యాన్ని స్థాపించారు. నెల్లూరును కూడా ఒక మహమ్మదీయ నవాబు కొంతకాలం పరిపాలించాడు. ఉల్లూఖాను రాజమహేంద్రవరం మీదుగా సింహాచలము, కటకం వరకుగూడా దండయాత్రలు చేశాడు. 1322-1326 సంవత్సరాల మధ్య ముద్రించబడిన గియాసుద్దీన్ తుగ్లక్ నాణెములు ఈమధ్యనే పశ్చిమ గోదావరిలోని ఏలూరువద్ద లభించాయి. 1324 లో రాజమహేంద్రవరంలోని ఒక హిందూ దేవాలయం ముస్లిం మసీదుగా మార్చివేయబడ్డది.

ఉత్తర హిందూస్థానం నుండి దిగివచ్చిన యీ మహమ్మదీయుల దండయాత్రలు దేశంలో అల్లకల్లోలం కలిగించాయి. ఆంధ్రుల రాజకీయ స్వాతంత్ర్యం నశించటంతోపాటు, అన్యమతస్థులయిన మహమ్మదీయుల చేతులలో ప్రజలు అనేక అగచాట్లకు గురి అయినారు.

మహమ్మదీయుల చేతులలో ప్రజలు అనుభవించిన బాధలను ప్రోలయనాయకుని విలాస శిలా శాసనం ఇలా వర్ణిస్తున్నది:

"ధనం కోసం మహమ్మదీయులు భాగ్యవంతులపై ఎన్నో పాప కార్యాలు చేశారు. పూజలు చేసుకోరాదని బ్రాహ్మణులను ఆజ్ఞాపించారు. దేవాలయాలను, విగ్రహాలను ధ్వంసం చేశారు. రైతులనుండి ధాన్యాన్ని

బలవంతంగా స్వాధీనం చేసుకొంటున్నారు. బీదలు, భాగ్యవంతులు అందరూ ఒకేవిధంగా నలిగిపోతున్నారు. భార్యలను ఎత్తుకుపోతున్నారు. ఈ మునల్మానుల భీకర కృత్యాలు విన్నవెంటనే కొందరు మరణించారు. ఈ పరిస్థితులలో తెలుగు ప్రజలు ఎలా జీవించగలరు. మునల్మాను రాక్షస కృత్యాల ఫలితంగా తెలుగుదేశం అంతా దావానలంలో దగ్ధమవుతున్న మహారణ్యంవలె వుంది."

బార్నీ అనే ఒక ముస్లిం చరిత్రకారుడు ప్రజల యిబ్బందులను ఇలా వర్ణించాడు:

"రైతుల వద్దనుంచి అధికంగా పన్నులు వసూలు చేయటానికి మల్లాను పూనుకున్నారు. అంతకు పూర్వంకంటె 5 రెట్లు, 10 రెట్లు పన్నులను పెంచారు ఈ పన్నుల భారంతో అనేక రైతు కుటుంబాలు నాశనమయినవి. బీదరైతులు దరిద్రులయి బిచ్చగాళ్ళయిపోయినారు. ధనికులు కోపంతో గ్రామాలను వదలి వెళ్ళి తిరుగుబాటు సేనలో చేరారు. భూములు బీడువడ్డాయి. వ్యవసాయం పూర్తిగా సన్నగిల్లింది."

ఈ దాసత్వం నుండి తెలుగుదేశా న్నుద్ధరించటానికి 14 వ శతాబ్దంలో అనేకులు ప్రయత్నించారు. ముసునూరు నాయకుల నాయకత్వాన ఆంధ్రదేశంలోని 74 మంది సామంతులు ఏకమై కోస్తాతీరం విముక్తి వరుముకట్టారు. వీరసోమ దేవరాజు అను ఆర్వీటి నాయకుడు రాయలసీమలో తిరుగుబాటు లేవదీసాడు. హరిహర, బుక్కరాయలు ఆనెగొంది రాజ్యాన్ని స్వాధీనపరుచుకొని స్వతంత్ర హిందూరాజ్య స్థాపనకు హంపి విజయనగరంలో పునాదులు వేశారు. మహమ్మదీయుల దండయాత్ర ఫలితంగా ధ్వంసమయిన తెలుగుదేశాన్ని పునరుద్ధరించటానికి జరిగిన యీ ప్రయత్నాలు 14 వ శతాబ్దపు ఆంధ్ర జీవితంలో ప్రధాన ఘట్టాలు. వీరిలో ముసునూరి నాయకులు ముఖ్యులు.

## ముసునూరి నాయకులు

కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో సామంతులుగా వున్న వరిపాలకులు, దావగా మిగిలిన సేనానాయకులు ఏకమై ముస్లింలను ప్రతి

మట్టుపెట్టవలెనని నిశ్చయించారు. ముసునూరి ప్రోలయ వీరికి నాయకుడు. ముసునూరు కృష్ణాజిల్లా, నూజివీడు తాలూకాలో వుంది. ముసునూరు నాయకులు కమ్మవారు. ఆ ప్రాంతాన్ని ప్రోలయ నాయకుడు పరిపాలిస్తూ వుండేవాడు. ప్రోలయ నాయకుని నాయకత్వాన్ని, పిఠాపురం ప్రాంతానికి చెందిన కొప్పుల ప్రోలయ్యానాయకుడు, అద్దంకిని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి, రేచర్ల సింగమనాయకుడు, కొలను రుద్రదేవుడు, ఇందులూరు అన్నయ్య మంత్రి ఇంకా అనేకులు అంగీకరించారు. వీరంతా కలిసి, ప్రజలను సంఘటితపరచి, క్రీ. శ. 1325-26 ప్రాంతంలో కోస్తా జిల్లాలను విముక్తి చేశారు. వారు తిరుగుబాటు సేనలను సమకూర్చుకొని, అడవులలో, కొండలలో తలదాచుకుంటూ, సమయం కనిపెట్టి ముస్లిం సైన్యాలపై దాడిచేస్తూ వుండేవారని మల్లవరం, వంతమాగులూరు శాసనాలద్వారా తెలుస్తున్నది.

ప్రజల సహాయంతో జీవిస్తూ, శత్రువులపై మెరుపు దాడులు చేస్తూ ముస్లిం సేనలను చికాకు పరచేవారు. ప్రబలమయిన ముస్లిం సేనలను ముఖాముఖి ఎదుర్కొనుటకు సమయంకొరకు కాచివుండేవారు తెలంగాణా ప్రాంతం పూర్తిగా ముస్లింల స్వాధీనం కావటంవల్ల, వీరు కోస్తా ప్రాంతంలో భద్రాచలం కొండ ప్రాంతాలలో తమ విముక్తి కార్యక్రమం ప్రారంభించారు. 1326 లో భద్రాచలం వద్ద రేకపల్లెలో వీరు తిరుగుబాటు జెండా లేవనెత్తారు.

అదే సంవత్సరం ఢిల్లీ పాదుషా గియాసుద్దీన్ తుగ్లక్ మరణించాడు. అతని కొడుకు ఉల్లూఖాన్ వరంగల్లు వదలి ఢిల్లీ వెళ్ళాడు. దానితో తెలంగాణా ప్రాంతంలో కూడా ఈ తిరుగుబాటుదారుల కార్యక్రమాలు విస్తరించసాగాయి.

ప్రోలయనాయకుడు మరణించాడు. అతని తమ్ముడు కాపయ నాయకుడు తెలంగాణా విముక్తి పోరాటానికి నాయకత్వం వహించాడు.

ఈ విధంగా పది సంవత్సరాలకు పైగా గెరిల్లా యుద్ధ చర్యలు జరిపి, చివరకు 1336-37 సంవత్సరాలలో కాపయనాయకుడు ఢిల్లీ సేనాని

అయిన మాలిక్ మక్బూలును ఓడించి ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నారు. కాకతీయ రాజ్య పతనానంతరం 13 సంవత్సరాలు ఓరుగల్లుని, సుల్తానుపురమను పేరుతో నవాబుల పరిపాలన క్రింద ఉంది తిరిగి హిందూరాజా స్వాధీనమయింది.

ఇదే కాలంలో ఆర్వీటి సోమదేవరాజు రాయలసీమలోని సాతాని కోట, కందనోలు, గంగినేనికొండ, యాదగిరి మొదలయిన కోటలను స్వాధీనం చేసుకొని మహమ్మదీయులను ఆ ప్రాంతం నుండి తరిమివేశారు.

అదే సంవత్సరం హరిహర, బుక్కరాయలు విద్యారణ్య పండితుని ప్రోత్సాహంతో హంపి, విజయనగరం సామ్రాజ్యానికి శంకుస్థాపన చేశారు.

## కా ప య నా య కు డు

కాపయనాయకుడు ఓరుగల్లు రాజధానిగా తెలంగాణాను 1336 నుండి 1368 వరకు పరిపాలించాడు. ఆంధ్రదేశాధీశ్వర, ఆంధ్ర సురత్రాణ బిరుదులు వహించాడు. కాకతీయ సామ్రాజ్యానికి లొంగివున్న 75 గురు ఆంధ్ర సామంతులు కాపయనాయకుని, కాకతీయ సామ్రాజ్యానికి వారసునిగా గుర్తించారు.

ఈ ఐకమత్యం కొద్దికాలం మాత్రమే నిలిచింది. అంతఃకలహాలు ప్రారంభమయినవి. అనుమనగల్లు, పిల్లలమఱ్ఱి నల్లగొండజిల్లా ప్రాంతాలను పరిపాలిస్తూన్న రేచెర్ల వంశస్థుడైన సింగమనాయకుడు కాపయనాయకుని ధిక్కరించి, పిల్లలమఱ్ఱికి 10 మైళ్ళ పశ్చిమంగా వున్న రాజకొండలో ఒక స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. సింగమనాయకుడు వెలమ, కాపయనాయకుడు కమ్మ. బహుశా ఈ కుల విభేదాలే అంతఃకలహానికి కారణమయి ఉండవచ్చు.

ఇది ఇలా ఉండగా, గుల్బర్గాను పరిపాలిస్తున్న అల్లాఉద్దీన్ హసన్‌గంగూ, ఢిల్లీ సుల్తాను పరిపాలనను ధిక్కరించి, స్వతంత్ర రాజ్య స్థాపనకు యత్నాలు చేయసాగాడు. పొరుగున ఒక స్వతంత్ర రాజ్యం ఉండటం దేశ క్షేమానికి లాభకరమని భావించిన కాపయనాయకుడు, ఆ

ప్రయత్నాలకు సాయం చేసి, 1500 అశ్వికదళాన్ని హసన్‌గంగూకు సాయం పంపాడు. 1347 లో, ఢిల్లీ సుల్తానుల దక్కను రాజధాని ఐన దౌలతాబాద్‌ను జయించి, బహమనీ రాజ్య స్థాపన చేశారు. కాని కాపయ నాయకు డాశించినట్లు బహమనీ రాజ్య మిత్రత్వము ఎంతోకాలం నిలవ లేదు. తమ అవసరం తీరిన వెంటనే బహమనీ సుల్తానులు, తెలంగాణాపై దండయాత్రలు చేయసాగారు.

1347 లో అల్లాఉద్దీన్ హసన్‌గంగూ ఓరుగల్లుపై దండెత్తి కాపయనాయకుని ఓడించి, కౌలాస్ దుర్గాన్ని, ఏనుగులను, తదితర బహుమానాలను స్వీకరించి తిరిగిపోయినాడు. కాపయనాయకుని రాజ్యానికి మాత్రం భంగం రాలేదు.

1357 లో తిరిగి అల్లాఉద్దీన్ తెలంగాణాపై దాడి చేసి కృష్ణానదిని దాటి కొండవీటి రెడ్డిరాజులతో తలపడ్డాడు. ఈ దండయాత్రకు కాపయ నాయకుడు తల ఒగ్గాడు. ధరణికోటవద్ద కొండవీటి రెడ్డి రాజయిన కొటయ వేమారెడ్డి, తురుష్కులతో ఘోర యుద్ధంచేసి ఓడించాడు. అల్లాఉద్దీన్ పరాజితుడై పారిపోయినాడు.

1361 లో కాపయనాయకుడు, విజయనగర రాజైన బుక్కరాయలు కలిసి, కౌలాస్ దుర్గాన్ని బహమనీ రాజులనుండి తిరిగి స్వాధీనం చేసు కునేందుకు యత్నించారు. కాపయనాయకుని కుమారుడు వినాయక దేవుడు. విజయనగర రాజులు పంపిన 20 వేల గుర్రపు దళం సాయంతో కౌలాస్ దుర్గాన్ని ముట్టడించాడు, కానీ బహమనీ సుల్తాన్ మహమ్మద్‌షా ఈ యుద్ధంలో గొప్ప విజయాన్ని పొందాడు. ఓరుగల్లు ద్వారం వరకు బహమనీ సైన్యాలు నడిచాయి.

మరు సంవత్సరం, 1362 లో మహమ్మద్ షా తిరిగి దండయాత్రలు చేసి, వినాయకదేవుని నగరమైన వేలంపుట్టం స్వాధీనం చేసుకొని, వినాయక దేవుని చిత్రవధ చేసి, సజీవంగా దహనం చేయించాడు.

ఈ రాక్షసత్వానికి క్రోధోద్రేకులైన తెలంగాణా ప్రజలు మహమ్మద్ షా సైన్యాలపై గెరిల్లాదాడులు చేసి వారిని పారద్రోలారు. చెట్ల

పెన, పాడుబడిన భవనాలలోను దాక్కొని, రాత్రిళ్ళు సేనలపై దాడి చేసి తెలంగాణా ప్రజలు 4 వేల ఆశ్విక బలగంలో 2500 మందిని నాశనం చేశారు. మహమ్మద్ షాకు ప్రమాదకరమైన గాయం తగిలింది.

మహమ్మద్ షా దౌర్జన్య కాండను భరించలేక కాపయనాయకుడు ఢిల్లీ సుల్తాను సహాయాన్ని అర్థించాడు. కాని ప్రయోజనం లేకపోయింది. చివరకు మహమ్మద్ షాతో రాజీ చేసుకుని, గోల్కొండ ఉభయ రాజ్యాలకు పరిహద్దుగా అంగీకరించాడు

బహమనీ రాజులతో కాపయనాయకుడు నిరంతర యుద్ధాలు చేస్తూం డగా, రేచర్ల సింగమనాయకుడు తన రాజ్యాన్ని విస్తరించుకో సాగాడు. సింగమ నాయకుని కుమారుడు అనపోత నాయకుడు. మహబూబ్ నగర్ జిల్లాలోని జల్లిపల్లిని జయించి ఓరుగల్లుమీదికి దాడి వెడలాడు. 1368 లో వరంగల్ జిల్లాలోని భీమవరం వద్ద జరిగిన యుద్ధంలో అనపోత నాయకుడు కాపయనాయకుని ఓడించి, అతనిని వధించాడు. అంతటితో ముసునూరి నాయకుల ప్రతిభ అంతరించింది.

కాపయ ఒక స్థానిక ప్రభువు. ప్రజల కడగండ్లు, ముస్లిం దాస్య త్వంవల్ల కలుగుతున్న దుష్ఫలితాల్ని చూసి హృదయం కరిగి స్వతంత్ర రాజ్య స్థాపనకు నడుంకట్టిన మహావీరుడు. ప్రజలను సమీకరించి గెరిల్లా యుద్ధాలు నడిపిన ప్రజానాయకుడు. అట్టి వీరులు చిరస్మరణీయులు.

## రేచెర్ల పద్మనాయకులు

కాపయనాయకుని మరణానంతరం, తెలంగాణాను ఒక శతాబ్ద కాలం రేచెర్ల పద్మనాయకులు పరిపాలించారు.

అనపోతనాయకుడు, ఓరుగల్లు, పానగల్లు, మెదకు, గోల్కొండ దుర్గాలు స్వాధీనం చేసుకొని, ఆంధ్ర దేశాధీశ్వర బిరుదు వహించాడు. ఇతని తమ్ముడు మాధవనాయకుడు దేవరకొండ వద్ద పరిపాలించసాగాడు. పద్మ నాయకులు వెలమలు. ఆంధ్రలోని వెలమ ప్రభువుల కందరికీ మూలపురుషులు.

బహమనీ సుల్తానులు, పద్మ నాయకులు కలిసి విజయనగరరాజుల మీద, కొండవీటి రెడ్డిరాజులమీద దండయాత్రలు చేస్తుండేవారు. పరస్పర రాజ్యలోభం, అధికార వాంఛ తప్ప ఈ అంతర్యుద్ధాలకు వేరు కారణం లేదు. మతం వెనకడుగు పట్టింది. అధికార కాంక్ష పైచేయి అయింది.

అనపోతనాయకుని అనంతరం అతని కుమారుడు రెండవ సింగమ నాయుడు, రాచకొండ రాజధానిగా తెలంగాణాను పరిపాలించాడు. ఇతడు సర్వజ్ఞ సింగమ నాయకుడని ప్రసిద్ధి చెందాడు. బమ్మెర పోతన ఇతని కాలంలో నివసించాడు.

రెండవ సింగమ నాయకుని అనంతరం, రెండవ అనపోత నాయకుడు, ఆ పిమ్మట మూడవ సింగమ నాయకుడు రాచకొండను పరిపాలించారు. మూడవ సింగమ నాయకుడు, బహమనీ రాజ్య స్నేహాన్ని వదలి, విజయనగర రాజుల స్నేహాన్ని చేశాడు.

దేవరకొండలో వీరి దాయాదులు పరిపాలించేవారు. వారిలో 1455 ప్రాంతంలో పరిపాలించిన లింగమ నాయకుడు గొప్ప వీరుడు.

లింగమ, సింగమ నాయకులు, విజయనగరం రాజుల సాయంతోను, గజపతుల సాయంతోను బహమనీ రాజుల నోడించవలెనని కృషి చేశారు. 1461 లో లింగమ నాయకుడు, కపిలేశ్వర గజపతి సాయంతో ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నాడు. కాని తామాశించినట్లు స్వతంత్రులు కాలేదు సరిగదా, పద్మనాయకులు గజపతులకు సామంతులు కావలసి వచ్చినది. కపిలేశ్వర గజపతి సేనాని హంవీరుడు ఓరుగల్లులో పరిపాలించ సాగాడు.

లింగమ నాయకుడు 1481 లో మరణించాడు. అంతటితో పద్మ నాయకుల స్వతంత్ర ప్రభుత్వం అంతమైంది. తెలంగాణా అంతా బహమనీ సుల్తానుల వశమైంది.

## కొండవీటి – రెడ్డి రాజులు (1324-1424)

గుంటూరు జిల్లా అద్దంకిలో ప్రోలయ వేమారెడ్డి అను రెడ్డిరాజు 1324 లో స్వతంత్ర్య ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. ప్రోలయ వేమారెడ్డి

గుంటూరు. నెల్లూరు జిల్లాలు జయించి, శ్రీశైలం వరకూ తన రాజ్యాన్ని విస్తరింపచేశాడు. ఈతడు 74 కోటలను కట్టించాడు. వినుకొండ, కొండవీడు, కొండపల్లి, బెల్లంకొండ, చందవోలు, ధరణికోట మొదలైన కోటలన్నీ వేమారెడ్డి కట్టించినవే.

ఇతని కుమారుడు అనపోతారెడ్డి రాజధానిని అద్దంకి నుండి కొండవీటికి మార్చాడు. అప్పటి నుండి కొండవీడే రెడ్డిరాజులకు రాజధానిగా వుంది. ఇది గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకాలో వుంది. కొండవీడు రాజధానిగా రెడ్డిరాజులు 1424 వరకు పరిపాలించారు. సుమారు నూరు సంవత్సరాలు నిలచిన యీ కొండవీటి రాజ్యాన్ని పరిపాలించిన వారిలో అనవేమారెడ్డి ముఖ్యుడు. ఇతడు కృష్ణా, గోదావరి జిల్లాలను మాత్రమే గాక, విశాఖ జిల్లాను సైతం జయించి, తన రాజ్యాన్ని విస్తరింప జేశాడు. అనవేమారెడ్డి దానధర్మాలకు ప్రసిద్ధుడు.

ఇతని తర్వాత కుమారగిరిరెడ్డి, పెదకోమటి వేమారెడ్డి పరిపాలించారు 1424 లో యీ వంశం అంతరించింది.

కొండవీటి రెడ్డిరాజులలో ఒకడైన కుమారగిరిరెడ్డి తన బావయైన కాటయ వేమారెడ్డి యొక్క శౌర్యసాహసాలకు మెచ్చి, రాజమహేంద్రవరం రాజ్యం అతనికి యిచ్చివేశాడు. అప్పటినుండి కొండవీడు, రాజమహేంద్రవరం రెండు ప్రత్యేక రాజ్యాలైనవి. కాటయవేముడు రాజమహేంద్రవరంలోను, కోమటి వేముడు కొండవీడులోను పరిపాలించసాగారు. వీరిద్దరి మధ్య కలహాలు కొనసాగాయి. ఈ కలహాలలో రాచకొండ పద్మనాయకులు, హంపి, విజయనగర రాజులు జోక్యం కలిగించుకోసాగారు. ఈ యుద్ధాల ఫలితంగా 1414 లో రాజమహేంద్రవర పరిపాలకుడైన కాటయవేముడు మరణించాడు. ఆ తర్వాత అల్లాడ వేమారెడ్డి, వీరభద్రారెడ్డి అను రాజులు 1447 వరకు రాజమహేంద్రవరాన్ని పరిపాలించారు.

ఇవి మాత్రమేగాక తూర్పు గోదావరి కోరుకొండలో ఒకటి, నెల్లూరు జిల్లా కందుకూరులో ఒకటి స్వతంత్ర రాజ్యాలు స్థాపించబడ్డాయి. వీరి మధ్య నిరంతర అంతఃకలహాలు సాగుతూండేవి. వీటన్నింటినీ కబ

శించి ఒకే సామ్రాజ్యాన్ని స్థాపించవలెనని, హంపి, విజయనగరరాజులు, కళింగ గజపతులు, బహమనీ సుల్తానులు నిరంతరం ప్రయత్నిస్తూనే వచ్చారు.

కొండవీటి రెడ్డిరాజ్యం 1425 లో విజయనగర సామ్రాజ్య అంత ర్భాగమైంది. రాజమహేంద్రవర రాజ్యం విజయనగర సామ్రాజ్యానికి సామంత రాజ్యంగా కొంతకాలం కొనసాగింది.

రాజమహేంద్రవరము సామంతుడైన వేమారెడ్డి, ఉత్తరదిశగా దండెత్తి వెళ్ళి, 1432 లో దక్షిణ కళింగాన్ని జయించారు. 1434 లో కళింగగాంగవంశం అంతమైంది. గజపతిరాజులు కళింగదేశాన్ని పరిపాలించ సాగారు.

గజపతి రాజులు ఆంధ్రదేశాన్నంతా జయించ పూనుకున్నారు. కపిలేశ్వర గజపతి 1447 లో రాజమహేంద్రవరాన్ని స్వాధీనం చేసు కున్నారు. అంతటితో రాజమహేంద్రవరం రెడ్డిరాజ్యం అంతరించింది.

1513 లో కృష్ణదేవరాయలు ఆంధ్ర దేశాన్నంతా జయించువరకు, సర్కారు జిల్లాలలోని రాజమండ్రి, కొండవీడు, బెల్లంకొండ, ఉదయ గిరి - మొదలైన ప్రధాన దుర్గాలు ఒరిస్సా అధిపతులైన గజపతుల పాలన క్రింద ఉన్నవి.

## సమాజం – సాహిత్యం

రాజుల రాజ్యకాంక్షలో హిందూ ముస్లిం విచక్షణ నశించింది.

'శత్రువు యొక్క శత్రువు మిత్రుడు' అను సూత్రం ఈ రాజు లంతా పాటించారు.

వీర శౌర్య సాహసాలు ఎంత గొప్పవైనప్పటికీ, యావదాంధ్ర దృక్పథం వీరిలో ఎవరికీ లేదు. స్వార్థపరత్వము, కుల దురభిమానము రాజ్యకాంక్ష ఈ యుద్ధాలకు మూలకారణం.

రెడ్డిరాజులు ప్రజల కొరకు అనేక సౌకర్యాలు కలిగించారు. చెరువులు, బావులు త్రవ్వించి వ్యవసాయాభివృద్ధికి సాయపడ్డారు.

మోటుపల్లి రేవును అనపోతారెడ్డి అభివృద్ధి చేసి విదేశ వ్యాపారాన్ని ప్రోత్సహించాడు. దేశం సుభిక్షంగా ఉంది. వర్తక వాణిజ్యాలు బాగా అభివృద్ధి చెందినవని చరిత్ర తెలియజేస్తున్నది. అవచి తిప్పయసెట్టి అను సుప్రసిద్ధ వ్యాపారి రాజులకు సైతం అప్పు లిచ్చేవాడు. శ్రీనాథుడు వ్రాసిన 'హరవిలాసం' తిప్పయసెట్టికి అంకితం ఇవ్వబడ్డది.

రాజులు కేవలం భోగలాలసులు కాజొచ్చారు. కుమారగిరిరెడ్డి (1386-1402) అను రాజు కాలంలో వసంతోత్సవం విరివిగా వ్యాప్తిలో ఉండేది. ఉత్తర హిందూస్థానంలో ఉన్న హోళీ పండుగ వంటిదే వసంతోత్సవము. తెలంగాణాలోని గొల్లలలోను. తెలుగుదేశంలోని సుగాలి, లంబాడి తెగలలోను యీ పండుగ యిప్పటికీ ఉంది.

కొండవీటి రెడ్డిరాజులందరూ గొప్ప పండితులు. కుమారగిరిరెడ్డి వసంతరాజీయమను నాట్యశాస్త్రాన్ని, కాటయ వేముడు కాళిదాస కావ్యాలకు వ్యాఖ్యానాన్నీ వ్రాశారు. కోమటి వేమారెడ్డి సంగీత చింతామణి, సాహిత్య చింతామణి అను గ్రంథాలు వ్రాశాడు. ఇవన్నీ సంస్కృతంలో వున్నాయి.

తెలుగు కవులు కూడా అనేకులు యీ కాలంలో వృద్ధి చెందారు. వీరిలో శ్రీనాథుడు, బమ్మెరపోతన ముఖ్యులు.

శ్రీనాథుడు 1385-1475 సంవత్సరాల మధ్య జీవించాడు. కొండవీటి, రాజమహేంద్రవర రెడ్డిరాజులవద్ద ఆయన పండితుడుగా ఉండి అనేక కావ్యాలు వ్రాశాడు. కాశీఖండం, భీమఖండం, నైషధం, హరవిలాసం మొదలయినవన్నీ శ్రీనాథుడు వ్రాసినవే. రాజాస్థానంలో వుండి శృంగార రచనలను రచించినాడు శ్రీనాథుడు.

ఇందుకు విరుద్ధంగా బమ్మెరపోతన (1408-1480) భక్తి ప్రధానమైన భాగవతం వ్రాశాడు. వరంగల్లు, పోతనకవి నివాసస్థలము. బమ్మెర జన్మస్థలము. రాజులకు అంకితమివ్వడం పాపమని, వారిని నోరారదూషించి, తన కావ్యాన్ని శ్రీరామున కంకితమిచ్చాడు. శ్రీనాథుడు నాటి పాలకవర్గ భోగలాలసతకు ప్రతినిధి. ఆ భోగలాలసతపై తిరుగుబాటుచేసి దైవభక్తిని ప్రచా

రం చేసినవాడు పోతన. నాటి సాంఘిక జీవనంలో రెండు విరుద్ధ ధోరణులకు వీరిద్దరు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరుగాక కవు లనేకులు రెడ్డిరాజుల కాలంలో రచనలు సాగించారు. కవిత్రయంలో ఒకడైన ఎఱ్ఱాప్రగడ యీ కాలంలోనే జీవించారు.

## విజయనగర రాజ్య స్థాపన

విజయనగర రాజ్యస్థాపకులయిన హరిహర, బుక్కరాయలు ప్రతాపరుద్రుని వద్ద ప్రధానోద్యోగులుగా ఉండేవారు. వీరిద్దరు అన్నదమ్ములు.

ప్రతాపరుద్రునికి దగ్గర బంధువులు. కాకతీయరాజ్య పతనానంతరం వీరిద్దరు ఆనెగొంది వెళ్ళి, అక్కడ అప్పటికే రాజ్యం చేస్తున్న జంబుకేశ్వరుడను కన్నడ రాజువద్ద ఉద్యోగులుగా చేరారు. జంబుకేశ్వరునికి ఢిల్లీ రాజయిన మహమ్మద్ తుగ్లక్‌కు జరిగిన యుద్ధంలో వీరిద్దరినీ నవాబు ఖైదీలుగా ఢిల్లీ తీసుకు వెళ్ళారు.

ఢిల్లీ వెళ్ళినమీదట వీరిద్దరు మహమ్మదీయ మతాన్ని స్వీకరించారు. తిరిగి ఆనెగొందిలో కల్లోలపరిస్థితి ఏర్పడటం వల్ల, ఢిల్లీ పాదుషా వీరిద్దరినీ విడుదలచేసి ఆనెగొంది రాజ్యము పరిపాలించవలసిందిగా పంపివేశారు. తిరిగి వచ్చిన మీదట విద్యారణ్యులను ఒక పండితుని సలహాపై వీరు హిందూ మతాన్ని తిరిగి స్వీకరించి ఢిల్లీ పాదుషాను ధిక్కరించి, స్వతంత్రంగా విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు.

ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు మధ్యగా కీలక ప్రదేశంలో వీరు రాజ్యాన్ని స్థాపించారు. తత్ఫలితంగా విజయనగర రాజులు కృష్ణకు దక్షిణంగా వుండే ఆంధ్ర, కర్ణాటక, తమిళ ప్రాంతాలన్నిటినీ తమ పాలన క్రిందకు తెచ్చుకోగలిగారు.

16 వ అధ్యాయం

# ఆర్థిక జీవితం

14 వ శతాబ్దంలో నివసించిన ఆంధ్రప్రజల ఆర్థిక జీవితం తెలుసుకోటానికి నాటి శాసనాలు, గ్రంథాలు, తదితర చారిత్రక సామగ్రి మన కుపయోగిస్తాయి.

ప్రజల ముఖ్యజీవనాధారం వ్యవసాయం. అడవులను నరికి, భూమిని సాగులోకి తేవటం, చెరువులు, కాలువలు త్రవ్వించి నీటి పారుదల సౌకర్యాలు కలిగించటం రాజుల ప్రథమ కర్తవ్యంగా వుండేది. 14 వ శతాబ్దంలో కోస్తా ప్రాంతాన్ని పరిపాలించిన రెడ్డిరాజులు ఈ విషయంలో విస్తారంగా కృషి చేశారు. అయినప్పటికీ, సాగుచేయబడే భూమితో పోల్చి చూస్తే, అడవులు, గుట్టలు విస్తారంగా వుండేవని నాటి గ్రంథాల ద్వారా తెలుస్తోంది.

నేడు సస్యశ్యామలమైన కోనసీమ ప్రాంతంలోని ముమ్మడివరం, చుట్టూ ఆనాడు దట్టమైన అరణ్యాలు ఉండే రామచంద్రపురం తాలూకాలో ప్రవహించే గోదావరి ఉపనది తుల్యభాగకు రెండువేపులా మారేడు చెట్లతో నిండిన అడవులు ఉండేవి.

గోదావరి తీరమే ఇలా ఉండగా యితర ప్రాంతాల విషయమై చెప్ప నక్కరలేదు. పల్నాటి సీమను వర్ణిస్తూ శ్రీనాథుడు ఇలా అన్నారు:

ఆ॥ చిన్న చిన్న రాళ్ళు చిల్లరదేవుళ్ళు
నాగులేటి నీళ్ళు నాపరాళ్ళు

నల్ల కొన్నమూళ్ళు నర్పంబులును దేళ్ళు
పల్లనాటిసీమ పల్లెయూళ్ళు.

మెట్టపొలం లేక వెలిపొలము. మాగాణి లేక నీరునేల. తోట భూమి అని భూసారాన్ని బట్టి. నీటి సౌకర్యాలను బట్టి భూమి మూడు రకాలుగా విభజింపబడి ఉండేది. కొలతలకు 'గడ' అనే ఒక ప్రమాణం వాడబడేది. ఈ గడ ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క రకంగా ఉండేది. నాలుగువైపుల 'గడ' పొడవుగల చతురస్రము కుంట. పేరు ఇప్పటికీ వాడుకలో ఉన్నది. రెండున్నర కుంటలు ఒక ఎకరముగా నేరు లెక్కకడుతున్నాము. క్షేత్రగణితంలో కుంట యిలా వర్ణించబడ్డది :

కం॥ నానాదేశములందును
నానావిధమైన గడలు నగ్గడపైనన్
దాన నఖిలక్కు లోకసరి
గా నుండిన దేను కుంట. గణిత విధిజ్ఞా.

ధాన్యాన్ని కొలవటానికి పుట్టి. తూము. కుంచము మొదలైన కొలతలు ఉండేవి. కాలువలు. దొరువులు. పాయలు. బావులు మొదలైన వాటి ద్వారా నీటి సరఫరా జరుగుతూ వుండేది. చెరువులు. కట్టలు. నిర్మించే విషయంలో ఆనాడు ఎంత శ్రద్ధ తీసుకోబడేదో ఈ క్రింది పొరుమామిళ్ళ శాసనంద్వారా తెలుసుకోవచ్చు. ఈ శాసనము విజయనగర రాజులచే 1369 ప్రాంతంలో కడపజిల్లా పొరుమామిళ్ళలో చెక్కించబడింది.

"చక్కని తటాకం నిర్మించవలెనంటే ఈ క్రింది 12 లక్షణాలుండాలి.

1. ప్రజా శ్రేయస్సును కోరే సమర్థుడైన రాజు.

2. జలవిద్యలో పాండిత్యంగల బ్రాహ్మణుడు.

3. గట్టినేల.

4. కనీసం మూడు ఆమడల పొడవుగల (24 మైళ్ళ పొడుగైన) తియ్యని నీరుగల నది.

5. చెరువు కట్టదలచుకొన్న ప్రాంతంలో రెండువైపుల రెండు గుట్టలు (సహజ రక్షణకు).

6. ఈ రెండు గుట్టల మధ్య, రాతితో కట్టిన గట్టి ఆనకట్ట.

7. ఆనకట్ట రెండువైపులా పండ్ల తోట యుండరాదు. (ఆనకట్ట ఫలితంగా వచ్చే ముంపువల్ల ఆ భూమి అంతా మునుగుతుంది.)

8. కొండరాళ్ళు సమృద్ధిగా దొరికే క్వారీ.

9. చెరువుక్రింద సాగు కుపయోగపడే సారవంతమైన భూమి.

10. విశాలమైన చెరువులోతట్టు భూమి.

11. చెరువుల నిర్మాణంలో కుశలులైన కూలీలు, మేస్త్రీలు.

12. నదిలో జల సమృద్ధి.

## ప్రజలపై పన్నుల భారం

నాటి పన్నుల విధానాన్ని తెలియజేసేందుకు "సకల నీతి సమ్మతం" అనే గ్రంథం, ప్రౌఢకవి మల్లన వ్రాసిన రుక్మాంగద చరిత్ర ఎంతో ఉపయోగపడతాయి. ఆ గ్రంథాలను పరిశీలిస్తే ఈ క్రింది సమాచారం మనకు లభిస్తుంది. రాజుకు 7 రకాలుగా ఆదాయం లభిస్తూ వుండేది.

1. కృషి ప్రపంచము – వ్యవసాయపు పన్ను.

2. గనులు.

3. గోకులం – పశువులపై పన్ను.

4. సుంకము – ప్రయాణం పన్ను

5. వణిక్కినెయి – వ్యాపారం పన్ను.

6. నందనవనం – విలాసారామాలపై పన్ను.

7. కప్పము – సామంతరాజులు చెల్లించే పన్ను.

వీటిలో అతి ప్రధానమైనది వ్యవసాయపన్ను. మాగాణి ప్రాంతాల నుంచి పన్ను ధాన్య రూపంలో వసూలు చేయబడేది. మిగతా పన్నులన్నీ ధనరూపంలో ఉండేవి. ముసునూరి నాయకుల కాలంలో పండిన పంటలో ఆరవవంతు పన్నుగా వసూలు చేసేవారు. ఆంధ్రదేశమంతటా ఇదే పద్ధతి అమలులో ఉండేది. ప్రతి గ్రామంలోను ఇలా వసూలైన ధాన్యాన్ని "రాచ గాదెలు" అనబడే గాదెలలోపోసి ప్రభుత్వోద్యోగులు కావలా కాసుండే వారు. సైన్యాలు ఊరిపైగా వెళ్ళినపుడు, లేక ప్రభుత్వోద్యోగుల ప్రయాణాలపు యీ ధాన్యాన్ని వాడేవారు. మిగతా ధాన్యాన్ని అమ్మి డబ్బును రాజధానికి పంపేవారు. నాటి ప్రభుత్వాదాయంలో ధాన్యాదాయం, సువర్ణాదాయం రెండూకూడా ప్రధానమైన భాగాలే.

గ్రామాలలోని బంజరు భూములు, పచ్చిక బీళ్లు రాజుగారి అధీనంలో ఉండేవి. వాటిలో పశువులను మేత మేపుకొనే హక్కును పుల్లరి అనేవారు. పశువుల కాపర్ల వద్ద పుల్లరి వసూలుచేసి బీళ్ళలో పశువులను మేపుకోనిచ్చే వారు.

గ్రామాలలో మూడు రకాలు ఉండేవి. రాచవూళ్ళు, అగ్రహారాలు, నాయంకరపాట్లు. వీటిలో రాచవూళ్ళు రాజుగారి స్వంత గ్రామాలు. ఇందులోనుండి వచ్చిన ఆదాయం అంతా రాజుగారి స్వంత ఖర్చులకు వినియోగించబడేది. ఈ గ్రామంలో సర్వాధికారాలు రాజోద్యోగులకే ఉండేవి. రెడ్డిరాజుల కాలంలోని ఈ రాచ ఊళ్ళే విజయనగరం కాలంలో భండార గ్రామాలని, మహమ్మదీయుల కాలంలో హవేలీ గ్రామాలని, పిలువబడ్డాయి. నిన్న మొన్నటివరకూ ఉన్న జమీందార్ల స్వంత గ్రామాలకు, స్వంత భూములకు ఇవే పునాది.

రెండవ రకం గ్రామాలు అగ్రహారాలు. వీటిలో పన్ను అంతా బ్రాహ్మణులకే పోతుంది. రాజుకు ఈ గ్రామాలపై ఏ అధికారమూలేదు.

సైన్యాలుగాని, ప్రభుత్వాధికారాలు గాని అగ్రహార గ్రామాల సమీపంలోకి సైతం వెళ్ళరాదని రెడ్డిరాజులు కఠిన శాసనాలు చేశారు.

మూడవరకం గ్రామాలు నాయంకరపాట్లు. ఈ మాట ప్రస్తుతం వాడుకలో లేదు. మామూలు గ్రామాలన్నీ ఈ మూడవ రకానికి చెందినవి.

రాచ ఊళ్ళలో పొలాన్ని రాజే స్వయంగా కౌలుకిస్తూ ఉండేవాడు. శ్రీనాథుడు తన చివరి రోజులలో, కృష్ణానది ఒడ్డున బొడ్డుపల్లి అనే గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకొని పంటలు చెడిపోగా ప్రభుత్వ శిస్తు చెల్లించలేక బాధపడ్డట్లు ఈ క్రింది పద్యం ద్వారా తెలుస్తుంది.

తే. గీ. కృష్ణవేణమ్మ గొనిపోయె - నింత ఫలము
బిలబిలాక్షులు తినిపోయె - తిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి
నెట్లు చెల్లింతు టంకంబు లేడునూర్లు.

గనుల నుండి వసూలయ్యే పన్నులు గాక, వివిధ వృత్తులవారు ప్రభుత్వానికి పన్నులు చెల్లించేవారు. చేనేతవారు, నూనె గానుగల వారు, ఇతరులు చెల్లించే ఈ పన్నులను వృత్తి కట్నాలు అనేవారు.

వీటన్నిటికంటే ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం సుంకాల ద్వారా వచ్చేది. వ్యవసాయ పన్ను తర్వాత ఇదే ప్రధానమైంది. రేవుల వద్ద ఎగుమతి-దిగుమతి సుంకములు, రోడ్లమీద ప్రయాణంచేసే వ్యాపారస్తుల వద్ద పవాడా సుంకములు, ప్రధాన నగరం ప్రవేశించినపుడు, తిరిగి వెళ్ళిపోయే టప్పుడు, సరుకు బండ్ల మీద విధించే సుంకాలు వుండేవి. ఇవిగాక నేల సుంకం అని వుండేది. సంతలో, ఉత్సవాల సమయంలో వ్యాపారస్థులు కట్టుకున్న దుకాణాలపైన ఈ సుంకము వసూలు చేయబడేది.

కాకతీయుల కాలంలో ఈ సుంకాలను ఖచ్చితంగా నిర్ణయించి, ప్రభుత్వోద్యోగులే వసూలు చేసేవారు. కాని రెడ్డిరాజుల కాలంలో ఈ అధికారాన్ని వేలంపాట వేసేవారు. కాంట్రాక్టు వద్దతివల్ల, ఒక్కొక్క

ప్రాంతంలో ఒక్కొక్క రకంగా రవాణా సుంకాలు, ఎగుమతి దిగుమతి సుంకాలు విధింపబడి వర్తకులు నానా ఇబ్బందులు పడేవారు. సుంకాలు వసూలు చేసేవారిని సుంకరులు సుంకాధికారులు అనేవారు. ఉప్పుపైన కూడా పన్ను పూర్వకాలం నుంచీ విధించబడుతూ వుండేది.

ఒక గ్రామం మొత్తంమీద, రాజుకు చెల్లించవలసిన పన్నును కప్పము అనేవారు.

## గ్రామ వ్యవస్థ

వ్యవసాయ ప్రధానమైన ప్రతి సమాజానికి గ్రామ జీవితం పునాది. గ్రామ ఆర్థిక సంబంధాలు గ్రామ జీవితానికి కీలకం కనుక ప్రాచీన గ్రామాలలోని ఆర్థిక సంబంధాలను కొంతవరకు తెలుసుకుందాము.

నాటి భూసంబంధాలను సమగ్రంగా తెలుసుకోగల సమాచారంలేదు. కాని లభించిన సమాచారాన్ని బట్టి ఈ క్రింది విషయాలు తెలుసుకోవచ్చు. ఈనాటివలె కొనటం, అమ్మటం విస్తారంగా జరిగేదికాదు. కాని రైతుకు తన భూమిని ఇతరులకు అమ్మే హక్కు వుండేది. తాను వ్యవసాయం చేయలేనప్పుడు, అప్పుల పాలైనప్పుడు, మరొక గ్రామం తరలిపోవు సందర్భంలోనూ, గ్రామ పెద్దల అనుమతితో తన భూమిని ఇతరులకు అమ్మేవాడు. సర్పవరం వద్ద దొరికిన ఒక శాసనంలో ఖండ్రిక విస్తీర్ణంగల భూమి ఖరీదు 20 టంకాలని ఉంది. దీన్నిబట్టి స్వంత ఆస్తివలె భూమిని అమ్మటానికి, కొనటానికి హక్కుండేదని బోధపడుతుంది.

గ్రామంలోని భూమిని వివిధ రైతు కుటుంబాలు విడి విడిగా సాగు చేసుకుంటూ ఉండేవారు. అయితే ఆ భూమిపై రైతుకు గల పెత్తనం గ్రామ పంచాయతీకి లోబడి ఉండేది.

ఏ గ్రామానికా గ్రామం ఒక భిన్న కేంద్రం వలె ఉండేది. నిత్య జీవితాని కవసరమైన వస్తువులన్నీ ఆ గ్రామంలోనే ఉత్పత్తి అయ్యేవి. అరుదుగా కావలసిన వస్తువులు, పశువులు, మొదలైనవి సంతలో కొనేవారు.

వర్తక వ్యాపారాలు క్రమతో కూడుకున్నవిగా ఉన్నవి. దొంగల భయం విస్తారం. సాగుభూముల నంటుకుని అడవులు, గుట్టలు ఉండేవి. ఈ కారణాలవల్ల ప్రతి ముఖ్య గ్రామానికీ, చుట్టూ ప్రహరీగోడ ఉండేది. ప్రహరీచుట్టూ కాపలా తిరిగి గ్రామరక్షణ బాధ్యత నిర్వహించే వ్యక్తి ప్రహరీ కాపు. ఈ పేరు క్రమంగా పారికాపు, బారికాపు, బారికాడు-అని మారింది.

గ్రామ పరిపాలనలోని బాధ్యతలు నిర్వహించే వ్యక్తులు రెడ్డి, కరణము, పురోహితుడు, తలారి, బారికాపు, కమ్మరి, కుమ్మరి, సాలె, కంసాలి వగైరా లుండేవారు. రైతు వ్యవసాయంలో నిమగ్నుడై ఉండగా, అతని కవసరమైన ఇనప సామానులు కమ్మరి, పాత్ర సామానులు కుమ్మరి, వస్త్రాలు సాలె, బంగారు వెండి సామానులు కంసాలి చేస్తూఉండేవారు. గ్రామ పరిపాలనా బాధ్యత అంతా రెడ్డిది గ్రామమునసబును ఇప్పటికీ రెడ్డి అని వాడటం ఆంధ్రదేశంలో సర్వసామాన్యంగా ఉన్న విషయమే.

గ్రామంలో అందరికంటె ధనం, పలుకుబడి హెచ్చుగా గలవారు సాధారణంగా రెడ్డిగా ఎన్నుకోబడేవాడు. గ్రామస్థులు ఎన్నుకున్న మీదట రాజు అనుమతికూడా పొందటం అవసరం. కాని, ఈ పద్ధతి త్వరలో నశించి, రెడ్డి, కరణం పదవులను సరాసరి రాజులే నియమించటం జరిగింది. కాకతీయుల కాలంనుండి (12వ శతాబ్దం) ఈ పదవులు రాజుచే నియమించబడటంతోపాటు వంశపారంపర్యంగా రావటంకూడా ప్రారంభమైంది.

రైతులు ఏ శుభాశుభకార్యాలు జరుపుకున్నా పురోహిత బ్రాహ్మణుడి ప్రమేయం ఉండవలసిందే. గ్రామాని కుండవలసిన అత్యవసర విషయాలను సుమతీ శతకకారుడు ఇలా చెప్పుతున్నాడు :

కం. అప్పిచ్చువాడు వైద్యుడు
ఎప్పుడు నెడతెగక పారు నేరును ద్విజుడున్
చొప్పడిన యూర నుండుము
చొప్పడకున్నట్టి యూరు చొరకుము సుమతీ.

రైతులకు అవసర సమయంలో అప్పు ఇవ్వగల ధనికుడు కూడా నాటి గ్రామజీవితంలో ప్రధాన పాత్ర వహించే వాడని తెలియగలదు.

గ్రామ సమిష్టి జీవిత నిర్వహణకు సాయపడేవారందరికీ ఈనాములు ఇవ్వబడేవి. ఈ భటవృత్తి ఈనాములపైన నామమాత్రం పన్ను వుండేది. చాకలి, మంగలి, కుమ్మరి మొదలైన వారందరికీ ఇలాగే ఈనాము లున్నవి. ఈ భూములను గ్రామస్థులే తమ పశువుల సహాయంతో దున్ని పెడుతూ వుండేవారు. ఈ విధంగా ఏ గ్రామాని కా గ్రామం స్వయం సమృద్ధిగా ఉంటూ ఉండేది. ఈ విధానంలో గ్రామ ప్రజలంతా సుఖులుగా,ఉండేవారని, ధనికులు, అగ్ర వర్ణాలు - ఇతరులపై దోపిడీ చేయటం ఉండేదిగాదని భావించటం పొరపాటు. వెట్టివారు అనబడే అస్పృశ్యులు మూడురకాల వెట్టి చేయవలసి ఉండేది. రాచవెట్టి, గ్రామవెట్టి, కులవెట్టి. రాజులకు చేసే సేవ, గ్రామానికి చేసే సేవ, కులానికి చేసే సేవ. ఈ శ్రమకంతా ప్రతిఫలంగా గ్రామస్థులు వారికి ఏదో కొంత ముట్టజెపుతూ ఉండేవారు.

గ్రామం అంతా ఒకటిగా ఉండవలసిన అవసరం ఆనాడు ఎంతో ఉండేది. నిరంతర యుద్ధాలు,రాజకీయ కల్లోలాలు జరుగుతూండే ఆ కాలంలో గ్రామజీవితం మాత్రం పెద్దగా మార్పు చెందకుండా సుస్థిరంగా వస్తూనే వుంది.

రాజులు మారినప్పుడల్లా, పన్నుల హెచ్చు కావటం, కట్నాలు, కానుకలు విశేషంగా వసూలు చేయడం, వైష్ణవ శైవ మతోద్యమాల ప్రభావంవల్ల గ్రామజీవితం రెండుగా చీలిపోవటం జరుగుతూనే వుండేది. ఈ ఒడుదుడుకులను తట్టుకుంటూ, గ్రామజీవితం బ్రిటిషు పరిపాలకులు మనదేశంలో అడుగుపెట్టేవరకూ కొనసాగుతూ వచ్చింది.

## గృహ పరిశ్రమలు, వర్తకము

వ్యవసాయం ఎంత ప్రధానమో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, శిల్పి పనులు కూడా అంతే ప్రధానమైనవి. పంచ లోహాలతో పని

చేసేవారిని పంచాననం అనేవారు. మొదట్లో పై పనులన్నీ విశ్వకర్మలనందరే కంసాలులే చేస్తూండేవారు. క్రమంగా ఇందులో కూడా కులవిభజన ఏర్పడ్డది.

మోటుపల్లి ప్రాంతంలో వజ్రాల గనులుండేవని మార్కోపోలో వ్రాశాడు. విజయనగరంనుండి 15 రోజుల ప్రయాణంలో చేరుకునే ఒక చోట వజ్రాల పరిశ్రమ ఉండేదని నికోలి దేకాంటి అను చరిత్రకారుడు వ్రాశాడు.

విదేశాలతో విస్తారంగా వ్యాపారం జరుగుతూ ఉండేది. నాడు విదేశ వ్యాపారం ఎంతగా సాగుతూ ఉండేదో హరవిలాసంలోని ఈ క్రింది పద్యం తెలియజేస్తుంది;

సీ॥ పంజాబు కర్పూర పాదపంబుల తెచ్చి
జలనోధి బంగారు మొలకతెచ్చి
సింహళంబున గంధ సింధూరములు తెచ్చి
పడమటి బలు తేజి హరులు తెచ్చి
గోవ సంపద్ద సంకుమ ద్రవంబును తెచ్చి
యాసన నాజిముత్యాలు తెచ్చి
భోటంగి కస్తూరి కాటుకములు తెచ్చి
చీని చీనాంబర శ్రేణి తెచ్చి

వస్త్ర పరిశ్రమకు ఆంధ్రదేశం మొదటినుండి ప్రసిద్ధి చెందింది. పల్నాటి సీమలో ఏకులు వడకటం ప్రతి ఇంట్లోను ఉండేదని శ్రీనాథుని పద్యం ద్వారా తెలుస్తున్నది:

క. రసికుడు పోవడు పల్నా
డెసగంగా రంభయైన నేకులె వడకున్
వసుధేశుడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్.

నూనె గానుగులు ఆడే తెలికవారికి విశేష ప్రాధాన్యం ఉన్నట్లు కొన్ని శాసనాలద్వారా తెలుస్తున్నది. చాళుక్యుల కాలంలో (క్రీ. శ. 1084 లో) ప. గో. జిల్లా ఒక గ్రామంలో నివసించే ఒక వేయి తెలిక కుంటుం బాలకు, అంతకు పూర్వం లేని కొన్ని సాంఘిక మర్యాదలు కలిగిస్తూ కుళో త్తుంగచోళుడు ఒక శాసనం చేశాడు. వృత్తి సహకార సంస్థలు ఉండేవి. తెలికలవారంతా సమయము అనబడే వ్యాపార కట్టుబాటుకు లోబడి ఉండే వారు. ఇది కేవలం కట్టుబాటు మాత్రమే కాదు. మత, కుల, వ్యవహారా లన్నీ యీ కట్టుబాటుకు లోబడి ఉండేవి. అదే విధంగా వర్తకులు నగర అను ఒక సంస్థగా ఏర్పడేవారు క్రమంగా నగరం అంటే పట్టణం అనే అర్థం రూఢి అయింది.

## నేర విచారణ – శిక్షాస్మృతి

నాటి నేర విచారణ అతి దారుణంగా ఉండేది. ఎర్రగా కాగుతున్న ఇనుప బంతిని — దీనిని మద్దు అనేవారు — చేతిలో పెట్టుకోవాలి. చేయి కాలకపోతే అతడు నిర్దోషి. లేకపోతే దోషి. ఈ విచారణను మద్దుపట్టుట అనేవారు. ఈ ఆచారం యెంత విరివిగా ఉండేదో ఈ క్రింది ఉదాహరణ ద్వారా తెలుస్తుంది.

కాకతీయరాజు ప్రతాపరుద్రుడు మహమ్మదీయులచే ఓడింపబడ్డాడు. తన వద్దనున్న ధన, కనక వస్తు వాహనాలన్నీ ఇచ్చివేశాడు. తన వద్ద ఏమీ మిగలలేదన్నాడు. కాని మహమ్మదీయ సేనాని ఖుస్రూఖాన్ నమ్మలేదు. మద్దు పట్టుట ద్వారా తాను నిజమే చెప్పుతున్నట్లు నిరూపించు కోవలెనని ఆజ్ఞా పించాడు.

సలసల కాగే నూనెలో చేయి ఉంచటం, ఇనుపకడ్డీతో నాలుకను కాల్చడం మొదలైనవి కూడా నేర విచారణలో భాగంగా ఉండేవి.

నేరస్థులను పట్టుకోటానికి తలారులకు విశేషాధికారాలు ఇచ్చేవారు. ఈ విధి నిర్వహించే వానిని యామికుడు అంటారు. ఇతడు గ్రామం మొదట్లో గాని, చివరలోగాని మకాంపెట్టి, వచ్చే పోయే వారి నందరినీ పరీక్షిస్తాడు. అనుమానమున్నపుడు అందరినీ ప్రశ్నించటం. అవసరమైతే హామీలు

కొరటం జరుగుతుంది. ఈ పోలీసుల అధిపతి తలవరి. దొంగతనం జరిగిన చోట పోలీసు దొంగను పట్టుకొనలేకపోతే పోలీసే దొంగిలింపబడిన ఆస్తికి బాధ్యుడవుతాడు. అందుకని ఏ అమాయకుడి పైననో నేరం మోపక పోలీసులకు విధిలేదు. గ్రామం పైట కావలాకాసే వారిని వెలికావలి వారని, ఇతరులను అప్పకావలివారని అనేవారు. ముత్రాజు కులంవారు ఎక్కువగాని యీ కావలిపనికి వినియోగించబడే వారు. రెడ్డి రాజులనాటి ఒక శాసనంలో ఇలా ఉంది:

"అనవేమారెడ్డిగారి ప్రభుత్వంలో.... ప్రజల ఉపద్రవం లేక నిర్వాహకం లేక సంసార్లు ప్రభువుతో చెప్పుకున్నంతలో. ఓప్పేడు బోడిలింగమ నాయుడు అనే ముత్రాచ కోట్వాలు అయివుండగా వాని సాహసత్వంను అప్పకావలి నిర్వాహకం కొన్నింటికి చేయగలండని ప్రభువుకుతోడ ఆ కోట మొదలైన సీమలు అప్పకావలి నిర్ణయం చేసినారు. అగపాసింగమనాయుడునికి వెలికావలి."

నాటి శిక్షలు చిత్రవధ తప్ప మరొకటి కాదు. రుక్మాంగదచరిత్రలో యీ పద్యము చూడండి:

ఉ. కట్టిరి కొట్టి రీడ్చి రతికంటుగ లాగిరి గుండు రొమ్మునన్
బెట్టిరి వెంగ్రపోచిరి తపింపగ నెండల నిర్భరంబుగా
జుట్టిన పచ్చిరంటు నరికాదన దోచిరి పట్టుకారులన్
బట్టిరి నిత్రుపానముం బాయగజేసిరి ఎర్రవెంవరన్.

ఒక ముస్లిం చరిత్రకారుడు ఇలా వ్రాస్తున్నాడు:

"కాళ్ళు చేతులు నరకటం, చెవులు, ముక్కులు కోసివేయటం, కత్తులకి వేయడం, సీసం కరిగించి నోట్లో పోయటం, గోళ్ళలో మేకులు కొట్టడం, మనుషులను సజీవంగా దహించటం, రంపంతో కోయటం, చేక కొరడ వేయటం సర్వసాధారణం..."

శ్రీనాథుడంతటి కవికి సైతం పన్ను చెల్లించనందుకు ఈ క్రింది శిక్షలు విధించబడ్డాయి:

*సీ॥ కవిరాజు కంఠంబు కౌగిలించెను గదా*
*పురవీధి నెదురెండ పొగడదండ*
*ఆంధ్ర నైషధకర్త యంఘ్రియుగ్మంబున*
*దగిలియుండెను గదా నిగళయుగము*
*వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత*
*వియ్యమందెను గదా వెదురు గడియ*
*సార్వభౌముని భుజాస్కంధ మెక్కెను గదా*
*నగరి వాకిటనుండు నల్లగుండు*

## మత సాంఘికాచారాలు.

రెడ్డిరాజుల కాలంలో ఆంధ్రదేశంలో శైవమతం విస్తారంగా వ్యాప్తి చెందింది. ఈ కాలంలో మతాచారాలతో దానధర్మాలు, వ్రతాలు, నోములు, పండుగలు మొదలైనవి అంతులేకుండా పెరిగిపోయినవి. చాతుర్వర్గ చింతామణి అనే గ్రంథంలోని వ్రతఖండం అనే విభాగంలో హేమాద్రి అనే పండితుడు ఈ వ్రతాలను విశదంగా వర్ణించాడు. ఏకాదశి ఉపవాసం, ద్వాదశి పారణ, శివరాత్రి ఉపవాసం-మాఘ స్నానాలు, కార్తీక స్నానాలు-ఇలా అంతులేకుండా ఉన్నాయి. వీనిని అన్ని అగ్రకులాలవారు ఆచరిస్తూండేవారు. ముఖ్యంగా రెడ్డిరాజులు ఈ వ్రతాలన్నింటినీ అనుసరించేవారు.

మహమ్మదీయుల మతావేశానికి పోటీగా వీరశైవ మతావేశం రెడ్డి, వెలమరాజులు ప్రజలలో బాగా ప్రచారము చేశారు. దేవతలకు పశువులను బలి ఇవ్వటం మాత్రమేకాక, భక్తులు తమ తలలను దుర్గకు బలిఇవ్వటము ఒక ఆచారమైంది. భైరవుడు, వీరభద్రుడు, దుర్గ మొదలయిన ప్రచండ దేవతల ఆరాధన హెచ్చింది. వీరారాధనలు, వీర పూజలు జరిగేవి. భైరవ కాపాలిక తంత్రాలు తిరిగి తలఎత్తాయి. మతం పేరుతో మోసం, వ్యభిచారం, దౌర్జన్యం జరుగుతూండేవి. వీరముష్టి, మైలారు, వీరభటులు అను సాహసికులు ఉండేవారు. దేవుని రథం నడుస్తూంటే ఆ రథ చక్రాల క్రిందపడి నలిగి చనిపోవటం మోక్షదాయకంగా వీరు భావించేవారు.

విజయనగరంలో తాను ఇలాంటి ఘటనను స్వయంగా చూచానని నికోలో డికాంటీ అను చరిత్రకారుడు వ్రాశాడు.

సహగమనం ఆచారం కూడా ఉండేది. అయితే నిర్బంధం ఉన్నట్లు లేదు. సహగమనం చేసిన స్త్రీలు అరుదుగా ఉండేవారు. అలాంటివారిని పేరంటాళ్లుగా నేటికీ తెలుగు దేశంలో అక్కడక్కడా ఆరాధిస్తున్నారు. కృష్ణరాయలు చనిపోయినప్పుడు ఆయన భార్యలు సహగమనం చేయలేదు. కాని ఉంపుడుగత్తెలను మాత్రం బలవంతంగా సహగమనం చేయించారు.

మంత్ర తంత్రాలలో ప్రజలకు విశేషంగా నమ్మక ముండేది. భూత వైద్యులు, తాంత్రికులు దేశమంతటా ఉండేవారు. రసవిద్యద్వారా బంగారం తయారు చేయటం సాధ్యమౌతుందని ప్రజలు విశ్వసించేవారు. ఈ విశ్వాసాన్ని అవకాశంగా తీసుకొని అనేకులు గురువులు వెలిశారు. మతము, మూఢనమ్మకాలు, కులాచారాలు ఒకవైపున, ఉత్సవాలూ, వేడుకలూ మరొక వైపున నాటి సాంఘిక జీవితంలో ప్రధాన పాత్ర వహించేవి.

శైవమతంతోపాటు వైష్ణవమతం కూడా ఆంధ్రలో వ్యాపించింది. కొండవీటి రెడ్డి రాజులలో మొదటి ముగ్గురు శైవమతాన్ని అభిమానించగా, చివరి ఇద్దరు వైష్ణవమతాన్ని అభిమానించారు. తెలంగాణాను పాలించిన పద్మనాయక రాజులు శైవంనుంచి వైష్ణవంవైపు దృష్టి మరల్చారు. ఒక తేడా కనిపిస్తుంది. శైవ మతంలో క్రౌర్యం, రాజసం హెచ్చు. వైష్ణవ మతంలో సాత్వికం హెచ్చు. శృంగారం రెంటిలోనూ ఉంది. శైవశృంగారం బీభత్సం, క్రౌర్యంలతో కలిసి ఉండగా వైష్ణవంలో ఆ రెండూ లేవు.

17 వ అధ్యాయం

# విజయనగర సామ్రాజ్యం

కాకతీయరాజ్య పతనానంతరం, ఆంధ్ర దేశమంతా మహమ్మదీయ దండయాత్రకు లొంగిపోయే ప్రమాద మేర్పడ్డది. మాలిక్‌కాఫరు సైన్యాలు తమిళదేశం ప్రవేశించి మధురను స్వాధీనపరచుకొన్నాయి. తమిళదేశం నడిబొడ్డులో ఒక ముస్లిం రాజ్యం ఏర్పడ్డది.

ఈ మహమ్మదీయ దండయాత్రను జయప్రదంగా ప్రతిఘటించి ఆంధ్రదేశాన్ని మాత్రమేగాక, దక్షిణ హిందూ దేశాన్నంతటినీ, ఒకేఒక త్రాటిన నడిపించిన వారు హంపీ-విజయనగర రాజులు. కాకతీయరాజులు సాహసికులే. కాని ఉత్తర హిందూస్థానంనుంచి ముంచుకువస్తున్న ముస్లిం దండయాత్రను ప్రతిఘటించటానికి దక్షిణ హిందూదేశంలోని రాజులను ఐక్యం చేయవలసిన ఆవశ్యకతను వారు గుర్తించలేదు. మహారాష్ట్ర పరిపాలకులైన దేవగిరి యాదవులతో ఓరుగల్లు కాకతీయులకు మొదటి నుండి కలహాలున్నాయి. ఈ కలహాలను అవకాశంగా తీసుకొని మహమ్మదీయులు మొదట దేవగిరిని, తరువాత ఓరుగల్లును స్వాధీనపరచుకున్నారు. పరాయి శత్రువులను ప్రతిఘటించడానికి ఇరుగు పొరుగు రాజ్యాలు ఐక్యం కావలెనన్న రాజనీతి కుశలతను కాకతీయ ప్రతాపరుద్రుడు ప్రదర్శింపజాలక పోయినాడు. అందుకనే ఏకాకిగా పోరాడినప్పటికీ ఆంధ్ర రాజ్యం పతనమైంది.

ఇదే విధంగా రెడ్డి, వెలమ, కమ్మ వైషమ్యాలను అధిగమించలేని ఫలితంగా, స్వతంత్ర రాజ్య స్థాపనకై ముసునూరి నాయకులు చేసిన కృషి కూడా విఫలమైంది.

హంపీ. విజయనగర రాజ్యాన్ని స్థాపించిన హరిహరరాయులు, బుక్కరాయులు పై ఘటనలోని గుణపాఠాలను గ్రహించారు. దక్షిణ హిందూ దేశంలోని ఆంధ్ర, కర్నాటక, తమిళ ప్రాంతాలన్నింటినీ ఒకే సామ్రాజ్యం క్రింద వ్యవస్థీకరించినపుడే మహమ్మదీయుల దండయాత్రలను జయప్రదంగా ప్రతిఘటించగలమని గ్రహించారు.

ముస్లిం దండయాత్రలవలన నానాబాధలు అనుభవిస్తున్న ప్రజలు కూడా ఈ ప్రయత్నాన్ని బలపరచారు. హరిహర, బుక్కరాయల సామ్రాజ్య స్థాపన ప్రయత్నం జయప్రదమైంది.

ఈ ఉద్దేశాని కనుగుణంగా ఆంధ్ర, కన్నడ సరిహద్దులలో, తుంగభద్రా నదీతీరంలో సహజ రక్షణ కుపయోగపడే కొండల నడుమ విద్యానగర పట్టణాన్ని హరిహరరాయలు నిర్మించారు. రామాయణ కాలంనాటి కిష్కింధ నగరమున్న చోటనే హంపీ నిర్మాణం జరిగింది. ఈ సామ్రాజ్య స్థాపనకు విద్యారణ్యుడను ఒక పండితుని నైతిక ప్రోత్సాహం చాలా వుంది. మహారాష్ట్ర స్వాతంత్ర్య వీరుడగు శివాజీకి సంతరామదాసు ఏ విధంగా ధార్మిక, నైతిక ప్రోత్సాహాన్నిచ్చాడో అలాగే విజయనగర సామ్రాజ్య స్థాపనకు విద్యారణ్యుడు సహాయపడ్డాడు. హిందూ సంస్కృతి, మతము రక్షింపబడవలెననే ఆశయంతో ఈ సామ్రాజ్య స్థాపన జరిగింది.

విజయనగర సామ్రాజ్య చరిత్రను మూడు దశలుగా విభజింపవచ్చును.

1. 1336–1480 వరకు ప్రథమదశ–ఈ దశలో విజయనగరరాజ్యం కన్నడ, తమిళ ప్రాంతాలను, రాయలసీమను ఆక్రమించుకున్నది.

2. 1480–1550. ఈ దశలో తెలంగాణా మినహా ఆంధ్రదేశమంతా కృష్ణరాయల పరిపాలన క్రింద ఉన్నది.

3. 1550–1650. ఇది పతనావస్థ. 1565 లో తల్లికోట యుద్ధంలో ఓడిపోయిన మీదట క్రమంగా రాజ్యం శిథిలమై, 1650 కి పూర్తిగా అంతరించింది.

## సామ్రాజ్య స్థాపన (1336-1480)

ఈ దశను వివరించే ముందు విజయనగర సామ్రాజ్య స్థాపకులు ఆంధ్రులా, కన్నడులా అనే సమస్యను చర్చించవలసి వుంది. హిందూ రాజుల నైక్యపరచి, మహమ్మదీయులను ప్రతిఘటించడం సామ్రాజ్య స్థాపనలో ప్రధానాశయం. తెలుగు, కన్నడ విభేదాలుకాక, హిందూ, ముస్లిం మత విభేదాలు నాడు ప్రముఖ పాత్ర వహించాయి. హరిహర బుక్క రాయలిద్దరూ కాకతీయ ప్రతాపరుద్రుని బంధువులు. తెలుగువారు, అతనివద్ద సైనికాధికారులుగా వున్నవారు. ఓరుగల్లు పతనానంతరం అనెగొంది (హంపి) వెళ్ళి అక్కడ కన్నడరాజైన జంబుకేశ్వరుని కొలువులో చేరారు. మహమ్మద్ బిన్ తుగ్లక్ చే ఖయిదు చేయబడి, తిరిగి విడిపించబడి రాజ్య స్థాపనకు పూనుకున్నారు. ఈ వంశం తెలుగువంశం. అయినప్పటికీ, కన్నడ దేశంలో స్థిరపడి, 150 సంవత్సరాలు ప్రధానంగా కన్నడ దేశాన్నే వీరు పరిపాలించారు. కన్నడ భాషను ప్రధానంగాను, తెలుగును కొంతవరకు వీరు పోషించారు.

1480 నుంచి విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన సాళువ, తుళువ, ఆర్వీటి వంశాలు మూడూ తెలుగు వంశాలు. వీరంతా తెలుగు భాషను ప్రధానంగాను, కన్నడ భాషను కొంతవరకు ప్రోత్సహించారు. వీరిలో అత్యంత ప్రసిద్ధుడైన కృష్ణదేవరాయలు స్వయంగా "ఆముక్త మాల్యద" అను తెలుగు కావ్యం వ్రాశాడు. "దేశభాషలందు తెలుగు లెస్స" అని ఉద్ఘాటించాడు. తెలుగు, కన్నడ విభేదాలకు అవకాశ మివ్వకుండా విజయనగర రాజులంతా పరిపాలించారు

విజయనగర సామ్రాజ్యం 1336 లో స్థాపించబడ్డది. రాజ్యస్థాపకుడు హరిహరరాయులు. ఇతని రాజ్యం మైసూరు కర్ణాటక ప్రాంతాలకు విస్తరించి ఉండేది. ప్రస్తుతం మైసూరు రాజ్యము ఆనాడు హొయిసల రాజ్యం. ఈ రాజ్యాన్ని పరిపాలిస్తున్న నాల్గవ బళ్ళాల రాజును జయించి, హరిహరాయలు ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు. ఇతను సంగమ వంశానికి మూలపురుషుడు.

ఇతని తర్వాత ఇతని తమ్ముడు బుక్కరాయలు రాజ్యపాలన చేశాడు. ఇతని కాలంలో మధుర రాజ్యం కూడా విజయనగరంలో కలిసిపోయింది. మధురను జయించినవారు బుక్కరాయల కుమారుడు కుమార కంపనుడు. మధురా విజయాన్ని కంపరాజు భార్య గంగాదేవి సంస్కృత కావ్య రూపంలో వ్రాసింది. మహమ్మదీయుల పరిపాలనలో ప్రజలు పడ్డ అగచాట్లను ఈమె వర్ణించింది. హిందూ మతాభిమాన ఫలితంగా కలిగిన అతిశయోక్తులు కొన్ని ఉన్నప్పటికీ, నాటి సమాజ పరిస్థితులను తెలుసుకోవటానికి ఈ గ్రంథం ఎంతో ఉపకరిస్తుంది. మధురానగర దండయాత్ర 20 ఏండ్లు పట్టింది. ఈ విజయంతో దక్షిణ హిందూ దేశమంతా బుక్కరాయల ఆధిపత్యాన్ని అంగీకరించింది. ఈ యుద్ధంలో కుమార కంపనుడు చనిపోయినాడు.

బుక్కరాయలు పశ్చిమ సముద్ర తీరమందలి గోవా రేవు పట్టణం స్వాధీనం చేసుకున్నాడు. పోర్చుగీసు వ్యాపారస్థులు ఆనాటికే గోవా రేవుద్వారా విస్తార వ్యాపారం చేస్తూ ఉండేవారు. నాటినుండి గోవా రేవు పట్టణం విజయనగర రాజుల క్రిందనే ఉన్నది.

బుక్కరాయల కాలంలో విద్యారణ్యుని సోదరుడు సాయణాచార్యులు రాజగురువుగా ఉండేవాడు. వేదాలకు సాయణుడు భాష్యం వ్రాశాడు. వేద భాష్యాలన్నిటిలోకి సాయణభాష్యము ప్రసిద్ధమైనది.

ఈతని తర్వాత సంగమ వంశస్థులైన నలుగురు రాజులు పరిపాలించారు. వీరిలో రెండవ దేవరాయలు (1423-1446) ముఖ్యుడు. ఇతని కాలంలో రాయలసీమ అంతా విజయనగర రాజుల స్వాధీనమైంది.

తెలంగాణాలోని రాచకొండ పద్మనాయకులు, రాజమహేంద్రవర రెడ్డిరాజులు విజయనగర ఆధిపత్యాన్ని అంగీకరించారు. రెండవ దేవరాయలు తెలుగు భాషను ప్రోత్సహించాడు. శ్రీనాథుడు ఇతని ఆస్థానంలో స్వర్ణాభిషేకాన్ని, కవిసార్వభౌమ బిరుదాన్ని సంపాదించాడు. తెలుగు రాయడని, ఈ రాజును శ్రీనాథుడు కీర్తించాడు.

సింహళం, మలయా, జావా మొదలైన దూర ప్రాంతాలనుండి ఈయన ఆస్థానానికి కానుకలు వచ్చేవి.

ఈతని తర్వాత మల్లికార్జునరాయలు, విరూపాక్షరాయలు పరిపాలించారు. విరూపాక్షరాయలు విషయలంపటుడు, అసమర్థుడైనందువల్ల అంతవరకు సేనానిగా ఉన్న సాళువ నరసింహరాజు రాజ్యాధికారాన్ని స్వీకరించాడు.

## సామ్రాజ్య విస్తరణ - (1480-1550)

సాళువ నరసింహరాజు తెలుగుసేనాని. ఈతని కేంద్ర స్థానము చంద్రగిరి. తరతరాలుగా విజయనగర రాజులవద్ద ఈ వంశస్థులు సేనానాయకులుగా వున్నారు. వారితో బంధుత్వాలు జరిపారు. అసమర్థుడైన విరూపాక్షరాయని పరిపాలనవల్ల క్షీణించినటువంటి సామ్రాజ్యాన్ని నరసరాజు సంరక్షించాడు. ఈతడు 1494 వరకు పరిపాలించాడు.

ఈతని తర్వాత పది సంవత్సరాల పాటు యీతని కుమారులు రాజ్యం చేశారు. అల్పవయస్కులగు వారిద్దరూ చనిపోవటమో, లేక చంపివేయబడడమో జరిగింది. ఆ తర్వాత ఇతని సేనానాయకుడు తుళువ నరసనాయకుడు రాజైనాడు. రాజ్యకాంక్షతో సేనానులు, రాజులను పదవీచ్యుతులను చేసే సాంప్రదాయం విజయనగర రాజ్యంలో ప్రారంభమయినది. తుళువవంశం కూడా సాళువ వంశం వలెనే, తెలుగువంశం తుళువ నరసనాయకుని తర్వాత అతని కొడుకు నరసింహరాయలు పరిపాలించాడు. వీర నరసింహరాయలు 1509 లో మరణించిన మీదట అతని సవతి తమ్ముడు కృష్ణదేవరాయలు రాజ్యం అధిష్టించాడు.

ఈ సందర్భంలో మంత్రి తిమ్మరుసు పాత్రను ప్రస్తావించవలసి వుంటుంది. వీర నరసింహరాయలువద్ద తిమ్మరుసు మంత్రిగా వుండేవాడు. తన అవసాన కాలంలో తిమ్మరుసును పిలిచి, కృష్ణదేవరాయలను చంపించవలెనని, అతని కండ్లు తెచ్చి చూపవలెనని, తన తర్వాత తన కుమారుడే రాజ్యానికి రావలెనని వీర నరసింహరాయలు కోరాడు. సరేనని అంగీకరించి తిమ్మరుసు కృష్ణదేవరాయలను రహస్యంగా దాచివుంచి మేక కళ్ళు రెండు తీసుకువెళ్ళి వీర నరసింహరాయలకు చూపించాడు. దాంతో అతడు విశ్రాంతిగా చనిపోయాడు.

## కృష్ణ దే వ రా య లు

వీర నరసింహరాయల మరణానంతరం మంత్రి తిమ్మగును సహాయంతో కృష్ణదేవరాయలు పరిపాలించసాగాడు. ఈతడు 1509 నుండి 1530 వరకు పరిపాలించాడు. కృష్ణదేవరాయలు అత్యంత ప్రతిభాశాలి. సేనాని, బహుభాషాకోవిదుడు. రాజ్య తంత్రజ్ఞుడు. సామ్రాజ్య విస్తరణ ఒక వైపున చేస్తూనే, సుస్థిర పరిపాలన కవసరమైన అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టాడు. తెలుగు, కన్నడ భాషలను రెంటినీ ఆదరించాడు. తెలుగు భాషపట్ల సహజంగా అభిమానం చూపాడు. ఆముక్తమాల్యదలో ఇలా అన్నాడు :

*ఆ. వె. తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను*
*తెలుగు రేఁడ నేను తెలుఁగొకండ*
*ఎల్లవారు వినగ ఎరుగవే బాసాడి*
*దేశ భాషలందు తెలుగు లెస్స*

కృష్ణదేవరాయలు మొట్టమొదట దక్షిణ దిగ్విజయం ప్రారంభించి ఉమ్మత్తూరు, శివసముద్రం దుర్గాలను సాధించాడు. ఈరెండూ కావేరీ తీరాన ఉన్నవి. అంతటితో నంతృప్తిపడక శ్రీరంగపట్నం కూడా స్వాధీన పరచుకున్నాడు. తన దక్షిణాపథ రాజ్యానికంతా శ్రీరంగపట్నం కేంద్రంగా చేసి కెంపగౌడ్, వరప్పగౌడ్ అను వారిని సామంతులుగా నియమించాడు. కెంపగౌడ్ బెంగుళూరు నగర నిర్మాత. నాటి నుండి ఈ ప్రాంతమంతా పాలెగాండ్ర పాలనలో కృష్ణదేవరాయలకు లోబడి వున్నది. ఈ దక్షిణ దండయాత్ర 1512 లో జరిగింది. ఇదే సమయంలో తంజావూరు, మధుర, జింజి ప్రాంతాలను కూడా కృష్ణరాయలు ఆక్రమించుకున్నాడు.

తంజావూరు, మధురలకు తెలుగు సేనానులు పరిపాలకులయినారు. విజయనగర రాజ్యం పటిష్టంగా వున్నంత వరకూ ఈ రెండు రాజ్యాలు సామంత రాజ్యాలుగా వుండేవి. అటు తర్వాత ఇవి స్వతంత్ర రాజ్యాలైనవి. తంజావూరు రాజ్యానికి చెవ్వప్ప నాయకుడు-కృష్ణదేవరాయల అనంతరం

పరిపాలించిన అచ్యుతరాయలచే. 1535 లో నియమితుడైనారు. మదురకు పరిపాలకుడుగా విశ్వనాథ నాయకుని కృష్ణదేవరాయలే నియమించారు.

తెలుగు సేనాను దక్షిణ దేశం వెళ్ళి పరిపాలించటంతో వారితో బాటు కొన్ని వేల తెలుగు కుటుంబాలు ద్రావిడ దేశానికి తరలిపోయినవి. మధుర, తంజావూరు ప్రాంతాలలో, ఇళ్ళలో తెలుగు మాట్లాడుకొనే రాష్ట్రేతరాంధ్రులు కొన్ని లక్షల మంది నేడున్నారు. విజయనగర రాజ్య పతనానంతరం మధుర, తంజావూరు నాయకులు ఆంధ్రభాషా పోషకులుగా పేరుపొందారు.కృష్ణదేవరాయల దక్షిణ దిగ్విజయం ఫలితంగా ఆంధ్రభాష, సంస్కృతి పరరాష్ట్రాలకు వ్యాపించింది.

దక్షిణ దిగ్విజయం తరువాత కృష్ణరాయలు ఉత్తర దిగ్విజయం ప్రారంభించారు. ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, బెల్లంకొండ, నాగార్జునకొండ, అద్దంకి మొదలైన దుర్గాలన్నిటినీ గణపతుల వద్ద నుండి జయించారు.

కృష్ణానది దాటి, శాతవాహనుల కాలంలో నుండి ప్రసిద్ధి చెందిన శ్రీకాకుళం గ్రామాన్ని, అక్కడ ఆంధ్రవిష్ణు దేవాలయాన్ని కృష్ణదేవ రాయలు చూశారు. ఈ దేవాలయాన్ని చూసి, ప్రాచీన సామ్రాజ్యాధిపతు లను స్మృతికి తెచ్చుకున్న మీదటనే కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద గ్రంథం వ్రాశారట. సింహాచలం, పొట్నూరు, కటకం వరకు కృష్ణదేవ రాయల దిగ్విజయం సాగింది. కటకం పూర్తిగా ధ్వంసం చేయబడింది. ప్రతాపరుద్ర గజపతి కూతురును కృష్ణదేవరాయలు వివాహం చేసుకున్నాడు. ఈ దండయాత్ర 1515 లో జరిగింది.

రాయల మూడవ దండయాత్ర రాయచూరు దుర్గంపైన. ఇంత వరకు కృష్ణదేవరాయలు ముఖాముఖి మహ్మదీయులతో తలపడలేదు. తన సామ్రాజ్యాన్ని ఇతర దిశలలో విస్తరించుకోవటంలో మాత్రమే నిమగ్నులైనారు. 1520 లో రాయచూరు దుర్గాన్ని ముట్టడించి, ముస్లిం సేనలను ఓడించి ఆ దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కృష్ణదేవరాయలు దక్షిణ హిందూ దేశాన్నంతటినీ జయించి, ఏక చక్రాధిపత్యం చేస్తూ ఉండగా, దక్కనులోని బహమనీ రాజ్యం బీజపూర్, అహమ్మద్‌నగర్, బీదర్, బీరార్, గోల్కొండ అని ఐదు విభాగాలైంది. శత్రురాజ్యంలో వచ్చిన ఈ అంతఃకలహాలు కృష్ణరాయల సామ్రాజ్య విస్తరణకు అనుకూల పరిస్థితులను కల్పించాయి.

కృష్ణరాయల జీవితంలోని ఆఖరు ఘడియలు శాంతంగా గడవలేదు. కృష్ణరాయలకు ఒకే కొడుకున్నాడు. అతను బాలుడు. తన అనంతరం, యీ బాలునికి రాజ్యం దక్కుతుందో లేదో అని రాయలు అనుమానించసాగాడు. అనుమానానికి తగినట్లు ఆ బాలుడు చనిపోయాడు.

తన మహోన్నతికంతా కారణమయిన తిమ్మరుసే యీ హత్య చేయించాడని రాయలకనుమానం కలిగింది. తిమ్మరుసును, అతని అన్న కుమారుణ్ణి బంధించాడు. తిమ్మరుసు అన్న కుమారుడు ఖైదు నుంచి తప్పించుకుపోయాడు. కృష్ణరాయలు యుక్తాయుక్త విచక్షణను వదలి, అప్పాజీ అని తానెంతో గౌరవించిన తిమ్మరుసు రెండు కళ్ళు ఊడబెరికించాడు. కృష్ణరాయలు తిమ్మరుసుల ఆఖరి రోజులు యీ శోచనీయ పరిస్థితులలో ముగిశాయి. రాజ్యకాంక్ష ఆనాడు ఎంత ప్రబలంగా ఉండేదో తెలుసుకునేందుకు యిది చక్కని ఉదాహరణ.

## సామ్రాజ్య పతనం (1550-1650)

కృష్ణరాయల మరణానంతరం, అతని తమ్ముడు అచ్యుతరాయలు పది ఏండ్లు పరిపాలించాడు. అచ్యుతరాయల మరణంతో సింహాసనానికై పెనుగులాట ప్రారంభమైంది. అచ్యుతరాయల కుమారుడు బాలుడైన వేంకటరాయుడు సింహాసనం అధిష్టించాడు.

రాజ్యాధికారంకొరకు, మంత్రులు, సేనానులు రెండు పక్షాలైనారు. వేంకటరాయని మేనమామ సకలం తిమ్మయ్య ఒక పక్షానికి, కృష్ణరాయల అల్లుడు అళియ రామరాయలు మరొకపక్షానికి నాయకత్వం వహించారు. బాలుడైన వేంకటరాయలు మరణించినమీదట సకలం తిమ్మయ్య రాజు కావలె

నని ప్రయత్నించారు. అళియ రామరాయలని ప్రసిద్ధిచెందిన ఆర్వీటి రామరాయలు యీ ప్రయత్నాన్ని ప్రతిఘటించి, అచ్యుతరాయల తమ్ముని కుమారుడైన సదాశివరాయలను బాలుని సింహాసనంపై ఉంచి, తానే నిజమైన పరిపాలకుడై 23 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా రాజ్యమేలాడు. సకలం తిమ్మయ్య ఆత్మహత్య కావించుకున్నాడు. ఆర్వీటి వంశ పరిపాలన ప్రారంభమైంది.

రామరాయలు, అంతవరకూ విజయనగరరాజు లవలంబించిన విధానానికి స్వస్తి చెప్పి, హిందూమత దురభిమానాన్ని ప్రోత్సహించాడు. ముస్లిం నవాబుల మధ్య అంతఃకలహాలను రగుల్కొల్పి దక్కను పీఠభూమి నంతనూ ఆక్రమించ యత్నించారు. రామరాయల జీవితమంతా యుద్ధాలతోనే గడిచింది.

సామ్రాజ్య విస్తరణకు కృష్ణదేవరాయలు సైతం అనేక దండయాత్రలు జరిపినవాడే. కాని యుద్ధాలు ముగిసిన మీదట ఓడిపోయిన వారిని గౌరవంగా చూసి వారితో, బంధుత్వాలు ఏర్పరచుకొని, వారి స్నేహాన్ని సంపాదించారు. అందువలన శ్రీకృష్ణరాయలు దాదాపు అన్ని దండయాత్రలలో విజయం సాధించాడు. అళియ రామరాయలు అందుకు వ్యతిరేకంగా, ఓడిపోయిన వారిని అవమానించి, కక్ష, ద్వేషం పెంచి మిత్రులను సైతం శత్రువులను చేసుకున్నాడు.

రామరాయలు తన 23 ఏండ్ల పరిపాలనలో నాలుగుసార్లు అహమ్మద్‌నగరు, బీజపూరు రాజ్యాలపై దాడిచేసి ఓడించాడు. రామరాయల ధాటికి తాళలేక, బీజపూరు నవాబైన అలీ ఆదిల్‌షా, రామరాయలతో సంధి చేసుకొని విజయనగరం వచ్చి రామరాయలు తనకు తండ్రి అని, తాను అతనికి దత్తపుత్రుడని వినయ విధేయతలతో వర్తించసాగాడు.

ఒక నవాబు తన కంతటి గౌరవం ఇవ్వటంతో, అళియ రామరాయలు మరింత గర్వోన్నతుడైనాడు. ఆదిల్‌షా కొరకు రెండుసార్లు అహమ్మద్‌నగర్ పై దండెత్తి ముస్లిం ప్రజలను బాధలు పెట్టి, వారి మత గ్రంథాలను ధ్వంసంచేసి, మతద్వేష పిశాచాన్ని రగుల్కొల్పాడు.

దాంతో ఆదిల్‌షా సైతం రామరాయలుకు ఎదురు తిరిగాడు. దక్కను నవాబులందరూ ఏకమై, 1565 లో జరిగిన తళ్ళికోట యుద్ధంలో రామ రాయలను ఓడించారు. అతనిని వధించి అతని శిరస్సును ఢిల్లానికి గుచ్చి విజయనారం చేరారు. విజయనగర సేనలు చెల్లాచెదరైనవి.

విజయనగర యుగంలో జరిగిన అసంఖ్యాకమైన యుద్ధాలు అన్నీ హిందూ ముస్లిం ప్రాతిపదికపై జరిగినవి కావు. శత్రువు యొక్క శత్రువు మిత్రుడు అను సంకుచిత రాజనీతి ఈ యుద్ధాలకన్నిటికీ మూలకారణం. ముస్లిం రాజ్యాలు తమలో తాము కలహించుకొని, విజయనగర రాజుల సహాయం పొందేవి. హిందూ రాజులు తమలో తాము కలహించుకొని మహమ్మదీయ నవాబుల సహాయం స్వీకరించేవారు. రెడ్డిరాజులకు, పద్మ వెలమలకు స్పర్ధ, గజపతులకు, నరపతులకు పోటీ. బీజపూర్, అహమ్మద్ నగర్ నవాబుల మధ్య ఈసు. తల్లికోటవంటి యుద్ధాలలో మాత్రమే హిందూ, ముస్లిం సామ్రాజ్య సేనలకు ముఖాముఖి ఘర్షణ జరిగింది.

తల్లికోట యుద్ధానంతరం, అర్వీటి వంశస్థులైన రాజులు మరొక శతాబ్దం పెనుగొండ రాజధానిగా, రాయలసీమ, మైసూరు ప్రాంతాలను, తమిళ దేశంలో కొంత భాగాన్ని పరిపాలించారు. ఈ పరిపాలన అంతా అంతఃకలహాలతోనే గడచిపోయింది.

రామరాయల తమ్ముడు తిరుమలరాయలు, తన 90 వ ఏట, పెను గొండలో సింహాసనం అధిష్టించాడు. పరిపాలనా సౌలభ్యం కొరకు తన రాజ్యాన్ని మూడు భాగాలు చేసి ముగ్గురు కుమారులను ఆ ప్రాంతాలకు పాలకులుగా నియమించాడు. పెనుగొండ, శ్రీ రంగపట్నం, చంద్రగిరి- ప్రాంతీయ రాజధానులు.

తిరుమలరాయని కుమారుడు శ్రీరంగరాయలు. పెనుగొండను పరిపాలిస్తుండగా గోల్కొండ నవాబు పెనుగొండపై దాడిచేశాడు. శ్రీరంగ రాయని అల్లుడు జగదేవరాయలు, ఈ యుద్ధంలో గోల్కొండ నవాబును ఓడించి, వీరుడని ప్రసిద్ధి చెందాడు. ఈ సాహసిక గాథలను వర్ణించే

బంగారు తిమ్మరాజుకథ అను జానపద గేయం నాటి పరిస్థితులను తెలుసు కునేందు కుపయోగపడగలదు.

శ్రీరంగరాయలు అనంతరం వేంకటపతిరాయలు చంద్రగిరి రాజధానిగా 1585-1614 వరకు పరిపాలించాడు. ఇతని కాలంలో మైసూరు విజయనగర సామ్రాజ్యం నుండి చీలిపోయి, రాజ ఒడయరు అను స్థానిక ప్రభువు పరిపాలనలోకి పోయింది. రాజఒడయరు నేటి మైసూరు రాజ వంశానికి మూలపురుషుడు. వేంకటపతిరాయల మరణానంతరం కొండవీడు, ఉదయగిరి, బెల్లంకొండ దుర్గాలు గోల్కొండ నవాబుల వశమైనవి.

వేంకటపతిరాయల మరణానంతరం చంద్రగిరి సింహాసనానికై తగవులు ప్రారంభమయినవి. వేంకటపతిరాయల అన్నకొడుకు రెండవ శ్రీరంగరాయలు వేంకటపతిరాయల బావమరిది గొబ్బూరు జగ్గరాజు సింహాసనానికై పెనుగులాడ సాగారు. గొబ్బూరు జగ్గరాజు రెండవ శ్రీరంగరాయలను సకుటుంబంగా హత్యచేయించాడు. ఈ దారుణ హత్యకు కినిసి, యాచమ నాయకుడను మరొక సేనాని రెండవ శ్రీరంగరాయల కుమారుడయిన మూడవ శ్రీరంగరాయలను బాలుని రక్షించి, అతని తరపున జగ్గరాజుతో యుద్ధం చేశాడు.

ఈ యుద్ధం తిరుచునాపల్లి సమీపంలో తోపూరు గ్రామంవద్ద జరిగింది. తంజావూరును పరిపాలిస్తున్న రఘునాథరాయలు యాచమ నాయని పక్షం వహించాడు. జగ్గరాజు ఓడిపోయాడు.

అనంతరం మూడవ శ్రీరంగరాయలు కొంతకాలం, చంద్రగిరిలో పరిపాలించాడు. 1646 లో మహమ్మదీయులు ఉత్తర ఆర్కాటు జిల్లాను స్వాధీనం చేసుకున్నారు. తన పదవిని రక్షించమని శ్రీరంగరాయలు ఢిల్లీ పాదుషా షాజహాన్ చక్రవర్తికి విజ్ఞప్తి చేశాడు కాని ఫలితం శూన్యం. అంతట శ్రీరంగరాయలు సామంతుల తిరుగుబాటుకు తట్టుకోలేక పారిపోయి మైసూరు రాజును శరణుజొచ్చారు. 1675 లో విజయనగరరాజ్యం నిశ్శేషంగా అంతమైంది.

మూడవ శ్రీరంగరాయల అనుమతితో కాళహస్తి పాలకుడయిన దామెర్ల వెంకటాద్రినాయుడు 1639 లో చెన్నకుప్పం అను ప్రాంతాన్ని, కోట కట్టుకునేటందుకై బ్రిటిషు వారికి ఇచ్చివేశాడు. ఇదే నేటి చెన్న పట్టణం.

ఆంధ్రలో బ్రిటిషువారి ప్రవేశం, 1616 లో మచిలీపట్నం రేవును నైజాం నుండి సంపాదించటంతోనే ప్రారంభమైంది. అంతకు పూర్వమే 1611 లో పశ్చిమ తీరంలోని సూరతును బ్రిటిషువారు ఆక్రమించారు. భారతదేశంలో బ్రిటిషువారు మొట్టమొదట సంపాదించిన స్థావరం సూరతు. కాని సూరతు కంటె, మచిలీపట్నంకంటె చెన్నపట్నం బ్రిటిషు సామ్రాజ్య విస్తరణకు ఎంతగానో ఉపయోగపడినందున 1639వ సంవత్సరం, బ్రిటిషు ఆక్రమణ చరిత్రలో ప్రముఖస్థానం వహిస్తున్నది.

18 వ అధ్యాయం

# రాయలనాటి వైభవం

హంపీ విజయనగర రాజుల వైభవం మొదలైన విషయాలను గురించి సమకాలికులైన న్యూనిజ్, పేస్ — అను పోర్చుగీస్ చరిత్రకారుల రచనలవల్ల మనం తెలుసుకోగలము. వీరిద్దరు కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయలు పరిపాలించిన కాలంలో విజయనగర ఆస్థానంలో ఉన్నారు. కృష్ణదేవరాయల రాయచూరు దండయాత్రను న్యూనిజ్ స్వయంగా చూచి వర్ణించాడు. విజయనగరం కేవలం రాజ్యం కాదు. సామ్రాజ్యం. ఆంధ్ర, తమిళ, కన్నడ ప్రాంతాలను ఒకే త్రాటిమీద నడిపించడం సామాన్య విషయంకాదు. సామ్రాజ్య నిర్వహణ కవసరమైన సైనిక బలాన్ని, రాజనీతిజ్ఞతను విజయనగరరాజులు అలవర్చుకొన్నారు.

కృష్ణదేవరాయలకుగల సైనిక బలాన్ని గురించి పేస్ ఇలా వ్రాస్తున్నాడు: "ఈ రాజువద్దపదిలక్షల సైనికులు సంవత్సరము పొడుగున ఉంటారు. ఇదంతా స్థిరసైన్యము. వీరిలో ౩౫ వేల మంది గుర్రపు రౌతులున్నారు. ఏ క్షణంలోనయినా ఈ సైన్యం యుద్ధానికి సిద్ధంగా ఉంటుంది. ఇంత పెద్ద సైన్యాన్ని పోషించడానికి రాజుకు డబ్బెక్కడనుండి వస్తుంది? ఈ సైన్యమంతా వివిధ సామంత నాయకుల పోషణక్రింద ఉండేది. ఈ సామంతులకు వేర్వేరు ప్రాంతాలపై అధికారం ఉంటుంది.

"ఆ ప్రాంతంలో పన్నులు వసూలు చేసుకోవటం మొదలైన బాధ్యత అంతా ఆ సామంతులదే. ప్రతి సామంతరాజు ఎంతెంత సైన్యాన్ని పోషించాలిసింది కృష్ణదేవరాయలే నిర్ణయిస్తారు.

"ఈ సామంతులు సైన్యాన్ని పోషించుటతోపాటు ప్రతి సంవత్సరం రాజుకు కప్పం చెల్లిస్తూ ఉంటారు. రాజుగారికి కూతుళ్ళు పుట్టినప్పుడు,

కొడుకులు పుట్టినప్పుడు, రాజుగారి జన్మదినోత్సవంనాడు వీరు బహుమానా లిస్తూ ఉంటారు." అని ఈ చరిత్రకారుడు వ్రాశాడు. కృష్ణదేవరాయలు సైనిక వందనం స్వీకరించే దృశ్యాన్ని పేస్ కన్నులకు గట్టినట్లు వర్ణించాడు. అశ్వికదళం, గజదళం, పదాతులు, రానుష్కులు, ఫిరంగిదళం మొదలయినవాటి నన్నిటిని వర్ణించారు. పోర్చుగీస్ సైనికదళం ఒకటి ఉండేది. గుర్రాలు, ఫిరంగులు పోర్చుగీసువారి సహాయంతోనే కృష్ణదేవరాయలు సంపాదించగలిగాడు.

ఇదే విషయమై న్యూనిజ్ ఇలా వ్రాస్తున్నాడు : "విజయనగర రాజులు ఎంత సైన్యం కావాలంటే అంత సైన్యాన్ని సమీకరించగలరు. అచ్యుతరాయలకు పదాతిదళమే 6 లక్షలకు పైగా వుంది. 24 వేల గుర్రాలున్నవి. వీటి పోషణ బాధ్యత అంతా సామంతులదే. ఈ సామంతులు కౌలుదార్ల వంటివారు. ఒక సామంతుడున్నాడు. అతను తన ప్రాంతంలో 120 లక్షల నాణెములు వసూలు చేస్తాడు. ఇందులోనుంచి 60 లక్షల నాణెములు కప్పం చెల్లిస్తాడు. మిగతా ధనంతో సైన్యాన్ని పోషిస్తాడు. సామాన్య రైతులు చాలా బాధపడుతున్నారు. ఈ సామంత ప్రజలు అతి నిరంకుశంగా పరిపాలనచేస్తూ ఉంటారు."

కృష్ణదేవరాయలకు పూర్వం ఇంతటి పెద్ద సైన్యం పోషించిన రాజులు లేరు. కాకతీయులకుగల స్థిర సైన్యం కొద్దిపాటి మాత్రమే. యుద్ధం వచ్చినప్పుడు గ్రామాలనుండి సైనికులను సమీకరించేవారు. విస్తారమైన స్థిరసైన్యాన్ని పోషించే పద్ధతి మహమ్మదీయులు ప్రవేశపెట్టారు. ఇతర రాజ్యాలను ఆక్రమించి సామ్రాజ్యాన్ని విస్తరింప చేయుటే ప్రధాన లక్ష్యంగా పెటుకున్న ఢిల్లీ నవాబులు లక్షల కొలది సైన్యాన్ని ఎప్పుడూ పోషిస్తూ ఉండేవారు. కృష్ణదేవరాయలు కూడా అదే పద్ధతి అవలంబించారు.

ఈ విధానంవల్ల ప్రజలపై పన్నుల భారం హెచ్చుట, సామంతుల నిరంకుశ పరిపాలనకు హద్దు లేకపోవటం సహజంగా జరిగింది. కృష్ణదేవరాయలు సామంతులను గట్టిగా అదుపులో ఉంచగలిగాడు. ఆ తర్వాత వచ్చినవారు ఇది చేయలేకపోయారు.

## పరిపాలన

విజయనగర రాజులందరూ వర్తక వాణిజ్యాల అభివృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి విస్తారంగా కృషి చేశారు.

పేస్ ఇలా వ్రాస్తున్నాడు :

"విజయనగరం చుట్టూ 72 మైళ్ళ పొడవుగల కొండల వరస ఉంది. ఈ ఆవరణ లోపల పండ్ల తోటలు, సారవంతమైన భూములు విస్తారంగా ఉన్నాయి. జల సమృద్ధిగల చెరువులు అనేకం ఉన్నవి. వర్తకులు నివసించు వీధులలో కెంపులు, వజ్రములు, నీలములు, పచ్చలు, ముత్యములు కుప్పలు కుప్పలుగా ఉన్నాయి. నేనొక కొండ యెక్కి పట్టణమంతా చూశాను. రోము నగరమంత పెద్దదిగాను, సుందరమైనదిగాను నాకు విజయనగరం కనిపించింది."

ఇదే విషయమై అబ్దుల్ రజాక్ అను ముస్లిం చరిత్రకారుడు ఇలా వ్రాస్తున్నాడు : "సప్త ప్రాకారములచే చుట్టబడిన ఏడు దుర్గములు ఈ నగరములో ఉన్నాయి. మొదటి దుర్గము మొదలు మూడవ దుర్గము వరకు పొలములు, ఉద్యానవనములు ఉన్నాయి. మూడవ దుర్గము నుండి ఏడవ దుర్గము వరకు ఇండ్లు, వాకిళ్ళు, బజారులు ప్రజలతో కిటకిటలాడుతున్నవి."

వ్యవసాయాభివృద్ధికి విజయనగర రాజులు చేసిన కృషి ప్రత్యేకం గమనార్హం. నేడు నిరంతరం కరువుతో బాధపడుతున్న రాయలసీమ ఆ కాలంలో రతనాలసీమగా ఉండేదనే విషయంలో అతిశయోక్తిలేదు. రాయలసీమలో ఎక్కడ చూసినా రాయలనాటి చెరువులు అనేకం కనబడతాయి. బుక్కరాయ చెరువు, నాగవ్వ చెరువు, బిచ్చపు చెరువు మొదలయినవనేకం త్రవ్వించబడ్డవి. రాయల్ చెరువు అను పేరుతో వ్యవహరించబడే చెరువులు రాయలసీమలోని అన్ని జిల్లాలలోను ఉన్నాయి. ఈ చెరువులకు నిరంతరం నీరు వచ్చేటట్లు అనేక కాలువలు కూడా విజయనగర రాజులు త్రవ్వించారు.

మొదటి దేవరాయలు విజయనగరానికి 12 మైళ్ళ దూరాన తుంగభద్రకు ఆనకట్ట కట్టి ఒక కాలువ ద్వారా విజయనగరానికి నీటిని సప్లయి చేశాడు. కృష్ణదేవరాయలు 1521 లో కొర్రగల్లు వద్ద తుంగభద్రకు మరొక ఆనకట్ట కట్టించె. అనేక చెరువులకు నీరు వచ్చేటట్లు చేశాడు. పోర్చుగీసు ఇంజనీర్లు ఈ ఆనకట్టల నిర్మాణంలో తోడ్పడ్డారు.

కృష్ణదేవరాయల కాలంలో మహర్నవమి ఉత్సవం అతి వైభవంగా 9 రోజులు జరిగేది. ఇప్పటికీ మహర్నవమి దిబ్బ అను ప్రసిద్ధ స్థలాన్ని హంపిలో చూడవచ్చు. కృష్ణదేవరాయలకు 12 మంది భార్యలు. వారిలో ముగ్గురు రాణులు. అందులో ఒకరు పట్టమహిషి. ఇతని తమ్ముడు అచ్యుత దేవరాయల అంతఃపురములో 500 మంది స్త్రీ లుండేవారని న్యూనిజ్ వ్రాస్తున్నాడు.

రాజనీతి విషయమై కృష్ణదేవరాయలకుగల అభిప్రాయాలను ఆయన వ్రాసిన ఆముక్తమాల్యదనుండి గ్రహించవచ్చును. "దేశ మధ్యంలో అరణ్యాలుండరాదు. దొంగలు, దారి దోపిడీగాండ్రు దానిని స్థావరం చేసుకొంటారు. కాని సరిహద్దులో అరణ్యాలుండటం మంచిది. అరణ్యంలో అడవిజాతులవారితో స్నేహ సంబంధాలు నెలకొల్పుకొనుట ద్వారా రాజ్యానికివారు కావలాదారులుగా ఉంటారు. ఆ పరిసర భూములు నిర్జనమైన ఊరులకు ఉచితంగా సాగుకు యివ్వవలెను. అడవిజాతులవారు, ఈ ఊరులు ఒకరి ప్రక్కన ఒకరు ఉండటంవల్ల ఒకరిమీద మరొకరు కాపుగా ఉంటారు. ఇద్దరిమధ్య అంతఃకలహాలు వచ్చినా మంచిదే ఆ అవకాశాన్ని వినియోగించుకుని రాజు తన పెత్తనాన్ని స్థాపించుకోవచ్చు....శత్రురాజుల సామంత ప్రభువులను సామ, దాన, భేద, దండోపాయాల ద్వారా లోబరచుకొని పర రాజ్యాలను ఆక్రమించవలెను. రాజు శత్రువులను జయింపవచ్చును. దుర్గములను కట్టుకొనవచ్చును. కాని శత్రు స్త్రీలను పుట్టింటి ఆడపడుచువలె గౌరవించవలెను. వారియెడల అనాదరముగాని, వాక్పారుష్యముగాని పనికిరాదు."

క్రీ. శ. 1470 లో దక్షిణ హిందూదేశం పర్యటించిన అత్హనాసి నికిటిన్ అను రష్యన్ వ్యాపారస్థుడు ఆనాటి యుద్ధాలను యిలా వర్ణించాడు.

"బలమైన యీ హిందూ మహారాజుల దుర్గంపై మాలిక్ ఖాన్‌జోదా ముట్టడి వేశారు. రాత్రింబగళ్ళు యుద్ధం జరిగింది. మహమ్మదీయ బలసైన్యం 20 రోజులు వరుసగా అన్నము, నీళ్ళు ముట్టకుండా పోరాడినవి. భారీ ఫిరంగులను, ముట్టడి సేనలు ప్రయోగించినవి. చిట్ట చివరకు దుర్గం లోబడ్డది. 5 వేల మంది మహమ్మదీయ సైనికులు ఈ ముట్టడిలో మరణించారు. నగరంలోకి ప్రవేశించినమీదట నవాబు 20 వేల మంది హిందువులను, స్త్రీలను, పురుషులను తలలు నరికి చంపించారు. మరొక 20 వేల మందిని యుద్ధ ఖైదీలుగాచేసి బానిసలుగా అమ్మివేశారు. ఇంతచేస్తే దుర్గంలోని కోశాగారంలో ధనమేమీ దొరకలేదు. నగరాన్ని ముస్లిం సేనలు ఖాళీ చేసినవి."

నాటి యుద్ధాలు ఎంత దారుణంగా జరిగేవో అది స్పష్టంగా తెలియ జేస్తుంది.

కృష్ణదేవరాయల పరిపాలనలో కరువు కాటకాదులు లేకుండా దేశం సుభిక్షంగా ఉండేదని, వర్తక వ్యాపారాలకు చోరభీతి లేకుండా కఠిన శాసనాలు అమలు జరుపబడేవని పై చరిత్రకారులు వర్ణించారు. కృష్ణ రాయలు అజానుబాహువని, దృఢగాత్రుడని, యుద్ధంలో సైనికులకు స్వయంగా నాయకత్వం వహించేవాడని, ఉదాత్త గంభీరుడని పేస్ వర్ణించాడు.

## సాహిత్యం – లలిత కళలు

కృష్ణరాయల పరిపాలనలో ఆంధ్రసాహిత్యం పొందినంత వ్యాప్తి అంతకు పూర్వం ఏ యుగంలోను పొందలేదు. కన్నడ, సంస్కృత కవులను కూడా కృష్ణరాయలు పోషించాడు. కాని, తెలుగు భాషపట్ల ప్రత్యేకాభిమానం చూపాడు. అష్ట దిగ్గజములని పేరుపడిన 8 మంది పండితులు, కవులు ఆయన ఆస్థానంలో ఉండేవారు. వారిలో అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, మాదయ్యగారి మల్లన, ధూర్జటి ప్రసిద్ధులు. అల్లసాని పెద్దన వ్రాసిన మనుచరిత్ర ప్రబంధయుగానికి నాంది.

సాహిత్యంలో ఒక మార్పు వచ్చింది. అంతవరకు సంస్కృత కావ్యాల తర్జుమాలు, పురాణ గ్రంథాలు మాత్రమే కవులు రచించేవారు. వాటిలో కూడా భక్తి ప్రధానమైన గ్రంథాలు విస్తారంగా ఉండేవి.

రాయలకాలంలో తర్జుమాల మీద మోజు, భక్తి పారవశ్యం తగ్గింది. శృంగారరసం ప్రాధాన్యం వహించింది. రాజాస్థానాలలో సర్వసుఖాలు పొందుతూ, రాజులను మెప్పించేందుకై నాటి కవులు రచనలు సాగించారు. పెద్దన, తిమ్మన వీరిలో ముఖ్యులు. కృష్ణరాయల తర్వాత విజయనగరం పరిపాలించిన రాజులకాలంలో నివసించిన పింగళి సూరన, రామరాజ భూషణుడు, తెనాలి రామకృష్ణుడు మొదలైనవా రనేకులు మహాకవులు ఆ కాలంలో ఉద్భవించారు.

వీరిలో తెనాలి రామకృష్ణుడు రచించిన పాండురంగ మాహాత్మ్యం సమకాలిక సాంఘిక జీవనాన్ని ప్రతిబింబించే గ్రంథం. వేశ్యా లంపటత్వం నాడు సర్వసామాన్యం. రాజులు, బ్రాహ్మణులు వంటి అగ్రవర్ణాలలో ఇది మరీ హెచ్చు. అవినీతికరమైన ఇట్టి జీవితంవల్ల కలిగే కుటుంబ విచ్ఛిత్తి. ఈ ఒడుదుడుకులను సర్దటానికిచేసే ప్రయత్నాలు పాండురంగమాహాత్మ్యం లోని నిగమశర్మోపాఖ్యానం చక్కగా వివరిస్తుంది.

రాయల ఆస్థానంలో నివసించిన మరియొక కవి ధూర్జటి. ఇతను శివభక్తుడు. కృష్ణరాయలు వైష్ణవ మతాన్ని ఆదరించినా అన్యమతాలను ద్వేషించలేదు. హిందూమతంలోని వివిధ మత భేదాల మధ్య సామరస్యం ప్రదర్శించారు. జైనమత అవశేషాలను కూడా విజయనగర రాజులు కాపాడారు. శ్రావణ బెళ్గోళలోని గోమటేశ్వరుని దేవాలయాన్ని కొందరు వైష్ణవులు ధ్వంసం చేయగా విజయనగరం రాజులలో రెండవవాడైన బుక్కరాయలు జోక్యం కలిగించుకొని తిరిగి ఆ వైష్ణవులే జైనాలయాన్ని కట్టించి యిచ్చునట్లు తీర్పు ఇచ్చారు. ఆ ఆలయం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది.

ధూర్జటి కవి కాళహస్తీశ్వర మహాత్మ్యము అనే భక్తి ప్రధానమైన కావ్యాన్ని వ్రాశాడు. ఆ తర్వాత కొంత కాలానికి కాళహస్తీశ్వరశతకము కూడా వ్రాశాడు. కృష్ణరాయల మరణానంతరం రాజాదరణ నశించి, రాజ

వళలయందు విరక్తిజెంది కాళహస్తికి వెళ్ళి అక్కడ ఈ శతకం వ్రాసి ఉంటాడు.

ధూర్జటి ఆ శతకంలో "రాజుల్మత్తులు వారి సేవ నరకప్రాయంబు" "రాజకీటములనే సేవింపగానోప" "నరనాథా శ్రయము ప్రాణహాని" "నృపాలాధమున్ భజింప జాతురు భావ్యమే" అని అనేక పద్యాలలో రాజ సేవను నిరసించారు.

విజయనగర కాలంలో సాహిత్యంతోపాటు చిత్ర, శిల్పకళలు వృద్ధి చెందాయి. హంపిలోని దేవాలయాలు, పెనుకొండలోని గగనమహల్ మొదలైనవన్నీ నాటి అవశేషాలే. తమిళదేశంలోకూడా విజయనగరరాజులు అనేక దేవాలయాలు నిర్మించారు. చిదంబరం, తిరువణ్ణామలై తదితర యాత్రా స్థలాలలో కృష్ణదేవరాయలు కొత్తదేవాలయాలు నిర్మించి పాత దేవాలయా లను బాగుచేయించి శిల్పకళను ఆదరించారు.

హిందూపురానికి 9 మైళ్ళ దూరంలో లేపాక్షి అనుచోట పెనుకొండ విరూపన్న అను కృష్ణరాయల ఉద్యోగి వీరభద్రేశ్వరాలయాన్నినిర్మించారు. ఆలయం గోడల మీద శివలీలలను ప్రదర్శించే రకరకాల చిత్రాలను వేయిం చారు. లేపాక్షి చిత్రాలకు భారతీయ చిత్రకళలో విశిష్ట స్థానము గలదని విజ్ఞుల అభిప్రాయం.

## తంజావూరు - మధుర రాజ్యాలు

1535 నుండి 1673 వరకు తంజావూరు రాజ్యాన్ని 140 సంవత్స రాలు నాయకరాజులు పరిపాలించారు. ఈ వంశం ఆఖరువరకు విజయనగర రాజులపట్ల విశ్వాస పాత్రులుగా ఉంటూ వచ్చారు.

వీరిలో ప్రథముడైన చెవ్వప్ప నాయకుడు కృష్ణరాయల తమ్ముడైన అచ్యుతరాయలకు బావమరది. తెలుగుదేశం నుండి వలస వెళ్ళిన యీతడు తమిళదేశంలో నాటుకుపోయి ప్రజారంజకుడనే పేరు సంపాదించు కున్నాడు. సింహళ దేశం వరకు యీతడు దండయాత్రలు చేశాడు. ఈతని కాలంలోనే క్రైస్తవ మత ప్రచారకులు మొట్టమొదటగా దక్షిణదేశంలో

మత ప్రచారం ప్రారంభించారు. ఈతని కుమారుడు అచ్యుత నాయకుడు అధికారంలోకి వచ్చేసరికి విజయనగర రాజ్య వైభవం నశించింది. మధుర రాజులు విజయనగరాధికారాన్ని ధిక్కరించారు. మధుర రాజులకు, విజయ నగర రాజులకు జరిగిన యుద్ధాలలో అచ్యుతనాయకుడు విజయనగర పక్షం వహించాడు.

మధుర, తంజావూరు రాజ్యాలకు నిరంతర కలహాలు ప్రారంభ మయినాయి. తంజావూరు రాజులు దచ్చి సంహాదారుల కాశ్రయమివ్వగా మధురవారు పోర్చుగీసువారికి ఆశ్రయమిచ్చేవారు.

ఈ కలహాలు ఒకవైపున సాగుతున్నప్పటికీ, తంజావూరు రాజులు భాషాపోషణ, శిల్ప చిత్ర కళాభివృద్ధి విశేషంగా చేశారు. దక్షిణదేశం దేవా లయాలకు ప్రసిద్ధి. అందులోనూ ఒక్క తంజావూరు జిల్లాలోనే 2000 దేవా లయా లున్నవి. వీనిలో ఎక్కువ భాగము నాయకరాజులు కట్టించినవే. బృహదీశ్వరాలయం మొదలైనవన్నీ ఈ నాయకరాజుల చేత ప్రారం భించబడి తర్వాత కాలంలో వృద్ధిచెందాయి.

అచ్యుతనాయకుని కుమారుడు రఘునాధనాయకుడు. ఇతని కాలం 1614 నుండి 1633 వరకు; ఇతడు అతి ప్రసిద్ధుడు. గొప్ప పండితుడు. కవి. అనేకులు తెలుగుకవులు, కవయిత్రులు యీతని ఆస్థానంలో ఉండే వారు. నృత్యసంగీతశాస్త్రాలు యీతని ప్రోత్సాహంతో విశేషంగా వృద్ధిపొందాయి. ఈతడు స్వయంగా పారిజాతాపహరణం, గజేంద్రమోక్షం మొదలైన భారత, భాగవత గాథలను యక్షగానాల రూపంలో వ్రాశాడు. రఘునాధమేళ అను సంగీత గ్రంథాన్ని వ్రాశాడు. ఈతని గురువైన గోవిందదీక్షితుడు సంగీత ధసు అను గ్రంథాన్ని. గోవిందదీక్షితుని కుమారుడు యజ్ఞనారాయణదీక్షి తుడు అనేక అలంకార గ్రంథాలను వ్రాశారు. చేమకూర వేంకటపతి, కృష్ణా ధ్వరి మొదలైన కవులు, రామభద్రాంబ, మధురవాణి మొదలయిన కవ యిత్రులు యీయన ఆస్థానంలో ఉండేవారు. రామభద్రాంబ, మధురవాణి- వేశ్యలు, గొప్ప పండితులు. రామభద్రాంబ సంస్కృతంలో రఘునాథాభ్యు దయమను గ్రంథాన్ని వ్రాసింది. మధురవాణి రామాయణ గ్రంథాన్ని

సంస్కృతంలో వ్రాసింది. చేమకూర వేంకటపతి వ్రాసిన విజయ విలాస కావ్యానికి తెలుగు ప్రబంధ సాహిత్యంలో విశిష్ట స్థానమున్నది.

## తెలుగు సాహిత్యం

రఘునాథనాయకుని కుమారుడు విజయరాఘవ నాయకుడు సంగీత సాహిత్యప్రియుడు. కాని అసమర్థుడైన పరిపాలకుడు.ఇతని కాలం 1633-73 వరకు. ఆతడు 'రఘునాథాభ్యుదయ' మనే నాటకం వ్రాశాడు. ఇది తెలుగులో మొదటి నాటకం. ఈతని ఆస్థానంలో రంగాజమ్మ అను కవయిత్రి మన్నారుదాస విలాసం, ఉషాపరిణయం మొదలయిన యక్షగానాలు వ్రాసింది. క్షేత్రయ్య అను సుప్రసిద్ధ పదకర్త యీ కాలంలోనే జీవించాడు. ఇతని నివాసస్థలం కృష్ణాజిల్లా మొవ్వ. శృంగార ప్రధానమైన పదములను రచించుటలో క్షేత్రయ్య సిద్ధహస్తుడు. పద కవిత్వాన్ని వెంటబెట్టుకొని క్షేత్రయ్య నానాదేశ సంచారం చేశాడు. గోల్కొండ వెళ్ళాడు. విజయరాఘవ నాయకుని ఆస్థానాన్ని దర్శించాడు.

క్షేత్రయ్యను అనుసరించి కంఠీరవరాజు, వరదయ్య అను పదకర్తలు జావళీలను రచించారు. ఈ శృంగార సాహిత్యానికి వేశ్యాకులం ఆలంబనగా వుంది. క్షేత్రయ్య పదములలో లలిత శృంగార స్ఫోరకములైన పదములు అరుదు. జుగుప్సాకరమైనవే హెచ్చు.

మధుర రాజుల దండయాత్రల ఫలితంగా 1673 లో తంజావూరు రాజ్యం అంతరించింది. అనంతరం మహారాష్ట్ర వంశస్థులు తంజావూరును పరిపాలించారు. ఈ మహారాష్ట్ర రాజులు సైతం ఆంధ్రరాజుల సాంప్రదాయాన్ని అనుసరించి తెలుగు భాషకు ప్రోత్సాహమిచ్చారు. తంజావూరు సరస్వతి మహల్‌ను నిర్మించి, అమూల్యమైన తాళపత్ర గ్రంథాలను పదిలపరచిన, మహారాష్ట్రరాజు శహాజీ శహాజీ బహుభాషా పండితుడు. తెలుగులో 20 గ్రంథాలు వ్రాశాడు. ఇతని కాలం 1684-1712.

తంజావూరు మహారాష్ట్ర రాజులలో ఒకరైన రెండవ శరభోజి కాలంలో సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు త్యాగరాజు జీవించాడు. ఇతని జననం 1759. మరణం 1847. దక్షిణదేశంలో పుట్టి, మహారాష్ట్ర రాజుల

ఆస్థానంలో జీవించిన త్యాగరాజు తన పాటలన్నిటినీ, తెలుగులో వ్రాయటం ఆశ్చర్యకరం. తంజావూరు ఆంధ్రనాయకరాజులు నాటిన తెలుగు భాషా బీజం, అన్య భాషా వాతావరణంలో సైతం పెరిగి, పెద్దదై, త్యాగరాజు గానసుధకు ఆలంబనం కాగలిగింది. తెలుగుభాషలో ఎంతటి పటుత్వం, మృదుత్వం లేకపోతే ఇది సాధ్యం కాగలదు ?

## మ ధు ర రా జు లు

1539-1736 వరకు, 200 సంవత్సరాలు, మధుర రాజ్యాన్ని ఆంధ్రనాయకులు పరిపాలించారు. వీరిలో ప్రథముడు విశ్వనాథ నాయకుడు, ఆఖరు రాణి మీనాక్షి, వీరిద్దరిమధ్య పదముగ్గురు రాజులు పాలించారు.

తంజావూరు రాజులతో తమకుగల కలహాలలో మధురరాజులు మహమ్మదీయుల సహకారాన్ని స్వీకరించారు. విజయనగర, తంజావూరు రాజ్యాల పతనానికి మధురరాజులు కొంతవరకు తోడ్పడ్డారు.

తంజావూరు రాజులను చూసి మధురరాజులు కూడా తెలుగు భాషను ప్రోత్సహించసాగారు. ఇలాచేసిన వారు తిరుమలనాయకుడు, విజయనగర చొక్కనాథుడు. తిరుమల నాయకుని కాలం 1623-1659. ఇతని ఆస్థాన పండితుడైన లింగనమఖి కామేశ్వరకవి సత్యభామా సాంత్వనము, రుక్మిణీ పరిణయము రచించాడు. క్షేత్రయ్య తిరుమలనాయకుని ఆస్థానాన్ని దర్శించి, అతనిపై కొన్ని పదాలు చెప్పాడు.

1706-32 మధ్య పరిపాలించిన విజయరంగ చొక్కనాథుని కాలంలో జీవించిన సముఖం వేంకట కృష్ణప్ప అహల్యా సంక్రందనము, రాధికా సాంత్వనము, శేషం వేంకటపతి శశాంకవిజయం రచించారు. ఇతని కాలంలోనే ముద్దుపళని అను కవయిత్రి ఉండేది. ఈమె కూడా రాధికా సాంత్వనం రచించింది.

పద్యకావ్యాలు మాత్రమే గాక, వచన కావ్యాలు కూడా తలయెత్తినవి. విజయరంగ చొక్కనాథుడు శ్రీరంగ మహాత్మ్యము, మాఘ మహాత్మ్యము అను వచన కావ్యాలు వ్రాశాడు.

విజయరంగ చొక్కనాథుని పితామహి రాణి మంగమ్మ. ఈమె కొంతకాలం పరిపాలన చేసింది. ఈమె పరిపాలన అత్యంత లో: భూయిష్ఠమై అసహ్యకరంగా ఉండేది. ఇద్దరు కవులు ఈమెను దూషిస్తూ మధురమంగాపుంశ్చలీ విలాసం. మంగమ్మ దండకం-రచించారు. బూత కవిత్వానికి, తిట్టు కవిత్వానికి ఇవి తార్కాణాలు.

పుదుక్కోట సంస్థానంలో కూడా తెలుగు సాహిత్యం వికసించింది పుదుక్కోట సంస్థానాధీశులు ఆంధ్రులుకారు; తమిళులు. ఆంధ్రభాష నాటి సామ్రాజ్యభాష కనుక తమిళరాజులు సైతం ఆంధ్ర భాషను ప్రోత్సహించారు. పుదుక్కోట సంస్థానానికి చెందిన రాయరఘునాథుడు పార్వతీ పరిణయం అను కావ్యం వ్రాశాడు.

ఆర్కాటు జిల్లాలోని చెంజి పరిపాలకులు, రామనాథపురం జిల్లా, తిరువత్తూరు తాలూకాలోని శివపురిని పాలించిన గోళ్ళవారు తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించారు. వీరందరూ విజయనగర సామంతులు. గోళ్ళ నరామప్ప ప్రోత్సాహంతో పచ్చకప్పురపు తిరువేంగళకవి రచించిన చొక్కనాథచరిత్ర నేటికి లభించిన దక్షిణాంధ్ర సాహిత్యంలోకల్లా మొట్ట మొదటి ద్విపద కావ్యం. ఈ గ్రంథ రచనాకాలం 1531-38 మధ్య.

దక్షిణాంధ్ర సాహిత్యంలో కొత్తవచ్చినట్లు కనబడే కొన్ని లక్షణా లున్నవి. స్త్రీలు, అందులోను వేశ్యలు, మహాపండితులై కావ్యాలు వ్రాశారు. రామభద్రాంబ, మధురవాణి, రంగాజమ్మ, ముద్దుపళని, వీరందరూ పండితులు, వేశ్యలు.

ఈ సాహిత్యం అంతటా నిండివున్న జుగుప్సాకరమైన శృంగారం మరొక ప్రత్యేక లక్షణం. కృష్ణరాయల కాలంలో శృంగార కవిత్వానికి ప్రాధాన్యం హెచ్చింది. దక్షిణాంధ్రరాజుల సభాభవనాలలో అది వెర్రి తలలు వేసి అసహ్యకరంగా పరిణమించింది.

ప్రజలకు సన్నిహితంగా ఉండే సాహిత్య రూపాలను, దేశీయ ఛందస్సును నాటి కవులు స్వీకరించారు. ఇది ఒక శుభలక్షణం, యక్ష గానాలు, వచన కావ్యాలు నాటకాలు అసంఖ్యాకంగా ఉత్పత్తి అయినాయి.

:రువులు, ఏలలు, పదాలు, సంకీర్తనలు మొదలైన దేశీయ ఛందోరూపాలు గంథాలలో ప్రవేశించాయి. సాహిత్యము, నృత్యము అవినాభావంగా ఎనవేసుకొని ఉండేవి. నృత్యానికి అనువైనట్లు నాటి కవులు తమ రచనలు •గించవలసి వచ్చింది. కనుకనే నృత్యానికి తగినట్టి దేశీయ ఛందస్సులు ్యప్తిలోకి వచ్చాయి.

తంజావూరు ఆస్థానంలో భరతనాట్యం, సంగీతం కొలువు తీర్చాయి. ంద్రరేఖ, రూపవతి, లోకనాయిక, శశిరేఖ,రత్నగిరి, భాగీరథి మొదలైన కాకారులు ంఘునాథనాయకుని ఆస్థానంలో ఉండేవారు. భరతనాట్యంలో ంజావూరు సంప్రదాయం ఒకటి ఏర్పడింది.

నాటి కవులు ఎంత సహజంగా పాత్రోచిత భాషను వాడారో, ంగాజమ్మ వ్రాసిన మన్నారుదాస విలాస నాటకంలోని ఈ క్రింది ంభాషణలు తెలియజేయగలవు.

## ముత్తైదువుల సంభాషణ

ఎల్లమ్మ : అవునషే తిమ్మక్కా, నాకు వక్కాబ్రద్దా వకటి కొదవా? చాలు చాలు. నిన్న మావారు సుక్కారారం నంతలో పిండికూర కంచున్ను, గానుగపిండి తెచ్చిరి. పెండ్లి వందిట్లో నోరు మెదిలించవలె నంచున్ను యింత తెచ్చుక తించున్నానంతే.

తిమ్మక్క : ఔ ! వొయగింటి తిమ్మావధానులు పెండ్లాం పేరమ్మ పాటలు పాడుచున్నది. అంటుకొని నీవు పాడ్రాదషవో.

ఎల్లమ్మ : యిందేదో నీవు నాగవసానివై పెద్దతనం చేసుక ఉంధేదనవున్నా. కడమవారు పాటలు పాడేవారూనా ?

## దైవజ్ఞుల సంభాషణ

మంచనభట్లు : ఓరి భైరవజోస్సిగా ! తిథివార నక్షత్రాలలో నొకటి గుర్తెరుగవు కదా ! పంచాంగ మనంగ నేందిరా ?

భైరవ : నీవు బుచ్చానదాని కొడుకు పదహారో ఏంట పల్లకి? పుట్టనని జాతకం వ్రాస్తివే – ఇదిగో బిచ్చమెత్తుకు తిరుగుచున్నాండె

19వ అధ్యాయం

# గోల్కొండ నవాబులు

విజయనగర రాజ్య పతనం ఆంధ్రుల చరిత్రలో ప్రధాన ఘట్టం ఇంగ్లీషు వ్యాపారస్థులు మద్రాసులో ఫోర్టు సెంటుజార్జి కోటను కట్టుకొని తమ వ్యాపారాన్ని, అధికారాన్ని దక్షిణాదిన వ్యాప్తి చేసుకోసాగారు తెలంగాణా, కోస్తా ప్రాంతాలు, రాయలసీమ గోల్కొండ నవాబులచేత ఆ పిమ్మట మొగలు సుబేదారుచే పరిపాలింపబడినవి.

అల్లావుద్దీన్ హసన్‌గంగూ దక్కను పీఠభూమిలో బహమనీ రాజ్యం స్థాపించినపుడు, మునునూరి కాపయ నాయకుడు ఆ ప్రయత్నాన్ని బలపరచిన విషయం మనం జ్ఞాపకముంచుకోవాలి. పొరుగున ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడడం, ఆంధ్ర రాజ్యానికి క్షేమకరమని మునునూరి కాపయ నాయకుడు గుర్తించాడు. ఓరుగల్లు బహమనీ రాజ్యాలు ఒక కట్టడిమీద ఉంటే, ఢిల్లీ పాదుషా దండయాత్రలను ప్రతిఘటించ వచ్చునని అతడు ఆశించాడు. ఆ ఆశలు నెరవేరలేదు.

బహమనీ సుల్తానులు, దక్కనులోని ముస్లిములు-పరాయి దేశస్థులు కారు. వీరిలో ఎక్కువమంది మతాంతరులయిన హిందువులు. దక్కనులో తరతరాలుగా నివసిస్తున్నారు. హిందువులు, ముస్లిములు మతం వేరైనా ఒకే జాతికి చెందినవారు. ఇలాంటి రాజ్యంతో స్నేహ సంబంధాలు నెల కొల్పుకోవడమే క్షేమమని కాపయ నాయకుడు భావించాడు.

అదే దూరదృష్టిని కృష్ణదేవరాయలు సైతం ప్రదర్శించాడు. బహమనీ సుల్తానులలో సైతం కొందరు యీ సమరస వైఖరిని అవలంబించార

మరికొందరు మతోన్మాద వైఖరిని బలపరచారు. హిందువుల తరపున అళియరామరాయలు ఇట్టి మతోన్మాద వైఖరిని ప్రదర్శించారు.

ఈ కారణాలవల్ల 1665 లో జరిగిన తళ్ళికోట యుద్ధం హిందూ, ముస్లిం రాజుల యుద్ధంగా పరిణమించింది. ఆ యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం నాశనమైంది. బహమనీ సుల్తానుల మధ్య ఏర్పడ్డ తాత్కాలిక ఐక్యత కూడా ఆ పిమ్మట క్రమంగా నశించింది.

## గోల్కొండ నవాబులు

బహమనీ రాజ్యం ముక్కలై ఏర్పడిన అయిదు రాజ్యాలలో ఆంధ్రుల చరిత్రతో సంబంధమున్నవారు గోల్కొండ నవాబులు మాత్రమే.

ఈ నవాబులు 1512 నుండి 1687 వరకు 168 సంవత్సరాలకు పైగా తెలంగాణాను, కోస్తా జిల్లాలను పరిపాలించారు. ఈ 150 సంవత్సరాలు రాయలసీమ ప్రాంతాన్ని విజయనగర రాజులు పెనుగొండ, చంద్రగిరి రాజధానులుగా పరిపాలించారు.

గోల్కొండ నవాబులు ఆరుగురు. వీరి పేర్లు కులీ, జంషీద్, ఇబ్రహీం మహమద్, అబ్దుల్లా, అబ్దుల్ హసన్‌లు. కుతుబ్‌షా అనే గౌరవ బిరుదు అందరూ ధరించారు.

వీరిలో మొదటివాడైన కులీ కుతుబ్ 1512-1543 వరకు రాజ్యం చేశాడు. ఇతడు రాజ్యాన్ని స్థాపించినపుడు తెలంగాణాలో కొంత భాగం మాత్రమే ఇతని పరిపాలనలో వుంది. మిగతా తెలంగాణా, కోస్తా ఆంధ్ర దేశం గజపతుల ఆధీనంలో వుంది. కృష్ణదేవరాయలు కళింగ దండయాత్ర జరిపి, కోస్తా ఆంధ్రదేశాన్నంతా జయిస్తున్న సందర్భంలో రాచకొండ, దేవరకొండ దుర్గాలను కులీ కుతుబ్‌షా స్వాధీనం చేసుకొన్నాడు. కాని త్వరలో కృష్ణదేవరాయలతో జరిగిన ముఖాముఖి యుద్ధంలో ఇతడు పూర్తిగా ఓడిపోయాడు. రాయల మరణానంతరం ఇతడు ఓరుగల్లు, ఖమ్మంమెట్టు, బెల్లంకొండ, కొండపల్లి, కొండవీడు దుర్గాలను, మెదకు,

పానుగల్లు దుర్గాలను జయించాడు; తెలంగాణా అంతా ఇతని ఆధీనంలోకి వచ్చింది.

ఈ యుద్ధాలలో సీతాపతిరాజా అను ప్రముఖ వీరునితో కులీ కుతుబ్‌షా పోరాడవలసి వచ్చింది. ఈ సీతాపతిరాజా సీతాబుఖాన్, చిత్తాపుఖాన్ అని కూడ చరిత్రలో పిలువబడినాడు. మహమ్మదీయ రాజ్య విస్తరణను కొంతవరకైనా ప్రతిఘటించే ఉద్దేశంతో ఇతడు ఖమ్మం మెట్టును తన కేంద్రంగా చేసుకొని దక్షిణ తెలంగాణాను పరిపాలించాడు. ఇతడు మూడుసార్లు కొండపల్లి, ఖమ్మంమెట్టు, ఓరుగల్లు ప్రాంతాలలో కులీ కుతుబ్‌షాతో పోరాడాడు. మూడుసార్లు ఓడిపోయినాడు. తాను పరిపాలించిన స్వల్ప కాలంలో ఈ సీతాపతిరాజు ఓరుగల్లులోని దేవాలయాన్ని బాగుచేయించి, పాకాల చెరువును మరమ్మతు చేయించే ప్రజోపయోగ కార్యా లనేకం చేశాడు.

గోల్కొండ నవాబులలో మూడవ వాడైన ఇబ్రహీం (1550–80) సుప్రసిద్ధుడు. తన అన్న జంషీదుకు భయపడి అళియరామరాయల వద్ద కొన్ని సంవత్సరాలు ప్రవాసం గడిపాడు. ఆ కాలంలో ఇతనికి తెలుగు బాషతోను, తెలుగు కవులతోను పరిచయం ఏర్పడ్డది. ఆ తర్వాత ఇతడు అళియరామ రాయలపై కత్తికట్టి మిగతా బహమనీ నవాబులతో కలిసి తళ్ళికోటలో విజయనగర రాజ్య పతనానికి కారకుడైనాడు.

గోల్కొండ నవాబులందరిలోకీ ఈతడు ప్రజాహిత కార్యాలు ఎక్కువగా చేశాడు. ఇతనిని గురించి కొమర్రాజు లక్ష్మణరావుగారు తన మహమ్మదీయ మహాయుగంలో ఇలా వ్రాశారు: "ఈ నవాబు విద్వాంసుడు. ఇతని రాజ్యంలో దొంగల భయంలేదు. మసీదులను, ప్రాసాదములను కట్టించి, చెరువులను త్రవ్వించి ఎన్నో ప్రజోపయోగమైన పనులు చేశాడు" గోల్కొండ దుర్గానికి చుట్టూ ప్రహరీగోడ, ఇబ్రహీం బాగ్, ఫూల్‌బాగ్ అను తోటలు, హుస్సేన్‌సాగరు అను బ్రహ్మాండమైన చెరువు, ముస్సినదికి బడవల్ వద్ద ఆనకట్ట ఇతడే కట్టించాడు. టర్కీ, అరేబియా వర్షాల నుండి విదేశీ వర్తకులు గోల్కొండకు విపరీతంగా వచ్చేవారు.

ఈ రాజు అనేకమంది తెలుగు కవులను పోషించాడు. "మల్కిభరాం" అనే పేరుతో కవులీతనిని కీర్తించారు. పొన్నెకంటి తెలగన్న అచ్చ తెలుగులో యయాతి చరిత్ర గ్రంథం వ్రాసి ఇతని సర్దారైన అమీన్ ఖాన్‌కు కృతి యిచ్చారు. ఈ అమీన్‌ఖాన్ పొట్లచెరువు పరిపాలిస్తూ ఉండేవాడు. ఈ ఖాన్ హిందూ-ముస్లిం భేదంలేక ప్రజలకు సహాయం చేసేవాడు. వివాహంకాని బ్రాహ్మణులకు ధన సహాయం చేసి, పెండ్లిండ్లు చేయించేవాడు. అద్దంకి గంగాధరుడను మరొక కవి తపతీ సంవరణోపాఖ్యానం వ్రాసి, ఇబ్రహీంషాకు అంకితం ఇచ్చారు. కందుకూరు రుద్రకవి నిరంకుశోపాఖ్యానము అను ఒక కావ్యాన్ని, సుగ్రీవ విజయమను యక్షగానాన్ని వ్రాశారు, ఈ కవికి ఇబ్రహీంషా చింతలపాలెం అను అగ్రహారం దానం చేశాడు. మల్లారెడ్డి అను మరొక కవి శివ ధర్మోత్తరము షట్ చక్రవర్తుల చరిత్రము మొదలయిన గ్రంథాలు వ్రాశాడు. వీరుగాక ఇంకా అనేక కవులు ఇబ్రహీం పరిపాలనా కాలంలో వర్ధిల్లారు.

## తానీషా - అక్కన్న మాదన్నలు

ఇబ్రహీం తరువాత పాలించిన మహమ్మదు కుతుబ్ (1580-1611) హైదరాబాదు నగిరాన్ని కట్టించాడు.

ఇతని కుమారుడు అబ్దుల్లా కూస్సేను (1611-1658) కాలంలో ఆంధ్ర దేశం అంతా గోల్కొండ నవాబుల స్వాధీనమయింది. చంద్రగిరిలో నామమాత్రావశేషంగా వున్న విజయనగర వంశస్థులను కూడా గోల్కొండ నవాబులు జయించారు. రాయలసీమలో నవాబుల రాజ్యం ప్రారంభమైంది. గోల్కొండ నవాబులలో ఆఖరువాడు అబ్దుల్ హసన్ కుతుబ్‌షా (1658 – 1687) ఇతనినే తానీషా, లేక తానాషా అని చరిత్ర కారులు వ్యవహరిస్తున్నారు. తానాషా అనగా మంచిరాజు. ఈతడు ప్రజాహితంగా పరిపాలించేవాడు. ఇతని వద్ద అక్కన్న అను సేనాని, మాదన్న అను ప్రధాన మంత్రి ఉండేవారు. వీరిద్దరు అన్నదమ్ములు. ఈ అక్కన్న, మాదన్నలకు మేనల్లుడు కంచర్ల గోపన్న రామదాసను పేరుతో ప్రసిద్ధి చెందినవాడు. గోపన్న భద్రాచలం తహసీల్దారుగా ఉండేవాడు. సర్కారు డబ్బుతో దేవా

లయం నిర్మించాడు. శిస్తు చెల్లించనందుకు గోపన్నను కొంతకాలం తానీషా ఖైదు చేసి, ఆ తర్వాత అతడు గొప్పభక్తుడని గుర్తించి వదిలేశాడు. రామదాసు దాశరథీ శతకం వ్రాశాడు.

తానీషా కాలంలోనే మొగల్ పాదుషా ఔరంగజేబు, దక్కనును జయించాలని ప్రబల ప్రయత్నం చేశాడు. 1686లో గోల్కొండ ముట్టడి ప్రారంభమైంది, తానీషా సంధికి సిద్ధమైనాడు. కాని ఔరంగజేబు అంగీకరించలేదు. యుద్ధం జరిగింది. 7 నెలల ముట్టడి తర్వాత గోల్కొండ దుర్గం ఔరంగజేబు వశమైంది. కొందరు తానీషా సేనానులు లంచం తీసుకుని స్వామిద్రోహం చేయడం వల్లనే యిలా జరిగింది. తానీషా ఖైదుచేయబడి దేవగిరి దుర్గంలో మరణించాడు. గోల్కొండ స్వతంత్ర ప్రభుత్వం అంతమైంది.

గోల్కొండ రాజ్యాన్ని కాపాడటానికి అక్కన్న - మాదన్నలు, అబ్దుల్ రజాకు అను సేనాని ఎంతో కృషి చేశారు. మహారాష్ట్ర నాయకుడైన శివాజీకి, తానీషాకు సఖ్యత ఏర్పరచి ఔరంగజేబు పాదుషాను ప్రతిఘటించవలెనని అక్కన్న, మాదన్నలు యత్నించారు. కాని వారి కృషి ఫలించలేదు. కొందరు మతోన్మాదులు ఔరంగజేబు ప్రేరేపణపై హైదరాబాదు వీధులలో పట్టపగలు అక్కన్న, మాదన్నలను ముక్కలుముక్కలుగా నరికి వధించారు. అబ్దులు రజాకు ఔరంగజేబుకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడాడు. ఈతడు 8 నెలల యుద్ధంలో నూరు గాయాలు తిని కూడా యుద్ధరంగం నుండి తప్పుకోలేదు. గోల్కొండ సర్వనాశనమైన మీదట కూడా అబ్దులు రజాకు ఔరంగజేబు క్రింద పని చేయుటకు అంగీకరించక జీవిత శేషాన్ని విశ్రాంతితో గడిపి మరణించాడు.

1686 లో గోల్కొండ రాజ్యం పతనమైంది. అంతకు పది ఏండ్లకు ముందే 1675 చంద్రగిరిలోని విజయనగర రాజ్యపాలన అంతమైంది. పర రాష్ట్రంలో తంజావూరు నాయకరాజుల పాలన 1673 లో అంతమైంది. ఆంధ్ర ప్రభుత్వాలన్నీ కూలిపోయినవి. గాలి దోపిడి గాండ్రు ఆంధ్రదేశం నలుమూలలా స్వైర విహారం చేయసాగారు. ఆంధ్రుల క్షీణదశ కిది ప్రారంభము.

## అరాచకము – ప్రజల కడగండ్లు

ఔరంగజేబు 1687 లో దక్కను జయించాడు. 20 ఏండ్ల తర్వాత 1707 లో చనిపోయాడు. ఔరంగజేబు కాలంలో దక్కనుకు సుబేదారుగా నిజాముల్‌ముల్క్ ఆసఫ్‌జా అనునాతడు నియమించబడ్డాడు. ఔరంగజేబు మరణానంతరం, 1724 లో ఈనిజాముల్‌ముల్క్ స్వతంత్రతను ప్రకటించు కున్నాడు. పిమ్మట ఈ ఆసఫ్‌జాహీ వంశమే హైదరాబాదును పాలించింది.

ఆంధ్రదేశంలో అరాచకం వ్యాపించింది. ఒక మూల మొగలు సేనల దోపిడి, రెండో వైపున తూర్పు ఇండియా కంపెనీకి చెందిన బ్రిటిషు వారి ఆక్రమణ సాగుతున్న రోజులు. నిజాముల్ ముల్క్ పరిపాలనకు గోల్కొండ నవాబుల పరిపాలనకు ఎంతో వ్యత్యాసముంది. గోల్కొండ నవాబులు ప్రజారంజకంగా పరిపాలించారు. కాని నిజాముల్ ముల్క్ ఏదో విధంగా రాజ్యాన్ని నిలుపుకోవటమే పరమావధయంగా పెట్టుకున్నాడు. మొగలు సుబేదారుగా ప్రవేశించాడు. వీలుచిక్కగానే స్వతంత్రం ప్రకటించు కున్నాడు. బ్రిటిషు, ఫ్రెంచి సేనలను తన దేశంలో స్వేచ్ఛా విహారం కల్పించాడు. దేశముఖులకు దేశ పాండ్యాలకు సర్వాధికారా లిచ్చాడు.

ఈ వాతావరణంలో శతక వాఙ్మయం వృద్ధి చెందింది. ఇందులో ఎక్కువ భాగం భక్తి ప్రధానం. ఈ భక్తి చాటున సమకాలిక ప్రజల యిబ్బందులను ప్రతిబింబిస్తూ వ్రాసిన శతకాలు వెలువడ్డాయి.—

గోగులపాటి కూర్మనాథుడను కవి 1724 ప్రాంతంలో విశాఖజిల్లా లోని విజయనగరాన్ని పరిపాలించిన మొదటి ఆనంద గజపతి ఆస్థానంలో ఉన్నాడు. ఈ ఆనందగజపతి, పాయకరావుపేటను పరిపాలిస్తున్న పాయక రాజా అను ఉత్కళరాజా కలిసి నైజాం వద్ద కొన్ని లక్షలు అప్పు తీసు కొని యివ్వనందున నైజాం సేనలు ఆ ప్రాంతాన్ని కొల్లగొట్ట సాగినవి. నాటి ప్రజల దుస్థితిని, నైజాం సేనల దుండగాలను గోగులపాటి కూర్మనాథ కవి సింహాద్రి నరసింహస్వామి పేర ఇలా వివరిస్తున్నాడు:

సీ॥ యవనేశుధాటికి నడలి సర్వస్వమ్ము
విడిచి మందిరములు వెడలువారు
వెడలియు తలదాచ వెరవేమి గానక
నడవుల నిడుమల బడెడువారు
బడియు నెచ్చట కూడుపెట్టు గానక తమ
శిశువులతో వెతజెందువారు
జెంది దెండము గుండ గాంచిలేకత నళి
మానార్థులై ఖేదమూనువారు
గీ॥ వైరి యొక్కొక్క కార్యంతో నవని ప్రజలు
అష్టమహాషంపై వదియారువేల
నతులతో నీవు వలన కెచ్చట శరిగెదు.
వైరి నరసింహ సింహాద్రి నారసింహ.
సీ॥ పాష్టెక్కు గతిబట్టి కోటి సన్న్యాసుల
ధీయను తాకులాడించు నొకడు
సోమయాజుల బ్రహ్మసూత్రముల్ ద్రెంచి నిం
గాటి ఎండకు నల్లెగట్టు నొకరు
ఖూలు ఘోరాయంచు గుడి కేలు గుర్రము
నెక్కి ధేయని తరకెత్తు నొకడు
పైకాలు గొమ్మని బమ్మకోమటివారి
చెలువపై బడి ఖూతుసేయు నొకడు.
సీ॥ గ్రామముల్ నిర్మూమధామమ్ము లయ్యెను
సస్యంబులెల్ల నాశనముజెందె
దొడ్లలో శాకముల్ దుంపలుద్దిగలోయె
దోచిరి సర్వంబు గోచిదక్క

సీ॥ తనివెంచు కోవుగా తులలు మార్గస్థుల
            కొంతక ముక్కలు గోయనపుడు
అలతింపవుగదా అయ్యొయ్యొ ప్రజఘోష
            ధూర్తులు పడి తొక్కు డోమనపుడు
బాలి రాదాయెగా వతుల పురుష్కులు
            కామినులను చెరవట్టినపుడు

ఈ విధంగా ప్రజల బాధలను వర్ణించి ఈ బాధల నుండి కాపాడ వలసిందిగా సింహాద్రి నరసింహుని వేడుకుంటున్నాడు.

సీ॥ మా మొఖాసాకు గ్రామంబు లిమ్మనలేదు
            కొంపలు గాల్పింప కూడదంటి
కరి హయాదుల మేము కాంక్షింపగాలేదు.
            గోవధ మాన్పించి ప్రోవుమంటి
మాకు మిమ్ములను సామ్రాజ్య మిమ్మనలేదు.
            జనులను దోచింప జనదటంటి
స్వామి మా కొరకేమి కామింపగా లేదు
            శతిలోన ప్రజల రక్షింపమంటి

భద్రగిరి శతకం వ్రాసిన భల్లా పేరయ. వెంకటాద్వరి అను వారలుకూడా ప్రజల బాధలను తమ శతకాంలో చొప్పించారు.

## సమాజ కల్లోలము

ఒకవైపున మహమ్మదీయ సేనల అఘాయిత్యాలు. మరొకవైపున బ్రిటిషు. ఫ్రెంచి సేనల పదఘట్టనలు ఆంధ్ర దేశం నలుమూలలా వ్యాపించాయి. సాంఘిక క్షేమం నశించింది. తిండికి. గుడ్డకు కరువు వచ్చింది. 2 వేల సంవత్సరాలనుండి అవిచ్ఛిన్నంగా వస్తున్న స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థ భగ్నం కాసాగింది. గృహ పరిశ్రమలు. చేతి-

పరిశ్రమలు మూలపడసాగినవి. యావద్భారతదేశంలోను ఈ పరిణామం ప్రారంభమైంది.

ఈ పరిణామానికి కారణం ప్రజలు తెలుసుకోలేక పోయినారు. ఆర్థిక విచ్ఛిత్తితోపాటు సమాజంలో కులభేదాలు, మూఢాచారాలు, కట్టుబాట్లు మితిమీరిపోయినవి.

ఈ దశలో వైష్ణవభక్తి ధోరణి ఒక్కటి ప్రారంభమైంది. ఉత్తర హిందూస్థానంలో 1400-1500 మధ్య కబీరు ఉద్భవించి కుల భేదాలను ఖండించి రామభక్తిని ప్రచారం చేశాడు. భద్రాచల రామదాసు తెలుగు దేశంలో పుట్టి అదేపని చేశాడు. దేశమంతా భక్తి వాతావరణం వెల్లివిరిసింది. ఉత్సవాలు, తిరునాళ్ళ రూపంలో దేవునిపేరు తలచుకొని ప్రజలు తిరిగి ఆత్మవిశ్వాసం పొందటానికి ప్రయత్నించారు. నాటి శతక వాఙ్మయంలో మహాప్రతిక వంతు భక్తి ప్రధానమైనవి. ఈ భక్తిలో కూడా ఒక విశేష మున్నది 11 వ శతాబ్దమునాటి వీరశైవ ఉద్యమంలో పుట్టిన భక్తి వాఙ్మయము మతప్రచారము కొరకు, అన్య మతాలను ఖండిస్తూ పుట్టింది. 18 వ శతాబ్దంలో ఆంధ్రలో వ్యాపించిన భక్తి అలాంటిది కాదు. ఇది వైష్ణవభక్తి, దాస భావంతో, ప్రతిఫలాపేక్ష లేకుండా కేవలం ఆత్మ సంతృప్తికై దేవుని పూజించటం ఇందులో ప్రధానాంశం. పాత సమాజం శిథిలమై పోతున్నది. కొత్త సమాజం ఎలా వుంటుందో ఎవరికీ తెలియదు. ఈ సంధియుగంలో 'భారమంతా నీదే'ననే ప్రపత్తి ధోరణిలో ఈ భక్తి వాఙ్మయము సాగింది. తెలుగులో దాశరథీ, మానసబోధ, వేణు గోపాల మొదలైన శతకాలు భక్తి ఇట్టివాటిలో ముఖ్యమైనవి.

ప్రజలలో విపరీతమైన మూఢనమ్మకాలు బయలుదేరినవి. వీర భోగవసంతరాయలు అనే కలిపురుషుడు ఒకడు పుట్టి దేశాన్ని ఉద్ధరిస్తాడని అంతకంటే తరుణోపాయం లేదని ఒక వాదన బయలుదేరింది. చంద్రగిరి పాలించిన వీరవెంకటపతిరాయలు (1614) ఈ కొత్త పేరుతో పుడతాడని ప్రజలలో కొందరు నమ్మసాగారు.

ప్రజల దీనావస్థను వర్ణించే అనేక కథలు ఈ కాలంలో వ్రాయ బడినవి. బాలనాగమ్మ, చిన్నమ్మకథ, లక్ష్మమ్మ కథ ముఖ్యమైనవి.

మహమ్మదీయ ఫకీరు, జంగము వేషముతోవచ్చి బాలనాగమ్మ అను స్త్రీని ఎత్తుకుపోయి నానాబాధలు పెడతారు. చివరకు ఆమె చనిపోయింది. ఈ కథ ఇంటింటా ఇప్పటికీ ప్రచారంలో ఉన్నది.

దీనావస్థను వర్ణించే వాటితోపాటు శౌర్యోత్సాహాలను కలిగించే ఘటనలుకూడా కథలలోకి ప్రవేశించినవి. సర్వాయిపాపడి చరిత్ర ప్రసిద్ధ మైనది. ఔరంగజేబు పరిపాలనా కాలంలో కల్లుగీత వృత్తిద్వారా జీవించే సర్వాయి పాపయ్య, తురక సర్దారులను ఎదిరించి ప్రజలకు రక్షణ యిచ్చి మహావీరుడని పేరు గాంచాడు.

కర్నూలుజిల్లా బంగానపల్లి ప్రాంతంలో పోతులూరి వీరబ్రహ్మం అను ఒక తత్వజ్ఞాని బయలుదేరాడు. కలికాలం వచ్చిందని, లోకం అంతా చెడిపోయిందని, అయితే ఎప్పుడో మంచిరోజులు వస్తాయని కర్మవాదాన్ని ప్రచారం చేశాడు. ఈయన కంసాలి. ఈయన శిష్యులలో ఎక్కువమంది చేనేతవారు. గృహ పరిశ్రమలు విచ్ఛిన్నం గావటంతో మొట్టమొదట ఏ కులాలు దెబ్బతిన్నవో ఆ కులాలలో నుండి ఈ నిరాశాపూరిత తాత్విక ప్రచారం బయలుదేరడం గమనార్హం. చారిత్రకంగా సంధియుగమైన ఈ దశలో శతకాలు, గేయాలు, యక్షగానాలు మొదలైన వివిధ రూపాలతో సాహిత్యం వికసించటం ఒక లక్షణం. రాజాదరణ ఉంటేనేగాని వెలువడని ప్రబంధ వాఙ్మయం అంతరించింది. ప్రజావాణి వివిధ రూపాలలో వ్యక్తం కాసాగింది.

పంచబంగాళమైన ఈ వాతావరణంలో ఆశారేఖవలె యోగి వేమన ఉద్భవించాడు. వేమన 1760 ప్రాంతంలో జీవించాడు.

# యోగి వేమన

వేమన కవి పేరు ఆంధ్ర దేశంలో సుప్రసిద్ధం. వేమన పద్యాలు యావదాంధ్ర దేశంలోను ప్రచారంలో వున్నాయి. వేమన కాలాన్ని గురించి ఆయన జీవిత విశేషాలను గురించి నిన్న మొన్నటివరకు స్థిరమైన అభిప్రాయాలు లేవు. కొండవీటి రెడ్డిరాజుల కాలంలో వేమన జీవించారన్న ఒక వాదన చాలాకాలంగా ప్రచారంలో ఉంది. శతక కవుల చరిత్రను రచించిన శ్రీ వంగూరు సుబ్బారావుగారు ఈ వాదనను ప్రారంభించారు. కాని ఆ తర్వాత పరిశోధకు లనేకులు పైవాదనను త్రోసివేశారు.

వేమన విషయమై విస్తార పరిశోధన గావించిన శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, ఈ కవి 18 వ శతాబ్దంలో నివసించారని సహేతుకంగా నిర్ణయించారు.

18 వ శతాబ్దపు ఆంధ్రదేశ స్థితి అతి విషాదకరంగా ఉండేది. సుసంఘటితమైన ప్రభుత్వం లేని ఫలితంగా దేశంలో అరాచకం వ్యాపించింది. 2 వేల ఏండ్లుగా అవిచ్ఛిన్నంగా వస్తూన్న గ్రామీణ ఆర్థిక జీవితం విచ్ఛిన్నం కాసాగింది. మత, కుల భేదాలతో హిందూ సంఘం కుళ్ళి పతనావస్థలో ఉంది. 13 వ శతాబ్దంలో గొప్ప కల్లోలాన్ని కలిగించిన వీరశైవమతం నశించింది. జంగాలు బసివిరాండ్రు, లింగధారులు మిగిలారు. ఆంధ్రలో వ్యాపించింది. వేమనకాలం నాటికి వైష్ణవ మతంలో కూడా విపరీతమైన మూఢాచారాలు, దుర్వ్యసనాలు వ్యాపించసాగినవి.

ఈ నిరాశా వాతావరణంలో భద్రాచలం రామదాసువంటి భక్తులొక మూల, పోతులూరి వీరబ్రహ్మంవంటి కర్మసిద్ధాంతులు మరొకమూల ఉద్భవించారు. ఇదిగాక, నీచ లోహాలను బంగారంగా చేయటం సాధ్యమని

ఒక విశ్వాసం ప్రబలింది. ఈ విశ్వాసాన్ని అవకాశంగా తీసుకొని అనేకులు మాయ సన్యాసులు, స్వర్ణయోగులు వెలిశారు. చుక్కానిలేని పడవ గాలి తాకుడుకు ఊగిపోయినట్లు ఆంధ్రదేశంలో ప్రజాజీవితం సంక్షోభంలో పడ్డది.

## వేమన దేశకాలములు

ఈ పరిస్థితులలో వేమన ఒక సాధారణ కర్షక కుటుంబములో జన్మించాడు. గుంటూరు జిల్లా కొండవీడు తన జన్మస్థలమని కాపు కులం తన జన్మ ద్వారా పవిత్రమైందని చెప్పుకున్నాడు.

నేడు రెడ్లు అని వ్యవహరించబడే కులమే ఆనాటి కాపులు. ఇప్పటికీ ఆంధ్రదేశంలో రెడ్లు కొన్ని జిల్లాలలో కాపులు అని వ్యవహరించబడుతూనే ఉన్నారు.

*ఆ॥ కలియుగమున నున్న కాపు కులానికి*
*వేమన తన కీర్తి విక్రయించె*
*ఆ॥ కాపుకులము లెంత కర్మతులైనను*
*పాపరాశి కొంత పరినిపోవు*
*ఎవర మెరుగనట్టి వెర్రిజీవులుగాన*

.... .... ....

అని కర్షక కులగౌరవాన్ని కీర్తించారు. "ఎవర మెరుగనట్టి వెర్రి జీవులు" అను ఒక్క వాక్యంలో ఆనాటి రైతాంగంయొక్క అమాయకత్వాన్ని వివిధ మత, కుల గురువుల కుతంత్రాలకు ఏవిధంగా వీరు మోసపోయేది సూచించాడు.

వేమన పద్యాలలో వెలిబుచ్చిన వివిధ జీవితానుభవాలను దృష్టిలో నుంచుకొని, ఈ క్రింది జీవితాన్ని వేమన గడపి వుంటాడని విమర్శకులు భావిస్తున్నారు.

ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో 1700 ప్రాంతంలో వేమన జన్మించాడు. ఏదో కొంత చదువు సంధ్యలు పూర్తి చేసుకొని, ఆనాటి

వాతావరణానికి లోబడి, సుఖ విలాసాలలో మునిగిపోయారు. వేశ్యాలంపటత్వంలో కొంతకాలం గడిపారు. ఆ తర్వాత తల్లిదండ్రులు వీరికి వివాహం చేశారు. పాతజీవితపు అవశేషాలు పూర్తిగా వదలనందువల్లనో, లేక మరేకారణం వల్లనో వేమన సంసార జీవితం సుఖంగా జరగలేదు.

ఆ॥ చెప్పులోని రాయి, చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలి ముల్లు
ఇంటిలోని పోరు ఇంతింత గాదయా
విశ్వదాభిరామ వినురవేమ.

అని గయ్యాళి భార్యతో సంసారానికి స్వస్తిచెప్పి దేశసంచారం చేయసాగారు. సంఘంలో తాను చూచిన లోపాలన్నిటినీ అతి వివిరంగా ఆటవెలది పద్యాలలో యెక్కడిక క్కడ చెప్పుకుంటూ కొన్ని ఏండ్లపాటు ఆంధ్రదేశమంతటా తిరిగారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాలలో సంచారం చేశారు. వేమన శిష్యులమని చెప్పుకునే ముఠాలు కొందరు యిప్పటికీ ఆ ప్రాంతాలలో వున్నారు. సంఘంలోని లోపాలను బట్టబయలు చేయటంతో పాటు ఆధ్యాత్మిక భావాలను కూడా వేమన తన పద్యాలలో ప్రచారం చేశారు. మోసం, డాంబికం లేని నిజమయిన జ్ఞానయోగం అలవర్చుకోవాలన్న భావం వేమన పద్యాలలో విరివిగా వుంది. సహజంగానే యీ సంస్కర్త చుట్టూ శిష్యులు పోగయినారు. గురువుకు లేని కొన్ని గొప్పలు కూడా ఆరోపించి ప్రచారం చేశారు.

అనంతపురం జిల్లా కటారుపల్లి అనే గ్రామంలో 1750 ప్రాంతంలో వేమన మరణించారు. అక్కడ వేమన సమాధి అని ఒకటుంది. కటారుపల్లిలోని సమాధి కొండవీటి వేమనది కాదనీ, అదే పేరుగల మరొకరిదనీ వేమన కడపజిల్లా పామూరు అను గ్రామంవద్ద ఒక గుహలోకి ప్రవేశించి సిద్ధిపొందారని రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు అభిప్రాయ పడుతున్నారు. ఈ వాదన నమ్మదగినదిగా లేదు.

## సంఘ సంస్కరణ ధోరణి

శైవమతం ఆనాడు అత్యంత హేయంగా తయారైంది. శైవులు కొందరు తమ ఆడపిల్లలను, బసివిరాండ్రను పేరుతో పెళ్ళిచేయక 'ఊరి వేశ్యల'నుగా వదలి వేసేవారు. గ్రామాలలోను, పట్టణాలలోను మతము పేరిట వ్యభిచారము, త్రాగుడు, మోసము విపరీతముగా వుండేవి. వేమన వీరిని యిలా నిందిస్తున్నాడు :

ఆ॥ ఆత్మశుద్ధిలేని ఆచారమదియేల
భాండ శుద్ధి లేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా

.... .... ....

ఆ॥ అన్ని మతములందు అధికమైన మతంబు
లింగ మతముకన్న లేదు భువిని
లింగధార్ల కన్న దొంగలు లేరయా

.... .... ....

ఆ॥ అక్షమాల బూని అలసట చెందక
కక్షి నింపుకొనుట కాదువగాదు
పక్షి కొంగరీతి పైమూపులేలకో

.... .... ....

ఈ దురుణాలన్నీ వైష్ణవమతంలో కూడా వ్యాపించాయి. కృష్ణ రాయల కాలంలో తాతాచార్యులనే ఆయన మూపుముద్రిగా ప్రజలను వైష్ణవమతంలోకి మార్చేవారు. పారిపోతున్నవారి వీపులపై బలవంతంగా చక్రాంకితాలను వేసి, వైష్ణవులనుగా మార్చారు. తాతాచార్యులవారి ముద్ర భుజం తప్పినా వీపు తప్పదన్న సామెత ఏర్పడ్డది. శైవులు బసివిరాండ్రను వేశ్యలుగా వదలినట్లే, వీరు కూడా వైష్ణవ దాసిలనే పేరుతోను 'నామ

ధారు'లను పేరుతోనూ వేశ్యలను తయారుచేసేవారు, సాతానులు, రామానుజ కూటములను ఏర్పరచి, త్రాగి తందనాలాడేవారు. వీరిని వేమన ఇలా అంటిస్తున్నాడు :

ఆ॥ ఎంబెరు మతమందు నెనగ మాంసము తిని
మారుపేరుపెట్టి మధువు త్రావి
వావి వరస దప్పి వలికి పాతౌదురు.

ఆ॥ రంగధామములకు హంగుగా తా నేగి
కల్లుకంపు సొంపు గల్గియుండు

ఆ॥ వైష్ణవులనియెడు వార్త మాత్రమెగాని
ప్రజల చెరుతురయ్యి భ్రష్టులగను

.... .... ....

మహమ్మదీయుల దండయాత్ర ఫలితంగా వచ్చిన ప్రమాదాన్ని వేమన వివరించాడు. ఈ దారి దోపిడిగాండ్రు ప్రజలను పెట్టే బాధలను వేమన వర్ణించలేదు. కులమత విభేదాలతో చిన్నాభిన్నమైన హిందూ సంఘానికి వచ్చిన ప్రమాదాన్ని చూపి ప్రజలను హెచ్చరించుట వేమన లక్ష్యం. కనుక ఇలా అంటున్నాడు :

ఆ॥ లింగమతములోన దొంగలుగా బుట్టి
యొకరి నొకరు నింద నొనరజేసి
తురకబాడిచేత ధూళియై పోదురు

.... .... ....

అని తీవ్రమైన హెచ్చరిక చేస్తున్నాడు.

ఆ॥ రాళ్ళ నమ్మియున్న రాజాధిరాజులు
కాటికెదరి భువిని గూలి చనిరి
రాళ్ళ పగులగొట్టి రాకసపుత్రులు
మూళ్ళనూళ్ళ గలిగి మనిరి వేమ.

హిందూ సంఘములోని వివిధ కులాలలోని లోపాలను ముఖ్యంగా అగ్రవర్ణాలవారి దాంబికాన్ని అతి నిశితంగా వేమన విమర్శించాడు :

ఆ॥ విప్రులెల్ల జేరి వెర్రికూతలు కూసి
సతిపతులనుగూర్చి సమ్మతమున
మును ముహూర్తముంచ ముండెట్లుమోసెరా

ఆ॥ లంజకొరకు మేక నంజుడు తినసాగి
యజ్ఞమెల్ల కామయజ్ఞమాయె
మొదట సోమయాజి తుద కామయాజిరా

.... .... ....

ఆ॥ బ్రాహ్మణుండు సర్వ భాగ్యంబు లీవచ్చు
గౌరవింపవచ్చు కోరి వారు
జ్ఞానమొసగి జనుల కడతేర్పగలిగిన

.... .... ....

రాజులను గురించి :

ఆ॥ ఎంత సేవజేసి ఏ పాటుపడినను
రాచమూక నమ్మరాదురన్న
పాముతోడి పొందు పదివేలకైనను

రామాయణ భారతగాథలలో దేవతలకు ఆరోపించే అమానుష విషయాలను పరిహసిస్తూ ఇలా అన్నాడు :

ఆ॥ కనకమృగము భువిని కద్దు లేదనకుండ
తరుణి విడిచిపోయె దాశరథియు
తెలివిలేనివాడు దేవు డెట్లాయెరా

ఆ॥ అగ్నిబాణముచేత నంబుధింకినపుడె
రాము డవలితేగ లావుమరచి
వరున కొండలుమోసి వారధేలనుకట్టె

*ఆ॥ రాతిబొమ్మకేల రంగైన వలువలు*
*గుళ్ళు గోపురములు కుంభములును*
*కూడుగుడ్డ దాను గోరునా దేవుండు*

కుంభేదాలను సమూలంగా నాశనం చేయాలని వేమన ఆశయం.

*ఆ॥ తిర్పెవారి తెల్ల సొక్కకంచము పెట్టి*
*పొత్తుగుడిచి కులము పొలయవేని*
*తలను చేయిపెట్టి తగనమ్మ చెప్పరా*
*విశ్వదాభిరామ వినురవేమ*

## తాత్విక ధోరణి

వేమన కాలంలో ఆంధ్రదేశములో వివిధ తాత్విక ధోరణులు పొడ సూపసాగినవి. యోగశాస్త్రంవల్ల ప్రజలకు వెర్రి ఏర్పడ్డది. దేశమంతా హఠయోగులు వెలిశారు. ప్రాణాయామాది ఆసనాలను ఆచరించి. శరీరాన్ని శుష్కింపజేస్తే, జ్ఞాననేత్రం వికసిస్తుందని కొందరు నమ్మారు. గాజు ముక్కలను నమలేవారిని, భూమిలోపల కొన్ని గంటలుండి, చావకుండా బ్రతికేవారిని హఠయోగులను మనము అక్కడక్కడ చూస్తున్నాము. శరీరములోని అతికీలకమైన నరములు మొదలైన వానిని అదుపులో పెట్ట కొన్ని విచిత్ర క్రియలను చేయు సర్కసు ఈ హఠయోగం. వేమన కొంతకాలం ఈ హఠయోగాన్ని ఆశ్రయించారు. సంతృప్తి కలగలేదు. వేమనను ప్రధానంగా వేధించే సమస్య సాంఘిక సమస్య. సమాజంలోని మోస, అన్యాయం, దాంభికం మొదలైనవానిని తొలగించుట వేమన లక్ష్యం. హఠయోగం కేవలం వ్యక్తిగతమైన నియమ నిష్ఠలకు సంబంధించినది.

మంత్ర తంత్రములందు. స్వర్ణవాదమందు ప్రజలకు చాల విశ్వాసముండేది. వేమన మంత్ర తంత్రములను అనేకచోట్ల విరసించారు. కాని బంగారము చేయవచ్చుననే భ్రమ మాత్రము వేమనకు చివర పరప వున్నట్లుంది. వేమనపేర ప్రచారంలో వున్న అనేక పద్యాలలో ఈ భావము కనపడుతుంది. హఠయోగాన్ని విరసిస్తూ వేమన ఇలా అన్నారు :

ఆ॥ ఆసనములు పన్ని అంగంబు బిగియించి
ఒడలు విరుచుకొనెడు యోగమెల్ల
వెట్టిసాముకన్న చింతాకు తక్కువ

కాని రసవాదాన్ని గురించి వేమన ఏమి చెప్పాడో చూడండి :

ఆ॥ దేహమున నుడియుండ హేమతారకవిద్య
పరము నుడిగియుండ బ్రహ్మవిద్య
కడమవిద్యలెల్ల కల్ల విద్యలుగాదె

.... .... ....

ఆ॥ ఉప్పు చింతపండు ఊరిలో నుండగ
కరువదేల వచ్చె కాపులార
తాళకం బెరుగరో తగరంబు నెరుగరో

ఉప్పు, చింతపండు తగరపు రేకులోచుట్టి పుటము పెట్టి మరికొన్ని లోహములతో చేర్చిన బంగార మగునని ఆ నాటి నమ్మకం.

మానవ సుఖజీవితానికి ధనం, సంపద అత్యవసరమనే ఒక వాస్తవి కత, బహుశా ఈ వికృతరూపంలో వేమనలో ప్రతిబింబించి ఉండవచ్చు. స్వర్ణ యోగం అంటే నాటి ప్రజలకు విపరీతమైన నమ్మకం కలగడానికి కూడా యిదే కారణమై యుండవచ్చు.

ఏమైనా సమకాలిక తాత్వికులలో ఈ మాత్రం అభ్యుదయ సంస్కార భావాలను కనబరుచుటకూడా గొప్ప విషయమే ననటంలో ఎట్టి సందేహమూ లేదు.

వేమన చిట్టచివరకు ఆశ్రయించిన రాజయోగంకూడా నాటి తాత్విక దృక్పథాంలో కల్లా ఉన్నతమైనది.

జీవితాన్ని పూర్తిగా సన్యసించాలనిగాని, లేక అంతూపొంతూ లేక కర్మకాండలో మునిగిపోవాలనికాని రాజయోగం చెప్పదు. మామూలు

సాంసారిక జీవితం గడుపుతూనే నీతి నియమాంతో గౌరవమయిన, సుఖ ప్రదమయిన జీవితం గడుపుట ద్వారా మోక్షం, సాధించ వచ్చునని రాజయోగం బోధిస్తుంది. అద్వైతజ్ఞానికిది మారుపేరు. జీవిత సమన్యల పరిష్కారానికి వివిధ మార్గాల నన్వేషంచి, చివరకు గౌతమబుద్ధుడు నిర్వాణ మార్గాన్ని చేపట్టినట్లు; సామాన్య సంసారి అయిన వేమన సంసారంలో పడి, లేచి, అది దాటి హఠయోగాన్ని చేపట్టి, దానిని కూడ నిరసించి-చిట్టచివరకు అద్వైత తాత్విక వాదాన్ని చేరుకున్నాడు.

## ప్రజా కవి వేమన

వేమన తన సంస్కరణ కార్యక్రమానికి కవిత్వాన్ని ఒక సాధనగా చేపట్టాడు. వేమన పద్యాల వంటి అచ్చ తెలుగు పద్యాలు ఇంతవరకు తెలుగు భాషలో లేవంటే అత్యుక్తి కాదు. తెలుగుభాష జాతీయత సొంపు యావత్తు వేమనకు స్వాధీనము. కవిత్వాన్ని ఉపయోగించుకొని లోకోక్తులు నీతులు కుప్ప తెప్పలుగా వేమన కురిపించాడు. తెలుగు భాషలో అంతకు పూర్వము లేని హాస్య రసాన్ని వేమన ప్రవేశ పెట్టాడు.

ఆ॥ *గుహలలోన జొచ్చి గురువుల వెదకంగ*
*క్రూరమృగ మొకండు తారసిలిన*
*ముక్తిమార్గ మదియె ముందుగా జూపురా.*

ఆ॥ *పాలసాగరమున పవ్వళించినవాడు*
*గొల్లయిండ్ల పాలు కోరనేల*
*ఎదుటివారి సొమ్ము లెల్లవారికి తీపి*

నీతి పద్యాలకు లెక్కలేదు. కొన్ని ఉదాహరణలు :

ఆ॥ *కోతిబట్టి తెచ్చి కొత్త పట్టముగట్టి*
*కొండముచ్చులెల్ల కొలిచినట్లు*
*నీతిహీనువద్ద నిర్భాగ్యులుందురు.*

ఆ॥ చాకి మఱత యుతికి చీకాకుపఱచేని
మైలదీని తెన్ను మఱచినట్లు
బుద్ధిచెప్పువాడు గుద్దితే నేమయా.

ఆ॥ కులము గల్గువారు, గోత్రంబు కలవారు
విద్యచేత విఱ్ఱవీగువారు
పసిఁడిగల్గువాని బానిసకొడుకులు.

ఆ॥ పసుల వన్నె వేరు పాలేకవర్ణమౌ
పుష్పజాతి వేరు పూజ యొకటి
దర్శనములు వేరు దైవంబదొక్కటి

ఆ॥ లోభివాని జంప లోకంబులోపల
మందువలదు వేరు మతముగలదు
పైకమడిగినంత భగ్గున పడిచచ్చు.

ఆ॥ ఉదధిలోని నీరు ఉప్పులుగాఁజేసె
పసిఁడిగల్గువాని పిసినిఁజేసె
బ్రహ్మదేవుచేత పాడైన చేతరా.

వేమన కవిత్వమెంత గంభీరమైనదో, ప్రశస్తమైనదో తెలుగు వారికి చెప్పవలసిన అగత్యం లేదు.

వేమన పద్యాల పేరుతో నేడు వేలకొలది పద్యాలు ప్రచారంలో ఉన్నవి. వీనిలో సగానికి పైగా ఇతరులు చేర్చినవే. ముఖ్యంగా తాత్విక సంబంధమైన వానిలో ముప్పాతిక మూడువంతులు వేమన శిష్యులు చేర్చారు. ఈ పద్యాలను పరిశీలించి, ఇతరులవి తొలగించి వేమనవి మాత్రమే ప్రచురించినప్పుడే, ఈ మహాకవి జీవితం విషయమై సంపూర్ణ పరిజ్ఞానం మనకు లభిస్తుంది.

జీవితానుభవాలను విజ్ఞాన దృష్టితో చూసిన వేమనలో సునిశితమైన హాస్యరసం ఉద్భవించింది. వెగటు కల్గించని హాస్యరసంతో విజ్ఞానబోధ

చేయటం మహాకవులకు మాత్రం సాధ్యం. అట్టి మహాకవుల స్థాయిని వేమన అందుకున్నాడు. తన కవిత్వాన్ని గురించి వేమన యిలా అన్నాడు:

ఆ॥ బ్రహ్మవ్రాత కెదురు పలికినవాడను
అరి విష్ణుసూత్ర మరచువాడు
మూడుకనులవాని మొనని నిల్పినవాడు
కానబడరు సిద్ధ కాని వేమ

ఆధునికాంధ్ర సమాజ నిర్మాణానికి, అభ్యుదయ కవిత్వానికి 200 సంవత్సరాల క్రితమే ఒక పునాదిరాయిని వేసినవాడు వేమన యోగి.

# బ్రిటిష్ ఆక్రమణ

భారతదేశంతో వర్తకం చేసుకునేందుకై ఈస్టు ఇండియా కంపెనీ క్రీ. శ. 1600 లో ఏర్పర్చరి. వీరు ఇండియాకు వచ్చి నాటి మొగల్ పాదుషా ఐన జహంగిరు అనుమతి పొంది వ్యాపారం ప్రారంభించారు. సుగంధ ద్రవ్యాలను, వస్త్రాలను భారతదేశం నుండి కొనుగోలు చేసి, ఇంగ్లాండులో తయారైన వస్తువులను, దేశీయ సంస్థానాధిపతులకు, నవాబులకు అమ్ముతుండేవారు. అంతకు పూర్వమే భారతదేశంలో అడుగు పెట్టిన పోర్చుగీస్, డచ్చి, ఫ్రెంచి వర్తకులతో బ్రిటిషు వర్తకులకు పోటి ఏర్పర్చరి. ఈ పోటిలలో పోర్చుగీస్, డచ్చి వర్తకులు ఓడి పోయారు. ఫ్రెంచి, ఆంగ్లేయ వర్తక కంపెనీల మధ్య 1 1/2 శతాబ్దాల కాలం ఘర్షణలు జరిగాయి.

దేశీయ ప్రభువులు, నవాబులు తమ అంతఃకలహాలలో విదేశీయుల సహాయాన్ని అర్థించసాగారు. విదేశీయుల సహాయంతో తమ దేశీయ ప్రత్యర్థులను ఓడించగలమని భావించారేగాని, మొత్తం దేశ స్వాతంత్ర్యాన్నే విదేశీయులకు అమ్మివేస్తున్నామని ఈ ప్రభువులు గ్రహించలేదు. ఈ సంకుచిత స్వార్థ వైఖరి ఫలితంగా, వర్తకులుగా వచ్చిన విదేశీయులు రాజ్యాధికారాన్ని సంపాదించగలిగారు.

## నైజాం లొంగుబాటు

ఢిల్లీ పాదుషాకు సుబేదారుగా ప్రారంభమైన అసఫ్ జా 1724 లో స్వతంత్రుడై ఢిల్లీ పాదుషాను ధిక్కరించాడు. ఢిల్లీ పాదుషా, ముబారిజ్ ఖాను అను సేనానిని, హైద్రాబాదు నవాబును లొంగదీసేందుకు పంపాడు,

బీరార్‌లోని బుల్డానా జిల్లాలో జరిగిన యుద్ధంలో మొగలు సేనాని ఓడిపోయి మరణించారు. ఢిల్లీకి-హైదరాబాదుకు గల ఆఖరు బంధనాలు తెగిపోయాయి. 1748 లో ఆసఫ్‌జా మరణించే సమయానికి బీరారు సైతం ఆసఫ్‌జా పరిపాలనలోకి వచ్చింది.

ఆసఫ్‌జా అనంతరం, అతని కుమారుడు నాజర్‌జంగు, కూతురు కొడుకు ముజఫర్‌జంగు రాజ్యాధికారంకోసం పెనుగులాడసాగారు. ఫ్రెంచి వారు ముజఫర్‌జంగ్‌ను, ఇంగ్లీషువారు నాజర్‌జంగును బలపరచారు.

నాజర్‌జంగు తన అధికారాన్ని స్థాపించుకొనే ఉద్దేశంతో దక్షిణ దండయాత్ర ప్రారంభించాడు. కడప, కర్నూలు నవాబుల సహాయంతో రాయలసీమ మీదుగావెళ్లి, ఉత్తర ఆర్కాడులోని జింజీకోటను ముట్టడించాడు. జింజీ అప్పుడు ఫ్రెంచివారి ఆధీనంలో ఉంది. ఫ్రెంచి గవర్నరు డూప్లె.

ఫ్రెంచివారు నాజరుజంగును హత్య చేయటానికి పథకం వేశారు. విఫలులైనారు. తాము ముజఫరుజంగును బలపర్చడం మానుకున్నామని ప్రకటించారు. అంతట ముజఫరుజంగు, నాజరుజంగుకు లొంగిపోయినట్లు ప్రకటించాడు.

జింజీకోట ఫ్రెంచివారి అధీనంలో ఉంది. కోటలోనుండి ఫ్రెంచి సైనికులు తుపాకులు పేల్చసాగారు. కోటవైపు నాజరుజంగు తెల్లవారు వేళ పురోగమించాడు. త్రోవలో తన అనుచరుడైన కడప నవాబును కుశల ప్రశ్న వేయటానికి ఒక్క క్షణం ఆగాడు. వెంటనే కడప నవాబు దళంనుండి తుపాకులు పేలాయి. నాజరుజంగు ఏనుగు అంబారీమీద నుండి నేలకు దొర్లి మరణించాడు. కడప, కర్నూలు నవాబుల మిత్ర ద్రోహ ఫలితంగా ఫ్రెంచివారు విజయం సంపాదించారు. అంతట ఫ్రెంచివారు కోటనుండి బయటకు వచ్చి ముజఫరుజంగును నైజాం నవాబుగా ప్రకటించారు.

కడప, కర్నూలు నవాబుల మిత్ర ద్రోహం ఇంతటితో ఆగలేదు. తాము ముజఫరుజంగును బలపరచినందువల్ల ఆశించినంత ప్రతిఫలం

లభించలేదని వీరు కినిసి. ముజఫరుజంగు హైదరాబాదు వెళ్ళేటప్పుడు రాయచోటి తాలూకాలోని లక్కిరెడ్డిపల్లి వద్ద నన్నని కొండత్రోవలో ఎదిరించి, అతనిని హత్య చేశారు. ఈ ఘటన 1757 లో జరిగింది.

ముజఫరుజంగు మరణానంతరం, ఫ్రెంచివారు నాజరుజంగు తమ్ముడైన సలాబత్‌జంగును హైదరాబాదు గద్దె నెక్కించారు. తనకు వారు చేసిన సహాయానికిగాను సలాబత్‌జంగు, సర్కారు జిల్లాలలో (గుంటూరు మినహా) పన్నులు వసూలు చేసుకునే అధికారాన్ని 1753 లో బుస్సీ అను ఫ్రెంచిసేనానికి ఇచ్చివేశాడు. అంతకు పూర్వమే 1750 లో మచిలీపట్నం పరిసర ప్రాంతం ఫ్రెంచివారి కిచ్చి వేయబడినది.

నైజాంపై ఫ్రెంచివారి పెత్తనం ఎక్కువ కాలం సాగలేదు. ఇంగ్లీషు సేనలు క్లయివు ఆధిపత్యాన కర్నాటకంలోని ఫ్రెంచి స్థావరాలను ఒక్కొక్కదానినే స్వాధీనం చేసుకోసాగాయి. మొదటికే ముప్పు వచ్చిందని గ్రహించి ఫ్రెంచివారు సలాబత్‌జంగును వదలివేసి హైదరాబాదులోని తమ సైన్యాలను దక్షిణాదికి తరలించారు.

ఆసఫ్‌జా నాల్గవ కుమారుడైన నిజాం అలీఖాను బ్రిటిష్ వారి సహాయంతో సలాబత్‌జంగును పదభ్రష్టుని చేసి, 1761 లో హైదరాబాదు సింహాసనాన్ని ఆక్రమించాడు. నైజాంపై బ్రిటిష్ వారి పెత్తనం ప్రారంభమైంది.

అంతకుపూర్వం ఫ్రెంచివారికి దానం చేయబడిన ఉత్తర సర్కారులను, నిజాం అలీఖాను 1766 లో ఇంగ్లీషువారికి ఇచ్చి వేశాడు. అవసరం వచ్చినప్పుడు ఇంగ్లీషువారు నైజాంకు సైన్యాన్ని పంపటానికి, అది లేనప్పుడు ఏటా 6 లక్షల రూపాయల కప్పం కట్టటానికి ఒప్పందం జరిగింది. 1790 లో మైసూరు నవాబైన టిప్పు సుల్తానుపై బ్రిటిషువారు యుద్ధాన్ని ప్రకటించారు. ఆ యుద్ధంలో నైజాం నవాబు, బ్రిటిషువారు, మహారాష్ట్రులు ఏకమై టిప్పు సుల్తానును ఓడించారు.

1798 లో నైజామును, బ్రిటిష్ వారికి సైన్య సహాయ మైత్రి జరిగింది. నైజాం రక్షణకై శాశ్వతంగా హైదరాబాదులో బ్రిటిష్ వారు

కొన్ని సేనలను ఉంచేందుకు, ఆ సేనల ఖర్చులకై, నైజాం ఏటా 4 లక్షల రూపాయలను కంపెనీ వారికిచ్చేందుకు ఒప్పందం జరిగింది. 1766 లో ఇంగ్లీషువారి నుండి కప్పం వసూలు చేసిన నైజాం, 30 ఏండ్ల కల్లా తన రక్షణకై ఇంగ్లీషు వారికే ఏటా కప్పం చెల్లించే దుస్థితికి దిగజారారు. ఈ సైన్య సహాయమైత్రి పథకాన్ని ప్రవేశపెట్టినవారు వెల్లస్లీ.

1799 లో నాల్గవ మైసూరు యుద్ధం జరిగి, టిప్పు సుల్తాను ఓడిపోయి మరణించాడు. మైసూరు రాజ్యంపై ఒడయరు వంశస్థులను ఇంగ్లీషువారు పునఃప్రతిష్ఠ చేశారు. యుద్ధంలో పాల్గొన్న నైజాంకు రాయలసీమ జిల్లాలన్నీ లభించాయి. కాని మరు సంవత్సరమే 1800 లో నైజాం తాను ఏటా కట్టవలసిన పన్నుకు బదులుగా, రాయలసీమ జిల్లాలన్నిటినీ ఇంగ్లీషువారికి ఇచ్చివేశాడు. అంతటితో తెలంగాణా మాత్రం నైజాం క్రింద మిగిలిపోయి సర్కారు, రాయలసీమ జిల్లాలు ఇంగ్లీషువారి వశమైనవి. ఆంధ్రదేశం రాజకీయంగా రెండు ముక్కలైంది.

నిజాం ఆలీఖాన్ 1803 లో మరణించాడు. పిమ్మట వరుసగా, సికందర్‌జా, నజీరుద్దౌలా అనువారు పరిపాలించారు. నజీరుద్దౌలా కాలంలో సైన్య పోషణ ఖర్చులకై బీరారు, రాయచూరు, ఉస్మానాబాద్ జిల్లాలు ఇంగ్లీషువారు తీసుకున్నారు.

నజీరుద్దౌలా మరణించిన మీదట, 1857 లో అఫ్జల్ ఉద్దౌలా నవాబైనాడు. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అప్పుడే ప్రారంభమయింది. స్వాతంత్ర్యోద్యమానికి ద్రోహంచేసి బ్రిటిషువారి కండగా ఉన్నందుకు గాను, అఫ్జల్ ఉద్దౌలాకు బ్రిటిషువారు అనేక బిరుదులు యిచ్చారు. తాము ఇంతకు పూర్వం తీసుకున్న రాయచూరు, ఉస్మానాబాద్ జిల్లాలను తిరిగి యిచ్చారు.

ఆ పిమ్మట 1869 లో మీర్ మహబూబ్ అలీఖాన్ నైజాం పదవిని స్వీకరించాడు. ఇతని కుమారుడైన ఉస్మాన్ ఆలీఖాన్ ఆఖరు నైజాం.

## సర్కారు జిల్లాల స్వాధీనం

నైజాం పరిపాలనలో చికాకోల్, రాజమండ్రి, ఏలూరు, కొండపల్లి, గుంటూరు అని అయిదు సూబాలుగా ఈ ప్రాంతం పరిపాలన సాగేది. వీనిలో చికాకోల్ సుబా ఒక ప్రధాన కేంద్రం.

గోల్కొండ నవాబుల కాలంలో చికాకోల్‌ను షేర్ మహమ్మద్ ఖాన్ అను ఫౌజుదారు పరిపాలించేవాడు. ఇతని పేర షేర్ మహమ్మద్ పురం అను గ్రామం చికాకోల్ వద్ద వున్నది. ఈ సూబాక్రింద నేటి చికాకోల్ విశాఖజిల్లా యుండేవి. షేర్ మహమ్మద్ ఖాన్‌తోపాటే బొబ్బిలి వెలమ దొరలు-విజయనగర పాలకులైన పూసపాటి వంశస్థులు చికాకోల్ సూబాలో ప్రవేశించి ఆయా ప్రాంతాలలో పన్నులు వసూలు చేసుకునే అధికారం సంపాదించి క్రమంగా జమీందార్లు ఐనారు.

గోల్కొండ రాజ్యం పతనమై అసఫ్‌జా వంశం హైదరాబాద్‌ను పరిపాలించసాగిన మీదట, చికాకోల్ ఫౌజుదారుగా అన్వరుద్దీన్ ఖాన్ నియమించబడ్డాడు. ఇతను కర్ణాటక యుద్ధాలలో ప్రముఖ పాత్ర వహించాడు.

1753 లో సర్కారు జిల్లాలను ఫ్రెంచి వారికి నైజాం ఇచ్చివేసినప్పుడు చికాకోల్ ఫౌజుదారుగా ఉన్న జాఫర్ ఆలీ, ఫ్రెంచివారికి తల ఒగ్గ ఇష్టంలేక ప్రతిఘటించేందుకై విజయనగర రాజుల సహాయాన్ని కోరాడు. కాని ఫ్రెంచి సేనాని మొరాకిన్ పెట్టిన ప్రలోభాలకు అంతకుముందే లొంగిపోయిన విజయనగర రాజైన విజయరామరాజు జాఫర్ ఆలీ ప్రయత్నాలను బలపరచలేదు. అంతట జాఫర్ ఆలీ నాగపూరు మహారాష్ట్రుల సహాయం కోరాడు. మహారాష్ట్ర సేనలలో దారిదోపిడి లక్షణం అప్పటికే ప్రవేశించింది. మహారాష్ట్ర సైనికులు నాగపూరు నుండి పిడుగువలె విరుచుకుపడి, చికాకోల్, విశాఖ, గోదావరి జిల్లాలను దోచుకొని, భీమిలిలో డచ్చి ఫ్యాక్టరీని ధ్వంసంచేసి, విజయరామరాజును ఓడించి, ఫ్రెంచి సేనలను చుమ్మపాలలో చీకాకుపరచి, దొరికిన ధనంతో తిరిగి తమ రాష్ట్రానికి వెళ్ళిపోయాడు. జాఫర్ ఆలీ ఆ తర్వాత నిస్పృహాయుడై మరణించాడు.

1754 లో చికాకోలు సూడా ఫ్రెంచివారి స్వాధీనమయింది. కాని కొత్తగా రాజైన ఇబ్రహీంఖాన్ తిరిగి ఫ్రెంచి అధికారాన్ని ధిక్కరించ సాగారు. విజయరామరాజు కోరికపై 1756 లో బుస్సీ చికాకోలుపై తిరిగి దండెత్తారు.

## బొబ్బిలి యుద్ధం

ఈ అవకాశాన్ని విజయరామరాజు తన స్వప్రయోజనానికి వినియోగించ దలచారు. బొబ్బిలి రాజులను నాశనం చేయాలని బుస్సీని పురికొల్పి, బొబ్బిలిపై దాడి చేయించారు. బొబ్బిలి రాజు తమ పాత బాకీ లన్నింటిని వెంటనే చెల్లిస్తానని మాట ఇచ్చినప్పటికీ వినక బుస్సీ, బొబ్బిలి సంస్థానాన్నంతా తమకు స్వాధీనం చేయవలెనని కోరాడు. అందుకు అంగీకరించక బొబ్బిలి దొరలు ఆత్మరక్షణకు పూనుకున్నారు.

1757 వ సంవత్సరం జనవరి 26 తెల్లవారుఝామున ఫ్రెంచి సేనలు, విజయరామరాజు భటులు బొబ్బిలిని ముట్టడించారు. ఫ్రెంచి సైనికులు 500, విజయరామరాజు భటులు 10 వేలు, బొబ్బిలి వీరులు 250 మాత్రమే. మధ్యాహ్నానికల్లా బొబ్బిలి కోటగోడలు బద్దలైనవి. తమకు పరాజయం తప్పదని గ్రహించిన బొబ్బిలి వీరులు తమ స్త్రీలకు అవమానం జరగకుండా, వారి నందరను స్త్రీశిశువులతోసహా తమ చేతులతో వధించి, తామందరూ యుద్ధభూమిలో చనిపోయారు. చిన రంగారావు అను రాజకుమారుని ఒక దాది కాపాడింది. ఆ చిన రంగారావు వంశస్తులే నేటి బొబ్బిలి రాజులు.

విజయరామరాజు చేయించిన ఈ ఘాతుకత్వానికి ప్రజలు క్రోధోద్రిక్తులైనారు. రెండు రోజుల తర్వాత బొబ్బిలి వీరులలో మిగిలిపోయిన పాపారాయుడు. విజయరామరాజును అర్ధరాత్రివేళ గుడారంలో వధించి తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు.

స్వాతంత్ర్య రక్షణకై బొబ్బిలి వీరులు చూపిన ధైర్య సాహసాలు, విజయనగర రాజుల ద్రోహబుద్ధి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

విజయనగర రాజుల విద్రోహం అంతటితో ఆగలేదు. ఫ్రెంచివారి వద్ద అనుకున్న సౌకర్యాలు లభించనందువల్ల విజయనగర రాజైన ఆనంద

గజపతి, కలకత్తాలోని ఇంగ్లీషు వారికి కబురు పెట్టారు. కర్నల్ ఫోర్డు నాయకత్వాన కలకత్తానుండి బ్రిటిష్ సేనలు 1758 అక్టోబరు 20 న విశాఖ పట్నం చేరాయి.

దోపిడీ ధనం, ఇంగ్లీషు సేనలు, విజయనగర సేనలు సమానంగా పంచుకోవలెనని, ఉత్తర సర్కారులకంతా విజయనగర రాజులను జమీందారులను చేయవలెనని, ముఖ్య నగరాలు, రేవు పట్టణాలు మాత్రం ఇంగ్లీషు వారి చేతిలో ఉండవలెనని, కర్నల్ ఫోర్డు, ఆనందగజపతి కశింకోటవద్ద ఒక ఒడంబడిక చేసుకున్నారు. అనంతరం ఇంగ్లీషు సేనలు గోదావరి జిల్లా చేరుకున్నాయి 1758 డిసెంబరు 9 న. పిఠాపురంవద్ద వున్న చందుర్తి వద్ద ఫ్రెంచి సేనలు ఘోరంగా ఓడిపోయాయి. దీంతో ఆంధ్రదేశంలో ఫ్రెంచివారి పతనం పూర్తి అయింది. సర్కారు జిల్లాలన్నీ ఇంగ్లీషువారి హస్తగతమైనవి. చందుర్తిని ఈనాడు కొండూరు అని వ్యవహరిస్తున్నారు.

## రాయలసీమ జిల్లాలు

1675 లో విజయనగర వంశస్థుడైన మూడవ శ్రీరంగరాయల పరిపాలన అంతమైంది. పిమ్మట 1800 వరకు రాయలసీమ జిల్లాలను స్థానికులైన నవాబులు, పాళయ్యగాడ్లు పరిపాలిస్తూ వచ్చారు. పేరుకు వీరు నైజాం అధికారాన్ని అంగీకరించారు. ఆచరణలో స్వతంత్రులు.

ఈ కాలంలో మహారాష్ట్రుల దండయాత్రలు అనేకసార్లు రాయలసీమను కల్లోలపరచినవి. 1740లో మహారాష్ట్ర సేనానులు కర్నూలుమీదుగా క్రిందికి దిగి, కడప జిల్లాను దోచుకొని, గుర్రంకొండ, గువ్వల చెర్వు యుద్ధాలలో కడప నవాబును ఓడించి, తిరుచునాపల్లి వరకు వెళ్ళి చందాసాహెబును ఓడించాయి. ఈ మహారాష్ట్ర సేనానులు స్థిరంగా ఉండి పరిపాలించేవారు కాదు. మెరుపుదాడిచేసి, గ్రామసీమలను ధ్వంసంచేసి, దోపిడీ ఆస్తిని స్వీకరించి తిరిగి వెళ్ళిపోయేవారు. తిరిగి మహారాష్ట్రదాడులు 1741 లో, 1746 లో కూడా జరిగినవి. ఈ మహారాష్ట్రులలో కొందరు మాత్రం స్థిరపడి పరిపాలన చేయసాగారు. మురారిరావు అను సేనాని 1748 లో అనంతపురం జిల్లా, గుత్తి, తాడిపత్రి, పెనుకొండ తాలూ

కాలను స్వాధీనం చేసుకొని పరిపాలించ సాగారు. 1761 లో హైదరాలీ గుత్తి దుర్గాన్ని దీర్ఘ యుద్ధానంతరం స్వాధీనం చేసుకొని, మురారిరావును ఖైదు చేశాడు. అనంతరం 1800 వరకు అనంతపురం జిల్లా మైసూరు సుల్తానుల క్రింద వుంది. పిమ్మట నైజాముకు, ఆ పిమ్మట ఇంగ్లీషు వారికి స్వాధీనమైంది.

కడప నవాబు 1750 లో, నైజాం వారసత్వపు తగాదాలలో జోక్యం కలిగించుకొని నాజరుజంగు, ముజఫరుజంగు హత్యలకు కారకుడైన విషయం లోగడ గమనించాము. పిమ్మట 1768 లో హైదరాలీ కడప జిల్లాపై దాడిచేసి కడప నవాబును ఖైదుచేసి 1800 వరకు ఆ ప్రాంతాన్ని కూడ తన గవర్నరైన మీరు సాహెబు పరిపాలనలో వుంచాడు. కర్నూలు, చిత్తూరు జిల్లాలు కూడా 1800 వరకు హైదరాలీ పరిపాలన క్రిందనే వున్నాయి.

## పాళయగార్లు – మన్రో

1800 లో రాయలసీమ అంతా బ్రిటిషువారి స్వాధీనమైంది. స్థానిక ప్రభువులైన పాళయగార్లను తొలగించి, వారి కోటలను, సేనలను ధ్వంసం చేసి, వారి అధికారాన్నంతా నాశనం చేసిన మీదటగాని రాయలసీమ ఆక్రమణ పూర్తికాలేదు. ఈ పని చేసినవాడు సర్ థామస్ మన్రో.

విజయనగర రాజులు పాళయగార్ల వ్యవస్థను ఏర్పరచారు. వీరు భూస్వామ్య ప్రభువులు. కోటలు, సైన్యాలు కలిగి వుండి అవసరమైనపుడు విజయనగర రాజులకు సాయం చేస్తుండేవారు. విజయనగర రాజుల అనంతరం నైజాం దుర్బల పరిపాలన కాలంలో వీరు బలపడి తమ ప్రాంతాలకు సర్వాధికారులైనారు. తెలంగాణాలోని జాగీర్దారు, దేశముఖుల వంటివారే ఈ పాళయగార్లు. హైదరాలీ రాయలసీమను పరిపాలించిన 50 ఏండ్లలో ఈ పాళయగార్లను అణచివేయడానికి తీవ్ర కృషి చేశాడు. కాని సాధ్యం కాలేదు.

రాయలసీమలో 1800 నాటికి 80 మంది పాళయగారుండేవారు. వీరిలో ఎక్కువమంది కడప జిల్లాలో వున్నారు. వీరిలో ప్రతివారికి కొంత

పేట. కొన్ని గ్రామాలు. ఒక కోట వుండేవి. అచ్చటి ప్రజలపై సివిల్. క్రిమినల్ అధికారాలు చలాయించేవారు. రైతుల నుండి వీరు శిస్తును వసూలుచేసి కొంతభాగం తాము వుంచుకొని మిగతా భాగం పై అధికారులకు యిచ్చేవారు. వారు దొరికినప్పుడల్లా పక్క గ్రామాలను దోచుకొనే వారు.

1801 లో కాంప్‌బెల్ సేనాని కడప జిల్లా పులివెందుల తాలూకా వేములకోటను పట్టుకొని అచ్చటి పాళయగారిని ఖైదు చేశారు. పిమ్మట పులివెందుల తాలూకాలోని మల్లరాజును తొలగించారు. మన్రో విధాన ఫలితంగా నాలుగైదేండ్లలో పాళయగార్ల కోటలన్నీ ధ్వంసమైనాయి. రైతుకు, ప్రభుత్వానికి మధ్యదళారులైన పాళయగార్లు అదృశ్యం కావడంతో, రాయలసీమ అంతటా రైత్వారీ విధానాన్ని మన్రో ప్రవేశ పెట్టాడు.

రైత్వారీ విధానంవల్ల ప్రజలకు, ప్రభుత్వానికి సరాసరి సంబంధం ఏర్పడి, పాత భూస్వామ్య దోపిడీ తొలగిపోయింది. కాగా, గ్రామ జీవితంలోని సమిష్టి ఆర్థిక జీవిక అవశేషం పూర్తిగా నశించింది. బ్రిటిషు వారు రాయలసీమ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సర్కారు జిల్లాలలో సైతం రైత్వారీ విధానాన్ని అమలు పరచారు.

22 వ అధ్యాయం

# సామ్రాజ్యవాదుల దోపిడీ - ప్రజల ప్రతిఘటన

భారత దేశానికి విదేశ దండయాత్రలు కొత్తకావు. కాని బ్రిటిషు వారి ఆక్రమణ అంతకు పూర్వం జరిగిన విదేశ దండయాత్రల వంటిది కాదు.

యూరపులో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెంది సామ్రాజ్య వాద దశకు మారింది. వలస దేశాలను ఆక్రమించుకొని, ఆ దేశాల ఆర్థిక సంపదను దోచుకొని, లాభాలు సంపాదించటం సామ్రాజ్యవాద లక్షణం. బ్రిటిషు సామ్రాజ్యవాద దోపిడి ఫలితాలు, 1800 కల్లా భారతదేశం అంతటా ప్రత్యక్షం కాసాగినవి.

ఒక శతాబ్దంపైగా సాగిన నిరంతర అంతర్యుద్ధాలవల్ల ఆంధ్రదేశం క్షోభించిపోయింది. గ్రామ పరిశ్రమలు ధ్వంసమయినవి. గ్రామ పంచాయతీల హక్కులు నామమాత్రమయినవి. పాళయగాళ్లను, ఇతర జమీందార్లను తొలగించి, భూస్వామ్య దోపిడీ తీవ్రతను బ్రిటిషువారు తగ్గించినప్పటికీ, రైతులపై పన్నులను విధించే సందర్భంలో, వసూలు చేసే సందర్భంలో బ్రిటిషువారు పాళయగాళ్లకంటె ఘోరమైన పద్ధతుల నవలంబించేవారు.

థాంసే సేమరు అను ఒక బ్రిటిషు పౌరుడు కోయంబత్తూరు జిల్లాలో ఒక గ్రామంలో, రెవిన్యూ అధికారులు ప్రజలను పెట్టిన బాధలను స్వయంగా చూసి బ్రిటిషు పార్లమెంటుకొక నివేదిక సమర్పించాడు.

"కొందరిని తలక్రిందులుగా కోదండము వేసిరి. కొందరి రెక్కలు విరిచి కట్టిరి. కొందరి నెత్తిన బండలుపెట్టి కొరడాలతో బాదిరి" అని ఆయన వ్రాశాడు. ఈ ఘోర ప్రత్యక్ష కథనం తర్వాత చిత్రహింసల కమిషన్ (టార్చరు కమిషను)ను పార్లమెంటు ఏర్పరచి విచారణ జరిపింది.

గ్రామ పంచాయతీల విధ్వంసంవల్ల కలిగిన నష్టం గురించి సర్ థామస్ మన్రో ఇలా వ్రాస్తున్నాడు :

"ఈ గ్రామ ప్రజా సంఘములు చిన్న ప్రజాస్వామికములు. దీనికి కావలసిన అధికారములెల్ల కలవు. దేశీయ ప్రభుత్వ సంస్థలెవ్వియు వీని అధికారమునకు భంగం కలిగించవు. ఎన్ని ప్రభుత్వములు మారినను ఇవి చెక్కు చెదరక నిలచి ఉన్నవి. ఈ సంస్థల మూలముననే భారతీయ ప్రజలు కొంతవరకైనా శాంతి స్వాతంత్ర్యములను పొందగలిగినారు."

రైత్వారీ విధానం రావటంతో పై సంస్థలన్నీ నశించాయి. జిల్లా కలెక్టరు ఇష్టాయిష్టాలనుబట్టి పన్నుల విధింపు జరుగుతూండేది కంపెనీ వారి ఖజానాలో డబ్బు తక్కువైనప్పుడల్లా భూమిశిస్తును వారు పెంచ సాగారు. శిస్తులభారం పెంచటమేగాని చెరువుల, కాలవల మరమ్మతులను చేయించటం మానివేశారు. దేశాన్ని కొల్లగొట్టడమే ప్రధానంగా భావించారు. తత్ఫలితంగా ఆంధ్రదేశంలో కరువుకాటకాలు అనేకసార్లు ఏర్పడ్డాయి. 1830 లో రాయలసీమలో ఘోరమైన కరువు ఏర్పడి వేలాది ప్రజలు మరణించారు. కరువు నివారణ పథకంలో భాగంగానే నాడు కడప - కర్నూలు కాలువ నిర్మాణం ప్రారంభమైంది. 1877, 1878 సంవత్సరాలలో మరింత తీవ్రమైన కరువు ఏర్పడ్డది. మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలో వ్యాపించిన ఈ కరువులో 50 లక్షల ప్రజలు మరణించారు.

## గాజుల లక్ష్మీనరుసుచెట్టి

బ్రిటిషు పరిపాలనవల్ల కలుగుతున్న దుష్ఫలితాలకు వ్యతిరేకంగా **ప్రజాభిప్రాయాన్ని సమీకరించుటకు పూనుకున్న మొదటి ఆంధ్రుడు గాజుల లక్ష్మీనరుసుచెట్టి.**

వీరు మద్రాసులో లక్షాధికారులైన వ్యాపారస్తులు. కంపెనీ అధికారులు, క్రైస్తవ పాదరీలు చేయు దురాచారాలను ఖండించుటకై క్రెసెంటు అను ఇంగ్లీషు పత్రికను స్థాపించారు. బైబిలును విద్యాగ్రంధ బోధనా విషయంగా చేయరాదని 1846 లో ఒక గొప్ప సభచేసి పార్లమెంటుకు మహజరు పంపారు. ఆ మహజరుపై 12 వేల మంది మద్రాసు పౌరుల సంతకాలు సేకరించారు.

కంపెనీ అధికారులు పన్నుల వసూలులో అవలంబిస్తున్న దారుణ పద్ధతులను బహిఃప్రపంచానికి తెలియచేసింది లక్ష్మీనరసుగారు. కంపెనీ చేతులనుండి బ్రిటిషు పార్లమెంటు పరిపాలన స్వీకరించవలెనని 1852 లో లక్ష్మీనరసుగారు మరొక మహజరు పంపారు.

లక్ష్మీనరసుగారు మితవాది. 1857 లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని ఆయన వ్యతిరేకించారు. ఈ తిరుగుబాటు అనంతరం బ్రిటిషు ప్రభుత్వం లక్ష్మీనరసుగారికి సి.యస్.ఐ. బిరుదునిచ్చి బహూకరించింది.

## ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం

సిపాయి తిరుగుబాటు అని వ్యవహరించబడే ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం 1857 లో జరిగింది. సామ్రాజ్యవాద దోపిడీ క్రింద నలిగిపోతున్న ప్రజానీకం అంతా బ్రిటిషువారిని ద్వేషించసాగారు. వారి పరిపాలనను అంతమొందించడానికి మార్గాలు వెతకసాగారు.

గ్రామసీమల నుండి తొలగింపబడిన రైతాంగం, పొట్టగడవక వేల సంఖ్యలో సైనికులుగా చేరేవారు. వీరిలో కొందరు బందిపోటు వృత్తిని స్వీకరించారు. మహారాష్ట్రి సేనానులు కొందరు ఈ దారిదోపిడీదార్లకు నాయకత్వం వహించారు. వీరే పిండారీలు, థగ్గులు. వీరు దేశమంతటా విచ్చలవిడిగా తిరిగి ధనికులను, ప్రభువులను మాత్రమే గాక ప్రజలను సైతం దోచుకునేవారు.

1816 లో పిండారీ దండు ఒకటి తెలంగాణా మీదుగా కృష్ణానదిని చేరి సర్కారుజిల్లా లన్నిటినీ దోచుకుంది. ఈ దండు వచ్చినప్పుడు ప్రజలు ఎంతో భయభ్రాంతు లయ్యేవారని ఈ క్రింది ఉల్లేఖనం తెలియ జేస్తుంది:

"కొందరు సకుటుంబంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. దానిలో దూకి వందలాది స్త్రీలు మరణించారు. గ్రామంలోని ఆడపిల్లల నందరిని పిండారీలు ఎత్తుకుపోయారు."

ప్రజలు, సైనికులు, స్వదేశ సంస్థానాధీశులు అందరూ బ్రిటిషు ప్రభుత్వాన్ని ద్వేషించసాగారు. 1857 లో మీరటు, లక్నో, కాన్పూరు లలో సైనికులు తిరుగుబాటు చేశారు. యూరోపియన్ ఉద్యోగులను వధించి స్వతంత్రాన్ని ప్రకటించారు. తిరుగుబాటుకు ఉత్తరప్రదేశ్ ప్రధాన కేంద్రం.

ఝాన్సీరాణి లక్ష్మీబాయి, నానాసాహెబ్, అయోధ్యబేగం, తాంతియా తోపే మొదలైనవారు ఈ విప్లవానికి నాయకత్వం వహించారు. మొగల్ పాదుషాను తిరిగి సింహాసనస్థుని చేయవలెనని విప్లవ కారులలో కొంద రూహించారు.

విప్లవం ఓడిపోయింది. ఝాన్సీలక్ష్మీబాయి రణరంగంలో చనిపో యింది. మిగతావారు మరణించడమో, ఖైదు చేయబడడమో జరిగింది. పేరుకు పాదుషాగా వుంటూవచ్చిన బహదూర్‌షాను ఇంగ్లీషువారు తొల గించివేశారు. విప్లవకారులను అణచివేయుటకు బ్రిటిష్ అధికారులు అతి క్రూరమైన పద్ధతుల నవలంబించారు. ఫిరంగిగొట్టాల మూతులకు ప్రజలను కట్టి కాల్చివేశారు.

1880 లో ఈస్టు ఇండియా కంపెనీని తొలగించి బ్రిటిష్ పార్ల మెంటు భారత దేశాన్ని పరిపాలించసాగింది. విక్టోరియారాణి భారతదేశ ప్రభుత్వ బిరుదు ధరించింది.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో దక్షిణ హిందూదేశం పాల్గొనలేదు. కాని స్వాతంత్ర్య సంగ్రామానికి ముందు, వెనుక ఆంధ్రదేశంలో చెల్లాచెదురుగా జరిగిన తిరుగుబాట్లు అనేకం వున్నాయి.

## ఆంధ్రలో తిరుగుబాట్లు

తమ స్వప్రయోజనాల దృష్ట్యా ఒకప్పుడు ప్రభుత్వానికి అనుకూలంగా, మరొకప్పుడు వ్యతిరేకంగా ప్రవర్తించిన జమీందార్ల గాథలు ఆంధ్రుల చరిత్రలో చాలా ఉన్నాయి. భూస్వామ్య వర్గం తమ దోపిడీని కాపాడుకోడానికి చేసిన ఈ ప్రయత్నాలు జాతీయ భావప్రేరితములు కావు. కాని, అధికారుల దుర్మార్గాలకు వ్యతిరేకంగాను, పన్నులబాధ భరించలేకనూ, ఎక్కడికక్కడ ప్రజలు, సైనికులు చేసిన తిరుగుబాట్లు సామ్రాజ్యవాద పరిపాలనలోని దోపిడీని స్పష్టంగా మనకు వ్యక్తం చేయగలవు.

1780 లో విశాఖపట్నంలో సిపాయీల తిరుగుబాటు జరిగింది. బ్రిటిష్‌వారిని భారతదేశం నుండి తరిమివేయడానికి పూనుకున్న ఒక వీరుడుగా మైసూరు సుల్తాన్ హైదరాలీని ప్రజలు భావించేవారు. హైదరాలీపై యుద్ధానికి విశాఖపట్నం నుండి నాలుగు సైనిక పటాలాలు కదలాలని విశాఖలోని సేనాని ఆజ్ఞాపించాడు. హైదరాలీపై మేము యుద్ధం చేయము అని నాలుగు పటాలాలు తిరుగుబాటుచేసి, ఆఫీసర్లందరినీ చంపివేసి, సైనిక గవర్నరు ఇల్లు దోచుకొని నగరం వదలిపెట్టి దక్షిణంగా కొన్ని మైళ్ళ దూరం వరకు వెళ్ళారు. మరునాడు బ్రిటిషు ఆఫీసరు కొంత అదనపు సైన్యంతో పారిపోయిన సైనికులను వెంటతరిమి కొందరిని కాల్చివేసి, మిగతావారిని ఖైదు చేశాడు. ఈ తిరుగుబాటు 1680 అక్టోబరు 3 వ తేదీన జరిగింది.

## గోలుకొండ తిరుగుబాటు

ఇంతకంటె ఎక్కువ ప్రసిద్ధమైన తిరుగుబాటు గోలుగొండ ఏజెన్సీ ప్రాంతంలో 1837 లో ప్రారంభమైంది. ఆ ప్రాంతానికి పరిపాలకుడుగా ఉన్న అనంతభూపతిని, పన్నులు చెల్లించలేదనే కారణంతో బ్రిటిష్‌వారు తొలగించి ఆ ప్రాంతాన్నంతా స్వాధీనం చేసుకున్నారు.

ఇందుకు నిరసనగా కొండదొరలు, భూపతి వంశస్థుడైన చిన్న భూపతిని రాజుగా ప్రకటించి మూడేండ్లపాటు ప్రభుత్వానికి శిస్తులు కట్టడం మానివేశారు. ప్రభుత్వమే చివరకు దిగివచ్చి, ఎవ్వరినీ ఖైదు చేయమని హామీ యిచ్చిన మీదట, చిన్న భూపతి తిరుగుబాటును విరమించాడు. ఈ మూడేండ్లలో కొండదొరలు గుట్టలమధ్య దారికేచ్లు కట్టి, రాత్రివేళ బ్రిటిషు సేనలపై దాడిచేసి గెరిల్లా పోరాట పద్ధతుల ద్వారా బ్రిటిషు సేనలను ముప్పతిప్పలు పెట్టారు.

ప్రథమ భారత సంగ్రామ వార్తలు దేశమంతా వ్యాపించగానే, 1857 లో తిరిగి కొండదొరలు సన్యాసిభూపతి అను వ్యక్తి నాయకత్వాన తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు కూడా ఓడిపోయింది.

1864-65 లో బ్రిటిషువారు ఏజన్సీ ప్రాంతమంతా పోలీసు స్టేషన్లను స్థాపించారు. గోదావరి జిల్లా ఏజన్సీలో 1879-80 లో ప్రారంభమైన పితూరీ ప్రభావం గోలుగొండ మీద ప్రసరించి, 1879 జూన్ 3 వ తేదీన 50 మంది పోలీసులకు కొండదొరలకు ఘర్షణ జరిగింది. ఆ పిమ్మట కొండదొరల నాయకుడైన వీరయ్య దొరను బ్రిటిషువారు కాల్చివేశారు.

గోలుగొండ ఏజన్సీలోని రెండు ముఠాలను ప్రభుత్వం గోదావరి ఏజన్సీకి మార్చింది.

1856 లో ఒకసారి, 1891లో మరొకసారి కొండదొరలు పితూరీలు చేశారు. గూడెం, చింతపల్లి – కృష్ణదేవిపేట పోలీసు స్టేషనులపై 200 మంది సాయుధ ప్రజలు దాడిచేసి పోలీసులను చంపి, ఆయుధాలను స్వాధీనం చేసుకొని కొండలలోకి పారిపోయారు. వారి నాయకుడు కాంత భూపతి చనిపోవటంతో యీ తిరుగుబాటు కూడా విఫలమయింది.

ఏజన్సీ ప్రాంత ప్రజలపైన పోలీసులు, అధికారులు చలాయించే జులుంకు, గుండె లంచాలకు, జరిపే అవమానాలకు వ్యతిరేకంగా పై తిరుగుబాట్లు అన్నీ జరిగాయి.

గుమ్మడు తాలూకాలోని సవరలు 1864 లో తమ నాయకుని పోలీసులు అరెస్టు చేసినందుకు నిరసనగా, ఒక పోలీసు ఇన్‌స్పెక్టరును, నలుగురు పోలీసులను చంపి, ఒక పోలీసు స్టేషన్ను ధ్వంసం చేశారు.

తిరుగుబాటు దార్లను అధికారులు ఖైదుచేసి, కొందరికి ఉరిశిక్ష, మరి కొందరికి యావజ్జీవ ద్వీపాంతరశిక్ష విధించారు. 1866 లో తిరిగి అదే ప్రాంతంలో సవరలు తమ కొండలలోకి ప్రవేశిస్తున్న ఒక పోలీసు దళాన్ని ప్రతిఘటించారు. పోలీసుదళం ముందుకు సాగలేక పలాయనం చిత్తగించింది. 1868 లో ప్రభుత్వం విస్తార బలగంతో కొండప్రాంతాన్ని లేనీ ముట్టడించి, సవరలపై అనేక అత్యాచారాలు జరిపి తిరుగుబాటును అణచి వేసింది.

సాలూరు తాలూకా కొర్రవాని పలసలో 1900 సంవత్సరంలో మరొక తిరుగుబాటు జరిగింది. కొర్రా మల్లయ్య అను కొండదొర 4, 5 వేలమంది ప్రజలను చేరదీసి బ్రిటిషువారు సాగిస్తున్న దౌర్జన్యాలు వివరించి పోలీసు స్టేషన్లపై దాడి చేయాలని ఉద్బోధించాడు. ఇద్దరు పోలీసులను ప్రజలు వధించారు. పాలిమెంట పోలీసుస్టేషనుపై దాడికి సన్నాహాలు చేస్తుండగా జిల్లా కలెక్టరు పెద్ద బలగంతో వచ్చి తిరుగుబాటును అణచివేసి, ముగ్గురిని ఉరితీశారు.

భద్రాచలంవద్ద ఉన్న యర్నగూడెంలో సుబ్బారెడ్డి అను నతడు 1859 లో చిన్న తిరుగుబాటు లేవదీశాడు. నానా సాహెబు సైన్యంతో వస్తున్నాడని, బ్రిటిషు వారిని తరిమి వేయండని ఉద్బోధించాడు. ఇతని నాయకత్వాన కోయలు బుట్టాయిగూడెం గ్రామ మునసబును చంపి, జీలుగు మల్లి వద్ద పోలీసులతో పోరాడారు. పోలీసులు తిరుగుబాటును అణచివేసి, సుబ్బారెడ్డిని మరి ఏడుగురిని ఉరితీశారు.

## రంపపితూరీ

పైవాటి అన్నిటికంటే విస్తృతమయిన రంపపితూరీ గోదావరి ఏజన్సీ ప్రాంతంలో 1879 లో జరిగింది.

మన్యం రైతులు, ముఠాదార్లు, అధికార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఈ తిరుగుబాటు లేవదీశారు. రంపచోడవరంలో ప్రారంభమయిన పితూరీ భద్రాచలం, రేకపల్లి, గోలుగొండ-ప్రాంతాలకు విస్తరించింది.

తిరుగుబాటుదార్లకు ద్వారబంధాల చంద్రయ్య, పులిచింత సాంబయ్య, అంబుల్ రెడ్డి నాయకులు. ద్వారబంధాల చంద్రయ్య 1879 ఏప్రిల్‌లో అడ్డతీగెల పోలీసుస్టేషనును ధ్వంసం చేశాడు. అదే సంవత్సరం నవంబరులో చంద్రయ్య అనుచరులను 79 మందిని ప్రభుత్వం కాల్చివేసింది. 1880 ఫిబ్రవరిలో చంద్రయ్యనుకూడా పోలీసులు కాల్చివేశారు.

అంబుల్ రెడ్డి నాయకత్వాన 1879 జూలై 10 వ తేదీన ప్రజలు వద్దిగూడెం పోలీసు స్టేషనును తగులబెట్టారు. 1880 లో తమ్మన్నదొర రేకపల్లిని స్వాధీనం చేసుకున్నారు. బ్రిటిషు సైనికులు క్రమంగా తిరుగుబాటుదార్లందరినీ కాల్చివేసి ప్రజలపై క్రూరనిర్బంధాలు అమలు జరిపారు. 14 వ శతాబ్దంలో మహమ్మదీయ వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటం జరిపిన ముసునూరి నాయకులు, రేకపల్లిలో తమ పోరాటం ప్రారంభించిన విషయం ఈ సందర్భంలో స్మరించుకోవలసి వుంటుంది. నాటి నుండీ బ్రిటిషు హయాంవరకు, ఏజన్సీ ప్రాంతాలలో నివసించే కొండజాతి ప్రజలు దాస్యత్వ ప్రతిఘటనపై సాయుధ పోరాటాలను జరిపే సాంప్రదాయాలను నిలబెట్టారు.

## మన్యం తిరుగుబాటు

ఇదే ప్రాంతంలో 1922 లో అల్లూరి సీతారామరాజు నాయకత్వాన మన్యం తిరుగుబాటు జరిగింది.

పశ్చిమ గోదావరిజిల్లా భీమవరం ప్రాంతంలో జన్మించి, రాజమండ్రిలో విద్యాభ్యాసం చేసిన సీతారామరాజు 1922 జనవరిలో కొండదొరలను, ప్రజలను సమీకరించి, రాజవొమ్మంగి స్టేషనుపై దాడిచేసి, ఖైదులో వున్న వీరయ్య అను కొండదొరను విడిపించాడు. వీరయ్య, గంటందొర-మల్లుదొర సీతారామరాజుకు సేనానులుగా ఈ తిరుగుబాటులో సహాయ పడ్డారు.

అనేక పోలీసు స్టేషన్లపై సీతారామరాజు దళాలు దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. రెండేండ్లపాటు ఏజన్సీ ప్రాంతంలో సీతారామరాజు దళాలకు, ప్రభుత్వ సేనలకు ఘర్షణలు జరుగుతూనే వున్నవి. చిట్టచివరకు పితూరీ ఓడిపోయింది. కొన్ని వందలమంది పితూరీదార్లు మరణించారు.

ఈ ప్రధానమయిన తిరుగుబాటులు మాత్రమే కాక ఆంధ్రదేశం అంతటా చిన్న చిన్న తిరుగుబాటులు అప్పుడప్పుడు జరుగుతూనే వున్నాయి.

తమ తలపాగాలను తీసివేయవలెనన్న ఆజ్ఞకు నిరసనగా, మచిలీపట్నంలో సిపాయీలు 1706 లో తిరుగుబాటు చేశారు. ఆరుగురు సైనికులను అధికారులు కాల్చివేశారు.

కర్నూలు నవాబయిన రసూల్‌ఖాన్ 1838 లో బ్రిటిషు వ్యతిరేక కుట్ర చేశారు. ఈ కుట్రలో నెల్లూరు జిల్లా ఉదయగిరి నవాబు కూడా పాల్గొన్నారు. రసూల్‌ఖాన్‌ను బ్రిటిషువారు అరెస్టుచేసి తిరుచనాపల్లి జైలుకు పంపారు. జైలులో రసూల్‌ఖాన్ మరణించారు.

1857 లో భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగిన సందర్భంలో ఆ వార్తలు విని ఉత్సాహపడి, బళ్ళారి జిల్లాలో భీమారావు అను మాజీ తాసిల్దారు ఒక తిరుగుబాటు లేవదీశారు. హాస్పేటకు 28 మైళ్ళ దూరంలో వున్న కొప్పాల్‌ను తిరుగుబాటుదార్లు స్వాధీనం చేసుకున్నారు. తుంగభద్ర నది ఒడ్డున బ్రిటిషు సేనలకు తిరుగుబాటుదార్లకు ఘర్షణ జరిగింది. 100 మంది తిరుగుబాటుదార్లు భీమారావుతో సహా మరణించారు. 77 మంది ఖైదు చేయబడి, ఉరితీయబడ్డారు.

# ఆధునిక యుగం

క్రీ. శ. 1853 నుండి నేటి వరకు ఆంధ్రుల చరిత్రలో ఆధునిక యుగం. ఈ శతాబ్దంలో ఆంధ్ర ప్రజా జీవితాన్ని రూపొందించిన ఉద్యమాలు నాలుగు : 1. వీరేశలింగంగారి ఆధ్వర్యాన ప్రారంభమైన సంఘ సంస్కరణ, భాషా సంస్కరణ ఉద్యమం ; 2. 1913 లో ప్రారంభమైన ప్రత్యేక రాష్ట్రోద్యమం ; 3. 1921 నుండి ప్రారంభమైన కాంగ్రెసు ఉద్యమం ; 4. 1935 నుండి ప్రారంభమైన కమ్యూనిస్టు ఉద్యమం.

జాతీయ పునరుజ్జీవనం ముందుగా సాహిత్యరంగంలో ప్రారంభమైంది. 1812 లో మచిలీపట్నం కలెక్టరుగా ఉన్న చార్లెస్ బ్రౌన్ దొర తెలుగు భాష పునరుద్ధరణకు పూనుకున్నాడు. అనేకమంది తెలుగు పండితులను చేరదీసి, తాళపత్ర గ్రంథాలకు శుద్ధప్రతులు వ్రాయించి కాపాడాడు. వేమన పద్యాలను, బ్రౌన్ నిఘంటువును ప్రచురించాడు.

భాషకు బ్రౌన్‌దొరవలెనే చరిత్రకు మెకంజీదొర సాయం చేశాడు. 1816-21 మధ్య మెకంజీ ప్రభుత్వ సర్వే అధికారిగా వుండేవాడు. దేశ చరిత్రను తయారు చేయించవలెననే ఉద్దేశంతో, ఆంధ్రదేశంలోని గ్రామ కైఫీయత్తులను, తదితర చారిత్రక పత్రాలను అత్యధిక వ్యయ ప్రయాసల కోర్చి మెకంజీ సేకరించాడు.

వీరిద్దరు విదేశీయులైనప్పటికీ, ఆంధ్రజాతి పునరుజ్జీవనంలో వీరి పాత్రను సర్వదా స్మరించుకోవాలి.

## నాటి పరిస్థితులు

200 సంవత్సరాల విదేశీ పాలన ఫలితంగా జాతీయ చైతన్యం, ఆత్మవిశ్వాసం ప్రజలలో నశించాయి. అన్ని రంగాలలోను నిస్తబ్ధత, కుళ్ళు ప్రవేశించాయి.

అతి బాల్య వివాహాలు, తత్ఫలితంగా ఏర్పడే బాల్యవితంతువులు, వరశుల్క, కన్యాశుల్క దురాచారాలు ప్రధానంగా బ్రాహ్మణ కులంలో, ఇతరులలో కొంతవరకు వుండేవి.

సాహిత్యసృష్టి నశించింది. ప్రబంధాల యుగం అంతరించింది. పాత వ్యాకరణ సూత్రాలను దృష్టిలో ఉంచుకొని బాలవ్యాకరణం అనే గ్రంథాన్ని 1882 లో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ పండితుడు చిన్నయ సూరి రచించారు.

బొంబాయి-మద్రాసు రైలుమార్గం ఏర్పడ్డాగి, కృష్ణా, గోదావరి నదులకు ఆనకట్టలు నిర్మించబడినవి. మెట్ట వ్యవసాయం నుండి మాగాణి వ్యవసాయానికి, రైతాంగం మారసాగింది.

ఈ పరిస్థితులలో 1848 లో కందుకూరి వీరేశలింగం పంతులు రాజమహేంద్రవరం వద్ద ఒక బీద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు.

తెలుగు, సంస్కృతం, ఆంగ్లభాషలలో పాండిత్యం సంపాదించి, రాజమహేంద్రవరం కళాశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా జీవితం ప్రారంభించిన వీరేశలింగంగారు, మొట్టమొదట తన దృష్టిని సంఘ సంస్కరణ వైపు ప్రసరించారు. అతిబాల్య వివాహాలు పనికిరావని, వితంతు వివాహాలు జరిపించవచ్చునని, స్త్రీలకు విద్య, సమాన హోదా ఉండవలెనని, వ్యాసాలద్వారా, ఉపన్యాసాలద్వారా, బ్రహ్మాండమైన ప్రచారం చేశారు. స్వయంగా వితంతు వివాహాలను జరిపించి సంఘసంస్కరణకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు.

కులభేదాలు హిందూ సంఘ పతనానికి మూలకారణమని గుర్తించి, వానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు. మూఢ నమ్మకాలను,

మతాచారాలను, ఛాందస భావాలను నిరసిస్తూ, అనేక రచనలు సాగించారు. హిందూమతం యొక్క సంస్కరణ రూపమైన బ్రహ్మ సమాజానికి ఆంధ్రదేశంలో పునాది వేశారు.

ఈ రెంటితోనే సంతృప్తిపడక, ప్రభుత్వోద్యోగులలో విశేషంగా వ్యాపించిన లంచగొండితనాన్ని ధైర్యంగా విమర్శించి కొందరు ఉద్యోగులను శిక్షింపచేశారు. నాటి సమాజంలో విరివిగా వున్న వేశ్యాలంపటత్వాన్ని తీవ్రంగా నిరసించి నైతిక పునరుజ్జీవనకు ప్రారంభకులైనారు.

ఈ మహోద్యమాల ప్రచారానికి భాషను ఒక సాధనంగా స్వీకరించి తెనుగు భాషలో నూటికిపైగా వచన గ్రంథాలను రచించారు. నవల, నాటకము, ప్రహసనము, జంతు, జీవ, ఖగోళ, భూగోళ, పదార్థ, విజ్ఞాన శాస్త్రములు, జీవిత చరిత్రలు, స్వీయచరిత్ర—మొదలైన వివిధ రూపాలలో భాషాసేవచేసి, గద్యతిక్కన అను సార్థకనామం ధరించారు. తన అవసాన దశలో అప్పుడప్పుడే తలఎత్తుకున్న కాంగ్రెసు ఉద్యమాన్ని, వ్యావహారిక భాషోద్యమాన్ని అభిమానించారు. ఆంధ్రుల చరిత్రను, ఆంధ్ర భాషాచరిత్రకు పునాదిగా ఆంధ్ర కవుల చరిత్ర అను ఉద్గ్రంథాన్ని విశేష శ్రమకోర్చి ప్రకటించారు.

తన జీవితాన్నంతా సంఘ సంస్కరణకు, భాషాభివృద్ధికి వినియోగించుటతోపాటు, పుస్తక రచన ద్వారా తాను సంపాదించిన లక్షరూపాయల ఆస్తిని, హితకారిణీ సమాజమను ప్రజాసంస్థ పరం చేసి, ఆంధ్రదేశంలో అపూర్వమైన త్యాగ ప్రమాణాలను సృష్టించారు.

క॥ తన దేహము తన గేహము
తన కాలము తన ధనంబు తన విద్య జగ
జ్జనులకై వినియోగించిన
ఘను డీ వీరేశలింగకవి జనులారా.

అను శాశ్వత కీర్తిని సంపాదించారు. ఆధునికాంధ్ర జీవితానికి శ్రీ వీరేశలింగం గారిని యుగపురుషుడుగా మనం భావిస్తున్నాము.

వీరేశలింగంగారు ప్రారంభించిన, భాషా సంస్కరణోద్యమాన్ని గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు గారలు మరింత ముందుకు తీసుకువెళ్ళి తెలుగు భాషను ప్రజాసామాన్యానికి అర్థమయ్యే విధంగా వ్రాయవలెనని, వ్యావహారిక భాష మాత్రమే ప్రజాస్వామ్య యుగానికి అనుగుణమైన భాషా రూపమని నిరూపించారు. అప్పారావుగారు తమ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి 'కన్యాశుల్కం' అను నాటకాన్ని వ్యావహారిక భాషలో రచించారు. ఆంధ్ర భాషలోని స్వతంత్ర నాటకాలలో కన్యాశుల్కం అగ్రగణ్యమైనది.

చరిత్ర పరిశోధనకు కొమర్రాజు లక్ష్మణరావుగారు ప్రారంభం చేశారు. వారు ప్రారంభించిన విజ్ఞాన చంద్రికా గ్రంథమాల ఆంధ్రులలో విజ్ఞాన తృష్ణను రేకెత్తించింది.

ఆధునికాంధ్ర జీవితాన్ని తీర్చి దిద్దుటలో భాగస్వామి అయిన రెండవ ఉద్యమం ప్రత్యేక రాష్ట్రోద్యమం. 1913 లో బాపట్లలో జరిగిన ప్రథమ ఆంధ్ర మహాసభ ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావలెనని, భారతదేశాన్నంతా భాషాప్రయుక్తంగా విభజించవలెనని తీర్మానించింది. ఈ ఉద్యమ మూలపురుషులు కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, జొన్నవిత్తుల గురునాథంగారలు.

భారత దేశంలో అనేక జాతులున్నవి. ప్రత్యేక భాష, సంస్కృతి, ప్రాంతం కలిగిన ఈ వివిధ జాతుల సమ్మేళనమే భారత ప్రజ. ఈ సత్యాన్ని గుర్తించినంత మాత్రాన భారతదేశ ఐక్యతకు భంగం కలుగదు. పైపెచ్చు దృఢమైన, శాశ్వతమైన ఐక్య భారతదేశం ఆవిర్భవించగలదు.

ఈ విషయాన్ని మొట్టమొదటగా వెల్లడించినవారు ఆంధ్రులు. ఈనాడీ సూత్రాన్ని భారత ప్రజలందరూ ఆమోదించారు. ఈ వాస్తవిక సత్యాన్ని బైటకి తెచ్చి, ప్రచారం చేసిన సంస్థ ఆంధ్రమహాసభ.

మూడవది 1921 లో కాంగ్రెసు ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం. 1885 లో భారత జాతీయ కాంగ్రెసు ఏర్పడ్డప్పటినుంచీ మితవాద నాయకత్వం చేతులలో ఉంది. కేవలం తీర్మానాలతోనే సంతృప్తి

వహించిన కాంగ్రెసు సంస్థ 1921 లో గాంధీజీ నాయకత్వాన ప్రత్యక్షకార్య క్రమానికి పూనుకున్నది. స్వాతంత్ర్య సంపాదన మాటలలో సాధ్యం కాదని, అందుకు త్యాగం, పోరాటం అవసరమని, నూతన సాంప్రదాయాన్ని 1921 లో కాంగ్రెసు ప్రవేశ పెట్టింది. ఈ ఉద్యమం ఆంధ్రలో కూడా తీవ్రంగా వ్యాపించింది. 1921, 22 సంవత్సరాలలో, ఆంధ్రలో అంతటా స్కూళ్ళు మానివేసి, ఉద్యోగాలు వదలివేసి అనేకమంది యువకులు స్వార్థత్యాగ బుద్ధితో గ్రామాలవెంట ప్రచారం చేయసాగారు. కోర్టుల బహిష్కరణ, అస్పృశ్యతా నివారణ, మద్యపాన నిషేధం మొదలైన నిర్మాణ కార్యక్రమంతోపాటు, పన్నుల నిరాకరణ వంటి ప్రత్యక్ష పోరాట రూపం కూడా కాంగ్రెసు కార్యక్రమంలో భాగంగా వుంది. గుంటూరుజిల్లా పెదనందిపాడులో పన్నుల నిరాకరణ కొంతవరకు సాగింది. పల్నాడులో అడవి పుల్లరిని నిరాకరించి, హనుమంతు అను యువకుని నాయకత్వాన రైతాంగం ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నది. నరిశీపట్నం మన్య ప్రజలు అల్లూరి సీతారామరాజు నాయకత్వాన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు.

1922 లో చౌరీచౌరాలో ప్రజలు పోలీసు స్టేషనును ధ్వంసం చేశారు. ఉద్యమం తాను విధించిన హద్దులను దాటిపోతున్నదని గాంధీగారు ఉద్యమాన్ని ఉపసంహరించారు. ఉద్యమ నాయకత్వాన్ని తమ అదుపులో ఉంచుకునేందుకు భారత బూర్జువా వర్గం ఆనాటి నుండి పదే పదే ప్రయత్నిస్తూనే ఉంది. భారత బూర్జువావర్గ ద్వంద్వ స్వభావానికిది మొదలు.

1930, 40, 42 లలో కాంగ్రెసు నాయకత్వం క్రింద సాగిన ఉద్యమాలలో ఆంధ్రదేశం సముచిత పాత్ర వహించింది.

గాంధీజీ మితవాద నాయకత్వంతో, అశాస్త్రీయ సిద్ధాంతాలతో విసుగు చెందిన యువకు లనేకులు శాస్త్రీయమైన, అభ్యుదయకరమైన సిద్ధాంతాల కొరకు, విప్లవకర నాయకత్వం కొరకు వెతక నారంభించారు. 1917 రష్యాలో లెనిన్ నాయకత్వాన జయప్రదంగా సాగిన సోషలిస్టు విప్లవం ఈ నూతన సిద్ధాంతాన్ని, నూతన నాయకత్వాన్ని ప్రపంచ ప్రజల ముందుం

చింది. భారతదేశంలో 1928 నాటికి బొంబాయి కార్మిక వర్గంలో వేరూనిన మార్క్సిస్టు సిద్ధాంతాలు 1935 నాటికి ఆంధ్రప్రజలలో ప్రవేశించ సాగినవి.

1935 నుండి నేటి వరకు జరిపిన కృషి ఫలితంగా ఆంధ్రలో కమ్యూనిస్టు ఉద్యమం ఒక బ్రహ్మాండమైన శక్తిగా రలయెత్తింది. కార్మిక, కర్షక, తదితర పీడిత వర్గాల ఆర్థిక రాజకీయ హక్కులకోరకు మాత్రమేగాక, జాతి అభ్యుదయాన్ని కాంక్షించే వివిధ వర్గాలకు నాయకురుగా ఆంధ్రలో కమ్యూనిస్టుపార్టీ పురోగమిస్తున్నది.

ఈ ఉద్యమాలన్నీ ఆంధ్రలో కొనసాగుతుండగా, నైజాం పరిపాలనలో యమయాతన లనుభవిస్తున్న కోటిమంది తెలుగు సోదరులలో నూతన జాగృతి ఏర్పడనారంభించింది. 1935 సంవత్సరం నుండి యీ నూతన జాగృతికి తెలంగాణా ఆంధ్ర మహాసభ నాయకత్వం వహించింది. అంతకు పూర్వమే అనేక సంవత్సరాలుగా, తెలంగాణా ఆంధ్రుల అభ్యుదయానికి అనేక సాహిత్య సంస్థలు కృషిచేస్తూ వచ్చాయి. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి గారలు ఈ కృషికి నాయకత్వం వహించారు. నైజాం క్రూర పరిపాలన ఫలితంగా నామరూపాలు లేకుండాపోయే ప్రమాదాన్నుండి తెలుగు భాషను కాపాడి, ఈ వివిధ సారస్వత పరిషత్తులు తెలంగాణా ఆంధ్రుల పునరుజ్జీవనానికి పునాదిని వేసినవి. వానిలో కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం, హైదరాబాదు ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రధాన మయినవి.

1945 తర్వాత తెలంగాణా ఆంధ్రుల పోరాటం ప్రజానీకంలోకి వేళ్ళుతన్ని రైతాంగ పోరాటంగా పరిణమించింది. శతాబ్దాలుగా సాగుతున్న భూస్వామ్య దోపిడీకి, వెట్టిచాకిరీకి క్రూర నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా తెలంగాణా ప్రజలు 1947–52 సంవత్సరాల మధ్య తీవ్రపోరాటం జరిపారు. వేలాది వీరులు నేలకొరిగారు. మట్టిలో నుండి మహావీరు లుద్భవించి రజాకారు దుర్మార్గాలను, ఆ తరువాత ఏర్పడిన మిలిటరీ గవర్నరు నిరంకుశత్వాన్ని ప్రతిఘటించారు. కమ్యూనిస్టుపార్టీ ఈ మహోద్యమానికి నాయకత్వం వహించింది.

తెలంగాణా, సర్కారాంధ్ర అను కృత్రిమ సరిహద్దులను ఛేదించి ముక్కోటి ఆంధ్రులను ఒకటి చేసి, విశాలాంధ్రను స్థాపించవలెనన్న నినాదం 1942 లో మొట్టమొదటగా కమ్యూనిస్టుపార్టీ ఇచ్చింది. ఈ నినాదం ముక్కోటి ఆంధ్రుల జాతీయ వాంఛగా రూపొందినది.

అర్ధ శతాబ్దిగా సాగుతున్న జాతీయోద్యమ ఫలితంగా, 1947 లో బ్రిటిషువారు భారతదేశాధిపత్యాన్ని వదలుకోక తప్పని పరిస్థితి వచ్చింది. కాంగ్రెసు నాయకత్వానికి అధికార ప్రదానం చేసి బ్రిటిషువారు వైదొలగారు. భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించింది.

1947 తర్వాత ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏ క్షణంలోనైనా రావచ్చునని ప్రజలు ఎదురుచూడ సాగారు. ఆరు సంవత్సరాలు గడిచినవి. వాగ్దానాలు, కమిటీలు, కమిషన్లతో కాలం గడచిపోయింది.

ఆంధ్ర ప్రజలు విసిగి పోయినారు. ఆంధ్ర ప్రజా హృదయంలో దావానలంవలె మండుతున్న ఈ తీవ్ర అసంతృప్తి 1952 డిసెంబరులో పొట్టి శ్రీరాములు ఆమరణ నిరశనదీక్ష రూపంలో వ్యక్తమైంది. అక్టోబరు 19 నుండి డిసెంబరు వరకు 58 రోజులు నిరాహారదీక్ష వహించిన శ్రీరాములుగారు 1952 డిసెంబరు 16 న అసువులు వీడి అమరత్వాన్ని పొందారు. ఆంధ్రులు మహోద్రేకంతో కార్యాచరణకు పూనుకున్నారు. ప్రభుత్వం స్తంభించి పోయింది. పదకొండు మంది ఆంధ్ర వీరులు పోలీసు తుపాకులకు తమ నిండుప్రాణాలను బలి యిచ్చారు. ఈ ప్రజాందోళనకు కేంద్రప్రభుత్వం లొంగింది. ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరుస్తూ ప్రధాని నెహ్రూ డిసెంబరు 19 న ప్రకటించారు.

అక్టోబరు 1 న, కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం అవతరించింది. ఆంధ్రులు రాష్ట్రావతరణోత్సవాన్ని పర్వదినంగా జరుపుకున్నారు.

1955 జూలైలో వెలువడిన రాష్ట్ర పునర్విభజన కమిషన్ నివేదిక విశాలాంధ్ర నిర్మాణాన్ని సూచించింది. కాని ఐదేండ్లు గడువు విధించింది.

ఐదేండ్ల గడువు అనవసరమని ఆంధ్ర—తెలంగాణాలను ఏకంచేసి, తక్షణమే విశాలాంధ్రను ఏర్పరచవలెనని, ఆంధ్ర ప్రజానీకం, వివిధ రాజకీయ పార్టీలు ఐక్య కంఠంతో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినవి. తెలంగాణాలోని అత్యధిక సంఖ్యాకులు తక్షణ విశాలాంధ్రను వాంఛించారు.

భారత ప్రభుత్వం విశాలాంధ్రను ఏర్పరుస్తూ ప్రకటన చేసింది. 1956 నవంబరు 1 వ తేదీన విశాలాంధ్ర ఏర్పడ్డది. ఆంధ్ర, తెలంగాణా ప్రజల మధ్య ఏర్పడిన కృత్రిమ విభజన అంతమైంది. ఆంధ్ర జాతి సమగ్రాభివృద్ధి కవసరమైన భౌతిక పరిస్థితులు ఏర్పడ్డవి.

స మా ప్తం

# ఆంధ్రుల చరిత్రలో
# కొన్ని ముఖ్య తేదీలు

| | | | |
|---|---|---|---|
| 1. ఆంధ్రులను గురించి మొదటి ప్రశంస ఐతరేయ బ్రాహ్మణము | .... | క్రీ.పూ. | 1000 |
| 2. మెగస్తనీసు | .... | " | 300 |
| 3. శాతవాహన రాజ్యస్థాపన | .... | " | 221 |
| 4. గౌతమీపుత్ర శాతకర్ణి | .... | క్రీ.శ. | 78 |
| 5. శాతవాహన రాజ్యపతనం | .... | " | 203 |
| 6. విష్ణుకుండిన మాధవవర్మ (iii) | .... | " | 546 - 611 |
| 7. వేంగిరాజ్య స్థాపన | .... | " | 624 |
| 8. గుణగ విజయాదిత్యుడు | .... | " | 849 - 892 |
| 9. మహాభారత రచన | .... | " | 1022 - 1061 |
| 10. పల్నాటి యుద్ధం | .... | " | 1178 - 1182 |
| 11. రామానుజాచార్యులు | .... | " | 1018 - 1118 |
| 12. బసవయ్య | .... | " | 1100 - 1165 |
| 13. కాకతీయ యుగం | .... | " | 1000 - 1323 |
| 14. గణపతిదేవుడు | .... | " | 1198 - 1262 |
| 15. ఓరుగల్లు పతనం | .... | " | 1322 |
| 16. ముసునూరి కాపయ నాయకుడు | .... | " | 1336 |

| | | | |
|---|---|---|---|
| 17. విజయనగర రాజ్యస్థాపన | .... " | 1336 | |
| 18. బహమనీ రాజ్యస్థాపన | .... " | 1347 | |
| 19. కృష్ణదేవరాయలు | .... " | 1509 - 1530 | |
| 20. తళ్ళికోట యుద్ధం | .... " | 1565 | |
| 21. విజయనగర రాజ్యపతనం | .... " | 1646 | |
| 22. మద్రాసులో ఈస్టు ఇండియా కంపెనీ ప్రవేశం | " | 1639 | |
| 23. తంజావూరు నాయక రాజ్యం | .... " | 1535 - 1673 | |
| 24. మధుర నాయకరాజ్యం | .... " | 1539 - 1736 | |
| 25. క్షేత్రయ్య | ... " | 1633 - 73 | |
| 26. త్యాగరాజు | .... " | 1759 - 1847 | |
| 27. గోలకొండ రాజ్యము | .... " | 1572 - 1687 | |
| 28. గోలకొండ పతనం | .... " | 1687 | |
| 29. బొబ్బిలియుద్ధం | .... " | 1757 | |
| 30. యోగివేమన | .... " | 1750 | |
| 31. ఉత్తర సర్కారులు బ్రిటిషువారి స్వాధీనం | .... " | 1766 | |
| 32. దత్తమండలాల స్వాధీనం | ... " | 1799 | |
| 33. రైత్వారీ సెటిల్‌మెంటు | .... " | 1799 | |
| 34. కందుకూరి వీరేశలింగం | .... " | 1848 - 1917 | |
| 35. ప్రథమాంధ్ర మహాసభ | .... " | 1913 | |
| 36. సాధారణ ఎన్నికలు | .... " | 1952 | డిసెం. |
| 37. శ్రీ పొట్టి శ్రీరాములుగారి నిర్యాణం | .... " | 1952 | " |
| 38. ఆంధ్రరాష్ట్ర అవతరణ | .... " | 1953 | అక్టో. |
| 39. విశాలాంధ్ర అవతరణ | .... " | 1956 | నవం. |

## గ్రంథ రచన కుపయోగపడిన

## కొన్ని ముఖ్య గ్రంథముల పట్టిక

## (BIBLIOGRAPHY)


1. ఆంధ్రుల చరిత్ర 1, 2, 3 భాగములు
— చిలుకూరి వీరభద్రరావు

2. ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము — మల్లంపల్లి సోమశేఖరశర్మ

3 చారిత్రక వ్యాసములు "

4. History of the Reddi Kingdoms "

5 A Forgotten Chapter of Andhra History "

6. శాతవాహన సంచిక — మారేమండ రామారావు

7. కళింగ సంచిక
— ఇతిహాస పరిశోధక మండలి, రాజమండ్రి

8. రెడ్డి సంచిక

9. రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక "

10. ఇతిహాస పరిశోధక మండలివారి మాసపత్రిక కాపీలు

11. Early Dynasties of Andhra Desa
— భావరాజు కృష్ణారావు

12. రాజరాజ నరేంద్రుడు "

13. Eastern Chalukyas of veingi
— నేలటూరి వెంకటరమణయ్య

14. A Forgotten Empire — Robert sewell

15. Social and Political life in Vizianagar Times — Salatore

16. ఆంధ్రుల సాంఘిక చరిత్ర — సురవరం ప్రతాపరెడ్డి

17. దేశి — కోరాడ రామకృష్ణయ్య

18. ఆంధ్రభాషా వికాసము — గంటిజోగి సోమయాజి

19. ఆంధ్రుల చరిత్ర — సంస్కృతి — ఖండవల్లి లక్ష్మీరంజనం

20. Early History of the Deccan — Bhandarkar

21. Vedic Age — Bharatiya Vidya Bhavan

22. Age of imperial Unity "

23. India - Primitive Communism to Slavery — S. A. Dange

24. సపకథా మంజరి — పిండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

## ఏటుకూరు బలరామమూర్తి గారి ఇతర రచనలు

| | రూ. |
|---|---|
| భారతీయ తత్వశాస్త్రం | 18.00 |
| మన చరిత్ర | 20.00 |
| బౌద్ధం మార్క్సిస్టు దృక్పథం | 7.00 |
| ఉపనిషత్ చింతన | 10.00 |
| మార్క్సిజం . భగవద్గీత | 10.00 |
| గాంధేయ మార్గం . తాత్వికత | 6.00 |

ప్రతులకు :

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాదు-500 001.

విశాలాంధ్ర బుక్ హౌస్
విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు,
తిరుపతి, హన్మకొండ, అనంతపురం, కాకినాడ.

ISBN : 81-7098-131-X

Cover Printed at Sri Balaji Art Printers, Chikkadpally, Hyderabad-20.